శ్రీ మాదిరాజు రంగారావు

నవనాథ చరిత్ర - అనుశీలన

డా॰ ముట్నూరి సంగమేశం

సమత శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

ప్రజాదరం పొందిన పౌరాణిక నాటకాలు

శ్రీ రామ మోహన రాయ్

ఈ కవిత, చివరి మాట

మూలం: శ్రీ జి. యస్. శివరుద్రప్ప

సాహిత్య మాస పత్రిక



భారతి


ఏప్రిల్, 1986

వెల : రు.4/-



శాలోఫెన్
బాధానివారిణి మాత్రలు
అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపు
తలనొప్పి, ఫ్లూ, పంటినొప్పి, ఒళ్లునొప్పులని వెంటనే పోగొడ్తాయి
శాలోఫెన్‌లోని ఔషధాలు డాక్టర్లు సిఫార్సు చేసేవే.
శాలోఫెన్ ఉన్నచోట బాధ ఉండదు.
SALOFEN
ANALGESIC TABLET
SALOFEN

ఆదా చేయండి రు .11లు!



పోస్టుద్వారా భారతి తెప్పించుకోండి!

ఆఫ్‌సెట్ ముద్రణలో భారతి !

భారతి సంవత్సర చందా (పోస్టు ద్వారా రు. 51/–లు) ఒకేసారి చెల్లించే వారికి రు. 11/–ల 'ముదరా' వుంటుంది.

అంటే మీరు కేవలం రు. 40/–లు చెల్లిస్తే ప్రతినెలా భారతి పోస్టు ద్వారా మీ ఇంటికే అందుతుంది.

చందా పైకమును ఆంధ్రపత్రిక, గాంధినగరం, విజయవాడ–3కి మనియార్డరు లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా పంపుతూ ఈ దిగువ కూపను జతపర్చ కోరుతాము.

నేను 'భారతి' మాసపత్రికకు చందాదారునిగా చేరదలుచుకున్నాను
చందా పైకము రు. 40/– డి.డి. / ఎం. ఒ. ద్వారా పంపుతున్నాను.

పేరు : ______________________________

ఊరు : ______________________________

చందాదారుని సంతకం

సంపుటము : 63 ఏప్రిల్ 1986 సంచిక : 4

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంస్థాపకుడు

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

(1938 - 1972)

★

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నర్తకి కుమారి (- రష్మి)

విడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్సు ప్రయివేటు లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు ప్రచురణకర్త : శివలెంక రాధాకృష్ణ ముద్రణ · ఆంధ్రపత్రికప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3; సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ.

స్వవిషయం

భారతికి వాడే అచ్చు మరీ చిన్నదిగా ఉంటోందని ఒకరు రాశారు. నిజానికి ఈ అచ్చు ఇంచుమించు అన్ని పత్రికలలో నూ వాడే 12 పాయింటుదే కాని అంత చిన్నది ఏమీ కాదు!

** ** **

ఈ నెల నుంచి భారతిలో ఒక కొత్త శీర్షిక మొదలు పెడుతున్నాము. బొబ్బిలి నుంచి శ్రీ నిష్మల వేంకట సత్య సుబ్రహ్మణ్యంగారు పంపే నక్షత్రఫలం పాఠకుల ఆదరణ పొందగలదని ఆశిస్తున్నాము....

** ** **

చిన్న నవలల పోటీకి వచ్చిన రచనల పరిశీలన జరుగుతోంది. త్వరలో నే ఫలితాలని ప్రచురించగలమని అనుకుంటున్నాము! భారతిలో ప్రతినెలా కనీసం రెండు సీరియల్ నవలలు వెయ్యాలని ఉంది కాని ఇవి ఆశించినంతగా రావటం లేదు...

** ** **

భారతి అట్ట మీద నాట్యం చేసే వారి బొమ్మలు పడుతున్నాయి! సంగీతంలో పేరుపొందిన వారి ముఖచిత్రాలు కూడా వెయ్యాలని ఉంది – ప్రయత్నాలు చేస్తున్నాము కాని ఈ విషయమయి ఫోటోగ్రాఫరుల, రచయితల సహకారం మాకు లభిస్తే బాగా ఉండును...

భారతీ వందనము

శ్రీ మహితాంధ్ర భారతికిఁ జేతులు మోడ్చి నమస్కరింతు భా
షామహనీయమాతకుఁ బ్రశాంత మహోజ్జ్వల సుందరాంగికిన్
మా మత పూర్వపుణ్యమున మమ్ముఁ దరింపఁగఁ జేయుకోసమై
క్షేమ మొసంగి మా వయిన సేవలు గైకొను తల్లి వాణికిన్.

తల్లీ! నిన్ను మహా సరస్వతిని నిత్యంబున్ మహాభక్తి సం
ధిల్లన్ గొల్చిరి పూర్వసత్కవులు సందీపించు కావ్యావళిన్
ఫుల్లాబ్జాక్షిరో! మాకుఁ బూజ్యులు మహాపుణ్యాత్ములున్ వారి మే
ముల్లాసంబునఁ గొల్తు మెప్పుడును నాయుర్వృద్ధికిన్ సిద్ధికిన్.

రాజులు చేరఁదీసి కవిరాజులఁ గొల్చి సరస్వతీ! నినున్
దేజము కీర్తి ఆయువును దివ్యతఁ గాంచిరి; చేర కెవ్వరిన్
రాజులఁ బోతనాది కవిరాజులు శాశ్వత కీర్తి సంచె రా
రోజులు మాఱె; ఈ ప్రజ తెలుంగరు నీదు మహావిభూతులన్.

ముద్దులు మూటగట్టు నతిమోదముఁ గూర్చుఁ దెలుంగు పద్దెముల్
పద్దెములా తలంప నవి భాసురముల్ కడు జుంటితేనియల్
ముద్దుగ ముద్దుగా హృదయముం గరఁగించు సుధాస్రవంతులా
పద్దెము లిప్పు డేతెలుఁగు బాలురు నేర్వరు చిత్రమయ్యెడిన్.

'అమ్మా'! 'నాన్న'! యటంచు ముద్దుగను నోరారంగఁ బిల్వ రక్కటా!
'మమ్మీ' 'డాడి' యటంచుఁ బల్కుదురు సౌమ్యంబా? మనోజ్ఞంబ?
సమ్మోహంబు గతించు టెప్పుడొకొదా! సర్వాంగ సౌందర్య మో
అమ్మా! ఆంధ్రసరస్వతీ! నతిశతం బౌఁగాక! నీ కెన్నఁడున్.

వచ్చి ప్రజాప్రభుత్వములు స్వర్ణయుగంబు సృజించు నంచు నిన్
మెచ్చి తలంచినార మది మిథ్యయె యయ్యెను బిచ్చిగాక యీ
వచ్చు ప్రభుత్వముల్ కవుల వాణిని నిన్ దలఁపంగనోపునే?
యెచ్చటి నీతి? రాచటిక మెచ్చుట? చిత్రము గాదె భారతీ!

ఛందోరూపము నీది శాశ్వతము నిస్సందేహ మోమాత! స్వ
చ్ఛందం బందు మహాకవీశ్వరులు నిచ్చల్ నిన్నుఁ బూజింతు రా
నందం బిచ్చు నదే యనంతముగఁ గానం జాల రల్పుల్ నిజం
బందం బయ్యది చంద మయ్యది నితాంతానందదం బయ్యదే.

పరభాషా మమకారముల్ సడలు దుర్వ్యామోహముల్ పాయుసుం
దర దివ్యాంధ్ర సరస్వతీ రమణి! సందర్శింపఁ ద్వన్మంజు రూ
ప రమన్ భక్తిని పూర్వపుణ్యము ననే ప్రాప్తించు నీ సేవత
త్పరతన్ నీ పదసేవచే సకల సౌభాగ్యంబులున్ గల్గెడిన్.

అవివేకుల్ ప్రభువుల్ నినుం దలఁపఁజో రంచున్ విచారింప కా
సువివేకుల్ నిను నీ సుపుత్రకవివిజ్ఞుల్ గొల్వ నానందమే
యవు నీఁ కెన్నఁడు భారతీ! తలఁపఁగా నజ్ఞప్రభుల్ నిత్యులా?
భవదీయం బగు కీర్తి శాశ్వతము దివ్యం బెంతయున్ భవ్యమున్.

పరమ పవిత్ర భారతివి భాసుర లక్ష్మివి పార్వతీతలో
దరివి మహామనోజ్ఞ వగు తల్లివి నిత్యవు జ్ఞానలక్ష్మివిన్
సురుచిర భాగ్యలక్ష్మివి విశుద్ధ మనోహర శౌచలక్ష్మి వో
వరపర దేవతా! ఇవియె వందనముల్ శతముల్ సహస్రముల్.

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

శ్రీ మాదిరాజు రంగారావు

స్వేచ్ఛా కవిత్వమూ - నేటి సంశిష్టస్థితీ

కవిత్వం ఏనాటిదో! అన్ని కళల్లో ప్రాచీనమైంది. ఈనాడూ ముందూ కొనసాగే సాహిత్య ప్రక్రియ. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క కాలంలో వివిధ రూపాల్లో ఆవిష్కృతమవుతూ ఉంటుంది. దీన్ని నిర్వచించే ప్రయత్నం జరుగుతూనే వుంది. కాని మొత్తం మీద ఇంకా ఏ నిర్వచనానికీ అందని స్థాయిలోనే ఉంది. ప్రతి నిర్వచనమూ ఖండఖండంగా పాక్షికంగానే ఉంటుంది. ఎవరెంత సమగ్రతకు ప్రయత్నించినా ఏదో ఒక పార్శ్వంనుండి జారిపోతుంది. ఏదో ఒక ముఖం దృష్టికి అందకుండా ఉంటుంది. సృజన రూపం అంటేనే ఇది. ఏదో ఒక నియమక్రమంలో రూపొందుతూన్నట్లు కన్పిస్తుంది. కాని అంతలో తప్పించుకొనీ, అధిగమించీ నిరాకరించీ, ఛేదించుకొనీ తద్భిన్నమైన విశిష్టాకృతిని పొందుతుంది. కవి మనస్తత్వం, అనుభవరూపం, వస్తుదర్శనం, దృక్పథం, సమాహారంగా ఒక్కొక్క నిష్పత్తిలో సమాకలనం పొంది అపూర్వమైన నిర్మాణస్థితిని పొందుతుంది. ఇక్కడే కవికీ, కవికీ, సమయ సమయానికీ, భిన్న భిన్న వ్యక్తిత్వాలను ధరిస్తుంది. ఇతర ప్రక్రియలతో పోల్చి చూస్తే తక్కువ సంఖ్యలో పాఠక ప్రపంచం కలిగింది కవిత్వం. అయినప్పటికీ అనుభూతి సాంద్రతలో ఆకర్షణ గుణంలో ప్రభావశక్తిలో ఎక్కువ స్థాయి కలిగింది. ఒక ప్రమాణంలో అభిరుచి స్థాయి కలిగిన పాఠకుల్ని అపేక్షించేదీ. మొదటినుండీ ఏ సమాజ సంస్థితిలోనూ నాగరిక ప్రపంచంలో శిష్ట సాహిత్యంగా, గ్రామీణ జీవనంలో జానపద సాహిత్యంగా, ప్రత్యేకమైన రూపాలను సంతరించుకొని నిలచింది, కవిత్వం ఆదినుండీ మానవ సంస్కృతీ వికాసంలో నిర్వహించిన పాత్ర అనల్పమైంది. ఒక్కొక్క జాతి ప్రత్యేకతల్ని బట్టి వారి విశ్వాసాలూ అభిప్రాయాలూ అనుభవాలతో, మత తాత్త్విక రాజకీయ సాంఘిక పరమైన వ్యవస్థకు సంబంధించీ, ఇంకా వైయక్తిక మనస్తత్వరీతుల్నిబట్టీ వివిధ ధోరణుల్లో ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఇది అనేకమైన చారిత్రక కారణాలవల్ల మార్పులకు లోనుకావడమూ జరుగుతుంది. ఏ సాహిత్యచరిత్రను పరిశీలించినా ఈ అంశం విస్పష్టంగా దృష్టికి రాకమానదు. ఆధునిక యుగమూ ఈ పరిణామంలో ఒక భాగమే. ఏ కాలంలోనైనా ఏ వ్యవస్థలోనైనా ప్రధానంగా వ్యక్తిలో, స్పందన గుణం సృజనశక్తి ఉన్నంత వరకూ, కవిత్వం ఏదో ఒక విధంగా ఆవిష్కృతం అవుతుంది. కాని రాజరిక వ్యవస్థలోకన్నా నియంతృత్వ వ్యవస్థలోకన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థలో వస్తువూ కవి దృష్టీ వాస్తవానికి సన్నిహితంగా వైవిధ్యవిలసితమై, నవ్యతను సాధించే అన్వేషణతో, స్వేచ్ఛ కలిగిన ప్రజాప్రమేయంతో, విస్తృతమైన పరిధిని వహిస్తుంది. ఒక్కొక్క సందర్భంలో వెనుకనుండి ఒక్కొక్కరిని వేరు వేరు ప్రేరణ శక్తులు ఉత్సాహింపజేస్తాయి. ఇది ప్రత్యక్షంగానో పరోక్షంగానో కదిలించే, ఘటనో భావమో వైయక్తిమైన మనఃస్థితో ఆదర్శమో ఏదైనా కావచ్చు; ఆవేశ గతమయిన అనుభవస్థాయి దీనికి కేంద్రం. కష్టంలో సుఖంలో ఆర్తిలో ఆనందంలో ఇది సద్యోనిర్గతమై సాక్షాత్కరిస్తుంది. దీని ఆవిష్కార రూపాలు వివిధ వ్యక్తిత్వాలతో వేరువేరుగా కళాత్మకమయిన సంవిధాన రీతులలో రూపొందవచ్చు. ఇది ఛందస్సు మొదలుకొని, నిర్మాణ శిల్పంవరకూ పర్యాప్తమయింది. ఈనాడు వెలువడే స్వేచ్ఛా కవిత్వంలో ఛందస్సు లేకపోయినా ఒక విధమయిన విన్యాసంలో చలనంలో, గమనంలో అనేక రీతుల సమాకలనంతో అంతర్గతమయిన లయతోనో లేదా వాక్య విచ్ఛేదాలతోనో నిర్మాణ రూపాన్ని పొందవచ్చు. ఈ వివేచన వేరు.

విజ్ఞానం వికాసం పొందుతూన్న సమాజంలో, శాస్త్ర సాంకేతిక దశలో అభివృద్ధిక్రమాన్ని అందుకొని పారిశ్రామికంగా పురోగమన వేగాన్ని సంతరించుకున్న ఆధునికయుగంలో, కవిత్వంపట్ల అభిలాష, ఆదరణ తగ్గు ముఖం పట్టుతుందనే అభిప్రాయం వుంది. ఇది నిజం కాదని ప్రస్తుతస్థితి ఋజువు చేస్తోంది. పైగా కొత్త అనుభవ పరంపరతో, నూతన వస్తు పరిచయంతో, ఇంతకుపూర్వం లేని రూపాన్ని పొందే అవకాశం వుంది. వ్యక్తిలో మానసికంగా నిశ్శబ్దంగా ఉండలేని స్పందన గుణమూ, అనుభవస్థితిలో ఆవేశస్థాయిలో ఉద్గమించకుండా ఉండలేని, సృజనశక్తీ కారణం. మారుతున్న సమాజంలో, ఎన్నో కొత్త కొత్త అనుభవ పరంపరల మధ్య, కవిత్వ సృష్టిలో కొత్త రూపాలు కళాత్మకతను పొంది నిర్మితమౌతాయి. అంతర్ బహిర్ ఆకృతిలో పొందే ఏర్పాటు రీతి, విన్యాసక్రమం వేరుగా వుంటాయి. యథాస్థితికి భిన్నంగా ప్రవర్తించే ఆలోచనా ధోరణులూ, పరిధులు మారిన భావస్థితులూ, పరివర్తనం చెందిన అభిప్రాయ వైఖరులూ, సామాజిక తత్పరతగల దర్శనరూపమూ నవ్యతకెంతగానో ఉపకరించేవి. దీని ప్రభావ పర్యవసానమే "స్వేచ్ఛా కవిత్వం." బాగా ప్రచారంలో ఉందీ, ఈనాటి ఆధునికయుగ స్థితిని సంపూర్ణంగా ప్రతిబింబించేదీ, యుగ స్వభావానికి ప్రాతినిధ్యం వహించేదీ:

జనసాధారణమయిన సాధారణ ప్రక్రియల ప్రశస్తి ఎక్కువైనకొద్దీ కవిత్వంపట్ల అభిలాష, దాని ప్రాచుర్యం తగ్గకపోవడానికి పాఠకుల్లో ఉండే సంస్కార బంధురత, గ్రహణశక్తితోపాటు, ఉన్నత ప్రమాణాల్లో నిలచిన అభిరుచినీ, స్పందన శక్తినీ పేర్కొనవలసి వుంటుంది. ఈ లక్షణం నిరంతరం కవితా వ్యాసంగం భావుకత అనుభవగుణంవల్ల, కాలక్రమేణ వ్యక్తిత్వంలో భాగమై నిలచిపోతుంది. ఇది అంత సులభంగా అలవడేది కాదు. కవిత్వానికి కాలం చెల్లిపోయిందనుకోవడమూ నిజం కాదు. ఏ ప్రక్రియ ప్రత్యేకత దానిదే, దేని ప్రయోజనం దానిదే, దేని స్థాయి పరిమితీ దానిదే. కవిత్వమూ, కథ-నవల సమర్థవంతంగా నిర్వహించే ప్రతిభావంతులూ వున్నారు. ఈ రెండిటిలో దేనికదిగా చదివి ఆనందించే భావుకలోకమూ వుంది. సాహిత్యరంగంలో ప్రక్రియాగతమయిన సౌమనస్య వాతావరణం, ఆరోగ్యకరమయిన వాతావరణస్థితికి దోహదం చేస్తూంది. ఇప్పుడు కవిత్వంనుండి కథాభాగం సంపూర్ణంగా వేరౌతూ వస్తూంది. (1) కథ-నవల వేరుగా అభివృద్ధి చెందుతూన్నప్పుడు, దీని ప్రవేశం అనవసరమనుకోవడమూ, (2) కవిత్వంలో సంక్షిప్తత గుప్తత వ్యంగ్య శోభపై దృష్టితో భావస్థితికి ప్రాధాన్యం కలగడమూ, (3) వస్తువును విస్తృతపరచేకన్నా కేంద్ర స్థానంగానే నిలిపే యోజన-కథాభాగంనుండి దృష్టి ఉపసంహృతం కావడానికి కారణాలుగా పేర్కొవచ్చు. కథలో స్థితి వివృతిని పొందితే, కవిత్వంలో సంవృతిని అపేక్షించడం జరుగుతూంది. కథలో వివరణమూ. వ్యాఖ్యానమూ అధికం. వ్యంగ్యస్ఫూర్తి మొత్తంమీద ఉండవచ్చు. ప్రతీకల వినియోగమూ విస్తృతమయిన పరిధిలో వివృత లక్షణాన్నే పొందుతుంది. కవిత్వంలో ఇది సూచ్యగ్రరూపంలో ఉంటుంది. వ్యంగ్యంతోపాటు, ఆలంకారికత, మార్మికత భావరూపాలు ప్రతీకలు అన్నీ సంక్షిప్తస్థితిలో ఆధారమాత్రమయిన వస్తుప్రణాళికలో సూక్ష్మసూక్ష్మంగా నిబద్ధమై వుంటాయి. భావుకులకెక్కువగా వ్యాఖ్యానానికే అవకాశం ఇస్తూ, అనుభూతి సాంద్రతతోపాటు ఆలోచనా ప్రసారానికి ఎంతో వీలు కలిగి వుంటుంది. ఈ కళారూప స్వరూపమే ఇది. ఇక ఛందస్సు గురించి వేరే చెప్పనక్కరలేదు. ఛందస్సు పాటించని స్వేచ్ఛా కవిత్వంలోనూ వాక్యవిన్యాసం, సంచాలనం, గతి విలసనం వివిధ వాక్యాల ఘటనాక్రమం భావవిభాగాల(యూనిట్)

అమరికతీరు, స్వేచ్ఛాశీలమయిన ప్రణాళిక నాశ్రయించి నిర్మాణరూపాన్ని పొందుతుంది. కథ దీని పెంపుదలయైన నవల—వేరు వేరు ప్రక్రియలుగా అభివృద్ధి చెందడంతో కవిత్వంనుండి కథాభాగం తొలగిపోయినా ఇప్పటికీ సంఘటనలకూ సూత్రప్రాయమయిన కథాంశాల ఉన్మీలనకూ ప్రాధాన్యం వుంది. సంపూర్ణంగానో ప్రధాన కథాంశాలతోనో నిర్మితమయిన కవిత్వరూపం వేరుగా వుంటుంది. దీన్ని ఇటీవల స్వేచ్ఛా కవిత్వంలో ప్రయత్నించిన శీలా వీర్రాజు రచనలు 'కొడిగట్టిన సూర్యుడు', 'హృదయం పలికింది' ముఖ్యంగా పేర్కొనదగినవి. కావ్యంలో సన్నివేశ నిర్మితి, పాత్ర చిత్రణం, వాతావరణ కల్పనంతో కవిత్వాన్ని కథాభాగాలతో అనుసంధించిన ప్రయోగం అభినందనీయమయింది. ఈ ప్రయత్నం సృజన శక్తికి సాధనవల్ల లొంగనిదేదీ లేదన్న విషయాన్ని జ్ఞప్తికి తెస్తుంది. కథ నవల ప్రక్రియలు వేరైన కాలంలోనూ స్వేచ్ఛాకవిత్వంలో, అవసరం మేరలో ముఖ్యంగా నిర్మాణ శిల్పంపై దృష్టితో కథను తీసుకొని వ్రాసిన కావ్యాలు రాణించే అవకాశం ఉందన్న అంశాన్ని ప్రకాశింపజేస్తుంది.

2

ఆధునిక కవిత్వంలో ఇంతకుముందున్న వాటికి భిన్నమయిన ప్రేరణ శక్తులతో అనేకమయిన ధోరణులు వచ్చాయి. లక్ష్యంలో నిర్మాణంలో ఆవిష్కారంలో సిద్ధాంతాల అభిప్రాయాల ప్రాబల్యంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన స్థానాన్ని పొందాయి. ఈ కాలంలో ఒక్క తెలుగులోనే కాక ఇంచుమించు అన్ని భారతీయ సాహిత్యాల్లోనూ ఏదో ఒక విధమయిన సంచలనాత్మకమయిన ఆలోచనాత్మకమయిన 'నవ్యతలో', కవిత్వం ఆవిర్భవించింది. సర్వ భారత దేశంలో ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ఒకే విధమయిన సమాజ వ్యవస్థలో. ఒక తీరులో ఉన్న సమస్యలూ, ఒక క్రమంలో(పాటరన్) ప్రసరించే వివిధ దృక్పథాల సంచరణంతో వేగాన్ని అందుకునే పరివర్తనా స్వరూపమే దీనికి కారణం. ఈనాటి జీవనరూపం వేరు, అనుభవపరంపర వేరు. మన చుట్టూ పైన విమానం, క్రింద దూరాన రైలు, దగ్గరలో బస్, కారు, సైకిల్‌తోపాటు వెనకనుండి ఎడ్లబండీ ఉండనే ఉంది. చేతి పరిశ్రమలతోపాటు పారిశ్రామిక వాతావరణమూ వుంది' ఎన్నో యంత్రాల సంచలనం! వేగం! సంకీర్ణస్థితి! ఆలోచనలతోపాటు పురాతన ఆధునిక వస్తువుల మిశ్రమస్థితి! సంకలన రూపం! వీటి ప్రభావం తప్పనిసరి! ఆధునికంగా పరివర్తనకు గురి ఔతున్న సమాజంలో ఇవన్నీ అవసరాలనుబట్టి ప్రయోజనాన్ని కలిగి ఉన్నవే. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ జీవిత సమస్యల్ని భావింపజేసి, ఆలోచనపై ప్రభావాన్ని నెరపే ఈ 'వాతావరణం' నుండి కవిత్వమూ వేరుగా ఉండడం జరగదు,

ప్రస్తుత సమాజంలో వివిధ దిశలనుండి పనిచేసే సామాజిక భావధోరణులనేకం. ఎప్పటికప్పుడు సత్వరం మార్పును కోరేవీ, సంస్కరణనూ, నెమ్మదిగా మార్పును కోరేవీ వ్యవస్థాగతమైన మౌలిక సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారాన్ని దీర్ఘప్రాతిపదికపై కోరేవీ. భవిష్యత్ సామాజిక దర్శనంతో లక్ష్యసాధనలో క్రియ-ప్రతిక్రియ ప్రతిఘటన పోరాటం హింసతో కూడిన చర్యలతో ప్రవృత్తమైనవీ—దీనికి సమాంతరంగా మరోవైపునుండి మానవసంస్కృతికి నిలయమై, అనేక చారిత్రక దశలను క్రమించి నిలచిందీ సంప్రదాయ బంధురమైందీ. ఇంకొకవైపునుండి వైయక్తిక భావధోరణులూ, తమ తమ పాత్రల్ని నిర్వహిస్తున్నాయి. ఈ ధోరణులతో ప్రవర్తిల్లే స్థితిని పరిశీలిస్తే పైకి సంకీర్ణంగా కన్పిస్తుంది. కాని వివిధ భావాలతో క్రియాత్మక చర్యలతో ఒకొక్క లక్ష్యంతో పరివర్తనను కాంక్షించేవే. ఈ స్థితి మానవులందరి సంపూర్ణమైన సౌభాగ్యాన్ని సాధించే దృష్టితో ప్రయాణిస్తూ 'సంశ్లిష్టం'గా కన్పిస్తుంది. ఇక సాహిత్యానికి వస్తే కవిత్వంలో వివిధ ధోరణులు సమాజ స్వరూపానికి ప్రతిరూపాలుగా కన్పిస్తాయి. నేడు సంప్రదాయ, కాల్పనిక (భావ) సంస్కరణ, అభ్యుదయ, దిగంబర, అనుభూతి. తాత్విక, విప్లవ, నిరసన, మానవతా ప్రజాస్వామ్య సామ్యవాద భావజాలంతో ప్రచలితమై ఉన్నాయి. మరో విశేషం, ఈ ఆలోచనాధారలన్నీ కొన్ని వేటికవి తీవ్రతీవ్రంగానూ, మరికొన్ని ఒకదానికొకటి పోషకంగానూ మేళనం పొందీ ప్రవర్తిస్తున్నాయి. తమ భావాలకు మరింత శక్తినిచ్చేవీ క్రియాపరిధిని పెంచేవీ కావడంవల్ల ఉమ్మడిగా ఉన్న అంశాలను పరస్పరం స్వీకరిస్తూ గమ్యాన్ని చేరుకునే ఉద్దేశాన్ని వేగవంతం చేసుకుంటున్నాయి. చారిత్రక క్రమంలో చూస్తే కొన్నిటి విషయంలో ఒకటి ముగిసి మరొకటి అందుకున్నట్లు కన్పిస్తుంది. మరికొన్నిటి విషయంలో సమాంతరస్థితి కన్పిస్తుంది. ఈనాడు పైన పేర్కొన్న అన్ని ధోరణులకు చెందిన రచనలూ వస్తూ ఉండడం గమనించదగింది. ఇటీవల సమన్వయ భూమికతో మానవతా ప్రజాస్వామ్య సామ్యవాదం. సామాజిక దర్శనం కలిగి, తాత్త్విక భావధారతో, జీవిత చిత్రణంతో కవిత్వం వెలువడుతూంది. ఇది రెండు తీవ్రధోరణుల సామరస్య సంధానకంగా పాత్రను నిర్వహిస్తోంది. రచయితకు నచ్చిన, అనుసరించే సిద్ధాంతాల ప్రపంచనం, అభిప్రాయాల ప్రకటనం వివరణంతోపాటు కళాత్మకమైన విలువల్ని కాపాడవలసి ఉంది. అప్పుడే దానికి సాహిత్యపరమైన విలువలు సిద్ధిస్తాయి, సాహిత్యంలో పేర్కొనదగిన స్థానం లభిస్తుంది. పైకి సంకీర్ణంగా కనపడే ఈ సంశ్లిష్టస్థితి వ్యక్తి స్వేచ్ఛ-స్వాతంత్ర్యం ప్రధానంగా వున్న సమాజంలో తప్పనిసరిగా ఏర్పడుతుంది. ఇది బహువైవిధ్యోపేతంగా వివిధ భావధోరణులు ఆలోచనారీతుల ప్రసారంతో సమస్యల పరిష్కారానికి జరిగే నిరంతరాన్వేషణం క్రమంగా ఒక్కొక్కటీ గుణాత్మకమైన స్థితికి దారి తీసేందుకు జరిగే ప్రయత్నంగానే భావించవలసి ఉంటుంది. వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్య భావనతో, దరిద్రులు పీడితులు దుఃఖితులు అభాగ్యుల జీవితాన్ని సౌభాగ్యం చేసేందుకూ, మనస్సును ఆనందంతో తీర్చేందుకూ పరిశోధనలు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు సమస్యలకు కొత్త పరిష్కారాలు, సమాధానాలు పొందే అన్వేషణ జరుగుతూంది. ఇవి పరీక్షకు గురిచేయబడీ నిగ్గుతేలీ, ప్రజాశ్రేయమైంది రూపొందేందుకు ఈ సంశ్లిష్టస్థితి ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. ఈ సంశ్లిష్టస్థితిలో విభిన్న ధోరణులను ప్రతిబింబించే కొత్త కవులు, శేషేంద్రశర్మా, సుప్రసన్న, ఎల్లోరా, శివప్రసాన్, నగ్నముని, మిరియాల రామకృష్ణ, శివారెడ్డి, వరవరరావు. చెరబండరాజు ఇట్లా ఒక్కొక్కరూ ఒక్కొక్క సామాజిక తత్త్వభూమికతో వినూత్న భాషప్రసారంతో స్వయం వ్యక్తిత్వంతో ప్రకాశించేవారే. ఎవరో ఏదో వ్రాస్తే గొప్పదే కావచ్చు దాని వెంటబడి మందలో మనుషులు కాకుండా, చేసే ప్రయత్నం సర్వదా అభినందనీయమైందీ, ఆహ్వానింపదగిందీ. సృజనాత్మక సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో అనుకరణలూ ప్రతిరూపాలకూ గల స్థానం అంతంత మాత్రమే. సంప్రదాయంలోని సంస్కారార్హమైన వాటిని మార్చి, పరివర్తనకు గురిచేసిన ఆధునికశక్తులూ ఆధునికతలో వేళ్లదన్నుకొని పరిహరింపరాని సంప్రదాయ జీవసారం గురించీ, చర్చ వేరే విషయం. ఇప్పుడు తెలుగులో వెలువడుతూన్న కవిత్వం భారతీయ భాషల్లో వెలువడే కవిత్వానికి ఏ ప్రమాణాల్లోనూ తీసిపోయేది కాదు.

కాలం కదిలేకొద్దీ, దూరం పెరిగినకొద్దీ ఇప్పుడు ప్రచలితంగా వున్న వివిధ ధోరణులతో ఉన్న సంశ్లిష్టస్థితి, పోను పోను సమన్వయ భావంతో కొన్ని అంశాలు వదలిపోయి కొన్ని మిగిలిపోయి మరికొన్ని కొత్తవి చేరీ, ఉత్తమ కవిత్వాన్ని నిలిపేదిగా సర్వ మానవ సమతా వ్యవస్థను కోరేదిగా రూపొందుతూ క్రమిస్తూందనడంలో సందేహంలేదు. సమాజంలో వ్యక్తులందరి సమతాశ్రేయో భావంపై లక్ష్యంతో చేసే అన్వేషణలో భాగంగా, కవితా ప్రపంచంలో వివిధ దృక్పథాల ఆలోచనల ప్రసారంతో ఏర్పడిన, ఈ సంశ్లిష్టస్థితి-ప్రజాస్వామ్య వ్యవస్థలో భావప్రకటనకు అవకాశంగల వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యంవల్ల ఏర్పడిందీ, సమాజాన్ని పురోగమింపజేసేదే. ఈ పాతిక ఇరవై సంవత్సరాలకాలం, కాలపరిమాణం దృష్ట్యా ఏమంత పెద్దదీ కాదు, చెప్పుకోదగిందీ కాదు, కాని ఈ కాలంలో వెలువడిన కవిత్వం విలువలదృష్ట్యా ఎంతో విశిష్టమైందీ, గతానికీ భవిష్యత్తుకూ మధ్య విస్మరింపరాని పాత్రను నిర్వహించేదీ.

ఈ మాసం - మీ నక్షత్రఫలం
ఏప్రెలు 1986.

1. మేషం (అశ్వని, భరణి. కృత్తిక. 1వ పా)

అశ్వని, కృత్తిక 1పా. వారికి గతంలో వున్న శారీరక శ్రమ, వ్యవహారపు చిక్కులూ, వ్యయ ప్రయాసలూ క్రమంగా తగ్గి, 13వ తేదీనుండి ఆరోగ్య వృద్ధి. ధనలాభం కార్యవిజయం, వ్యవహారానుకూలత కల్గును. విద్యార్థులకు వర్తకులకు కొంత అనుకూలంగా ఉండును. శుభకార్య ప్రయత్నములు సిద్ధించును. అవసరానికి తగ్గ ధనం సమకూడును. అయినా మానసికంగా కొంత క్లేశం, ఖేదం తప్పదు.

భరణి నక్షత్రం వారికి ఆరోగ్యభంగం, శారీరక మానసిక శ్రమ: కార్యవిఘ్నం, ధనవ్యయం, మనోవైకల్యం, శత్రుపీడా, బంధు విరోధం, ప్రతి పనిలోనూ తొందరపాటూ, తరువాత పశ్చాత్తాపపడుటా జరుగును. శనికి జప శాంతులు చేయించడం మంచిది.

2. వృషభం (కృత్తిక 2, 3, 4, పా. రోహిణి, మృగశిర 1, 2, పా)

కృత్తిక 2, 3, 4, పా, రోహిణి వారలకు ఈ నెల అంతా చిక్కులు విడి, కార్యానుకూలతకు మార్గం ఏర్పడును. మనోవైకల్యం ఇంకా కొనసాగును. 13వ తేదీనుండి శుభఫలం కల్గును వివాహాది శుభకార్యాలలో పాల్గొనుట, సంతానమునకు అభివృద్ధి కలుగును. ఉద్యోగులకు, విద్యార్థులకు మంచి కాలం. ధరల మాంద్యం వల్ల వర్తకులకు ఆదిలో నిరుత్సాహం, నెల చివర విశేషలాభమూ కలుగును. మృగశిరవారికి ఆందోళనా, అనుకోనని దండగఖర్చులూ జరుగుతాయి. ప్రతి పనిలోనూ తొందరపాటూ, జరిగినదానికి విచారమూ కలుగును. ధనానికి కొంత తొట్రుపాటు తప్పదు. మితభాషణం మంచిది. కుజునికి శాంతి చేయించుట మంచిది.

3. మిధునం (మృగశిర 3, 4, పా. ఆరుద్ర, పునర్వసు 1, 2, 3, పా)

మృగశిర 3, 4, పా. వారికి శ్రమ హెచ్చు ఫలితం తక్కువ. ఉష్ణాధిక్యం. మనోవైకల్యం, విశేషంగా చిక్కులూ, శరీరంలో నలతా కల్గుతాయి. నెల ఉత్తరార్థం భార్యకు స్వల్పంగా నలత, ధనవ్యయం జరుగుతుంది. అయినా శుభకార్య ప్రయత్నాలు ఫలించును. విద్యార్థులకు సామాన్యజయం, ఉద్యోగులకు శ్రమా, వర్తకులకి సామాన్య లాభం కలుగును. ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3, పా. వారికి నెలంతా శ్రమ హెచ్చుగా ఉన్నా, కార్య విజయం, 15-20 తేదీల మధ్య ధనలాభం కలుగును. మొత్తం ఈ రాశివారికి ప్రతి పనిలోనూ ఆటంకాలూ తర్వాత విజయం కల్గును. ఆర్ద్ర, పునర్వసుల వారైన ఉద్యోగులు. విద్యార్థులూ, వర్తకులూ, కర్షకులూ, అధికంగా జయాన్ని, లాభాన్ని పొందుతారు.

4. కర్కాటకం (పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష) ఈ రాశివారికి 13 వ తేదీనుండి నెలంతా మనఃఖేదం, వ్యాకులపాటూ, ఉన్నా, అవసరానికి తగిన ధనం చేకూరి, అనుకొన్న పనులు నిర్విఘ్నంగా నెరవేరుతాయి. పుష్యమి వారికి శరీరంలో నలత, కుటుంబంలో కలత, మనోవైకల్యం 13వ తేదీనుండి అధికంగా ఉంటుంది. పునర్వసు, ఆశ్లేషవారకి ధనాదాయాన్ని మించి వ్యయం కూడా జరుగుతుంది. శుభకార్యానుకూలత, పుణ్యతీర్థయాత్రలూ, సద్గోష్ఠి, ఉత్తమ బంధుమిత్ర లాభమూ కలుగును. విద్యార్థులకూ. వర్తకులకూ, ఉద్యోగులకూ అనుకూలమైన కాలం.

5. సింహం (మఘ, పుబ్బ, ఉత్తర 1వ పా.)

పుబ్బవారికి ఆరోగ్యభంగం, మనస్తాపం, ఉష్ణాధిక్యం, అధిక శ్రమా, కుటుంబంలో అకారణ కలహాలు, వాగ్వాదం, అధిక ధనవ్యయమూ కలుగును. అన్ని పనులూ ఆలస్యంగా నెరవేరుతాయి. పడుట, దెబ్బలు తగులుట మొత్తం రాశివారికి జరుగవచ్చును. పునర్వసు 4వ పా, ఆశ్లేషలవారికి అనుకూల శుభఫలం కలుగుతుంది. మానసిక ఆందోళన ఉన్నా, అనుకొన్న శుభకార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయి., కోర్టు వ్యవహారాలు సానుకూలమవుతాయి. అయితే ప్రతి విషయంలోనూ మానసికంగా దిగులు వుంటుంది. సంసారభార్యా · కుటుంబసౌఖ్యం, ధనాదాయం బాగుండును. విద్యార్థులకూ, ఉద్యోగులకూ, కర్షక కార్మిక వర్గానికి, ఉపాధ్యాయులకూ, రాజకీయవాదులకూ, వర్తకులకూ సర్వవిధాలా మేలు, లాభం, సుఖసంతోషాలూ కలుగుతాయి.

6. కన్య (ఉత్తర 2, 3, 4. పా. హస్త, చిత్ర 1, 2, పా)

శరీర శ్రమ హెచ్చు. ధనవ్యయం, కుటుంబంలో కలత నలతలూ, బంధువులతో మాట పట్టింపులూ, అనవసర వాగ్వాదాలూ, కించిత్తు శరీరంలో నలతా, చిత్ర 1, 2, పా. వారికి కలుగును. ఉత్తర 2, 3. 4, పా, హస్త వారలకు గతంలో వచ్చిన శ్రమ, ఖేదం, నలత, వ్యవహారపు చిక్కులూ క్రమంగా తొలగిపోయి సుఖ సంతోషాలు కలుగుతాయి. శత్రువులు ఏదోవిధంగా అపకారం చెయ్యడానికి చూస్తూ ఉంటారు. అయినా శ్రమా, కించిత్తు భీతీ తప్ప ఎట్టి అపకారమూ జరుగదు. ప్రతి పనిలోనూ అధిక శ్రమా, వ్యయమూ కలుగును. దూర బంధుపీడ చేయును. మొత్తం మీద ఈ రాశివారికి శుభాశుభమిశ్ర ఫలం కల్గును. అయితే గతంలోకన్న శ్రమ తగ్గును. పనులు నెరవేరడంవల్ల అంతగా ఖేదం కలుగదు. నెలాఖరునాటికి అంతా శుభపరిణామం అగును. విద్యార్థులకు మేలు కలుగును. కష్టంమీద ఉన్నత విద్యావకాశం కలుగును.

7. తుల (చిత్ర 3, 4, పా. స్వాతి, విశాఖ 1, 2, 3. పా.)

చిత్ర 2. 3, పా. విశాఖ 1, 2, 3, పాదముల వారికి 12వ తేదీవరకు కొంత సామాన్యంగాను, ఆ పిమ్మట కుటుంబపు చిక్కులతోను, ధనమునకు తొట్రుపాటుతోను గడచును. ధనవ్యయము, ఇతరులతో మాటపట్టింపులు మనఃఖేదం కలుగును, స్వల్పంగా ఆరోగ్యభంగం అగును. శుభకార్య ప్రయత్నాలకు వ్యయం జరిగి ఫలించునుగాని అధికశ్రమ పొందవలసి వచ్చును. స్వాతి వారికి ఇప్పటి వరకు ఉన్న చిక్కులు తొలగి అన్నివిధాలా స్వస్థత కల్గును. ధనాదాయం పెరుగును. విద్యార్థులకూ, ఉద్యోగులకూ, అనుకూల ఫలం కల్గును. వర్తకులకు ప్రారంభంలో సామాన్యఫలమూ, ద్వితీయార్ధంలో మంచి లాభమూ, సువర్ణాభరణ ప్రాప్తి కలుగును.

8. వృశ్చికం (విశాఖ 4వ పా, అనూరాధ జ్యేష్ఠ)

విశాఖ వారికి ధనలోపం ఉండదు. బంధుమిత్రులతో కొంత స్పర్థ, మాటపట్టింపులు వచ్చును. అన్ని పనులూ సకాలంలో నెరవేరును. శుభకార్య ప్రయత్నాలు ఫలించును. రాజకీయ వాదులకు హెచ్చు పలుకబడి, ధన.పదవీ లాభం కలుగును. విద్యార్థులకు ఉద్యోగులకూ మేలు కల్గును.

అనూరాధ, వారికి శరీరంలో నలత, కార్య వైఫల్యం, మనఃక్లేశం ఆర్థికపు చిక్కులూ, అపనిందా, అవమానం కలుగును. శని జపం మంచిది. ఏదో విధంగా సమయానికి డబ్బు సర్దుబాటయి పబ్బం గడచిపోవుచుండును.

జ్యేష్ఠ వారికి అన్ని రంగాలలోను విజయం, లాభం, మంచి ధనాదాయం మాట పలుకుబడి, బంధుమిత్ర సమాగమం, శుభకార్యానుకూలత జరుగును. అన్ని వర్గాల వారికి శుభప్రదంగా ఉండును.

9. ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా) పూర్వాషాఢ వారికి గతంలోని చిక్కులు ఈ నెల చివరిదాకా కొనసాగును, ఆరోగ్యం సామాన్యం. అధికంగా వేడిమి, శ్రమ, మానసికంగా ఆందోళన ధనవ్యయం జరుగును. విద్యార్థులకూ, ఉద్యోగులకూ, వర్తకులకూ శ్రమకు తగిన ఫలం కలుగును. మూల, ఉత్తరాషాఢ 1వ పా, వారలకు శుభఫలం హెచ్చుగా నుండును. శుభ కార్య ప్రయత్నాలు నెరవేరును. అన్ని వర్గముల వారికీ శరీరంలో నలత ఉన్నా ప్రతి విషయమూ సానుకూలంగా, లాభదాయకంగా ఉండి, సర్వుల వలన సమ్మానమూ, గౌరవమూ, ఆదర గౌరవములూ, సుఖశాంతులూ లభించును. పూర్వాషాఢవారు శని కుజులకు జపం చేయుట మంచిది.

10. మకరం (ఉత్తరాషాఢ 2, 3, 4, పా. శ్రవణం, ధనిష్ట 1, 2, పా) ఉత్తరాషాఢ వారికి నెలంతా సామాన్యంగా గడచును. కాని చేతికి అంద వలసిన ఫలితం కొన్నాళ్ళు వాయిదా పడును. పుత్ర పుత్రికా విషయికంగా ధన వ్యయం. విద్యార్థులకు సామాన్యశ్రేణి విజయం.

శ్రవణం వారికి ధనలాభం, సంసార కుటుంబ సౌఖ్యం, మంచి పలుకుబడీ, కుటుంబంలో శుభకార్యానుకూలతా, సర్వత్రా విజయమూ చేకూరును.

ధనిష్ట వారికి ఫలితం బాగుగా ఉన్ననూ, విపరీతంగా శ్రమ, మానసికంగా ఆందోళనా, పిరికితనమూ, సంతానంతో మాటపట్టింపులూ, అధికంగా ధన వ్యయమూ జరుగును. హెచ్చు శరీరశ్రమ కల్గును.

11. కుంభం (ధనిష్ట 3, 4, పా. శతభిషం, పూర్వాభాద్ర 1,2,3, పా) శతభిషం, పూర్వాభాద్రల వారికి, ఆరోగ్యం, సర్వకార్య విజయం, ధన లాభం, సుఖసంతోషాలూ కల్గును. ఉద్యోగులకు పదవీ గౌరవప్రాప్తి, విద్యార్థులకు ఉన్నతశ్రేణి విజయం, వర్తకులకు ధనలాభం, రాజకీయవాదులకు చేతుల నిండా పనితోబాటు సంచారం, ధనలాభం కలుగును. ధనిష్ట 3, 4, పా, వారికి శ్రమ, ధనవ్యయమూ ఇతరులతో వాగ్వాదమూ, కుటుంబంలో స్వల్పంగా కలతలూ కలుగును.

12. మీనం (పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి) ఉత్తరాభాద్ర వారికి శరీరశ్రమ, మానసికాందోళనా హెచ్చు. అనవసరపు ఖర్చులు డబ్బు తొట్రుపాటుకి దారితీయును. ప్రతి విషయంలోను అనుమానాలు, భయం, నిరాశ, కలుగుచుండును. పూర్వాభాద్ర 4వ పా, రేవతి వారలకు సర్వ విధాల అనుకూలమైన కాలము. గతంలో మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగానూ కలిగిన చిక్కులు తొలగిపోయి కుటుంబంలో సుఖశాంతులు చేకూరును. విద్యార్థులకూ, వర్తకులకూ, ఉద్యోగులకూ మంచి యోగదాయకమైన కాలం.

గమనిక :- ఆయా వయస్సులవారు తమ తమ వృత్తి, వ్యాపార ఉద్యోగస్థితులను వయస్సును బట్టి ఫలాన్ని అన్వయించుకొన వలసినదిగా వేడుదును.

సిద్ధాంతి:

శ్రీ నిష్ఠల వేంకట సత్యసుబ్రహ్మణ్యం

బొబ్బిలి

ఆర్తి

ఓ కాంతి ధార
నా కను చూపులో
మిళితమై
అది మౌనమై,
ధ్యానమై
నిశ్చలమై
నిర్మల మైన
ఆసుషుప్తిలో
నా ఎద తలుపులు
తెరచి చూస్తే
ప్రభూ —
ఆరూపు
శత సహస్ర
ప్రభా భాసమైన
నీ దివ్య
సుందర విగ్రహమే

శ్రీ ఆకెళ్ల శివ ప్రసాద్.

ఉగాది లక్ష్మి

కిలకిలలాడు నా తెలుగు గడ్డను దివ్యసుధా తరంగిణీ
జలముల నింపవమ్మ—సరసత్వము సత్యము శాంతి దాంతి ని
ర్మల కరుణాంతరంగముల మల్లెలు నింపుముగాది లక్ష్మి! మా
తలపుల ప్రేమవాహినుల తన్పుము పెంపుము సౌఖ్యసంపదల్-

కూయవు కోయిలల్-చిగురు కోకలు కట్టవు గున్నమామిడుల్
సోయగముల్ లతాంగనల శూన్యము-శ్రీవనలక్ష్మి యింటిలో
మాయని కారుచీకటుల మబ్బులు—నీ వరహాల చేతితో
చేయుము దీప్తిమంతముగ చిన్నెలు వన్నెలు పిచ్చలింపగన్.

ప్రజల ప్రాణాలు తీయు దౌర్జన్యముడిపి
జనని! నింపుము రుచిర సౌజన్యములను
పంచిపెట్టుము సౌహార్ద భావములను
ప్రణయ మధురామృతమ్ము సంభావనముల.

మమతల యింటిలో నిలుపు మల్లెల దీపిక—జీవితాలలో
సమతలు సౌమనస్యములు సంపద పెంపొనరించు-స్నేహ బం
ధముల బిగించు మెల్లర సదాహృదయమ్ముల రాగరక్తిమల్
ప్రమదము పెంచుమమ్మ! నవరాగము రాగమునింపుమింపుగా,

విందులు విందులంచు కనువిందొనరించెడి సుందరాంగనల్
సందడి చేయసాగిరి-విశాల వికాస విలాస మాధురీ
బృందము నిండు గుండియల పెంపుము-నా రతనాల గడ్డపై
క్రొందలి రాకుడాలు తళుకుల్ రవణింపుము సర్వథాసదా!

శ్రీ పొతకోట రాధాకృష్ణమూర్తి

"చేతులు కాలేక..."

మేకా సుధాకరరావు

యువతీ బృందమొకటి స్వేచ్ఛగా కబుర్లాడుకుంటూ, పాడుకుంటూ సాగి వస్తూంది. సాంధ్యరాగపు చక్కదనాలు, చల్లగాలుల చక్కిలిగింతలూ వారి ఉత్సాహానికి ప్రోత్సాహమిస్తున్నాయి. అలా వస్తూన్న వాళ్ళకు దూరంగా——

"ఆడనా, ఆడనా జవరాలిమాట!" ఎవరిదో బరువుగా ఓ గొంతు వినిపించింది. ఒక్కసారిగా అంతా నిశ్శబ్దంగా నిలిచిపోయారు. ఆ గొంతూ నిలిచిపోయింది.

మళ్ళీ బయలుదేరి సాగుతున్నారు...అదిగో——ఎవరో రుషిలా ప్రవాహం వంటి గెడ్డం, జడలు కట్టిన కురులు...ఏదో పాడుతున్నాడు!

"మూణ్ణాళ్ళ ముచ్చటకు—మురిసేవు పలికేవు
ముందుగతి కానవే చిలుకా-ముందుగతి కానవే చిలుకా."

బాగా దగ్గరగా వచ్చేరంతా-

"ఎవరే ఆ తత్వాల తాత?" అంది ఒక యువతి.

"అంతేలే ఈ తాతల తత్వం" అంది, ఇంకో యువతి.

పాట సాగుతూంది——

"వయసు బలిమిచేత - మనసు తాలిమిలేక
మమతలా పడిపోయి - మోసాలపాలై తె జీవా!
మాయమైపోతివే జీవా!"

ఒక యువతి : ఉన్నతమైన వేదాంతం!

మరో యువతి : ఏదైనా ఉదంతమే నేమో?

పాటగాడు : కళ్ళెంలేన్ని రౌతు, వయసు
కళ్ళెం లేని గుర్రం, మనసు——

మరో యువతి : కుతూహలాజనితంగా వుందే ఇతని రీతి!

ప్రక్కనున్న యువతి : అతన్ని చూస్తేనే కలుగుతూంది ఏదో భీతి!

ఓ అల్లరమ్మాయి : ఎవరో మతిలేని మారాజులా ఉన్నాడు పాపం!

పాటగాడు : అవును—— అలానే అనిపిస్తుంది వయసు
దాన్నే బలపరుస్తుంది మనసు!

వాణి : ఏయ్ రాణీ - ఏమిటా తొందర?
ఆలోచించు కాస్త, మాట్లాడే ముందర.

పాటగాడు : ముచ్చట గొలుపుతూంది, మీ రాక
ఎచ్చటికో మరి ఈ పోక?

వాణి : ఎవరండీ మీరు? ఇదేనా మీ వూరు?

పాటగాడు : ప్రస్తుతానికి ప్రయోక్తను-

ఒకామె : ప్రయోక్తా?

రాణి : రండర్రా, దీనికి మరీ మతి పోతూంది

వాణి : ఏమిటి రాణీ అది?

వేణి : చీకటి అదే పడిపోతూంది

వాణి : వినవే వేణీ ఇది-

పాటగాడు : నీ పేరేమిటోనమ్మా-?

వాణి : వాణి

ప్రయోక్త : ఆహా! వేణి, వాణీ, రాణీ...

వాణి : ఆవిడ పేరు పద్మపాణి

ప్రయోక్త : చెవులకు సంగీతంలా వుందమ్మా - ఇరిగో ఇంకా వున్నారే?

వాణి : అవును— పదిహేనుగురం వచ్చాం మేము ప్రయోక్తగారూ! మూడు
రోజుల వినోద విజ్ఞానాల అనంతరం
తిరిగిపోతున్నాం, మా వూరు
ఈ పూట భోజనం ఈ వూరు
తరువాత ఎక్కడమే మా కారు-

ప్రయోక్త : చాలా సంతోషం తల్లీ

రాణి : ప్రయోక్తగారూ, మీకు
ప్రశ్నలు వేయడమే కాని
జాబులీయడం అలవాటు కాబోలును-

వేణి : చెప్పేరు కాదు మీ ఊరు

పద్మపాణి : ఆ కనిపించే దీపాలేనా, ఊరు?

ప్రయోక్త : అయిదారు నిమిషాల నడక-

ఒకామె : రండర్రా ఏమిటీ సోదె-

వాణి : ఏమిటర్రా ఒకంటే వాగుడు?
లేదండీ, ప్రయోక్తగారూ - వీళ్ళంతా...

ప్రయోక్త : అవునమ్మా వాణీ- అదంతా వయసు
నాకు తెలుసు ఆ మనసు-
ఎంతోకాలం నుంచి
మాచే వినలేదు, ఈ బాటను!
ఈ వేళల
మనిషే నడువలేదీ బాటను!

వాణి : అంత భయంకరమైనదా, ఈ బాట?

ప్రయోక్త : తమ నీడకు తామే భయపడతారు ఈ కాలపు మనుషులు!
తమను తామే నమ్ముకొనలేవీ కాలపు మనసులు!

వాణి : అవున ప్రయోక్తగారూ, "ఆడనా, ఆడనా - జవరాలి మాట?"
అంటున్నారు మేము వచ్చేముందు - మీరేనా?

ప్రయోక్త : పాడనా, పాడనా - వివరాల పాట?

రాణి : ఎవరండీ ఆ జవరాలు?

ప్రయోక్త : ఇదే వయసు - అతిమంచిసొగసు!
మీ వలెనే పుట్టిందికాని - ఇలాగ్గా పెరగలేదు పాపం!
విషాదాలతోట - ఆమె జీవితపు బాట.

వాణి : ఏమవుతుందో మీకామె?

వేణి : ఇంతకూ ఎవరండీ ఆమె?

ప్రయోక్త : రత్నంలాంటి పిల్ల - రత్నమే ఆ పిల్ల!

వాణి : ఏం జరిగిందండీ?!

ప్రయోక్త : తప్పొక్కటి చాలును భువి...

రాణి : తప్పేమిటి చెప్పుమయ్య త్వరగా తాతా-

వాణి : ఏమేవ్ రాణీ ఏమిటిది - మరీ...
ప్రయోక్తగారూ, దయచేసి కాస్త...

ప్రయోక్త : పుట్టుక పేదది పాపం
ఎట్టులనో ప్రాణి బ్రతికి ఎదిగెను భువిలో-

రాణీ, వేణీ : రండర్రా — మతిపోతూంద దీనికి-

వాణి : అయ్యో - ఉండండర్రా, ఏమిటా తొందర?

ప్రయోక్త : మనసును తొందరపెట్టింది, వయసు
మనిషిని తొందరపెట్టింది, మనసు!
వయసనండి, మనసనండి
త్వరపాటులో పడ్డ పొరపాటులో పడ్డ మృతపాటు!

వాణి : అయ్యో! అసహజమైన చావు కాబోలును పాపం!

రాణి : మేము వెడుతున్నాం వాణీ

వేణి : సానుభూతిసభ జరిగేలా వుందిక్కడ-

వాణి ! ఏమండి ప్రయోక్తగారూ,
వినాలనే వుంది, కోరిక-
తలా తోకా తేలడం లేదు పోలిక.
ముంచుకొచ్చేస్తూంది, చీకటి
చేరగా పోవాలి వీటికి
అందులో - అలసిపోయి ఉన్నారాయె అంతా-

ప్రయోక్త : పోండి - ఆ ఊరువైపే పోండి - అల్లంత దూరాన
అదే ఒక రావి - ఆ రావి ప్రక్కనే వుంది, ఓ పెద్దబావి-

ఇద్దరు ముగ్గురు యువతులు | అవునదిగో,
ఆ బావి!

రాణీ : పదండి, శుభ్రంగా కాలుసేతులు కడుక్కోవచ్చు

వేణి : దప్పి తీర్చుకోవచ్చు

పద్మపాణి : నిష్కల్మషంగా చేయవచ్చు పురప్రవేశం

ప్రయోక్త : నీవూ నడువమ్మా వాణీ - నేనూ చేరుతా మెల్లిగా

(నూతిలో నీరుతోడి 'నే'నంటే 'నే'నంటూ పోటీలు పడుతున్నారు - కాలు సేతులు కడుక్కుంటున్నారు - దాహం తీర్చుకుంటున్నారు.)

వాణి : ఆ చేద నన్ను త్రాగనీయవే రాణీ

రాణి : ఇదిగోనే వాణీ...

(వాణి త్రాగుతూంటే 'అమ్మయ్యా' అంటూ బరువుగా వినిపించింది)

వాణీ : అః! ఏమిటీ! మంచినీరు మాట్లాడుతూంది-ప్రయోక్తగారూ-

ప్రయోక్త : భయపడకమ్మా - వచ్చాను.

వాణి : 'అమ్మయ్యా' అన్నది, ఈ నీరు


రాణి : నీ ముఖమే వాణీ—నీరు త్రాగుతూ, అలసిన మీదట 'అమ్మయ్యా'
అనుకున్నావు కాబోలును-

ప్రయోక్త : లేదమ్మా వాణీ, వాటికి దప్పి తీరింది.
ఎన్నాళ్ళనుండో
పోరెవరూ ఈ చోటికి నీటికి
రారెవరూ ఈ నూతికి నీటికి-

బరువైన కంఠం : ఆనాటినుండీ
మనిషే చేరడు నా నీడను
పక్షే వాలదు నా మీదను!

వాణి : అయ్యో! రావే పాట పాడుతూంది!

ప్రయోక్త : అవునమ్మా-



దానికీ పోయిన ప్రాణం వచ్చినట్టుంది.
ఆ అమ్మాయి వెయ్యిమయ్యిందనీ,
అది ఆ కొమ్మలో గూడు కట్టుకుందనీ...

వాణి : అవునులెండి-
గాలికి ఆపురాలితేనే గగ్గోలు తేస్తారు!
మొత్తానికిదేదో చిత్రంగానే వుంది—
బావి మాటలాడటం-రావి పాట పాడటం...

రాణీ : కలలో వలె

వేణి : కాశీమజిలీ కథలోవలె

పద్మపాణి : జానపదచిత్రపు సొదలోవలె—

ప్రయోక్త : ఆ బావికి ఈ రావి, ఇరుగు
ఈ రావికి ఆ బావి పొరుగు
రావీ బావీ ఇరుగూ పొరుగై
చిరకాలంగా కాపురం చేస్తున్నై-

రాణి : మేము పోతున్నాం వాణీ-
ఏదో నాతి కథతో ప్రారంభించి
ఈ నూతి కథలోనికి దిగారు ప్రయోక్తగారు-

ప్రయోక్త : ఈ నూతిలోనే పద్మదని పుట్టించారు, ఆ నాతి
ఆ నీతి మీకు చెప్పడమే నాకు ప్రీతి-

వాణి : లేదండి ప్రయోక్తగారూ, అది పట్టి అల్లరిది-
నీకు పుణ్యముండేను ఊరుకోవే రాణీ-

వేణి : ఇంతకూ ఇదేదో కట్టుకథ-

ప్రయోక్త : కట్టుకథ కాదమ్మా, ఇది తీరనట్టి వ్యథ.

వాణి : మీకిష్టం లేకపోతే నడుస్తూండండమ్మా-
కాస్త త్వరగా చెప్పండి ప్రయోక్తగారూ,
నాకు కుతూహలంగా వుంది, వినాలని.

ప్రయోక్త : మెల్లిగా నడుస్తూనే చెపుతాను-నడువమ్మా వాణీ

ఇద్దరు / ముగ్గురు : అయితే అంతా మెల్లిగానే నడుస్తాం—
త్వరగా చెప్పండి మరి—

ప్రయోక్త : ఒకించుక నైరాశ్యం-కించిన్నిర్వేదం
ఇంచుక ఆనందం-ఏదో విషాదం
అన్నీ ఆ యమ ఒక్క తళుకు మెరుపులో
అగుపించేయండే. అతిశయోక్తి లేదేమాత్రం.
సందేహంలేదు-సామాన్యసుందరి కాదామె-
పద్మనేత్రని అంటే-ప్రబంధ ఫక్కీ-కాదు మరి-

రాణీ : ఇలాగైతే కథ సాగదు

వేణి : మనకై కాలం ఆగదు

ప్రయోక్త : అన్నిట గొప్పది పాపం-పుట్టుక ఒక్కటె శాపం!
నిజాని కామెది కాదా లోటు
అయినా, తప్పలేదు పాపం, చేటు.
తనింట పుట్టిందే కాని, ఈ రత్నం
తగిన రీతిగా ఎలా చూడగలుగుతాడా తాతయ్య?
తిండికే చాలదు అతని బండి
గుర్రం రెండుపూటలా తింటే
తనకు మిగిలేదిక అరపూటే!
రాత్రి కూడ తను తింటే-పొద్దుట గుర్రం వస్తే
అలా చేస్తే, అది చస్తే?
అలాగే లాగుతున్నాడా బండి-
తాతయ్యను చూస్తే జాలి కదండీ!

రాణీ : ప్రొద్దుపోయింది ప్రయోక్తగారూ

ఇంకొకరు : ప్రతీదీ...

ప్రయోక్త : అందుకో ఆ గొందిలో పుట్టిందీ రత్నం
తగిన పేరే పెట్టాడు పాపం, రత్నం-

రాణి : అమ్మయ్యా-పుట్టినచోటూ, పేరూ చెప్పడాని కెంతపట్టింది!

ప్రయోక్త : ఆరేళ్ళవరకూ అలానే-మురికిలోనే
మురిపెంగా పెంచేడు, పాపం
తల్లికి యెపుడూ రోగమె, శాపం!
ఆడపిల్లాయెను-ఆకాశం కప్పు కొనలా
ఎన్నాళ్ళుండగలదు? ఎన్నేళ్ళుండగలదు?
ఇరుగూ పొరుగూ చింకూ గొంకే ఇస్తే
సరిపెట్టుకునేదే, మరి-
దార్ఢ్యం ఉన్నన్నాళ్ళూ దాస్యం చేయించుకున్నారు కాని
తల్లిది రోగిష్టిది కాగానే
తమకేమని ఊరుకున్నారు—తాహతున్నవారే యజమానులు
మనసంతా మొద్దుబార్చుకొని, మరవు కప్పుకొని
మొండిబారిపోయి
అలానే లాక్కొస్తున్నాడు బండి
పాపం, తాతయ్యను చూస్తే జాలి కదండీ!

రాణి : (చిలిపిగా) ఎందుక్కాదండీ?

వాణి : తమరు నోరుముయ్యండీ-

వేణి : మనం ఇంత దూరం నడిచినా
కథ అక్కడనే వుంది—కానీయండి స్వామీ-

ప్రయోక్త : తిండున్నా లేకపోయినా-రాత్రిపూట రత్నాన్నలా ఒడిలో నిడుకొని
కడుపు నింపుకొనేవాడు, ఆనందంతో—అమితానందంతో!


రాణి : ఈ వివరాలు విడిచి, ఆ జవరాలి కథ చెప్పండీ-

ప్రయోక్త : ఆ జవరాలి జీవితమేనమ్మా, ఈ వివరాలు—
ఓపికతో వింటే, కాస్త సాఫీగా సాగిపోతుంది.
మంచాన తీసుకునే మరణించిందా తల్లి!
మరో జీవిని విడిచి మరీ పోయిందామె.
ఆ చెల్లికి ఈ పిల్ల తల్లి!
ఆ యింటి బరువంతా రత్నమే మోయాలి పాపం!
తండ్రి ఏ పావో తెస్తే తల్లిలాగే సర్దుకొచ్చేది.
పదోయేట మోసేదంత సంసారం!

రత్నాని కెందరో సాయపడేవారు
రత్నాన్ని జూచందరూ జాలిపడేవారు-అవునా?
పరుగెడుతున్న కాలప్రవాహం లోనికి
అడుగిడుతోంది, మరో పాత్ర-

రాణి : అదెవరు?

ప్రయోక్త : చూడ చక్కని చిన్నవాడు-నాల్గు పిక్కలు ఉన్నవాడు
తండ్రి నాటినుండీ తాతయ్య-వారి బండివాడు.
తనూ, తాతయ్య బండిని తరచూ వాడుతుండేవాడు.
వచ్చే, పోయే దారిని బండైనా నడకైనా


అనోలియమ్
కోల్డ్ రబ్
జలుబులు మరియు దగ్గుల
మీద ఇది ఎలా చల్లగా,
అయినా అమోఘంగా
పనిచేస్తోందో చూడండి.
Anoleum
Anoleum
6 ఔషధ దినుసుల ప్రక్రియ
అనోలియమ్ చల్లనైనది,
అయినా అమోఘమైనది–
ఆబాలగోపాలానికీ అతి శీఘ్రంగా
ఉపశమనం కలిగిస్తుంది.

తేడా

డా॥ ఎమ్. విజయగోపాల్

రాత్రికి
పగటికి ఎంత తేడా!
పగలైతే అరమైలు దూరంపోతావు ఒకటికి
రాత్రయితే అరడుగుదూరంలోనే
రాత్రయితే ముడుచుకు పోతావు
పగలైతే విరుచుకు పడ పోతావు
చీకటి నిరాశలో చచ్చిపోదామనుకునేనీవు
పగటి ఆశలో ప్రపంచాన్ని మార్చేస్తా నంటావు
అమవసనిశిలో ప్రళయాన్ని చూసే నీవు
వెన్నెలరాత్రిలో జీవన ప్రళయాన్ని భోం చేస్తావు
రాతిరి సందులో సంకుచిత మతప్రవక్త వైననీవు
పట్టుపగలు వెలుగులో మతాలన్నీ ఒక్కటే,
దేముడొక్కడే అంటావు.
రాత్రిపగళ్ళ చక్రంలో గిరగిర తిరిగేనీవు
రాత్రిని నీమెదడులోంచి తొలగిస్తే
ఈలోకానికి ఎంత హాయి!

తాతయ్యను పిలుచుకు పోయేవాడు.
తాతయ్యాతనికో ఊతయ్యేడు, నిజానికి.
అప్పుడప్పుడు రత్నానికేమైనా తెచ్చేవాడు-ఇచ్చేవాడు.
'చినబాబు' అనేవాడు తాతయ్యాతనిని-

రాణి : సరిపోయింది—ఆ నాతి నక్కడ నిలిపి
మరో కోతిని తీసుకొస్తున్నారు స్వామీ, సెలవు—

వేణి : ఏమేవ్ వాణీ, ఒక్క నిమిషం నిలిచేది లేదు

పద్మపాణి : మరీ ఆలస్యమౌతూంది, మనం పోవడం మంచిది-

వాణి : మీకు పుణ్యముండేను-మీరు నడవండ్రా-లాడ్జికి పోయి స్నానాదుల
ముగించుకునేసరికి నేనూ వచ్చేస్తాను-ఊరు చేరినట్టేగా-
ఏమండీ ప్రయోక్తగారూ, మరోలా అనుకోకుండా కొంచెం త్వరగా, ముక్తసరిగా చెప్పేస్తే, విని పోతా-మధ్యలో విడిచిపోవడానికి మన సొప్పటం లేదు-

యువతులు : అయితే అలానేరా - మేమంతా పోతున్నాం-తమ రాకకు వేచి యుండకనే భోజనాలు కూడ కానిస్తాం...

తరువాతి కథ

అంతా చూచి చూచి, వాణి రాక, భోజనాలు కూడ పూర్తి చేసుకున్నారు. వాణి కోసం కొందరు బయలుదేరుదా మనుకుంటుండగా. ఆమె రానే వచ్చింది.

చిలిపిగా, చమత్కారంగా, చనువుగా తలోకరకంగా ప్రవచించారామె గూర్చి. అన్నీ చల్లబడ్డాయి. అయితే ఆమె మనస్థితి-ఆమె భోజనం సైతం చేయననడం, విషణ్ణ వదనయై లోతైన భావనా సముద్రంలో ఈదుతున్నట్టు గోచరించడం, అందరికీ కుతూహలం కలిగించింది. అసలు, ఆమె నంతగా మార్చగలిగిన, ఆమె విన్న రత్నం విషాదగాథేమిటో వినాలనే ఆత్రుత పడ్డారందరూ.

వాణి మెల్లగా చెప్పనారంభించింది.

చినబాబుని పరిచయం చేశాడు కదూ?...ముందుగా నేను చెప్పవలసిన దేమిటంటే, ప్రయోక్త పలికిన ప్రతి మాట వెనుకా అగాధమైన బాధ అణగివుంది. ఏదో చమత్కారంగా చెపుతున్నట్టు కనపడినా, ప్రతి మాటా సార్థకంగా ప్రయోగించాడు. సూటిగా నాచేలా చెప్పాలని ప్రయత్నమై ఉంటుంది — నిగూఢ హృదయుడు!

"ఆయన చెప్పిన కథేదో చెప్పవే" అంది, రాణి.

"అవును—త్వరగా చెప్పమ్మా-తెల్లవారకుండా లేవాలి తిరుగు ప్రయాణానికి" అన్నారిద్దరు—

"సరే" అంటూ, మళ్ళీ చెప్పడం ప్రారంభించింది, వాణి :

చినబాబు సాయం చేస్తుండేవాడు, తాతయ్యకు. రెండేళ్ళ తరువాత పాపం, ఆ చంటిబిడ్డ పోయింది. పదోయేటనుంచీ అమ్మగా పెంచుతున్న రత్నం, అప్పుడే గర్భశోకం కూడ అనుభవించ వలసి వచ్చింది. నిజానికి తాతయ్య ఆ పోయిన బిడ్డకై బాధపడనే లేదు-తన రత్నం బాధ చూడలేక బాధపడ్డాడు.

చినబాబు అన్నగారితో వేరై పోయినందువల్ల ఒక్కడై పోయాడు. పొలమదీ తనే చక్కబెట్టుకోవలసి వచ్చింది. రోజూ పొలానికి పోయినా మరెక్కడకు పోయినా తాతయ్యను పలుకరించకుండా పోయేవాడు కాడు. తరచూ తాతయ్య కూడా పోతూనే ఉండేవాడు.

చిన్నప్పట్నుంచీ రత్నానికి చదువంటే శ్రద్ధ. ఇరుగు పొరుగుల అరుగుల మీద పంతులు పాఠాలు చెపుతూంటే వినేది, రత్నం. అలాగే, చూస్తూ అక్షరాలవీ నేర్చుకునేది. కూడబలుక్కుని పుస్తకాలు కూడ చదవగలిగేది. ఆ పంతులు కూడ ఎంతో సరదాపడి ఏదో ఒకటి చెపుతూ ఉండేవాడు. చినబాబు పుస్తకాలవీ కొని పడేసి, ఆమె ఉత్సాహానికెంతో ప్రోత్సాహం చేకూర్చాడు.

పదకొండేళ్లు నిండినై రత్నానికి. తాతయ్య గుర్రం చనిపోయింది. తాతయ్య సుస్తీతో మంచాన పడ్డాడు. ఆ బండి అమ్మేసి, వచ్చిన డబ్బుతో చిన్న దుకాణం పెట్టి సంసారానికి సంపాదించేది, రత్నం. చినబాబు కూడ సాయం చేస్తుండేవాడు.

అలా రెండేళ్ళు గడిచాయి. గత కొద్ది నెలలుగా, రత్నం బాల్యం విడిచి నప్పట్నుంచీ, తాతయ్య హృదయం భారతరమైంది! రత్నమంటే అతనికి పంచప్రాణాలు. కాలం పరుగెత్తుతూంది. రత్నం సౌందర్యం సవరించుక చక్కనౌతూంటే, తాతయ్య దైహికశక్తి, తగ్గి, మానసికంగా మరీ కృంగిపోతున్నాడు. బాగా కృశించిపోయాడు. రత్నం ఇదివరకటంత స్వేచ్ఛగా తిరుగాడటం లేదు. చినబాబు దగ్గరకూడ, సిగ్గుచే, పూర్వమంత చనువుగా ఉండటంలేదు. రాత్రులందు తాతయ్యకు రామాయణ భారతాదులలోని కథలవీ చెపుతూండేది. ఇరుగు పొరుగులంతా రత్నాన్ని ముచ్చటగా చెప్పుకొనేవారు-ఎంతో సానుభూతి చూపేవారు.

ఒక శరత్పూర్ణిమా యామిని—చినబాబు తెల్లగా తయారై తాతయ్య దగ్గరకు వచ్చాడు-సినిమాకు వెడదాం రమ్మనమన్నాడు. ఆ సినిమా బాగుందని చెప్పుకుంటున్నారు-రత్నం కూడా అంది, "మంచి సినిమా అట-చూచిరా నాన్నా" అని. ఆనాడు తాతయ్య శరీరంలో మరీ అనారోగ్యంగా వుంది. అంచేత రాలేనన్నాడు. "బాగుంటుంది-నీవు పోయి చూచిరా అమ్మా" అని, రత్నాన్ని ప్రోత్సహించాడు. మొదట రత్నం కొంచెం వెనుకాడినా, తండ్రి చేసిన ప్రోత్సాహం మీదా-బాగుంటుందనే అభిప్రాయంవల్లా బయలుదేరటానికి ఒప్పుకుంది-వెళ్ళింది.

తోవలో పూలచెండొకటి కొని ఇచ్చాడు చినబాబు. రత్నం తలలో ముడుచుకుంది. చీకటివంటి ఆమె కురులమధ్య ఆ చెండు, నల్లని మేఘంలోంచి అప్పుడే బయటపడుతున్న చంద్రుని స్ఫురింపజేస్తుందట! తెల్లని వెన్నెట్లో అలా నడుస్తూంటే ఆమె పాదాలు కందిపోతాయేమో ననిపించింది, చినబాబుకి. రిక్షా కట్టిస్తానన్నాడు. ఆమె వద్దంది.

సినిమానుంచి తిరిగి వస్తున్నారు. చక్కిలిగింతలు పెట్టే ఆ శారద వెన్నెలలో అలా నడుస్తూ, ఉల్లాసంగా పోయే జంటలను చూస్తూ వస్తున్న వారి హృదయాలలో అణిగి మణిగి అవ్యక్తంగా వుండిపోయిన ఊహాసుమాలు వికసించినాయి. చినబాబు ఏదో పలకరించాడు - రత్నం సిగ్గు నటించింది. ఇద్దరి గుండెలూ గొంతుల్లో కొట్లాడుకుంటున్నాయి ఆమె భయం వెలిబుచ్చింది. చినబాబు ఏవేవో హామీలిచ్చాడు. చినబాబు మీది విశ్వాసం; అతను తన యెడల చూపే సహాయ సానుభూతులవల్ల అతనిని కాదనలేని తనం...రత్నం కాదనలేక పోయింది. పరవశురాలై పోయింది.

స్వప్నంనుండి వలె మేల్కొన్నారు-ఇల్లు చేరుకున్నారు. అలా నాటుకున్న వారి ప్రేమబీజం, వారి హృదయోద్యానవనంలో పెరిగి పెద్ద లతై పెనవేసుకుంటూంది. రెండు మూడు నెలలు గడిచినాయి. వారి జీవిత ఆనందవనంలో తుపాను చెలరేగింది-చిందరవందర చేసింది!

ఏదో చోరీకేసులో చిక్కుకున్నాడు చినబాబు. అతనికేమీ సంబంధం లేక పోయినా అందులో ఇరికించారు. అకస్మాత్తుగా అతనిని పట్టుకుపోయారు పోలీసులు! మూడురోజులనుంచి చినబాబు కనపడకపోవడం భరించలేకపోయింది, రత్నం. తాతయ్య మెల్లిగా వెళ్ళి తెలుసుకు వచ్చాడు ఆ వార్త. భోరున ఏడ్చాడు తన సహాయం పోయినందుకు. అంతకు వేయిరెట్లధికంగా దుఃఖించింది రత్నం, తన హృదయమే ఎడబాటైనందుకు! నలుగురూ చేరి ఏవో సానుభూతి వాక్యాలు పలికారు-ఓదార్చారు. కాలానికి వీటితో నిమిత్తమే లేదు-తన దారిని తాను పోతూనే వుంది!

పైకి ఎలానో తిరుగుతూ ఉన్నా, రత్నం కన్నీరు కార్చని రాత్రి లేదు-కష్టపడి చినబాబు ఏ జైలులో ఉన్నదీ గాలించి, ఓ ఉత్తరం రాసిందికూడా. అయితే ఆ ఉత్తరం అక్కడికి చేరేసరికి అతనిని మరోచోటికి తీసుకునిపోయారు. చినబాబును గూర్చి తాను పడుతున్న బాధ ఇతరులకు తెలియకూడదు. లోలోనే కృంగిపోతూంది.

పేదరికం, ఏదో సాయం కాస్త చేస్తున్నవాడు కూడ లేకుండా పోవడంతో తాతయ్య ఒక నెలనాటికి మంచం దిగలేని స్థితికి వచ్చాడు. అన్నిటినీ మించి, తన రత్నం దిక్కులేనిదై పోతుంది! పెళ్ళి చేయలేదు. ఆమె భావి జీవితం ఏమయి పోతుందోననే ఆందోళన! ఏమీ చేయలేని అసమర్థత.

రత్నం మాతృమూర్తి కాబోయే సూచనలు ధృవపడినాయి. పరిపరివిధాల ఆలోచనలు చేసి, చివరకు ఆత్మహత్య అనవసరమని నిశ్చయించుకుంది. తన హృదయాధినాథుడు త్వరలోనే వస్తాడనీ, తనను భార్యగా స్వీకరిస్తాడనీ, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని, ఆ శుభక్షణానికై ఎదురు చూస్తూంది. తాతయ్య కూడ రత్నాన్ని ఏమీ అనలేదు. ఒక్కసారి "అమ్మా!" అని, కౌగలించుకుని ఏడ్చాడు, ఈ విషయం తెలిశాక. ఆమె కూడ గొల్లుమంది "చినబాబు పెళ్ళి చేసుకుంటాడు నాన్నా" అంటూ, మనసు విప్పి చెప్పేసింది.

ఈ పరిస్థితులు తాతయ్యను ఇక రెండు నెలలకన్న ఎక్కువ కాలం జీవించనీయలేదు. రత్నానికి ఆరోనెల వచ్చాక తాతయ్య ఆమెను శాశ్వతంగా విడిచిపెట్టి పోయాడు. ఇప్పుడు రత్నం ఎక్కులేని పక్షి! ఇరుగు పొరుగువారు ఆమెను ఏమీ నొప్పించకుండా ఓదార్చి, సముదాయించి; ధైర్యంచెప్పి సహాయం చేస్తూ వచ్చారు. అదృష్టవశాత్తూ అపాయమేమీ లేకుండా సునాయాసంగా ప్రసవించింది, రత్నం. ముద్దులు మూటగట్టే ఆ బిడ్డతో, జీవితంలోని దుఃఖమంతా మర్చిపోగలిగి, మురిసిపోతూ వుండేది రత్నం. తన హృదయాధినాథుడు ఏ క్షణంలో వస్తాడా అని, చిత్తమే కన్నుగా చేసుకుని, వేచుకుని-ఆ శుభ క్షణం ఆ క్షణమే కావాలని, పరమేశ్వరుని ప్రార్థించుకొనేది.

లోపల, మట్టి అరుగుమీద కూర్చుని రత్నం ఆనాడే మూడోనెల వెళ్ళిన పాపకు పాలిస్తూ ఉంది. చిన్న దీపంబుడ్డి ఓ మూల, మినుకు మినుకు మంటున్నా చీకటి రాత్రి కావడంవల్ల అంతా జీబురుగా వుంది. అదురుపాటుగా కూర్చుని పాలిస్తున్న రత్నం, ఏడుగంటల బండి అకస్మాత్తుగా అరిచేసరికి త్రుళ్ళిపడింది. ఏదో గుండెలో పొడిచినట్టయింది. తన తల్లికి బాధ కలగడం సహించలేనట్టుగా ఒక్కసారిగా, ఆ పాప కిల్లుమంది! చినబాబు ఎందుకో స్ఫురణకు వచ్చాడు. బిడ్డనూరడించి రొమ్ము కుడుపుతూ ఏదో ఆలోచనలో మునిగిపోయింది. పొరుగింటి పాపారావు పాపకు ఆముదం తెచ్చి యిచ్చి తిరిగి తలుపు జారవేసి పోతున్నాడు. పదిగజాల దూరంలో ఇటునుండి వస్తున్న బూచివంటి మనిషిని చూడనే లేదతను. ఆ మనిషి పాపారావుని చూచి ఒక్క నిమిషం నిలిచిపోయాడు! అనుమానం, ఉద్రేకం, ఉక్రోషం అలుముకుపోతున్నాయతనిలో — ముందుకు సాగేడు.


జేరవేసున్న వీధి తలుపు తెరచిన చప్పుడయింది. రత్నం దృష్టి ఆ ధ్వని వేపు మళ్ళింది. ఆమె హృదయం భయంతో జల్లుమంది మాసిన జుట్టూ, మలినమైన వస్త్రాలూ...ఆ గుడ్డిదీపపు వెలుగులో నిలిచి ఉన్న మనిషిని చూచింది. "ఎవరూ?" భయకంపిత స్వరంతో ప్రశ్నించింది. అతడు దెబ్బతిన్న నాగుపాలై ఉగ్రుడై పోయాడు. ఆ చూపులో అతని హృదయంలోని కర్కశత్వం కనపడుతూంది. "ఎవరా?" అంటూ క్రౌర్యం, కాఠిన్యం, పగ, కరడు కట్టిన కంఠంతో అడిగాడు. అప్పటికే లేచి నుంచుని కాస్త దగ్గరగా చూచిన రత్నం, ఆవాలు పట్టింది! సంతోష సంతాప మిశ్రితమైన గాద్గద్యపు స్వరంతో, "చినబాబూ-ఇదిగో మన చిట్టితల్లి. ఆ పరమేశుని దయకలిగి..." అంటూ పాపను చేతికందీయబోతూంది. "ఛీ-నోరుముయ్" అంటూ అతను ఉరిమేసరికి పిడుగు పడ్డట్టయిపోయింది.

"మన చిట్టితల్లట! కులటా!" అంటూ నోటికొచ్చినట్టూ దూషించాడు. రత్నం, "చినబాబూ-నేను అగ్నిపంటిదాన్ని-నా మాట నమ్ము-నీవు వస్తావనే జీవించి ఉన్నాను." అంటూ, తన సౌశీల్యాన్ని నచ్చజెప్పబోతూ దగ్గరైంది. అతడు ఆమెను అతిక్రూరంగా దూషించడమే కాక. అదివరకు తన మోటు చేయి తగిలితే కందిపోతాయేమోనని భయపడే ఆమె చెక్కిలిపై — అద్దంవంటి ఏ చెక్కిళ్ళలో తన రూపం చూచుకుంటూ హృదయం ఆనందంతో నింపుకునేవాడో, ఆ చెక్కిలిపై-చెళ్ళున చరిచాడు! ఆ సుకుమారి హృదయం పగిలేలా భోరున ఏడ్చింది! తల్లి బాధ చూడలేని చిట్టితల్లి గొల్లుమంది. అంతా బీభత్సంగా తయారయింది-అంతే, అక్కడనుండి వెళ్ళిపోయాడు చినబాబు.

ఆ రాత్రీ, ఆ మర్నాడు పగలూ, ఎంత శోకించిందో, ఏమి ఊహాలు పోయిందో రత్నం!

నిద్రపోతున్న చినబాబుకు, దగ్గరగా "కేర్"మని చంటిపిల్ల ఏడుపు వినిపించింది. తలుపు తెరిచి బయటకు వచ్చాడు. అరుగుమీద శిశువు అదేపనిగా గుక్కపెట్టి ఏడుస్తూంది. దీపం తెచ్చి చూచాడు—తల్లికోసం తల్లడిల్లే పసిగుడ్డు! ప్రక్కనే పడివున్న కాగితం తీసి చూశాడు!

"భగవంతుడు చిన్ననాటినుండీ నాకు కష్టజీవితమే కలుగజేసినా, మరో ప్రక్క ఇరుగు పొరుగులందరి సానుభూతి, సహాయం, అభిమానం, కలుగ



శివరాత్రి పాట

నిశానృత్యానురక్తా, తాండవశివా
నిదాఘ తాళగతుల లయలలో మేలుకొల్పు
వ్యర్థ శిశిరాను బద్ధమైన జీవితాల్ని
నీ పదఘట్టనలో గోటితో చిమ్మివేయి
మైమరవడం మాకు నేర్పు
శివమెత్తి నట్లు నర్తించడం నేర్పు మాకు
జీవన సమస్యల వేదిక మీద

బహు భంగిమలతో పరవశింపజేసే
ఆనందమూర్తీ
నిశోత్సవం యీ హృదయాలలో
భేరీని మ్రోయిస్తోంది
ఆనాదాన్ని తగ్గించకు
పరిసరాలకు సరిపోయేటట్టు సవరించకు
అమావాస్య ఉన్మత్తత తలకెక్కినపుడు
అజాగ్రతల బాటలో పయనించడం నేర్పు
మాకు తెగువను బోధించు

ఆలయపునీడల్లో గోళీలాడుతునే పాపలుమీరు
ఆశను జానెడు.బెత్తెడుగా కొలుస్తున్నారు
గోళీలను మీ నక్షత్రాలుగా మార్చుకుని
రాత్రి చేసే కరాళ నృత్యాలను మరచిపోతున్నారు.
వీధిగోడల మీది పిచ్చి గీతలలో
భవిష్యత్తుని చవవాలనుకుంతున్నారు
జీవితపుకొనల కొనలోనికి ఊహూహల్ని తరమండి
శలవు తీసుకోవడం నేర్చుకోండి

దుశ్చింతల గుబురుపొదల వెనక దాగిన మేకాల్లారా
పిరికితనపుకాళ్ళమధ్య ఆశయాలని ముడిచే శునకాల్లారా
మోరలెత్తిఒక్కసారి చూడండి.
ఆకాశాన ధైర్యపు నగారా ఎలా మ్రోగుతోందో.
కైలాసాన నిరంతరమూవీచే
మంచు తుఫాను లాంటి తాండవహేలకు
చుక్కలెలా చెదిరిపోయాయో చూడండి
లయను గుర్తుంచుకోండి!
లయాన్ని గుర్తుంచుకోండి !!

శ్రీ దేశెట్టి కేశవరావు

జేశాడు. ఉన్న ఒక్క ముసలితండ్రి కూడ నిజానికి నన్ను గురించిన బెంగతోనే గుండె పగుల్చుకున్నాడు. ఎప్పటికైనా నీవు వస్తావనే ఆశతోనే జీవితద్వారం అహరహమూ తెరచి ఉంచి, ఎదురుచూస్తూ బ్రతికేను, ఈ క్షణంవరకూ.

"భగవత్సాక్షిగా ఈ చిట్టితల్లి నీ కూతురు. అగ్నివంటి నా శీలాన్ని గురించి ఇంతకన్న నేను చెప్పదలచలేదు. ఇన్నాళ్ళూ నీవు వస్తావనీ, నన్ను స్వీకరిస్తావనీ చెప్పుకుంటూ వచ్చాను. నా నైజం తెలిసున్నవారు కనుక ఎవరూ శంకించినట్టు లేదు. నమ్మి ఊరుకున్నారు. నేటితో జీవితం సర్వనాశనమైంది!

"ఆత్మహత్య ఆశయ సాఫల్యానికి మార్గం కానేకాదని నాకు తెలుసును. అయితే, నీవు తెచ్చిపెట్టిన ఈ పరిస్థితి తప్పుకో వీలులేనిదిగా తయారైంది. నేనిలానే ఉంటే, నా చిట్టితల్లికి తండ్రి ఎవరో చెప్పుకోలేని దుస్థితి పడుతుంది. నేనంటే నిన్ను నమ్మడమనే పొరపాటు చేశాను కాని. అన్యం పుణ్యం ఎరుగని నా చిట్టితల్లేంజేసింది? దాని జీవితం ఏమి కానున్నదో? అంచేత నీకే అప్పగిస్తున్నాను.

"పెద్దదైనాక తన తల్లేమీ తప్పు చేయలేదని చెప్పు. తనైనా జీవితంలో పొరపాటు పడకుండా అతి మెలకువగా సంచరించుకోవాలని, నా జీవితమే పాఠంగా చెప్పు-నా కష్టదినాల్లో సహాయం చేస్తూ వచ్చిన నీకు, కడసారిగా నా కృతజ్ఞత తెలుపు కుంటున్నాను."

అంతా చదివేసరికి తల తిరిగినట్టయింది. చటుక్కున ఆ పసిపాపను ఒడి లోనికి తీసుకున్నాడు, చినబాబు. అతను చదువుతున్నంతసేపూ, "అమ్మేమి రాసినదో" శ్రద్ధగా వింటూన్నట్టు నిశ్శబ్దంగా వుంది. పాప! అతను చేతులలోనికి తీసుకోగానే, "మా అమ్మనిలా అన్యాయం చేసేవా?" అని ఏడుస్తూ అడిగినట్టు కెవ్వుమంది! అరుగుమీదనుండి చీడీలవరకూ ఆనవాలుపడ్డ నీటిజాడ చూచాడు! ఎంత కన్నీరు కార్చింది రత్నం! గుండె బరువెక్కిపోయింది. ఆ పాపనలా ఒడిలో ఉంచుకునే పరుగు పరుగున పోయాడు! "రత్నం, రత్నం" అంటూ అరిచాడు ఆ యింట్లో వెర్రివానిలా. పాప "అమ్మా-అమ్మా!" అంటున్నట్టు ఒకటే ఏడుపు!

నలుగురూ చేరారు. కాని రత్నం కనిపించలేదు. వెర్రెత్తినట్టయి పోయాడు చినబాబు. "రత్నాన్ని పెళ్ళి చేసుకుంటాను—ఈ పాప నా చిట్టితల్లి!" అంటూ ఆదేపనిగా రత్నం కోసం వెర్రి ప్రయత్నాలు చేశాడు. అయితే రత్నం ఎక్కడుంది?!

ఒక్క నిమిషం ఆగిపోయి, కన్నీరు తుడుచుకుంటూ, 'అదీ, ఆమె జీవిత గాథా విషాదం' అని, ముగించింది వాణి-

వింటూనే నిద్రపోయిన నలుగురైదుగురు తప్ప, అందరూ కన్నీరు కార్చారు, వాణి చెపుతూంటే.

"మరి ఆ పిల్లేమైంది పాపం?" అంటూ అడిగింది వేణి

'పాపకేం అయిదోయేటివరకూ నర్సింగ్ హోమ్‌లో పెరిగింది-ఇప్పుడు కాన్వెంట్లో చదువుతూంది. ఆ తండ్రి ఇల్లు కూడా అమ్మేసి పొలంలోనే కాపురం. ఋషిలా జీవిస్తున్నాడు పంచప్రాణాలూ పాపమీదే పెట్టుకుని. తన హృదయభారం తగ్గినట్టవుతుందనీ, రత్నం సౌశీల్యం ఇతరులకు అర్థం కావాలనీ, కనపడ్డవాళ్ళకల్లా, తన విషాదగాథ చెపుతూంటాడిలా-

నేనూ గ్రహించి "అయితే మీరేనా-?" అంటూ కదపబోయేసరికి, కనిపెట్టి "వింటూ నీవే ఇంత కన్నీరు కారిస్తే అనుభవించిన నా జీవితం ఏం కావాలి! గుండె బండ చేసుకుని, నా చిట్టితల్లి కోసం ఇలా జీవిస్తున్నాను. చేతుల కొరేక ఆవులు పట్టుకున్న బ్రతుకు నాది." అంటూ మాయమైనట్టుగా వెళ్ళిపోయాడు.

అని పూర్తిచేసి పోయి భారంగా పక్కమీద వాలింది వాణి.

టి.వి లోయ్ టీవిలు....

ఛాయాశిల్పి



డా॥ ముట్నూరి సంగమేశం

నవనాథ చరిత్ర- అనుశీలన

తెలుగులో 'నవనాథ చరిత్ర' ఈ కోవకు చెందిన గ్రంథాలలో అత్యుత్తమమైన గ్రంథము. గౌరన తానిది శ్రీ గిరి కవి వ్రాసిన పద్య కావ్యమాధారముగా గ్రహించి శ్రీశైల మల్లికార్జునాలయ నిర్వాహకాధికారి ముక్తిశాంత భిక్షావృత్తి ముని ప్రోత్సాహముచే ద్విపదకావ్యముగా వ్రాసితినని చెప్పినను, శ్రీ గిరి కవి కావ్యమింతవరకు అలభ్యమగుటచేత గౌరన కావ్యమే యీ విషయమును గూర్చి చెప్పెడి మొదటి కావ్యమగుచున్నది. కావ్య విషయము యోగమభ్యసించి సిద్ధి బడసిన తొమ్మండుగురు సిద్ధపురుషుల జీవనచరిత్ర. వైష్ణమున పన్నిద్దరాళ్వారులు, శైవమున అరువత్తు మూవురు నాయనారులు, వజ్రయాన బౌద్ధ తాంత్రికులలో చౌరాశీ సిద్ధులు వలెనే యోగ సంప్రదాయములో ప్రసిద్ధులైనవారు నవనాథులు. వీరు వేరు వేరు ప్రాంతములవారు. కాని వీరి కథలు దేశమంతటా వినిపించును. వీరు వ్రాసిన యోగశాస్త్ర సంబంధిత రచనలు కొన్ని సంస్కృతములోనున్నను, అంతకు రెండింతలుగా ప్రాచీన హిందీ బెంగాలీ భాషలలో దొరుకుచున్నవి. కట్టు కథలుగా చెప్పుకొనుచున్న వీరి చర్యలు చరిత్రలు కొన్ని బెంగాలీ భాషలలోను మహారాష్ట్రి భాషలోను కనిపించును. యోగ సంప్రదాయా విష్కృతివంటి కొన్ని సంస్కృత గ్రంథములలో వీరి చర్యాచరిత్రాదికము కొంత విపరింపబడినను, వానిలో కొన్ని విసంవాదములు, పరస్పర విరుద్ధములైన కథలు కనిపించును. నవనాథులనగా ఎవరెవరు అను విషయములో కూడ భిన్నమతములున్నవి. ఒక జాబితా వేరొకదానితో సరిపోదు. శైవులు, కాపాలికులు, కాశ్మీరాగమవాదులు, త్రిపురాసాధకులు, మానభాపమతస్థులు, మున్నగు వారెందరో నాథమతము నాదరింతురు. అన్ని సంప్రదాయములు శివుని ఆదినాథునిగను, మత్స్యేంద్రుని అతని మానసపుత్రుడుగను, గోరక్షనాథుని మత్స్యేంద్రుని ప్రధాన శిష్యునిగను, యోగ మార్గ ప్రవర్తకుడుగను పేర్కొనును. గోరక్షుని సతీర్థుడుగా ప్రసిద్ధి చెందిన చౌరంగినాథుని చరిత్రము గౌరన వాక్యములో ప్రముఖస్థానము వహించినది. అంతేకాదు, గోరక్షుడతనిని గురుతుల్యునిగా గౌరవించినట్లు గౌరన వర్ణనలు సాక్ష్యమిచ్చును. మేఘనాథ, విరూపాక్ష, నాగార్జున, ఖణికసిద్ధుల కథలు పూర్వాపౌర్యములతో కూడ వివరించి, ఆ పిదప సిద్ధబుద్ధినాథుని కథ ప్రాసంగికముగా చెప్పి, గౌరన వీరినే నవనాథులుగా పేర్కొనెను. ఆ మీద వీరి శిష్యప్రశిష్యుల పేర్లు సుమారు డెబ్బదికి పైగా సంగ్రహించెను. యోగ సంప్రదాయావిష్కృతి, హఠయోగప్రదీపిక మున్నగు వాటితో సరిపోల్చి చూచినప్పుడు గౌరన సంగ్రహించిన పేర్లలో కొన్ని సరిపోయి, కొన్ని సరిక్రొత్తగా కనిపించును. నవనాథుల శిష్యులుగా పేర్కొనిన వారిలో ఆత్రేయసిద్ధ నాగార్జునుడు, వ్యాళి, గోరక్కు, గోరంటకుడు అను వారి కథలు కూడ గౌరన తన కావ్యములో వర్ణించెను. పరంపర లెట్లున్నను వీరందరు ప్రసిద్ధులైన నాథసిద్ధులు. వీరి కథలకొక విధమైన ఐక్యత ఘటించి నవరస భరితమైన కావ్యముగా వీటిని సంతరించిన ఘనత గౌరనది లేదా శ్రీ గిరి కవిది. బెంగాలీ భాషలో ఫయజుల్లా వ్రాసిన గోరక్ష విజయము, శ్యామదాస్ వ్రాసిన మీనచేతన్, మార్వాడీ భాషలోని నాథచరిత్ర, నాథ పురాణము వంటివి గౌరన కృతికి (క్రీ.శ. 15వ శతాబ్ది) ఇటీవల వెలసినవి. సంస్కృతములో నున్న యోగ సంప్రదాయావిష్కృతి, సుధాకరచంద్రిక వంటివి తారీఖు సరిగా తెలియనివి. అదిగాక, వీనిలో పరంపరాగతముగా వినిపించుచున్న కథలొకచోట సంగ్రహించుటయే ప్రధాన లక్ష్యముగా కనిపించును. గౌరనది ఆయా కథల నాధారముగా గ్రహించిన సరస సత్కావ్య రచనాదృష్టి. నేటికి అయిదువందల యేండ్లకు ముందే తెలుగునాట ప్రచారమందిన కథలగుటచేత, తక్కిన పరంపరలకన్న గౌరన లిపిబద్ధమొనర్చిన పరంపరయే ఎక్కువగా ప్రామాణికమైనదని ఎంచవచ్చును.

గౌరన కావ్యము ఆదినాథుడైన శివుడు పార్వతికి యోగముపదేశించిన ఘట్టముతో ప్రారంభించును. కాని దీనికి చక్కని వాతావరణముగా గౌరన వసంత శోభను వర్ణించి, దానిని శివపార్వతుల జలక్రీడకు అనువైన పీఠికగా సంతరించెను. వసంత ఋతువు 'నీలకంధరుగొల్వ నెఱి వచ్చినట్లు' వచ్చినదట.

'తరుల ప్రాయపు మందు తావుల పొందు
విరహుల మంట కోవిల గమిపంట
రతి సుఖంబుల చొక్కు రసికుల మ్రొక్కు
రతిరాజు జోక విరక్తుల ధాక
పువ్వుబోణులయబ్బు పుష్పాస్త్రుగబ్బు
పువ్వుదేనెల పెచ్చు భోగులమెచ్చు' (నవ.చ.పు.8)

వెలయగా వచ్చిన వసంతవేళలో నా ఆదిమదంపతులు జలకేళి సవరింతురు. ఆ సందర్భమున శివునికి వీర్యపతనమై, ఆ వీర్యమునొక చేప మ్రింగగా దానికి సద్యోగర్భమున మత్స్యేంద్రుడుదయించును.

జలక్రీడ ముగించి జలాశయపు టొడ్డున విశ్రమించుచున్న సమయమున పార్వతి కోరికపై శివుడామెకు యోగరహస్యము తెరిగించును. జలాశయములో నున్న మత్స్యేంద్రుడా రహస్యములు వినుచూ, పార్వతి ఏమరినప్పుడు తాను ఊకొట్టును. శివుడది గ్రహించి, ఆ కుమారుని బయటకు పిలిచి, అనుగ్రహించి, యోగవిద్య కడముట్టనుపదేశించి, సిద్ధులు ప్రసాదించి వరములిచ్చి పంపును. ఈ విధముగా యోగవిద్యకు శివుడు ఆదినాథుడు. మత్స్యేంద్రుడు కలిలో భూలోకమున దానిని ప్రవచించిన మొదటి సిద్ధుడు. యోగసంప్రదాయావిష్కృతిలో శివపార్వతీ సంవాదమును విన్నవాడు భృగువంశములో పుట్టిన బ్రాహ్మణుడుగా, గండయోగమున పుట్టినందున నీటిలో పారవేయబడినవాడుగా వర్ణింపబడెను. అతడు నవనారాయణులలో ఒకడైన కవి నారాయణుని అవతారముగా పేర్కొనబడెను. బహుశా, యిది మత్స్యేంద్రుడు బ్రాహ్మణుడని, అవతార పురుషుడని చెప్పుటకై అల్లిన కథ.

గౌరన కావ్యములో శివుడు పార్వతి కుపదేశించిన యోగ మీ క్రింది పంక్తులలో వర్ణింపబడినది.

'అలరుజీవులు బ్రహ్మకాదిని మొదటఁ
గలిగిన నాలుగు కడపట రెండు
నేకమై యితరంబు నేమియుఁ జెప్ప
రాక వెలుగొందు క్రమమును జెప్పి.
యోలిఁ జతుర్ముఖ యోగంబులందు
నాలోన మతములు నభ్యాస విధులు
తనరునవస్థలు తాత్పర్యపశ్య
జనిత సౌఖ్యములును సరియటమీద
జరిగెడి సిద్ధిసూచకముల పలను,
నరయనింతకు మూలమై స్థూలసూక్ష్మ
కారణైక్యము పరకాయ సంస్థితులు
నేరుపుమీఱ నన్నియు నెఱింగించి

రాజిల్లునట మీద రాజయోగంబు
రాజశేఖరుఁ డద్రిరాజ నందనకు
వీనుల విందుగా వినిపించెనంత.' (పు.17)

మత్స్యేంద్రుని పిలిచి, హస్తమస్తక సంయోగమొనర్చి, యోగమలవడ జేసి, శివుడతనికి,

"తిరముగా వెలుపల దెలుపులు దోప
వెలియును లోనును వీక్షింపునట్టి
పొలుపు చూపియు. ముఖాంబురుహంబు నొప్ప
నెపమున వినిపించి. నిగమాదియైన
విపుల పదంబున వినుతికెక్కు-
కోదండ గుణము నిక్కువముగా దెలిపి,
యాదరంబెసఁగఁ గృతార్థుఁ గావింప
సకల వాదంబులు సకల సన్మణులు
సకల మంత్రంబులు సకలౌషధములు
సకల సంసిద్ధియు సమకొన నొసఁగి,
యకలంకచరిత నీ వతులిత మహిమ
దీపింప నఖిల సత్ సిద్ధులకెల్ల
నేపార గురుఁడవై యెసగుచునుండు" మని పలికెను.
(పు. 21-22)

ఈ వర్ణన వలన ఇది శైవ శాక్తాగమములకు, పాతంజలి యోగమునకు, హఠ యోగసాధనకు, రసౌషధ ప్రక్రియలకు కూడ సరిపోవునట్టి ఒకానొక సమన్విత యోగమార్గమనుట స్పష్టము.

కవి ప్రవేశించిన పిదప మత్స్యేంద్రయోగి దేశసంచారమునకు వెడలెను. గౌరనకవి, అతడు

"కాళింగ బంగాళ కరహాట లాట
గౌళ కేరళ చోళ కర్ణాట మోట
కుకురు కోంకణ పౌండ్ర కురుకోసలాది" (పు, 24)

సకల దేశములు తిరిగి మాళవదేశము చేరినట్లు వ్రాసెను. అచ్చట గల మాంధాతృపురమును చూచి, రాజైన రాజమహేంద్రుని కీర్తి విని సంతసించి, నర్మదా తీరమున గల ఓంకార తీర్థమును సందర్శించి, తత్సమీపకాంతారసీమలో నొక గుహలో నిలిచి యోగ మనువర్తింపసాగెను. రాజమహేంద్రుని పశుపాలకుడైన గొల్లబాలకతనిని చూచి, మహాత్ముడని గుర్తించి సేవింపసాగెను. ఈ గొల్లయే పిదప మత్స్యేంద్రుని అనుగ్రహమున యోగియై గోరక్షనాథుడను పేర ప్రసిద్ధి పొందిన వ్యక్తి.

యోగసంప్రదాయా విష్కృతిలో మత్స్యేంద్రుడు గిరినార్ ప్రాంతమున నొక గుహలో నిల్చి యోగసాధన చేసినట్లును, గోరక్షుడతనిని పదేండ్లు సేవించినట్లును చెప్పబడినది. ఇదే గ్రంథమున గోరక్షుడు గోదావరీతీరమున 'చంద్రగిరి' అనుచోట జన్మించెననియు, ఒకనాడు గోవులను కాయుచుండగా అతనిని పాము కరిచినదనియు వ్రాయబడెను. గోరక్ష సహస్ర నామస్తోత్రములో నతడు దక్షిణ దేశమున 'బడబ' అను ప్రాంతమున జన్మించినట్లు చెప్పబడెను: గోరఖ్‌పూర్‌లో అతని సమాధి గల చోటునే అతడు పుట్టినచోటుగా కూడ చెప్పుదురు. కొన్ని కథలతనిని బ్రాహ్మణుడనను, మరికొన్ని తంతువాయుడని చెప్పును. వేరొకచోట 'తేలి' అని వినిపించును. గ్రియర్సన్ సంగ్రహించిన కథననుసరించి గోరఖ్ నాథుడు కలిలో కథియవాడ్‌లో జన్మించిన సిద్ధుడు. ఇవన్నియు చూచిన పిదప, ఉత్తర కథాబలమున, గౌరన చెప్పినదే కొంతవరకు సత్యమునకు సన్నిహితమని పించును. సంప్రదాయములో ఇదే పేరుగల సిద్ధులు అయా కులస్థలాదులు కలవారు వెలసి యిట్టి భ్రాంతులకు కారణమై యుందురు. గౌరన కావ్యములోనే గోరక్షునికి తోడు గోరక్కు అను సిద్ధుడు కూడ వర్ణింపబడెను.

గోరక్షుడు చూచిన మత్స్యేంద్రుని రూప మీక్రింది విధముగా వర్ణింపబడెను.

'పొలుచు త్రిపుండ్రంబు పూత విభూతి
తళ తళ మించు దంతపు లాతాము
పొలుపారు పటికంపు పూసలపేరు
చిఱుత కెంజడలును సింగినాదంబు
నెఱపట్టుగంతయు నిగనిగమించు
లదరెడు మణుల కామాక్షులు మెఱయ,
దొడలపైఁ జేతులొత్తుగనూది నడుము
నిక్కించి నిజముఖ నీరేజమెత్తి
తక్కక దృష్టిలోఁ దగుల మగుడించి
మహనీయ యోగసమాధి గూర్చున్న
యహిమాంశుతేజుని నా మీననాథు" ని గోపాలుడు దర్శించెను.

నాథయోగుల రూపరేఖలు పలుతావుల నిట్లే వర్ణింపబడినవి. కాని వీరికి ముఖ్య చిహ్నమైన శూలమును గౌరన బుద్ధిపూర్వకముగనే విడిచినట్లున్నది. "ముద్రానాద త్రిశూలైర్విమలరుచిధరం ఖర్పరం భస్మమిశ్రం" ఇత్యాదిగా వర్ణించిన జలంధరోక్తికి ఇది కొంత భిన్నము. జలంధరుడు గోరక్షునికి సతీర్థుడుగా పేర్కొనబడినను, అతని మతము కొంతవరకు కాపాలిక సమ్మతము. అట్లే, అతని ముఖ్య శిష్యుడైన కాన్హపాదుని మతము కూడ గారుడ సమ్మోహనాది తంత్ర బహుళము. గౌరన కావ్యములో వీరి పేర్లు కూడ వినబడవు. ఇది అతని విశుద్ధ శైవ సంస్కారము.

పశుపాలకుడైన గోరక్షుని వృత్తివిద్యా నైపుణ్యము తెలియించుచు గౌరన ఎన్నో పశురోగములు, వాటి చికిత్సలు కూడ గుదిగ్రుచ్చి చెప్పెను. ఈ పద్ధతి తక్కిన కథాకావ్యముల కొరవడి యైనట్లున్నది. సింహాసన ద్వాత్రింశిక నుండి హంసవింశతి వరకు గల కథా కావ్యములన్నియు నిట్టి పద్ధతు లనుసరించినవే. గోరక్షుని గొల్లవేషము కూడ ఇట్టి వర్ణనల కొజ్జబంతిగా వర్ణింపబడినది.

ఈ పిదప గౌరన సారంగధరుని (చౌరంగి) కథ వర్ణించెను. మాళవదేశపు రాజు రాజమహేంద్రుడు. అతని రాణి రత్నాంగి. భోగకాంత చిత్రాంగి. శివ ప్రసాదమున బడసిన పుత్రుడు సారంగధరుడు. రాజొకనాడు వేట కరుగును. సారంగధరుడు పావురము లాడుచుండగా, అది చిత్రాంగి మేడపై వ్రాలును. దానిని తేబోయి చిత్రాంగిమేడ కరుగనున్న సారంగధరుని సుబుద్ధి వారింపనెంచును. "పలుకులు బొంకులు, పసలు వేసాలు. వలపులు తిడవెడ, వావులు సున్న మదిరాక్షులకు" అని సుబుద్ధి బోధించినను వినక సారంగధరుడు చిత్రాంగి మేడకేగును. 'చక్కనివారిలో చక్కనివాడైన' సారంగధరుని చూచి, మోహించి చిత్రాంగి వావివిడిచి తన కోర్కెదాపక చెప్పును.

'తల్లియే దైవంబు దలపోయననుచు
నుల్లమారఁగ జెప్పుచుందురు బుధులు,
కలలోన, బరకాంతఁ గదియుటనాకు
చెలియలి గామించి చేపట్టుకొనుట. (పు. 47)

అని నీతిగా పలికిన సారంగధరునితో 'గరువంబు మురువును కలికితనంబు గల చిత్రాంగి


'దైవంబుగాను నీ తల్లినిగాను
భావింప నృప భోగభామినిగాని:
భావజుగుఱి బాఱి జాఱిన పిదప
వావులేటికి ధర్మ వర్తనంబేల,
రతిరాజునాన నా రాచిలుక తోడు
చతురత నీ తోడ సరస సంభోగ
లీలదేలక వదలి చనిపోలేను. (పు. 48)

అని తొందరించి, తప్పించుకొని పోవుచున్న సారంధరుని పై వలువ అంటించుకొనును. అదియే తుదకు సాక్ష్యమై సారంగధరుడు 'పరిసెనంబున దిబ్బ పట్టుటకు సిద్ధపడినను' అతనిని దోషిగా నిరూపించెను. రాజతని కాలుచేతులు ఖండింప బంపును. అన్యాయముగా శిక్షబడి విలపించుచున్న సారంగధరునికి అతని పూర్వజన్మ వృత్తాంత మెరిగించి అశరీరవాణి యోదార్చును. ఆ మాటలు విన్న తలారులు రాజునకది యెరిగింతురు. నిజమెరిగి రాజు చిత్రాంగిని నూత ద్రోయించి, తా నాత్మహత్య చేసికొనబోయి తిరిగి అశరీరవాణి వలననే సారంగధరుడొక సిద్ధుని కృపచేత కాళ్సేతులు పొంది సుఖముగా నున్నాడని విని శాంతించును.

కాలుచేతులు ఖండింపబడిన సారంగధరుని చూచి మత్స్యేంద్రు డతనిని తన గుహ లోనికి టీసికొనిపోయి యోగ మంత్రౌషధ ప్రక్రియలచే తిరిగి అతని కాలుచేతులు మొలిపించి యోగముపదేశించును. మొలచుచున్న కాళ్సేతుల మొదళ్ళు నాల్గుచోట్లును ఎర్రగా కనిపించినందున మత్స్యేంద్రుడతనికి 'చౌరంగి' అని పేరు పెట్టెను. గోరక్షు నాతని చెంత వదలి మత్స్యనాథుడు మాల్యవంత మేగును. కాని తాను సిద్ధుడనై తినన్న విషయము గుర్తించిన చౌరంగి గోరక్షుని వీడి మాల్యవంత మరుగును. గోరక్షుని వదలి వచ్చినందుకు మత్స్యేంద్రుడు మండి పడి, అది రాచబుద్ధి అని నిందించి, నిస్సంతు కమ్మని శపించి, వెంటనే అతనిని తోడ్కొని గోరక్షుని వద్దకు వచ్చును. పిదప వారు ముప్పురు యోగసమాధిలో నిలుతురు. అట్లు వారెన్నాళ్ళు సమాధిలో నుండిరోకాని; సమాధి చాలించి లేచు సరికి రాజమహేంద్రుని రాజ్యమును, మాంధాతృనగరమును నామావశిష్టము లగును. 'పోలగానలనీరు' బుగ్గలకంటె, చాల నిస్సార మీ సంసారసుఖము' అన్న సత్యము చౌరంగి గోరక్షులకు స్వానుభవమయి సాక్షాత్కరించును.

ఈ కథలో నగరము, వేట, విలాసక్రీడ, నిశాముఖము, చంద్రోదయము, సూర్యోదయము వంటి చక్కని వర్ణనలతోపాటు, పూర్వజన్మ వృత్తాంతము, అశరీరవాణి కథనము వంటి శివకవి సంప్రదాయములను కూడ జోడించి మొదలి నుండి తుదివరకు కరుణాద్భుత సన్నివేశ భరితముగా సంతరించి గౌరన యీ కథను దేనికదే ప్రత్యేక కావ్యమన్నంత సొంపుగా రచించెను. చిత్రాంగిని భోగ కాంతగా చెప్పి యౌచిత్యము నెరపిన గౌరన, సారంగధరునికి ఘూర్జర రాజకన్య మంగళాంగితో వివాహమైనట్లు వ్రాసియూ, తిరిగి కథలో ఏ పట్టుననూ ఆమె ప్రశంస నెత్తుట ఏ కారణముననో పూర్తిగా విస్మరించెను. గ్రంథపాతమున్న దేమో తెలియదు.

గౌరన వర్ణించిన యీ కథ చాలవరకు తక్కిన అనుశ్రుతులతో సమన్వ యించుచున్నది. రాజమహేంద్రుడు తెలుగు రాజరాజనరేంద్రుడు కాడు. ఆ భ్రాంతికి కారకుడు బహుశా దోనేరు కోనేరు నాథుడు, ఈ భ్రాంతిని నివారించు టకో యన్నట్లు వేమనూర వేంకటకవి,



'మహిని రాజనరేంద్రుడు మాళవ పతి
రాజరాజనరేంద్రుడు రాజరాజు
ననగ, బేరెన్నికకునెక్కి యతిశయిల్లు
నింద్ర విభవుండు రాజమహేంద్రవిభుడు'

అని తన సారంగధర చరిత్ర (1–5)లో స్పష్టముగా వ్రాసెను. మహా రాష్ట్ర దేశములో ఈ కథ కొంచెము పేరు మార్పులతో వినిపించును. బదరికాశ్ర మములోని భువేశ్వరాలయపు స్థల పురాణములో ఇదే కథ చిన్న చిన్న మార్పు లతో వినిపించును. పంజాబ్‌లో ఈ కథ 'పూరన్‌భగత్' అనువాని కథగా చెప్ప కొందురు. పూరన్ భగత్ రాజా రసూల్‌కి సవతి తమ్ముడు. వీరు స్యాల్ కోటలోని శాలివాహనుని పుత్రులు. ఆ శాలివాహనుడు ఉజ్జయినీ రాజవంశస్థుడనియు, స్యాల్ కోటలో రాజ్యము సంపాదించెననియు చెప్పబడినది. పూరన్‌భగత్ పుట్టుక మంచిది కాక, వేరొక యింటిలోనుంచి పెంచబడెను. తండ్రి ఒక చమార వనితను చేరదీసెను. ఆమె కపటోపాయమే పూరన్ భగత్‌కు కాలు సేతులే కాదు కండ్లుకూడ నాశమగు టకు హేతువు. అంతేకాదు, ఇన్ని చేసి అతనినొక పాడు నూతిలో పారవేసిరి. గోరఖ్‌నాథుడతని నుద్ధరించెనని కథ. స్యాల్ కోటలో నేటికిని ఒక నుయ్యి 'పూరన్ భగత్‌కూప' మనుపేర ప్రసిద్ధముగా నున్నదట.

చౌరంగినాథుడు వ్రాసిన 'ప్రాణసంకలీ' అను గ్రంథమొకటి లభించు చున్నది. ఇది ప్రాచీన హిందీ భాషలోనున్నది. దీనిలో నితడు తాను శాలివాహ నుడనని చెప్పుకొనెను, సవతితల్లి కపటమునకు గురియైనట్లు కూడ వ్రాసికొనెను. పంజాబ్‌లో ఖిల్వాడీ అనుచోట నితని అగ్ని నేటికిని వెలుగుచున్నది. మాఘశుద్ధ చతుర్దశినాడు ఏటేటా అచ్చట ఉత్సవము జరుపుదురు, 'బౌహర్‌గద్దీ' అను పేరున ఇచ్చటనొక యోగ్యాశ్రమమున్నది. యోగి పరంపరలో చౌరంగినాథుడు పంజాబ్ లోని పాగల్‌పంథ్ అను సంప్రదాయమును స్థాపించినవాడు. ఆఫ్ఘనిస్థానపు రావల్ సంప్రదాయస్థులైన యోగులు కూడ ఇదే మతస్థులు. వీరిలో కొందరు ముసల్మానులు కూడ 'రావల్‌గల్లా'లను పేర ప్రసిద్ధులు.

ఆ యీ కథలన్నియు చూచిన పిదప సారంగధరుని కథలో కొంత సత్య మున్నదనియు, అతడు మాళవరాజవంశస్థుడే కానగుననియు, సిద్ధుడైన పిదప పంజాబ్, ఆఫ్ఘనిస్థాన ప్రాంతములలో తన సంప్రదాయమును వ్యాపింపజేసి నాడనియు నమ్మవచ్చును. గౌరన కావ్యములో చౌరంగి మత్స్యేంద్రునితో కలిసి మంచుకొండ కేగినట్లు వ్రాయబడెను. ఇట్లు దేశాంతర మతాంతరాసక్తుడగుట చేతనో యేమో గౌరన ఇతనిని గురు శాపతప్తునిగా వర్ణించెను. గౌరన మతములో నవనాథులు లౌకిక ధర్మా విరుద్ధులైన యోగసిద్ధులు.

చౌరంగినాథుడు గురిని దర్శింపబోయి మాల్యవంత మేగుచున్నప్పుడు దారిలో నొకచోట మొసలితో పోరాడుచున్న సర్పరాజునకు సాయపడి రక్షించెను. దానికా పాము సంతసించి అతనికొక దివ్యౌషధమిచ్చి, మీననాథుని, దర్శనము చేయుకొనెను. ఆ వృత్తాంతము విని మీననాథుడు చౌరంగి గోరక్షులతో కలిసి ఆ సర్పరాజును చూడనరిగెను. ఆ సర్పమొక గంధర్వుడు. మీననాథుని దర్శనము చేత నతని శాపము తొలగిపోయెను. మీననాథుని కతడెన్నో దివ్యౌషధములిచ్చి తన లోకమున కేగెను. గోరక్షుని కథలో చౌరంగి కథయు చౌరంగి కథలో సర్పరాజుకథయు ప్రారంభించినట్లే గౌరన యీ కావ్యములో నవనాథుల కథ లన్నియు ఒకదాని కొకటి సంబంధ పడినట్లుగా కూర్చి నడిపెను. ఇది అతని కథాకథనచాతురికి నిదర్శనము. దీనివలన కథల కేక వాక్యత కలిగి కుతూహల వృత్తికి భంగమురాని పద్ధతిలో కావ్యము నిర్వహింపబడెను.

సర్పరాజును వీడి ముందుకేగుచూ మత్స్యేంద్రాదులొక అడవిలో ప్రవే శించిరి. వారి కచ్చట పత్నీద్వితీయుడైన పుళిందుడొకడు కనిపించెను. అతని వలన మత్స్యేంద్రునకు రసము. పరుసువేది, చింతామణి మున్నగునవి గలచోట్లు గుర్తింపనయ్యెను. ఈ మీద గౌరన కావ్యములో కొంత గ్రంథపాతమైనది. తిరిగి వ్యాఘ్రోపహతుడైన బ్రాహ్మణుని కథ సగములో ప్రారంభించును. ఆ బ్రాహ్మ

ఋని సతీసమేతముగా రక్షించిన రాజు విరూపాక్షుని కథ యిందులో ప్రారంభించును. ఈ రెండు కథలకు గౌరన అత్యంత కరుణాద్భుత సన్నివేశ భరితముగా రచించెను. బ్రాహ్మణబాలకుడు మేఘనాథ సిద్ధుడుగా మారును. విరూపాక్షుడు మత్స్యేంద్రుని వద్ద యోగము గ్రహించి సిద్ధుడగును. వారందరు కలిసి ముందుకేగుచూ దారిలో వంచక పురోహితుని, వానినరసి కాయుచున్న బోయవానిని కలిసికొందురు. బోయవలన వంచక పురోహితుని వృత్తాంత మామూలాగ్రముగా తెలియవచ్చును. ఈ కథలో గౌరన పురోహితుల దుర్వర్తనములనెల్ల నేకరువు పెట్టి హాస్య వ్యంగ్య పూరితముగా రచన సాగించెను. గౌరన ఈ పురోహితుని ఆర్వేల శాఖకు చెందిన ఋగ్వేద బ్రాహ్మణునిగా వర్ణించెను. బహుశా అతనినాటికి ఆంధ్రదేశములో నియోగి వైదిక విభేదములుగాని, వృత్తిలో తారతమ్యములుగాని లేవు కాబోలు.

పురోహితాదులను వీడ్కొని ముందేగుచున్న మత్స్యేంద్రునికి దారిలో పడుము ద్రొక్కిన నాగరాజు తారసపడును. అతనికది శాపాంతము. శాపమిచ్చిన ముని ఖణికుడు. గౌరన వీరి పూర్వ వృత్తాంతములు సాకల్యముగా వర్ణించెను. మత్స్యేంద్రుడీ యిరువురికి యోగమిప్పించును. వీరే నాగార్జున ఖణిక సిద్ధులు.

ఆ మీద శిష్యులందరిని వెంటనిడుకొని యేగుచూ మత్స్యేంద్రుడు 'మంగళావృతమగు మహనీయ పుట భేదనము' చేరుసరికి ఆ నగరమున రాజప్పుడే మరణించినట్లు వినెను. తోడనే శిష్యులు వలదన్నను వినక మత్స్యేంద్రుడు పరకాయ ప్రవేశము చేయును. మంత్రి ఆ రహస్యము గ్రహించియు సమయోచితముగా వర్తించి రాజ్యమును నడుపును. పూర్వపు రాణులను పరస్త్రీలుగా నెంచి, రమణికాదులు పన్నెండుగురు కన్యలను పెండ్లాడి, భారహకన్యాపురములో నుంచి, మత్స్యేంద్రుడు వారితో సుఖించును. రమణికకు మంజునాథుడు జనించును. గురుడిట్లు భోగాసక్తుడై చిరకాలము తడయుటచే గోరక్షనాథుడేగి అతనిని మరల్ప యత్నించును. ఆ ప్రయత్నమంతగా ఫలింపకున్న సంగతి గమనించి పుత్రవ్యామోహమును మాన్పుటకై గోరక్షుడు మంజునాథుని చంపి ముద్ద చేయును. చివరకు తాను ప్రాణములు విడుతునని శరించి గురుని ప్రబోధించి తెచ్చును. మంజునాథుని కూర్మాసనమున నిలిపి, అతడట్లు శాశ్వతముగా నుండునని వరమిచ్చి మత్స్యేంద్రుడు వెడలిపోవుచుండగా మంత్రి వచ్చి తాను యోగి కానెంచును. మత్స్యేంద్రుడతనికి యోగమిప్పించి సిద్ధబుద్ధినాథుడని పేరిడును.


యోగసంప్రదాయావిష్కృతి ననుసరించి మత్స్యేంద్రు డొకసారి ప్రయాగలో పరకాయ ప్రవేశము చేసి రాజుగానుండి మాణిక్‌నాథుని కనినట్లును. వేరొకసారి స్త్రీ దేశములో (సింహళమని వ్యాఖ్య) పరకాయ ప్రవేశముచేసి రాజై పరశురామ మీనరాములను కొడుకులను బడసినట్లును తెలియును, బెంగాలీ గ్రంథములలో మత్స్యనాథుడు కదళీ దేశములో పరకాయ ప్రవేశము చేసి రాజై బిందునాథుని కనినట్లు వ్రాయబడెను. రాజా మాన్‌సింగ్ నాడు సంగ్రహింపబడిన 'మేఘమాల' అను సంస్కృత గ్రంథములో పరకాయప్రవేశము చేసి. మత్స్యేంద్రుడు జయంతి అను కన్యను పెండ్లాడి కదళీవనములో విహరించినట్లు వర్ణింపబడెను. వేరొక కథలో మత్స్యేంద్రుడు కామరూప దేశములో పరకాయ ప్రవేశము చేయగా మంగళాదేవ్యాదిరాణు లా రహస్యమెరిగి అతనిని తిరిగి పోనీకుండ నిల్పుటకై ప్రయత్నించినట్లు చెప్పబడినది. ఈ కథలోనితనికి పార్శ్వనాథశ్వేతాంబరనాథులను పుత్రులిరువురు దయించినట్లు చెప్పబడెను. స్త్రీ దేశమని చెప్పిన సింహళము హిమాలయ ప్రాంతమున నుండెనని శ్రీ హజారీప్రసాద్ ద్వివేదీగారు వ్రాసిరి, గఢవాల్ కుమయూన్ ప్రాంతములను కొందరు స్త్రీ దేశమని పేర్కొనిరి. కుల్లూ ప్రాంతము, సట్లెజ్ ఉద్గమ ప్రాంతము. హిమాలయ పాద ప్రదేశము, టిబెట్టు పూర్వభాగము, కామరూప (అస్సామ్) దేశము మున్నగునవి స్త్రీ దేశములని పేర్కొనబడినవి. భారతారణ్యపర్వము (146 అధ్యా.) లో కదళీవన ప్రశంస వినిపించును. అచ్చట వ్యాసాంజనేయ పరశురామాది చిరంజీవులు వసించుచున్నట్లు వర్ణింపబడినది. డేరాడూన్, హృషీకేశ్, బదరికాశ్రమ ప్రాంతములు 'కజరీబన్'లని శ్రీ సుధాకర ద్వివేదిగారు వ్రాసిరి. నాగరసర్వస్వమను బౌద్ధ గ్రంథపు టీకలో స్త్రీదేశము భూతస్థానమునకు దగ్గరగా నున్నట్లు వ్రాయబడినదని పండిట్ తన్ సుఖరామ్‌గారు తెలియజేసిరి. వాత్స్యాయనీయ జయమంగళావ్యాఖ్యలో వజ్రావతంస దేశమునకు పడమట స్త్రీ దేశమున్నట్లు వివరింపబడెను.



గోరక్షనాథుడు
గోరక్షమందిరము- మంగుళూరు

గౌరన వ్రాసిన 'మంగళావృత పుటభేదనము' బహుశా నేటి దక్షిణ కన్నడజిల్లాలోని మంగుళూరు కావచ్చును. అచ్చట మంగళాదేవి ఆలయమున్నది. ఆ దేవి పేరున ఆ నగరము మంగుళూరైనది. అచ్చటి తుళుభాషీయులలో కొన్ని జాతులవారు భూతములను పూజింతురు. గృహ, కుల, గ్రామ దేవతలుగా ఎన్నో భూతములచ్చట వెలసి దానిని భూతస్థానమని నిరూపింపదగినట్లున్నవి. అది మలబారు తీరముతో పాటుగా పరశురామ క్షేత్రము. పార్శ్వనాథ శ్వేతాంబర జైన బసదులు, విగ్రహములు నేటికిని తత్ప్రాంతమున నున్నవి. మంగుళూరులో నొక పేటకు 'కదిరి' అని పేరు. అది కదళీ శబ్దమునకు అపభ్రంశ రూపము కావచ్చును. ఈ కదిరిలో మంజునాథాలయమను పేర పెద్ద శివాలయమున్నది. దీని సమీపమున గోరఖ్ నాథాలయమును, గోరఖ్ సంప్రదాయస్థులైన 'కన్‌ఫటా' యోగుల మఠమును నున్నవి. (చూ.చిత్రములు). వజ్రయానీ సిద్ధులకొకప్పుడు నిలయమైన శ్రీశైల ప్రాంతమునకిది పడమరగానున్న ప్రదేశమే. ఈ ప్రాంతములో కొన్ని జాతులవారిప్పటికీ మాతృమాతుల వారసత్వరూపమైన 'మరుమకతాయ' మను ఆచారమును పాటించుచున్నారు. కాగా, గౌరన వర్ణించిన మంగళూరే మత్స్యేంద్రుడు పరకాయ ప్రవేశమొనర్చినచోటని నమ్మవచ్చును. వేర్వేరు ఆకరములలో వినవచ్చు లక్షణములన్నియూ ఆ చోటున సరిపోవుచున్నవి. గౌరన మత్స్యేంద్రుడు సంచరించినట్లు పేర్కొన్న గౌళబంగాళాదిదేశము లొకప్పుడు వజ్రయానీ బౌద్ధ తాంత్రికుల కాటపట్లు. నేపాల్‌లో మత్స్యేంద్రుని అవలోకితేశ్వరుడుగాను కౌలసిద్ధుడుగాను పేర్కొందురు; కనుక పై పరకాయ ప్రవేశకథ అతని యోగినీ కౌలసాధనను సూచించునది కావచ్చును. గోరక్షుడతని నా వామాచారము నుండి మరలించి విశుద్ధ యోగమార్గమునకు తిరిగి రప్పించెనని యెంచవలెను. నేపాల్‌లోని బౌద్ధమును శైవముగా మార్చినవాడనియు, గూర్ఖాజాతి నిర్మాత అనియు గోరక్షనాథునికి ప్రసిద్ధి కలదు.

మంగుళూరు విడిచిన పిదప మత్స్యేంద్రుడు హిమాలయమునకు బయలుదేరెను. దారిలో ఉజ్జయినిని చేరుకొనెను. గౌరన అచ్చటి కాళికాలయమును, కాశీ



కన్‌ఫటాయోగి
గోరఖ్ మఠము- మంగుళూరు

భక్తులను, వారి వీరవ్రతములను అత్యంత బీభత్స భయావహముగా వర్ణించెను. ఆ తర్వాత వారు ద్వారపతి గడచి, దారిలో ఎందరినో యతులను, పాశుపతులను తాపసులను, సోమయాజులను, ఆగమవేదులను, శివపూజా పరాయణులను చూచి, అయోధ్య చేరుకొనిరి. "అపమృత్యుభయము, నన్యాయవర్తనము, కపటంబుమరి శత్రుఘాతము లేక, తల్లియు దండ్రియు దానయై" యేలిన శ్రీరాముని చరితము సాంతముగా శిష్యులకెరిగించి మత్స్యేంద్రుడు అయోధ్యనుండి కురుక్షేత్రమేగెను. ఆ మీద గంగను దర్శించి, కాశిలో యేడు దినములు వసించి, ప్రయాగ కరిగి త్రివేణిలో మునిగి, మరికొన్ని తీర్థములు గడిచి కేదారేశ్వరుని దర్శించి. ఆ పైన హిమగిరి చేరుకొని ఒక గుహలో విశ్రమించెను. ఈ వర్ణనలతో గౌరన కావ్యము నకు పురాణపక్కి సిద్ధించెను.

కొన్నాళ్ళ పిదప మత్స్యేంద్రుడు తన శిష్యులను ఆయా దేశములలో తిరిగి యోగమార్గమును ప్రచారమునకు తెమ్మని పంపును.

"ఒరులు మిమ్మెరుఁగకయుండ నొక్కొక్క
వెరవున ప్రచ్ఛన్న వేషంబు బూని
సంచరింపుడు మీరు శమమును దమము
నంచిత జ్ఞానంబు నలవును మెఱయ
వ్రతుల విప్రులఁ బుణ్యనతులను బాశు
పతుల గోవుల భూమి పతులను యతుల
వృద్ధుల బాలుర విగత కల్మషుల
సిద్ధుల విద్యాప్రసిద్ధుల హితుల
మన్నింపు డకుటిలమతుల సన్మతుల
సన్నుత గురుభక్తి సహితుల హితులఁ
బరికించి వారల భావంబు దెలిసి
కరమర్థి శిష్యులుగాఁ బ్రమోదించి
ఘనసిద్ధదేహులఁ గావింపుడెపుడు
నొనరఁ గల్పింపుడు యోగశాస్త్రములు
పరమ తత్త్వార్థ దీప్తంబులు గాగ
జరితంబు చెప్ప దిచ్చటికి రావలదు." (పుట. 209-10)

అని చెప్పి పంపిన మీదట గోరక్షాదులాయా దేశములేగి యోగవిద్యను ప్రచారమునకు తెచ్చిరి. గౌరన యీ సందర్భములో గోరక్షాదులెవరెవరు ఏయే దేశమేగి యోగవిద్యను ప్రచారము చేసినదియు, వారి కెవరెవరు శిష్యులైనదియు. వివరముగా వ్రాసెను.

గోరక్షనాథుడొకసారి నీలగిరి ప్రాంతమరిగి, అచ్చటినుండి శ్రీశైలమునకు వచ్చెను. అచ్చట అతనికి అల్లమప్రభువు దర్శనము లభించెను. కాపాలిక సంప్రదాయమును గురించి, కాయసిద్ధిని గూర్చి వారిరువురికిని వాదము జరిగెను. అన్యోన్య శక్తి పరీక్షలైన పిదప అల్లమ ప్రభువు గోరక్షునికి శివాద్వైతజ్ఞాన యోగమును, అంగలింగా భేదతత్త్వమును. వివరించెను. దానివలన గోరక్షుడు సకల కళ్యాణములకు నిలయమయ్యెను.

అల్లమ ప్రభువు వీరశైవులచే శివుని అవతారముగా భావింపబడిన మహా పురుషుడు. శ్రీశైలములో బసవేశ్వరుని 'అనుభవ మంటపము' అను పేరుగల వీరశైవ విద్యాపరిషత్తునకు అధ్యక్షుడు. ఇతడు 12వ శతాబ్దిలో వెలసిన చారిత్రక పురుషుడు. గోరక్షనాథుడితనికి చాల పూర్వుడని మిగిలిన కథల వలన తోచును. కాగా, ఈ కథలలోగల సత్యమెంతయో తెలియదు. కాని హఠయోగప్రదీపికలో (88) సంగ్రహించిన సిద్ధుల పేర్ల పట్టికలో 'అల్లామప్రభుదేవశ్చ ఘోడాచూళీచ టింటిణిః" అని అల్లమ ప్రభువు పేరు కూడ చేర్చబడినది. కాయసిద్ధి గడించి కాలదండము మెరుగక తిరుగు యోగులగుటచే వీరు దీర్ఘజీవులు కనుక గోరక్షుడు లేక ఆ పేరుగల అతని శిష్యప్రశిష్యులలో నొకరో అల్లమ ప్రభువుతో వాదించి యుండవచ్చుననుకొనినచో అభ్యంతరముండదు.

గౌరన కావ్యములో ఈ మీద నాదసిద్ధుల శిష్యులైన ఆత్రేయ నాగార్జున, వ్యాళి, గోరక్కు, గోరంటకుడు అను వారి కథలు వర్ణింపబడెను. గౌరన కావ్యమును బట్టి యీ సిద్ధుల కథలన్నియు 12వశతాబ్దికి పూర్వమే జరిగినట్లు ఊహింపవచ్చును. అంతేకాదు, గౌరన నాటికే ఈ కథలు శ్రుతిపరంపరలో నిల్చి, అనేక విధములుగా అల్లుకొని, మెలిపడి, పూర్వాపరములేమో చెప్పరాని స్థితికి వచ్చినవని

అనుకొనవచ్చును. ఏది యెట్లున్నను గౌరన కాలములో, అనగా 15వ శతాబ్ది పూర్వభాగములో నవనాథుల వారి సంప్రదాయము, రసవాదము, సిద్ధుల మున్నగువాటిని గూర్చి ఆంధ్రదేశములో శ్రీశైలమునుండి శేషాద్రి వరకు ఎన్నో కథలు ప్రచారములో నున్నట్లు అప్పటి తెలుగు సాహిత్యము వలన తెలియచున్నది.

గౌరన వ్రాసిన దానిని బట్టి నాథమతము లౌకిక ధర్మావిరుద్ధము. ఇది విశుద్ధ యోగాచార శైవముగా రూపించును. దీనికి వైష్ణవముతో పగ లేదు. రామాయణముతో వైరము లేదు. తీర్థయాత్రలన్న నిరసన భావము లేదు. వ్రత నియమాదులపట్ల ఏవగింపు లేదు. ఆ కాలపు నాథ సంప్రదాయపు గ్రంథముల వల్లనేమి, ఇతరులీ సిద్ధులను గూర్చి వ్రాసిన వ్రాతలవల్లనేమి, నాదమతమింత సనాతన ధర్మపరాయణముగా కనిపించదు. కాగా, గౌరన నాటికి మతము కొన్ని చోట్ల, ఇతర సంప్రదాయములకు లొంగి పలు విధములుగా కనిపించినను, కొన్ని చోట్లనిది తన విశుద్ధ ధార్మిక రూపము నింకనూ నిల్పుకొన్నదనియే యెంచవలెను. కనుకనే ముక్తికాంత భిక్షానాథునికిది ప్రియమయ్యెను,

గౌరన సరస సాహిత్య లక్షణ విచక్షణ బిరుదాంకితుడు. సోమనాథ రంగనాథుల పిదప ద్విపద నేలిన పట్టభద్రుడు. భాషపై ఇతనికి గల అధికారమపారము. తేటతెనుగు మాటలుగాని, సమాసపద గుంభనముగాని, జాతివార్తా నిర్వహణ చమత్కారముగాని, అలంకార యోజనా చాతుర్యముగాని, జాతీయపద ప్రయోగముగాని చూచితీరదగినవి. ఎడనెడ ధర్మము, నీతి, లోకరీతి; పరోపకృతి వంటివి ముచ్చటించి తెలుపుచూ, వీరశైవ పక్షపాతము లేశమాత్రమును లేకుండ రచించిన యీ కావ్యమందరికిని ఆదరణీయమైనది. □

సీరియల్

సృష్టి

ఇచ్ఛాపురపు రామచంద్రం

(గతసంచిక తరువాయి)

"వచ్చే పుట్టినరోజుకి నాకు నలభయ్యో పూర్తిగా నిండుతాయి. నా జీవితమూ తేలిపోతుంది. అదృష్టం నిర్ణయించబడి పోతుంది. నేనమ్మని కాగలనో లేదో తెలిసిపోతుంది ఈ సంవత్సరంలోగా ఏమీ జరగకపోతే...మన యింట్లోకి చిన్ని పాపాయి వచ్చే అవకాశం కలగకపోతే...నా మొర భగవంతుడాలకించక పోతే...నేను ఆత్మహత్య చేసుకుంటాను-" ఆమె కంఠంలో తిరుగులేని నిర్ణయం.

జయదేవ్ పిడుగు పడ్డట్టు తృళ్ళిపడ్డాడు. "పద్మా!" అరిచాడు.

"సహనానికేనా హద్దుంటుంది. నేనింక యీ నిష్ఫల జీవితాన్ని, బండ బ్రతుకుని మోయలేను. ఈ సంవత్సరమూ అయినా-నేను బ్రతికేది ఏదో జరుగుతుందన్న ఆశకొద్దీ కాదు. మీ కోసమే..."

"థాంక్స్. కాని-పద్మా! నువ్వు నాకింత అన్యాయం చేయడం...చాలా దారుణం. ఆనాడు మనం చేసుకున్న వాగ్దానాలు మరచిపోయావా? జీవితాంతమూ ఒకరికొకరం ఉంటామని మన హృదయాలు బాసలు చేసుకోలేదూ? ఇవాళ-నన్ను యీ ప్రపంచంలో ఒంటరిగా వొదిలేసి నువ్వెళ్ళి పోతాననడం—న్యాయమేనా? ఎప్పుడింత స్వార్థపరురాలివై పోయావు?"

"నేను మిమ్మల్ని ముందే ప్రార్థించాను. దయచేసి మీరు మీ మాటలతో గతం గుర్తుకి తెచ్చి నన్ను నాకిష్టంలేని జీవితానికి బంధించే ప్రయత్నం చెయ్యకండి. నా నిర్ణయాల్ని మార్చే ప్రయత్నాలు చెయ్యకండి ప్లీజ్..." ఎక్కువ మాటలు వొద్దన్నట్టు అంది.

"నువ్వు లేకుండా నేనెలా బతకగలనని?"

ఆమె సమాధానం చెప్పలేదు. మౌనంగా ఉండిపోయింది. ఆ మౌనమే చెబుతోంది ఆమె నిర్ణయం ఎంత దృఢమయినదో.

స్త్రీ మాతృత్వం కోరుకోవడం చాలా సహజమే. కాని స్త్రీ జీవితానికి అర్థం మాతృత్వమొక్కటేనా? అందులోనూ—అధిక జనాభాతో సతమతమౌతున్న భారతదేశంలో! రష్యావంటి దేశాలలో అధిక సంతానవతులకు బిరుదులూ అవీ యిచ్చి సత్కరిస్తుందట ప్రభుత్వం. అక్కడ భూభాగం ఎక్కువా, జనసాంద్రత తక్కువా కనుక, అక్కడ స్త్రీ మాతృత్వం కోసం వెంపరలాడినా అర్థముంది కాని...యీ భారతదేశంలో బిడ్డలు కలగలేదని స్త్రీ ఆత్మహత్య చేసుకోవడమా?

అతనికి తెలుసు...ఈ పరిస్థితులలో పద్మకి నచ్చచెప్పబోయినా ప్రయోజనమేమీ ఉండదని. ఆమె అంత తీవ్రంగా ఆ సంకల్పానికి వచ్చింది. ఆమె మనసుని మార్చగలిగేదీ...ఆమె ఆత్మహత్యను నివారించగలిగేదీ ఒక్కటే. పద్మ గర్భం ధరించాలి. అంతకంటె యింకే మార్గమూ, పరిష్కారమూ లేవీ జటిల సమస్యకి.

గడియారం ఏడుగంటలు కొట్టింది.

జయదేవ్ ఆలోచనలలోంచి బయటపడ్డాడు.

ఇంక ముప్ఫయి గంటలు...ఈలోగా పద్మకి సంతానం కలగకపోతే ఆమె ఆత్మహత్య చేసుకు తీరుతుంది.

ఈ ముప్ఫయి గంటలలోనూ ఏం జరగబోతూంది? పద్మ-సంతానవతి కాగలదా? రేపు అర్థరాత్రి పన్నెండు గంటలలోగా ఆమె తన బిడ్డని హృదయానికి హత్తుకోగలదా?

ఈ క్షణానికి కనీసం గర్భవతయినా కాని పద్మ-ముప్ఫయి గంటలలోగా అమ్మ కావడానికి, ఆత్మహత్య చేసుకోకుండా జీవించడానికి అవకాశం లేక పోలేదు. ప్రయత్నాలు జరగకపోలేదు. ఎటొచ్చీ అవి ఫలిస్తాయా అని.

అతనికొకసారి లోపలికి వెళ్ళి పద్మ ఏం చేస్తూందో చూద్దామనిపించింది. లేవబోయేంతలో...

టెలిఫోన్ పిలిచింది.

అతను ఆత్రంగా అందుకున్నాడు—యీసారయినా తన ఆశ సఫలం కావాలనీ, కోరుకున్న పిలుపు రావాలనీ అనుకుంటూ.

"జయదేవ్..."

"ఆలిస్‌ని...ఎనిమిదిలోగా రండి."

ఆలిస్!...అతని ముఖంలోకి ఆనందమూ కళా వచ్చాయి. "ఆలిస్!..."

"వివరాలు-వచ్చాక. త్వరగా రండి." టెలిఫోన్ పెట్టేసిందామె.

అతను దీనంగా చూశాడు రిసీవర్‌వేపు. ఏమిటీ సస్పెన్స్? ఆమె మరొక్క వాక్యం చెప్పి వుంటె-విషయం తెలిసిపోయేది. ఈ ఆత్రత ఉండేది కాదు. కాని—ఆమె ఆలిస్! రహస్యాలు దాచదని టెలిఫోన్ మీద చాలా అవిశ్వాసం ఆమెకి. తను అక్కడికి వెళ్ళేవరకూ యీ ఆత్రత తప్పదు.

వాటీజ్ లైఫ్ ఇఫ్ నాట్ కేర్స్ అండ్ ఆంగ్జయిటీస్? ఎంత కరక్టుగా చెప్పారెవరో కాని.

ఆలిస్-యిప్పటి తన ఆశ. కల...దేవత!

ఆలిస్!

అతనికెక్కడలేని ఉత్సాహమూ వచ్చింది. ఆమె-ఒక గంటలో వచ్చెయ్యమంది. ఆలస్యం చెయ్యకూడదు.

అతనికేదో జ్ఞాపకం వొచ్చింది. బీరువా వద్దకు నడిచాడు వేగంగా.

జయదేవ్‌కి ఆనందంగా వుంది.

ఆత్రంగా వుంది.

అనుమానంగానూ ఉంది.

నిజంగా ఆ అద్భుతం జరగబోతూందా? జరుగుతుందా?

లాకర్ తెరిచాడు.

నోట్ల కట్టలు...వంద రూపాయలనోట్లు వందేసి.

మునుపయితే వాటివంక మరో నిముషం విచిత్రంగా చూసేవాడే. ఈ కాగితం ముక్కలా ప్రపంచాన్ని పాలించేవీ శాసించేవీ అనుకుని ఆశ్చర్యపోయే వాడే. కాని...యిప్పుడు...అతనికి చాలా తొందరగా వుంది. గంటలో అతన ఆలిస్ దగ్గరకు వెళ్ళాలి.

చకచక ఐదు కట్టలను బ్రీఫ్‌కేసులో వేశాడు. అంటె-ఏభై వేలు! అతనికి ధైర్యం వచ్చినట్టు లేదు, తృప్తి కలిగినట్టు లేదు. ఎందుకయినా మంచిదన్నట్టు మరో ఐదు కట్టలను తీసి, లాకర్ మూసెయ్యబోతుంటే-అప్పుడు హఠాత్తుగా గుర్తు వొచ్చింది.

అతని వేళ్ళు ఆత్రంగా వెదకసాగాయి లాకర్‌లో. కావలసినది దొరకటం లేదు. అతని ఆత్రత అధికమై పోయింది!

ఏమయిందా కవరు?

పద్మ తీసిందా?

తెరచి చూసిందా?

అదే జరిగితే-అంతా వ్యర్థమే.

అతనికి చెమటలు పోశాయి—ఎ.సి. రూమయినా!

ఆ కవరులోని కాగితాలు చదివితే-పద్మ తన ప్రయత్నాన్ని ఎంత మాత్రమూ ఆమోదించదు. తిరస్కరిస్తుంది-ఆ కాగితాలు పద్మ చదివితే - తన ప్రయత్నాలూ ఆశయా-అన్నీ బూడిదలో పోసిన పన్నీరే! ఎంత పొరపాటు చేశాడు తను! అయ్యో...ఆవేళ తనకెందుకు బుర్ర పని చేయలేదు సవ్యంగా? ఆ కవరు చాలా విలువయినదనీ, ప్రమాదకరమయినదనీ...దానినెవరికంటా పడకుండా అతి జాగ్రత్తగా రహస్యంగా దాచాలనీ ఎందుకు అనిపించలేదప్పుడు? ఈనగాచి నక్కలపాలు చేసినట్లే ఔతుందా యిప్పుడు? ఏమైందా కవరు?

అసలు—పద్మ లాకర్ తీయదే!

అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి సీక్రెట్ లాకర్ సంగతి. క్షణం ఆలస్యం చెయ్యకుండా సీక్రెట్ లాకర్ తెరిచాడు. అందులో వుంది కవరు.

ఒక్క నిట్టూర్పు విడిచి అతనా కవరు పట్టుకుని సోఫాలో కూలబడ్డాడు ప్రాణం తెరిపిన పడ్డట్లు.

అదే క్షణంలో పనిమనిషి టీ తెచ్చింది.

తీసుకుని- "డ్రయివర్‌కి కారు సిద్ధం చేయమని చెప్పు. నేనే డ్రయివ్ చేసుకుంటాననీ...అతన్ని వెళ్ళిపొమ్మన్నాననీ చెప్పు." అన్నాడు,

మంచి టీ తాగి సిగరెట్ అంటించేసరికతనికి మెదడు పనిచేయసాగింది. కవరు తెరచి కాగితాలు సరిగా ఉన్నాయో లేదో చూద్దామనిపించింది. తెరవబోయాడు.

చేతులు వొణికాయి. గుండె-భయంతో జలదరించింది. చేతిలోని ఆ కవరు-కాటెయ్యబోయే పాము పిల్లలా కనిపించింది.

ఆ కవరులోని కాగితాలలో...

అత్యంత నికృష్టమయిన దోపిడికీ, అతి హేయమయిన దురాచారానికీ నాంది పలికే అగ్రిమెంటుంది. అంతేకాదు...

స్త్రీ పూజింపబడే యీ భారతదేశంలో యింతవరకూ వెలకట్టబడలేని అద్దె నిర్ణయించలేని ఆడదాని అంతర్యాన్ని రూపాయి నోట్లలోకి దిగజార్చిన మొట్టమొదటి కాగితం ఉంది.

వ్యాపార ప్రకటనలలో, సినిమాలలో స్త్రీ అర్ధనగ్నంగా చూపబడుతున్నందుకూ; స్త్రీ శరీరంతో వ్యభిచారం జరుగుతున్నందుకూ సమాజం మీదా వ్యవస్థ మీదా ధ్వజమెత్తుతున్న మహిళాలోకం యీ కాగితాలలోని వొప్పందం చూసిందో తనని చీల్చి చెండాడక మానదు. చేతనయితే తనని ఉరే తీస్తుందేమో కూడా!

దౌర్భాగ్యురాలూ, విధివంచితా అయిన ఒక స్త్రీకీ-ధనవంతుడయిన ఒక మగవాడికీ- పెద్ద మనుషులముందు జరిగిన వొప్పందానికి అక్షరాల సాక్ష్యమయిన యీ కాగితాలను బయటకు తీయవలసిన అగత్యం ఏర్పడకపోతే ఎంత బాగుంటుంది! పరిస్థితులు స్త్రీని ఎంత దిగజార్చగలవో-మాతృప్రేమ ఆమెనెంత వరకూ తెగింపజేయగలదో, డబ్బు ఎంత పాపిష్టిదో—మనిషి ఎంత రాక్షసుడు కాగలడో అద్దం పట్టినట్టు చూపే యీ అగ్రిమెంటుని బయటపెట్టవలసిన అవసరం రాకూడదు గాక రాకూడదు.

భగవాన్! నేనింతవరకూ ఆమెకి చేసిన అన్యాయమూ ద్రోహమూ చాలు. నన్నింకా నేరస్థుణ్ణీ పాపాత్ముణ్ణీ చేయకు. ఈ కాగితాలను తిరగతోడవలసిన పరిస్థితి కల్పించకు. నేను నిన్ను ప్రార్థించేదిదే

ఆ కవరువేపు చూడలేనట్లు కళ్ళు మూసుకుని-దానిని బ్రీఫ్‌కేసులో ఉంచాడు నోట్లకట్టల పక్కన మరో అరలో.

"ఎక్కడికో వెళ్ళాలన్నారట?" అంటూ వచ్చింది పద్మ టీతో.

"ఔను. పావుగంటలో తయారవు. టైము లేదు."

"ఎక్కడికి? ఎందుకు?"

"పద్మా! ప్లీజ్. అవన్నీ తరువాత. ముందు తయారవు"

అలాగే అన్నట్లు చూసి వెళ్ళిపోయిందామె.

అతను టీ తాగసాగాడు. టీ చాలా రుచిగా ఉంది కూడా-పద్మ స్వయంగా తెచ్చింది కనుక. నిజానికి యీ సంవత్సరంనుంచీ-రోజులో ఎక్కువసార్లు ఆమె స్వయంగా అందించిన కాఫీ టీలే తాగుతున్నాడు. పద్మ ఆవేళ తన నిర్ణయాన్నంత



II set

స్పష్టంగా చెప్పేసరికి తనకి ప్రపంచమే అంధకార బంధురమై పోయింది. జీవితం మీద విరక్తి కలిగింది. అదీకాక యీ సంవత్సరమూ పద్మతో గడుపుతూ ఉండి పోవడమే న్యాయంగా తోచింది. తన ఆలోచనలను జరుపుతూ బిజినెస్‌ను మానేజర్ కప్పగించేశాడు పూర్తిగా. పద్మని తీసుకుని తప్ప సాధారణంగా బయ టికు వెళ్ళడం లేదు. ఆమెని తరచుగా షికార్లకి సినిమాలకి తీసుకు వెళ్ళడం సరదాగా కబుర్లు చెప్పడం—అలాగ ఆమెతో ప్రేమికుడిలా ప్రవర్తిస్తున్నాడు. ఔను. పెళ్ళికి ముందులాగ-రోజులో అధిక భాగం ఆమెతో గడపసాగాడు. అతని ధ్యేయం ఆమె ఆత్మహత్య చేసుకోకుండా జీవితం మీద రక్తి కలిగించడం. అందుకు చాలా సమయమూ, డబ్బూ వెచ్చించాడు. కాని ఫలితం లేకపోయింది. ఆమె నిర్ణయం కొంచెమయినా సడలలేదు! పద్మ అసలు సిసలు భారత స్త్రీ. అమెరికా ఆడది కాదు. అమెరికాలో అయితే స్త్రీ మంచి భార్య కాగలదు కానీ మంచి అమ్మ కాలేదు.

ఇక్కడ అందుకు విరుద్ధం. విచిత్రమయిన వ్యవస్థ యిక్కడ. పెళ్ళి కాక ముందు తల్లి కావడం ఎంత నేరమో, పెళ్ళయ్యాక తల్లి కాకపోవడమూ అంత నేరమే! ఈ దేశంలో సెంటిమెంట్ల సమాజంలో-ప్రతి స్త్రీ తల్లి కాగలదు కానీ-ఎవరో తప్ప భార్య కాలేరు. చాలామంది స్త్రీలు భార్యలు కాకుండానే మంచి అమ్మలై పోతారు. ఎందుకంటే-అమ్మ కాలేని భార్య గొడ్రాలనబడుతుంది. చులకనగా చూడబడుతుంది. చాలా లోటు అనుభవిస్తుంది. ఇక్కడ స్త్రీకి పిల్లలు శారీరక, మానసిక, సామాజిక అవసరమే కాదు, భద్రత కూడా! భవిష్యత్తు కూడా! మనసు ఎంత బాధపడకపోతే-తనని అంతగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న పద్మ-యింత కఠోర నిర్ణయం తీసుకుంటుంది—పిల్లలు కలగకపోతే ఆత్మహత్య చేసుకోవాలని?

"ఎందుకు మీరు మిమ్మల్నిలాగ నాతోనూ యింట్లోనూ బంధించుకోవడం? ఏముందని యిక్కడ? నేనూ...విసుగూ తప్ప. బయటకు వెడితేనే మీకు హాయీ, కాలక్షేపమూ. ఇంట్లో చిన్నపాప పొరాడుతూంటే ఆ దారి వేరు. ఇల్లు కలకల లాడుతుంది. ఇంట్లో ఉండబుద్ధి వేస్తుంది. పసిపిల్లలు లేక స్మశానంలా గీ బొం మంటున్న యింట్లో ఖైదీలా ఉండే ఖర్మ మీకేమిటి?" అనేది.

"ఏమో! నాకు మాత్రం స్వర్గంలాగే వుంటుంది మన యిల్లు-నువ్వున్నావు కనుక" అనేవాడు.

"ఎందుకలా ఆత్మవంచన చేసుకుంటారు? నిజంగా మీకు మాత్రం తండ్రి కావాలని ఉబలాటంగా లేదూ, ఎంత మగవారయినా? అబ్బాయి నెత్తుకోవాలనీ... షికారు తిప్పాలనీ...నలుగురికీ ఘనంగా నా కొడుకని చెప్పుకోవాలనీ అని పించదూ?"

"పిల్లలు వద్దనను. కాని పిల్లలే జీవితం కాదు నాకు. నిజానికి నువ్వు నా కంటికెప్పుడూ పసిపిల్లలా ముద్దుగానే కనిపిస్తావు—"

ఇంకేమీ అనేది కాదామె. ఒకసారి-నమ్మలేనట్లు తనవేపు చూసి అక్కడి నుంచి వెళ్ళిపోయేది. తను-ఒక నిట్టూర్పు వదిలేవాడు ఆమెపట్ల జాలితో. రాను రానూ ఆమె పిల్లలపట్ల మరింత కోరికను వ్యక్తపరిచేది తీరని కోరికలు క్షణ క్షణమూ తీవ్రం ఔతాయి కాబోలు.

ఇప్పుడు-

ఆమెది తీరని కోరిక కాదు.

తీరబోతున్న కోరిక.

ఆలిస్‌నుంచి ఆహ్వానం వచ్చిందంటే—చాలా ఆశపడొచ్చు. ఇందాకటి టెలిఫోన్ తనకి చాలా ఆశలు కలిగిస్తూంది. ఆలిస్ ఊరికే టెలిఫోనూ చేయదూ, రమ్మనీ అనదు. కాని...

నిజంగా...పద్మ రేపటికి అమ్మ ఔతుందా?

ఈ నిముషానికి గర్భవతయినా కాని ఆమె-రేపు ఉదయానికి తన సంతా నాన్ని హృదయానికి హత్తుకుంటుందా?

పూర్తిగా పన్నెండు గంటలయినా లేని యీ స్వల్ప వ్యవధిలో—

నలభై ఏళ్ళు నిండిన పద్మ-యిక తనకి సంతానార్హతే లేదనుకుని ఆత్మ హత్య చేసుకుందుకు గంటలు లెక్కపెడుతున్న స్త్రీ...

ఈ నిముషంలో కనీసం గర్భమయినా దాల్చని పద్మ-రేపు ఉదయాని కల్లా తన బిడ్డకు తానెలా తల్లి కాగలదు?

అసంభవం...అసాధ్యం...

కాదు. ఆలిస్ రమ్మని టెలిఫోన్ చేసింది కనుక—

సాధ్యమే. సంభవమే.

క్రిందటిసారి కలుసుకున్నప్పుడేం చెప్పింది ఆలిస్?

"ఈసారి నేను టెలిఫోన్ చేసి మిమ్మల్నీ పద్మనీ పిలిచానంటే—పద్మ అమ్మ కావడం ఖాయమన్నమాటే. బహుశా...నేననుకున్నది అనుకున్నట్లూ జరి గితే-మీకు వారం రోజులలోగానే నా పిలుపు వస్తుంది" అనలేదూ? మరిప్పుడు టెలిఫోన్ చేసిందంటే అర్థం-పద్మ అమ్మ కాబోతూందనేగా?

ఎలా సాధ్యమిది?

పద్మని పిలిచి తన మనసులో యింతవరకూ రహస్యంగా దాచుకున్న మాట చెప్పేసి-బరువు తొలగించుకుంటే? మనసు తేలిక చేసుకుంటే?

ఒక్కసారతని మనసు ఊగిసలాడింది —— ఆమెకు అసలు విషయం చెప్పెయ్యాలని.

అంతలోనే ఆలిస్ హెచ్చరిక జ్ఞాపకం వచ్చింది. "జయదేవ్! మీరు ముందుగా ఆమెకెంతమాత్రమూ ఏమీ చెప్పవొద్దు. అలా చెబితే పరిస్థితి చెడే ప్రమాదముందని-సుషమ మీకు తెలియజేయమంది."

అయినా-

ఇప్పుడు పద్మతో-"పద్మా! నీకు రేపటిలోగా సంతానం కలుగుతుంది నువ్వు తల్లివి కాబోతున్నావు, నీ జీవితవాంఛ కొంచెం గంటలలో నెరవేర బోతూంది, నువ్వు రేపటిలోగా నీ బిడ్డ నెత్తుకుంటావు-" అని తను చెప్పినా-

ఆమె నమ్ముతుందా? నమ్మగలదా?

ఆమేకాదు—ఎవరు మాత్రం నమ్మగలరు? ఒక స్త్రీ...నలభయ్యేళ్ళు నిండు తున్న స్త్రీ కొన్ని గంటలలో గర్భవతి అయి బిడ్డని ప్రసవించి—తన గుండెలకు హత్తుకుంటుందంటే-

వివేకమున్న ఎవరు మాత్రం నమ్మగలరు!

కాని-అటు-ఆలిస్!

ఆమె చెప్పాక తిరుగుండదు. ఆమె మాట జరిగి తీరుతుంది. తనకి చాలా నమ్మకముంది. ఆమె-సామాన్యురాలు కాదు. దేవతే. పద్మ ఆత్మహత్య చేసుకో కుండా సంతానవంతురాలిని చేసి, ఆమె జీవితాన్నీ తన జీవితాన్నీ రక్షించే దేవతే. ఇమె కసాధ్యమనేది ఉండదు. చిత్రమేమిటంటే...

అబ్స్ట్రెటీషియన్ (ప్రసవవైద్యులు) గైనకాలజిస్ట్ (స్త్రీ వ్యాధి నిపుణులు)గా నగరంలో ఎక్కువ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఆలిస్-ఐదేళ్ళ కిందటి వరకూ తక్కువ డబ్బు మాత్రమే సంపాదించింది. అప్పుడు—మనిషి మనసు మార్చుకున్నట్లు-నగరానికి చివర — ప్రశాంతమయిన వాతావరణంలో-ఎక్కువ డబ్బు కూడా సంపాదించాలన్న ధ్యేయంతో అత్యాధునికమయిన సౌకర్యాలతో మేరీ నర్సింగ్‌హోమ్ నిర్మించింది. ధనవంతులకి మాత్రమే అందుబాటులో ఉంటుందది.

ఆలిస్ - మిస్సో, మిసెస్సో ఆమెకే అనుమానం వొస్తూంటుంది. మెడిసిన్ చివరి సంవత్సరంలో మనోహరంతో ప్రేమలో పడిందామె. హౌస్‌సర్జన్సీ అయ్యే సరికి కానీ తను గర్భవతిననీ గోతిలో పడిందనీ తెలుసుకోలేకపోయింది. ప్రాక్టీసు పెట్టడమేమిటి- మేరీ పుట్టింది. కాని మనోహరం సినిమా ఛాన్సు వొచ్చి ఆమెనీ ప్రేమనీ వొదిలేసి ఫీల్డులోకి వెళ్ళిపోయాడు. పాపని పెంచడమూ, పేషంట్ల హృదయాలని చూరగొనడమూ, ప్రాక్టీస్ వృద్ధి చేసుకోవడమూ, తనదీ అంటూ

జీవితం ఏర్పరచుకోడమూ-వీటిలో ఆమె మనోహరాన్ని కొంతవరకూ మరచి పోయినా-ఉండి ఉండి తీరుబడి ఏకాంతమూ దొరికితే-ఒకసారి తన భగ్న ప్రేమని తలచుకుని నిట్టూర్పు విడుస్తుంది భారంగా. మొదటి రీలులో ప్రేమించి రెండో రీలులో గర్భవతిని చేసి, మూడో రీలులో హీరోయిన్‌ని వొదిలేసి పోయిన హీరో-సినిమా చివరి రీలులో ప్రత్యక్షమై పశ్చాత్తాపం వొలకబోసి — హీరోయిన్‌తో గ్రూప్ ఫోటో దిగడానికి వచ్చినట్లు-ఏనాడైనా మనోహరం తననీ తన ప్రేమనీ వెదుక్కుంటూ రాడా అని ఆమె ఆశ పడుతూంటుంది. ప్రేమా, ఆశా చివరివరకూ చావవు కదా! అయితే ఆలిస్ యింత నిర్విరామంగా పనిచేస్తున్నా ఆమెకి తెగ వొళ్ళొచ్చేసింది. తన భారీ శరీరాన్ని చూసుకుని ఆమె విచారిస్తుంటుంది కూడా.

మేరీమాతయందలి భక్తికొద్దీ. తన పాపమీద ముద్దుకొద్దీ-నర్సింగ్‌హోమ్‌కి మేరీ నర్సింగ్‌హోమ్ అని పేరు పెట్టింది ఆలిస్. పాప పెద్దదవుతూంటే ఆమెకు చాలా డబ్బు కూడబెట్టాలనే తాపత్రయం మొదలై ప్రజాసేవాభావం అడుగున పడిపోయింది. అయినా డబ్బు దగ్గర ఎంత కచ్చితంగా వుంటుందో. పేషంట్‌కి అంత విశిష్టమయిన సేవ చేస్తుంది. ఆమెకు స్త్రీ అంటే జాలి. ప్రకృతి ఆమెమీద మోపిన సృష్టి బాధ్యత వల్లనే ఆమె పురుషుడి చేతిలో మోసపోతూందని ఆమె నమ్మకం. అందుకు ఆమె మనోహరాన్ని నమ్మి వంచించబడడమే తార్కాణం. నిజమయిన క్రిస్టియన్ అయిన ఆలిస్ పాపమనేది శరీరానికికాదనీ హృదయానిదనీ (స్కిన్ టు స్కిన్-నో సిన్) నమ్మి-ఆబార్షన్లు చేస్తుంది. పేషంట్ల రహస్యాలను భద్రంగా దాచుతుంది కనుక ఆమె అంటే అందరికీ గౌరవం, విశ్వాసమూ. అందుకే ఆమెవద్దకు వచ్చే కేసులలో అధికభాగం-ధనవంతుల పిల్లలూ. కాలేజీ అమ్మాయిలూ తొందరపడి తెచ్చుకున్న గర్భాన్ని తీయవలసినవే. ఆ అమ్మాయిల అమాయకత్వానికి (ప్రేమపట్ల); అజ్ఞానానికీ (కాంట్రాసెప్టివ్స్‌పట్ల) జాలిపడుతూ-వారి గర్భాన్ని తీసెయ్యడంతోపాటు ఆ ఆడపిల్లల అజ్ఞాన అమాయకత్వాలను తన హితబోధలతో పోగొట్టాలని కూడా ప్రయత్నిస్తుంది. ఆమె మంచిదీ, వివేకవంతురాలూ అయిన డాక్టరు మాత్రమే కాదు; అదృష్టవంతురాలు కూడా. ఆమె కేసులలో విఫలమయిన వాటి శాతం అతితక్కువ.

నర్సింగ్‌హోమ్‌తోపాటు అదే ఆవరణలో క్లినికల్ లాబొరేటరీయూ తెరచింది. ఎక్స్‌రే-రక్త-మల-మూత్ర పరీక్షాదులు వేటికీ ఆవరణ దాటి అవతలకు వెళ్ళనక్కర్లేదు. ఈ మధ్యనే ల్యాప్రొస్కోపిక్ ఎక్విప్‌మెంటు కూడా తెప్పించింది. ఇంకా ఆమెకు పరిశోధనలంటే యిష్టం. పవిత్రమయిన సృష్టిని సాగించేందుకు-స్త్రీ అంతప్రసవవేదనకి లోను కాకూడదని ఆమె ఉద్దేశ్యం. ప్రసవవేదనను సాధ్యమయినంత తగ్గించేందుకు ఆమె పరిశోధనలు చేస్తుంది. ఆమె చాలావిధాల గొప్ప డాక్టరు.

అందుకే పద్మని ఆమెవద్దకు తీసుకువెళ్లాడు జయదేవ్. బయలుదేరేవరకూ కూడా-"ఎందుకండీ యీ వ్యర్థ ప్రయత్నాలు? నలభయ్యోయేట పిల్లలకోసం ఆరాటపడటమంటే-నలుగురూ నవ్వుతారు. నా మాట వినండి—" అంటూనే వుంది. అయినా "నువ్వు నాకు సహకరిస్తానని మాట యిచ్చావ్. మరచిపోకు—" అంటూ తీసుకు వచ్చాడు.

పద్మని చూస్తూనే-ఆలిస్ పలకరించింది-"షీరా!"

అతను ఆశ్చర్యపోయాడు పద్మ తనని ఆమెకు పరిచయం చేస్తూంటే.

అప్పుడు చెప్పింది ఆలిస్-"ఈమెకు సంతానం కోరి వస్తే—సారీ—మిసెస్ పద్మకా అదృష్టం లేదు."

"ఎందుకని?" బాధగా, భయంగా అడిగాడు.

"ఆమె గర్భకోశం-వూంబ్-చాలా యిరుకు. పిండం పెరుదలకి-బేబీ గ్రోత్‌కి తగినచోటు చూపలేదామె వూంబ్"

"ఆపరేషన్ ద్వారా కూడా సరిచేయడం సాధ్యపడదా?"

"సారీ. ఈ వయసులో-అసాధ్యమే"

గుణ్యా రామరాయ
గురు విధేయ

డాక్టరు బండ్లమూడి ఆంజనేయులు

కులమునందులేవు గుణము లెల్లప్పుడు
కులము గుణములెపుడు కూడిరావు
కులము వేరు నరుని గుణములు వేరయా
గుణ్యా రామ రాయ గురు విధేయ

అతిథి జూచినంత ఆనందబాష్పముల్
విరిసి కనుల వెంట వెడలకున్న
ధనదుడైన నతని దరికి పోరాదయా
గుణ్యా రామ రాయ గురువిధేయ

న్యాయ పీఠమందు నలరారు వానికి
పక్షపాతమెపుడు పనికిరాదు
కంచె చేను మేయ కావలి సాధ్యమా !
గుణ్యా రామరాయ గురు విధేయ

తరుణితోడ నెపుడు తగదు మిత్రత్వంబు
పూత చరితునకును పుడమి మీద
తాటినీడ పాలుత్రాగినా కల్లండ్రు
గుణ్యా రామ రాయ గురు విధేయ.

అవని కోట గోడలధిగమించగవచ్చు
బలిమి శత్రుకోటి బరిమారించి
కులము గోడ లవని కూల్చంగ శక్యమే
గుణ్యా రామ రాయ గురువిధేయ.

●●●●●

"అంటే-పద్మ-యీ జన్మలో సంతానాన్ని పొందలేదా?" నీరసంగా భయంగా అడిగాడు తల వొంచుకుని.

"పొందలేదనే చెప్పాలి." తీర్పు యిస్తున్నట్లుంది ఆలిస్.

ఆ మాటతో అతని అన్ని ఆశలూ అంతరించిపోయాయి. భవిష్యత్తు పూర్తిగా అంధకారమయమై పోయినట్లనిపించింది.

పద్మ మాత్రం-ఏ భావమూ ప్రతిఫలించని ముఖంతో ఉండిపోయింది.

ఇంక అక్కడ ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదతనికి.

"మళ్ళీ వొస్తాను-" అని లేచాడు.

"ఈ విషయంలో అయితే అనవసరం. ఎందుకంటే నేను పద్మని సాకల్యంగా పరీక్షించాను. రిపోర్టులు తీసుకున్నాను. ఇదంతా ఒకటి రెండు నెలల క్రితమే. కనుక నేను కొత్తగా చెప్పేదీ చేయగలిగేదీ ఏమీ ఉండదనుకుండాను-" అనేసిందామె.

చిత్రమేమిటంటే-ఆ ఆలిసే యిప్పుడు పద్మని సంతానవతి చేయబోతూంది. ఎవరూ ఊహించనయినా ఊహించలేని తీరులో. ఇది-యీ దేశానికే అద్భుతమూ ఆరంభమూ, ఆలిస్-ఎలా సాధించబోతూందీ అత్యాశ్చర్యకర అసాధ్యాన్ని? కొన్ని గంటలలో పద్మని తల్లిని చేయడాన్ని!

(ఇంకా వుంది)

శ్రీ టి. యస్. వి. సుబ్రహ్మణ్యం

శ్రేయో రాజ్యం-భారతీయ మౌలిక భావాలు

ఆధునిక యుగంలో శ్రేయోరాజ్య సంబంధిత భావాలు విశేషంగా రాజ్యాలచేతనూ ప్రజల చేతనూ ఆకర్షింపబడుతున్నాయి. నేడు రాజ్యాన్ని ఆవశ్యక క్లేశంగాను నెససరీ ఈవిల్ అనావశ్యక క్లేశంగాను అన్‌నెససరీ ఈవిల్ విమర్శిం చటంలేదు, కాని ప్రజా సంరక్షణ కోసమూ ప్రజాభ్యుదయంకోసమూ దోహదం చేసే అత్యావశ్యకమైన సంస్థగా గుర్తిస్తున్నారు. సంక్షేమ జ్య ఆవశ్యకత పాశ్చాత్యా తత్త్వంలోనే కాకుండ ప్రాచీన భారత రాజనీతి తత్త్వంతో కూడా సోదాహరణంగా వివరించడం జరిగింది. మహాభారతం, బృహత్సంహిత, మనుస్మృతి, అర్థశాస్త్రం మొదలైన ప్రాచీన భారతీయగ్రంథాలలో రాజధర్మాలను వివరించేటప్పుడు సంక్షేమ రాజ్యఆశయాలనుగురించికూడా స్పష్టం చేయడం జరిగింది. గ్రీక్‌తత్త్వ వేత్తలలో ప్రసిద్ధులైన ప్లేటో, అరిస్టాటిల్ తమ సిద్ధాంతాలలో ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆదర్శప్రాయము; ఆచరణాత్మకమూ అయిన సంక్షేమ రాజ్యాన్ని రిపబ్లిక్ మరియు పొలిటిక్స్ అనే గ్రంథాలలో వివరించారు. 18 వ శతాబ్దపు చివరి వరకు రాజ్యము కేవలం శాంతిభద్రతలను కాపాడుతూ పోలీస్‌రాజ్యం అని వ్యవహరింపబడుతుండేది. 19 వ శతాబ్దం నుంచి శ్రేయోరాజ్య భావనకుప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని చెప్ప వచ్చు. పాశ్చాత్యతత్త్వవేత్తలలో టి హెచ్ గ్రీన్, హెచ్ జె. లాస్కి, బెంథామ్; కాంట్ జెఫర్సన్ మొదలైనవారు శ్రేయోరాజ్యాల భావాలవ్యాప్తికి తీవ్ర కృషి చేసిన వారిని చెప్పవచ్చు. అదే కాలంలో ఫ్రాన్స్‌లో మూడవ నెపోలియన్, జర్మనీలో బిస్మార్క్, ఇంగ్లండులో మొదటి ఎలిజబెత్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలనుఎన్నో చేపట్టారు.

శ్రేయోరాజ్యభావన భారతదేశంలో అతి పురాతన కాలంలోనే వికసిస్తూ వచ్చింది ప్రజా సంక్షేమానికి అనువైన కార్యక్రమాలను ఎన్నెండినో రూపొందించి అమలు చేయడం జరిగింది. ప్రజా సంరక్షణకోసం ఆర్థికంగానూ, సాంఘికంగానూ, కార్మికుల, ఉత్పత్తిదారుల వినియోగదారుల సంక్షేమ చర్యలుఎన్నోకొనసాగింపబడేవి. మనుస్మృతి, శుక్రనీతి, మహాభారతం, బృహత్సంహిత, కౌటిల్యుని చే విరచితమైన అర్థశాస్త్రం మొదలగు ప్రాచీన భారత రాజనీతి గ్రంథాలలో సంక్షేమ రాజ్యభావాలు మనకు పుష్కలంగా లభిస్తున్నాయి. నాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితుల కను గుణంగా ఉండిన అలనాటి శ్రేయోరాజ్యభావాలున్నూ నేటి పరిస్థితులకు అనుగుణంగా మన భారత రాజ్యాంగంలో వివరింప బడ్డ సంక్షేమ ఆదేశాలున్నూ చాలవరకు పోలికలుకలిగి ఉన్నాయని చెప్పవచ్చు.

ప్రాచీన భారత రాజనీతి గ్రంథాలలోనూ ముఖ్యంగా అర్థశాస్త్రంలోనూ రాజ్యం యొక్క సంక్షేమ రాజ్య ఆశయాలు మనం చాలవరకు పరికించగలము. వేదకాలంలో రాజు "ధృతవృత" అనే పేరుతోనూ, తదనంతర సాహిత్యాన్ని బట్టి "పిసావట్ట" అనే పేరుతోనూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించినట్లు తెలియవస్తూవుంది.

రాజ్యంలో శాంతిభద్రతలను కాపాడడంతోనే రాజు భాధ్యత ముగిసి పోదు. రాజు దిక్కు లేనివారినీ, వయోవృద్ధులనూ, అంధులనూ, వికలాంగులనూ, విధవలనూ,అనాథలనూ,రోగపీడితులనూ, ప్రకృతి వైపరీత్యాలచే పీడింపబడేవారినీ, గర్భిణీస్త్రీలనూ సంరక్షించే బాధ్యతలను కలిగివున్నాడు. దుష్టులైన బలవంతులనుండి బలహీనులను రక్షించే బాధ్యతలను కూడా రాజధర్మంగా పరిగణింపబడేది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో రెండవ ఆదికరణములోని ఒకటవ అధ్యాయంలో 26వ॥ శ్లోకంలో చెప్పడం జరిగింది.

శ్లోక వివరణ :- "అనాథలగు బాలురనూ, వృద్ధులనూ, ఆపద పాలగువారిని, సంతానము లేని స్త్రీలనూ, దిక్కులేని స్త్రీల సంతానమునూ రాజు పోషించవలెను"

(అర్థశాస్త్రం - 2 అధికరణ -1వ అధ్యాయం - 26వ శ్లోకం)

మొదటి అధికరణములోని 12వ అధ్యాయంలోని 1వ శ్లోకంలో ఈ క్రింది విధంగా చెప్పడం జరిగింది.

శ్లోక వివరణ :- "ఎట్టి బంధువులూ లేనివారు, విధిగా ప్రభుత్వముచే పోషింపబడ వలసిన వారు"

(అర్థశాస్త్రం - 1 అధికరణము - 12 అధ్యాయం. 1 శ్లోకం)

రాజు కేవలం మానవుల సంరక్షణమాత్రమే కాకుండ రాజ్యానికి సంబం ధించిన పశు సంపద సంరక్షించే బాధ్యతకూడ కలిగి ఉన్నాడు. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 2వ అధికరణములో "జనపద నివేశము" అనే మొదటి అధ్యాయంలో 37వ శ్లోకంలో ఈ విధంగా చెప్పి ఉన్నాడు.

శ్లోక వివరణ :- "జరిమానాల మూలముననూ, కూలి జనము మూలముననూ, పన్నుల మూలముననూ, బాధలకు లోనగు వ్యవసాయమున్నూ, దొంగలు, అడవి మృగములు, విష జంతువులు, మొసళ్ళు, వ్యాధులు మున్నగువాటిచే పీడింపబడు పశువుల మందలనూ రక్షింపవలెను"

(అర్థశాస్త్రం - 26 అధికరణ - 1 అధ్యాయం - 37 శ్లోకం)

ప్రముఖ చరిత్రకారుడైన డా॥ ఈశ్వర్ ఏ రాజుల కాలంలోనూ లేనంతటి గొప్ప పశువైద్యశాలలు అశోకుని కాలంలో నిర్మించబడిందని పేర్కొన్నాడు.

రక్షణమనే మాటను కౌటిల్యుడు విశాలార్థములో వాడినాడు. రాజు అనుసరించవలసిన రక్షణ విధానంలో ప్రజల ఆరోగ్య రక్షణ, నీతి ధర్మ రక్షణ మున్నగునవి కూడ ప్రాధాన్యం వహించి ఉన్నాయి. మాంస విక్రేతలు, మద్య విక్రేతలూ, జూదగాండ్రూ మొదలైన వారిపై ఇందుకుగాను అనేక నియమాలు, నిర్బంధాలు విధింపబడ్డాయి. గ్రామ ప్రజలు వారి కాలాన్నీ ఆదాయాన్నీ వ్యర్థంగా ఖర్చు చేయకుండేటట్లుగా గ్రామాధికారులు అనేక చర్యలను తీసుకొనేవారు. దీన్ని గురించి అర్థశాస్త్రంలో కౌటిల్యుడు "అధ్యక్ష ప్రచారము" అనే 2వ అధికర ణంలో "జనపద నివేశము" అనే అధ్యాయంలో 33, 34 శ్లోకాలలో ఈ విధంగా తెలియచేశాడు.

శ్లోక వివరణ :- "ఆరామములుగాని, విహారశాలలు గాని గ్రామములందు ఉండ రాదు. నటులు, నర్తకులు, గాయకులు, వాద్యగాండ్రు, కథకులు, కుశీలవులు, అచ్చటి వారి కార్యకలాపాలకు విఘాతము గల్గించరాదు. దీని ద్వారా గ్రామస్థులందరు వారి వారి వ్యవసాయ కార్యము లలో నిమగ్నులగ నుండు కారణముననూ, కోశము, కూలి జనము, ద్రవ్యములు, ధాన్యములు, రసములు అభివృద్ధి గాంచును"

(అర్థశాస్త్రం 2 అధికరణ - 1 అధ్యాయం - 33, 34 శ్లోకాలు)

ఆర్థికముగా ప్రజలకు నష్టములు కలుగకుండుటకు రాజులు వస్తువుల ధరలు నిర్ణయించడమూ, గుత్త వ్యాపారం నిషేధించడమూ, రక్షక విధానములో నొక భాగం అని కౌటిల్యుడు వివరించినాడు

ప్రాచీన భారత రాజనీతి గ్రంథాలలో రాజును ధర్మరక్షకుడుగా పేర్కొనడం జరిగింది ధర్మ రక్షకుడంటే అతని ధర్మానికి సంబంధించని ప్రజ లను అణిచివేతకు గురిచేయాలని కాదు మత ప్రమేయంతో నిమిత్తం లేకుండా ప్రజా సంరక్షణే అత్యుత్తమమైన రాజ ధర్మం అని మనువు పేర్కొన్నాడు. ప్రజ లందరినీ రక్షించడం, న్యాయ సమ్మతమైన శిక్షల్ని విధించడం, ఆశ్రమ ధర్మాన్ని కాపాడడం రాజు యొక్క బాధ్యత అని గౌతముడు పేర్కొన్నాడు. శుక్రుడు దుష్ట శిక్షణ శిష్టరక్షణ రాజధర్మాలలో చాలా విశిష్టమయినవని పేర్కొ న్నాడు. అంతే కాకుండ రాజనేవాడు ప్రజలకు యజమానిగానూ, సేవకునిగనూ కూడ ఉండాలని చెప్పాడు.

ప్రజలను రక్షించడమే కాక వారి యోగక్షేమాల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కూడా రాజుల కర్తవ్యంగా పరిగణింపబడేది.

ఇందుకై వారు శూన్య ప్రదేశాలలో గ్రామాల నిర్మాణం చేస్తుండేవారు వ్యవసాయాభివృద్ధికై జలాధారాలు కల్పిస్తూండేవారు పచ్చిక బయళ్ళను ప్రత్యేకంగా కేటాయించి కాపాడుతూ పశుగణాభివృద్ధికి తోడ్పడేవారు. వ్యాపారం అభివృద్ధి పరచడానికి రహదారులు నిర్మించేవారు. ప్రభువునకూ ప్రజలకూ మధ్య ఉండదగిన సంబంధం తండ్రి పిల్లల మధ్య నుండే సంబంధంవంటిదనే సూత్రం ఆధారముగా చేసికొని రాజులు పరిపాలన సాగిస్తూ ఉండిరని విష్ణుగుప్తుడు (కౌటిల్యుడు) సవివరముగా తన అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు.

ఆర్థిక రంగంలో కూడ ప్రజాభివృద్ధికిగాను ప్రాచీన భారత రాజ్యాలు సంక్షేమ కార్యక్రమాలను చేసేవని చెప్పవచ్చు గుత్త వ్యాపారాల ద్వారా కలిగే నష్టాలను గుర్తించి, వాటికి ప్రజలు గురికాకుండా వ్యవసాయం, వనముల పెంపకం, గనుల పరిశ్రమ, లోహ పరిశ్రమ, నేత మున్నగు చేతి పనులు మొదలైన భారీ మరియు చిన్నతరహా పరిశ్రమలను ప్రభుత్వ యాజమాన్యంలో ఉంచడం జరిగింది.

దేశంలో ద్రవ్యోల్బణం ఏర్పడితే జాతీయ సంక్షోభం ఏర్పడుతుందని మహాభారతంలో చెప్పబడింది. అంతే కాకుండ పన్నుల విధింపు కూడ హేతుబద్ధంగా, సమానంగా ఉండేది. దీనిని గురించి మహాభారతంలో 5వ పర్వంలో 3వ ఆశ్వాసంలో 57వ పద్యంలో ఈ విధంగా చెప్పబడింది.

తే॥ మాలకరి పువ్వులు కోయుమాడ్కి నదే ; బి
పువ్వు దేనియ గొనియెడు పోల్కి నెడురు
గందకుండగ గొనునది కార్యఫలము
బొగ్గులకు బోలె మొదలంట బొడువజనదు.

(మహాభారతం - 5వ పర్వం - 2వ ఆశ్వాసం - 57 పద్యం)

తోటమాలి నిరపాయంగా పూలు, పండ్లు చెట్టునుండి కోసినట్లుగా, తేనెటీగ పూరేకులను గాయపరచకుండా తేనెను సంగ్రహించినట్లుగా రాజు తన ప్రజలను ఏమాత్రం నొప్పించకుండా పన్నులను వసూలు చేయాలని పంచతంత్రంలో చెప్పడం జరిగింది. ఈ అంశాన్నే మహాభారతంలో, శాంతి పర్వంలో, 2వ ఆశ్వాసంలో 393 వ పద్యంలో ఈ క్రింది విధంగా కూడ పేర్కొనడం జరిగింది.

పులి కూనల తినుచందము
గలిగిన నంతటన నిలుచుగాక ధనంబుల్
గలుగునే మేదన్ గావున
జలగ దిగిచినట్లు గొనగ జనునిల సొమ్ముల్

(శాంతి పర్వం - 2 ఆశ్వాసం - 393 పద్యం)

ప్రాచీన భారత రాజ్యాలలో సైన్యం ఉండే గ్రామాలు పన్ను నుంచి మినహాయింపబడేవి. వికలాంగులపై పన్నులుండేవి కావు. గురు కులంలో విద్యనభ్యసించే వారిపైనా, అరణ్యాలలో తపస్సు చేసేవారిపైనా, స్త్రీలపైనా పన్నులు విధించే వారు కారు ప్రస్తుత కాలంలో ప్రజల సాంఘిక ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవడానికి గణాంక శాఖ (స్టాటిస్టికల్ డిపార్ట్‌మెంట్) ఒకటి ఉన్నది. ఈ శాఖ చేసే పనులన్నిటిని కౌటిల్యుని కాలంలో గోపుడనే అధికారి నిర్వహిస్తూ ఉండేవాడు.

ఉద్యోగులు న్యాయానుసారముగా ప్రవర్తించేటట్లు చేయడానికి బెదిరింపులు, శిక్షలు లాంటివి అమలు చేయడం కంటే వారిలో శ్రేష్ఠులను తగురీతిలో సత్కరించడం ఉత్తమమని, జీతములు స్వల్పముగుటచే వారు లంచాలు తీసుకోవడమూ ప్రజలను పీడించడమూ సంభవిస్తోందని ప్రస్తుతకాలంలో అనేకమంది అభిప్రాయ పడుతున్నారు కౌటిల్యుడు కూడ ఇదే అభిప్రాయాన్ని ప్రకటించినాడు జీతములు ఉద్యోగుల మర్యాదలను బట్టి ఉండవలెనని ఇతడు భావించినాడు. వేతనములను బట్టి ఉద్యోగులను 2 తరగతులుగా విభజించినాడు. ఉద్యోగులకు అధిక మాసములో అధిక జీతమూ, ప్రత్యేక ధన సహాయమూ, ప్రభుత్వోద్యోగులు మరణిస్తే వారి పుత్రులకు భుక్త వేతనము లివ్వవలె ననియూ, ప్రభుత్వానికి మహోపకారం చేసిన ఉద్యోగులకు ప్రత్యేక బహుమానా లివ్వవలెనని కూడ కౌటిల్యుడు అభిప్రాయం వ్యక్తం చేశాడు.

మన ప్రాచీన భారత రాజనీతి గ్రంథకర్తలు గ్రామ పరిపాలనపై ఆసక్తి కనబరిచినట్లే నగర పరిపాలన విషయంలో కూడ ఎక్కువ శ్రద్ధ కనబరచినట్లు మనకు విశదమౌతుంది. ఆ కాలంలో నగరాలు ఒక పద్ధతి ప్రకారం నిర్మించబడేవి. ప్రజల ఆరోగ్యానుకూలమైన నగరాలు క్రమ పద్ధతిలో నిర్మించడం జరిగింది. ఇప్పటి మున్సిపల్ కౌన్సిళ్ళ వంటివి ఆ కాలమున ప్రజలెన్నుకొనిన సభలు లేనట్లు కనిపిస్తూవుంది. అందుచేత "నాగరికుడు అనే అధికారి సర్వాధికారిగా పరిపాలిస్తూ ఉండేవాడు. ఈ విషయం కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 2వ అధికరణలో నాగరికుని విధులు అనే 36వ అధ్యాయంలో వివరించినాడు.

దుష్టులను శిక్షించడమూ, ప్రజలనూ వారి సాంఘిక వ్యవస్థనూ రక్షించడమూ, వారి యోగ్యతలను పెంపొందించడమూ రాజ్య పరిపాలకుని ప్రధానాంశాలు. బహుశా కౌటిల్యుని కంటే మిన్నగా ఏ రాజనీతి రచయితా కూడా శాంతి భద్రతలను గురించి చెప్పి ఉండక పోవచ్చు. కౌటిల్యుడు ఈ విధంగా పేర్కొన్నాడు.

శ్లోక వివరణ :- "ఏ రాజయితే తన ప్రజలను న్యాయసమ్మతంగా పాలిస్తూ, శాంతి భద్రతలను కాపాడుతాడో అతనికి స్వర్గ ప్రాప్తి లభిస్తుంది. ఎవరైతే తన ప్రజలను రక్షించక సామాజిక భద్రతను చిన్నాభిన్నం చేయునో అతనికి రాజ్యాధికారం ఉండడం వృధా"


స్త్రీలను బలాత్కరించే వారు, దొంగలు, దోపిడికాండ్రు, ఇతర అపచారాలు చేసేవారు, ప్రజలను మోసగించే వర్తకులు, అవినీతికి పాల్పడి ప్రజలను పీడించే ఉద్యోగులు వీరందరినీ కౌటిల్యుడు "కంటకులని" పేర్కొన్నాడు. ఇట్టివారినందరిని దండించి ప్రజలను రక్షించడం రాజుల కర్తవ్యాలలో ముఖ్యం అని కౌటిల్యుడు భావించాడు. దుష్టులను దండించడమే కాక పౌరుల మధ్య సంభవించు వివాదములను పరిష్కరించడం కూడ ప్రాచీన రాజ్యాల కర్తవ్యమని గుర్తించడం జరిగింది. వివాదాలు పరిష్కరించడానికి, దుష్టులను శిక్షించడానికి ఏర్పడిన సంస్థలకు "ధర్మస్థీయ" అనే పేరుండేది.

మనుష్యుల మూలంగానే గాక దైవికాలయిన పీడల మూలానా కూడ ప్రజలు నష్టపడుతూ ఉంటారు. అట్టి నష్టాలకు పరిహారం సమకూర్చి బాధితులకు ఉపశమనం కలుగజేయడం రాజుల కర్తవ్యముగా ఎంచబడేది. దైవికంగా ఏర్పడిన పీడల నుంచి ప్రజలనూ, రాజ్యాన్ని రక్షించడానికి ఉద్యోగులు, ప్రజలు తీసుకోవలసిన చర్యలు ఎట్లుండవలసిందీ కౌటిల్యుడు అర్థశాస్త్రంలో 4వ అధికరణంలో "ఉపనిపాత ప్రతీకారము" అనే అధ్యాయంలో 1, 43 శ్లోకాలలో వివరించాడు.

1వ శ్లోక వివరణ :- "దైవికములగు మహాభయములు ఎనిమిది. అవి అగ్ని, వరదలు, వ్యాధి, దుర్భిక్షము, ఎలుకలు, క్రూరమృగములు, సర్పములు, పిశాచములు, వీటినుంచి రాజు దేశమును రక్షించవలెను.

(అర్థశాస్త్రం- 4 అధికరణ - 3 అధ్యాయం - 1 శ్లోకం)

44. వ శ్లోక వివరణ :- "సర్వత్ర అతడు తన ప్రజలను తండ్రివలె రక్షించవలెను"



(అర్థశాస్త్రం - 4 అధికరణ - 3 అధ్యాయం - 34 శ్లోకం)


రక్షణ విధానంలో వ్యక్తుల రక్షణమే గాక సామాజిక వ్యవస్థను రక్షించడంకూడా ఒక ప్రధానాంశంగా కౌటిల్యుడు గుర్తించాడు.

ప్రజా సంరక్షణ కోసమూ, అభివృద్ధి కొరకూ రాజరిక వ్యవస్థకు అధికారం కల్పించడం జరిగిందని మన ప్రాచీన భారతగ్రంథాలు ఘోషిస్తున్నాయి. కేవలం స్వకీయానందప్రదం అయిన విషయమే మంచిదని రాజు భావించరాదు. ఏది జనబాహుళ్య శ్రేయస్కరమో అదే ఆచరణీయమనీ, అనుసరణీయమనీ రాజు భావించాలి ప్రజల సంతోషంలోనే నృపునిసంతోషం ఇమిడి ఉన్నదని కౌటిల్యుడు వక్కాణించినాడు. ప్రాచీన రాజ్యాలు ప్రజలకు సంబంధించిన సామాజిక భద్రతా పథకాలను అమలు చేయడంతో బాటు విద్యా కేంద్రాలను, పండితులను, వృత్తులను పోషించి విద్యల, కళల, పారిశ్రామిక కళల అభివృద్ధికి ఎంతో కృషి చేశాయని చెప్పవచ్చు. ప్రాచీన కాలంలో రాజ్యమే ఒక అద్వితీయమైన విద్యాసంస్థని కూడ చెప్పవచ్చు.

ప్రాచీన భారత రాజ్యాల ముఖ్యాశయము కేవలం ప్రజాశ్రేయస్సును పెంపొందింపచేయటం దేశంలోని ప్రజలు సుఖసంతోషాలతో మరియు సంపదలతో ఉన్నారని భావించినప్పుడే రాజు విరోధులపై యుద్ధాన్ని ప్రకటించాలని మనువు చెప్పినాడు. ఆధునిక రాజ్య విధులతో పోల్చి చూస్తే ప్రాచీన రాజ్యాలు నిర్వహించే కర్తవ్యాలు చాల తక్కువ. అయినప్పటికి ఆ కాలంలో ఆ విధులు రాజ్యమనుగడకు చాల అవసరమైనటువంటిదని చెప్పవచ్చును. ఆధునిక కాలంలో ప్రజా సంక్షేమం కోసం రాజ్యం నిర్వర్తించే విధులు ఐచ్ఛిక విధులుగా పరిగణించవచ్చు.

ప్రాచీన భారత దేశంలో సార్వభౌమత్వానికి చిహ్నంగా అశ్వమేధ యాగాన్ని చేసేవారు. ఈ యాగాన్ని గురించి మహాభారతంలో పేర్కొనడం జరిగింది పుష్యమిత్రుడు రెండు అశ్వమేధయాగాలను సముద్రగుప్తుడు ఒక అశ్వమేధ యాగాన్ని, శ్రీరామచంద్రుడు ఒక అశ్వమేధయాగాన్ని, చేసినట్టు మన చరిత్ర పురాణాలలో పేర్కొన్నారు ఈ యాగము రాజు యొక్క సామ్రాజ్య విస్తరణను ధృవపరచడమే గాక ప్రజలకు సర్వ లాభాలను, సంక్షేమాన్ని కలిగిస్తుందని విశ్వసించేవారు అంతేగాకుండా ఈ యాగం ప్రజల సిరిసంపదలను అభివృద్ధి చేస్తుందని కూడా నమ్మకముండేది.

చట్టం ఆధిక్యత ప్రజాస్వామ్య మనుగడకు మూలస్తంభమువంటిది. చట్టం ద్వారా ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పరిరక్షింప బడుతాయని "డైసీ" అనే ఆంగ్ల రచయిత "లా ఎండ్ కాన్‌స్టిట్యూషన్ అనే గ్రంథంలో పేర్కొన్నాడు. చట్ట ఆధిక్యత ద్వారా ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేయడానికి ఆస్కారం తక్కువ. చట్టం గుర్తింపు పొందిన ప్రభుత్వ చర్యలు ప్రజాహిత కార్యాలకు దోహదం చేస్తుందనే నమ్మకంతో మన భారత దేశంలోనే కాక మిగిలిన అనేక పాశ్చాత్య రాజ్యాలలో "సమన్యాయపాలన" (రూల్ ఆఫ్ లా) అమలు చేయడం జరిగింది. ప్రాచీన భారత రాజ్య విధులను పరిశీలిస్తే ఆ కాలంలో రాజ్యాలు ఇట్టి విధానాన్ని అమలు చేసినట్లు కనబడుతున్నాయి. సమన్యాయ పాలన గురించి కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 4 వ అధికరణంలో 84వ శ్లోకంలో అందరి విషయంలో ఒకే న్యాయం చెల్లుబడి ఉండేదని చెప్పినాడు



శ్లోకవివరణ :- "ధనముతో సంబంధముగల అధికారులను రాజు శిక్షించి శుచులుగ చేయవలెను. శుచులైన వీరు పౌరులను, జానపదులను దండము ద్వారా శుచులుగ చేయవలెను."

(అర్థశాస్త్రం - 4 అధికరణము - 96 అధ్యాయం - 28 శ్లోకం)

పై శ్లోకము ద్వారా ప్రజలలో నేరము చేసిన వారు ఎట్లు శిక్షలకు పాత్రులగుచుండిరో ఉద్యోగులలో నేరము చేసినవారు కూడా అట్లే శిక్షలకు పాత్రులగు చుండిరని తెలియుచున్నది. అందరి విషయంలో ఒకే న్యాయము చెల్లుబడిలో ఉండినదని తెలియుచున్నది. ఇట్టి విధానము ప్రస్తుత కాలంలో సమన్యాయ పాలన అనుపేరిట ప్రచారంలో ఉన్నదని చెప్పవచ్చు.

ఆధునిక సంక్షేమ రాజ్యంలో ప్రజారక్షణతో బాటు వన్యమృగాల సంరక్షణకు కూడ ప్రాధాన్యత ఇవ్వబడుతున్నది. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో 2వ అధికరణంలో 26వ అధ్యాయంలో 43వ ప్రకరణంలో 1వ శ్లోకంలో సునాధ్యక్షుడు నిర్వహించవలసిన విధులను ప్రస్తావిస్తూ వన్యమృగ రక్షణకు ప్రాధాన్యత ఇచ్చెను.

శ్లోక వివరణ :- అభయ ప్రధానము పొందినట్టియు, అభయవనములలో ఉండునట్టియు, జింకలను, పశువులను, పక్షులను, చేపలను బంధించు వారికిని, వధించు వారికిని, హింసించు వారికిని, సునాధ్యక్షుడు ఉత్తమ సాహస దండమును, అభయవనములలో (ఇట్టి నేరములను చేయు) కుటుంబీకులకు మధ్యమ సాహస దండమును విధించవలెను"

(అర్థశాస్త్రం - 2 అధికరణ - 26 అధ్యాయం - 1 శ్లోకం)

శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదా కావ్యంలో రాజనీతి వివరణ సందర్భంలో కూడ రాజ్యం చేపట్టవలసిన సంక్షేమ కార్యక్రమాలను గురించి మనకు లభిస్తుంది. ఆంధ్రవాఙ్మయంలో రాజ్యపాలనను గురించి చెప్పగలిగేవారు ఎక్కువ మంది ఉండవచ్చునేమోగాని చెప్పినవారు మాత్రం మనకు ఇద్దరే కాన వస్తున్నారు. ఒకరు కవి బ్రహ్మ తిక్కన సోమయాజి, రెండవ వాడు శ్రీకృష్ణదేవరాయలు శ్రీకృష్ణదేవరాయలు స్వీయ అనుభవంతో ప్రజాహిత పరిపాలనా విధులను వక్కాణించినాడు. శ్రీకృష్ణదేవరాయలు తన రాజనీతిలో పేద రైతునకు పన్నులోనూ, వార్ధక్యమునందునూ లాభం పొందేటట్లు చేయడం రాజు యొక్క బాధ్యతగా గుర్తించినాడు. ప్రజలను నొప్పించక పన్నులు వసూలు చేయుట రాజు యొక్క ముఖ్య విధియని మహాభారతంలోని శాంతిపర్వంలో కూడ చెప్పబడింది

రాజ్యావతరణ గురించి మన ప్రాచీనులలో ఏకాభిప్రాయము లేదు. అందువలన రాజ్య అవతరణ గురించి అనేక సిద్ధాంతాలు ప్రచారంలోకి వచ్చినాయి. రాజ్యము మానవ నిర్మితమే కాని దైవ నిర్మితం కాదని చెప్పే సిద్ధాంతాన్ని సామాజిక ఒడంబడిక సిద్ధాంతమని పరిగణించారు. దుర్భరమైన పరిస్థితుల నుంచి తమను తాము కాపాడు కోవడానికి ప్రజలు ఒక ఒడంబడిక ద్వారా రాజులను నియమించుకొన్నారనీ ఈ సిద్ధాంతము చెప్పుతుంది. పాశ్చాత్య తత్త్వ వేత్తలలో థామస్ హాబ్స్, జీన్‌జాక్వెస్ రూసో, జాన్ లాక్ మొదలైన తత్త్వవేత్తలు రాజ్యావతరణను గురించి చెప్పేటప్పుడు ఈ ఒడంబడిక సిద్ధాంతం ప్రధానంగా వివరించారు మహాభారతంలోని శాంతి పర్వంలో ఈ ఒడంబడిక సిద్ధాంతాన్ని గురించి చెప్పుతూ ప్రజలు కృతయుగంలో దుర్భరమైన జీవితం నుంచి తమను రక్షించు కోవడానికి, సమర్థుడైన పరిపాలకుని నియమించడానికి బ్రహ్మను ప్రార్థించినట్లున్నూ ఆయన రాగద్వేషాలు ప్రబలిన ప్రజాసముదాయంలో విశృంఖలత్వాన్ని అరికట్టి వారిని నియత మార్గంలో నిలిపి నడుపుటకై మనువును రాజుగా నియమించినట్లున్నూ చెప్పబడింది. ప్రారంభంలో మనువు ప్రజాపరిపాలనా బాధ్యతను నిర్వహించడానికి సుముఖంగా లేనందున ప్రజలు అతనికి తమ పుణ్యంలో, పంటలలో, బంగారంలో వాటా చెల్లిస్తామని ఒడంబడిక చేసుకొన్నారు. దీనితోబాటు ప్రజలు తమ పాపకార్యాలకు తామే బాధ్యత వహిస్తామని హామీతో కూడిన వాగ్దానం చేయటంతో మనువు రాజుగా ఉండడానికి సమ్మతించినాడు "దీఘనికాయంలో" కూడ రాజు లేని రాజ్యంలో ప్రజలకు రక్షణ లేదని అందుచేత ప్రజల సమ్మతితో నియమించబడిన రాజు "మహాజన సమ్మత" అని పిలువబడింది. కౌటిల్యుడు కూడ తన అర్థశాస్త్రంలో రాజ్యావతరణను ప్రస్తావిస్తూ ప్రజలతో చేసుకొన్న ఒడంబడికకు ప్రతిఫలంగా రాజు ప్రజల భద్రతను కాపాడే

సమత

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

సమత వచ్చెననుచు సొగిలబడియేడ్చు
జనుల జాడ చాల జాల గొలుపు
ఆరణాల కూలి అంధ్రను పాలించె !
కంటి నలుసుర పులికంటి మాట !!

కష్టనిష్ఠురముల సుష్టుగా చవిచూచి
గద్దెనెక్కినట్టి ఘనుల చలువ
కూలి వారికెవను కూడెందు కనిపించు!
కంటి నలుసుర పులికంటి మాట!

కష్ట పడెడు వాడె కడ సుఖములందు
తాన కష్టపడుము కలతవలదు
ఇడియుడేలనయ్య ?జన్మ జన్మములుండ!!
కంటి నలుసుర పులికంటి మాట

వచ్చు జన్మ సుఖము వలదను కొన్నారు
వీకు నాకుగాను నిలిపినారు
త్యాగమూర్తులుగద! భోగాలదేలుచు —
కంటి నలుసుర పులికంటి మాట!

దైవ దత్తమైన దైహిక శక్తిని
దోచుకొనుట యెట్లు దోసమగును
దిట్టమెందుకయ్య దేవుని సొత్తుకు ??
కంటి నలుసుర పులికంటి మాట !

సూక్ష్మ మెరుగ కుండ శోకించుటే తప్పు
నిష్ఠురోక్తులాడ నేరమగును
మర్మ మెరిగిగాదె మనకు ప్రభువు లైరి
కంటి నలుసుర పులికంటి మాట !!

తస్మాత్ జాగ్రత్త !

శ్రీ దిలావర్

దుఃఖము జన్మము సారెకు
దుఃఖము జాయయు, జరయును దుఃఖంబకటా !
దుఃఖము సంసారాంబుధి
దుఃఖము సర్వంబు ! మాయ దొగకె మనసా !

తల్లియు దండ్రియు మిథ్యయె
వెల్లువతా సిరులు, యిండ్లు వివరింపంగన్
కల్లయె ! బంధు సహోదరు
లెల్లరు మాయయె ! పరాకు ఏలనె మనసా !

ఆయుః క్షీణము నెఱుగక
మాయను కర్మముల నెన్నొ మఱి మఱి జేయన్
తీయని ఆశాపాశము
కాయము బంధింప నిజము గాంతుర మనసా !

హీనమగు కామ క్రోధము
మేనున మఱి లోభమాది మించిన చోరుల్
జ్ఞానంబను మణి హారము
పూనిక కాజేయ మోస పోకుము మనసా !

సంపద చారు స్వప్నము !
ఇంపొదవగ యౌవనంబు యిల కుసుమంబా
లింప తటిల్లత ఆయువు !
వెంపర లాడంగ నేల వీఱడి మనసా !

[సంస్కృత మూలం ఆధారంగా]

బాధ్యతను స్వీకరించాడని పేర్కొన్నాడు. ప్రజలను రంజింప చేసే రాజునకు, ప్రజలకు మధ్య ఉండవలసిన సంబంధాన్ని గురించి మహాభారతంలో శాంతి పర్వంలో 2వ ఆశ్వాసంలో 274 వ పద్యంలో ఈ విధంగా చెప్పబడింది. (బృహస్పతి వసుమనుండను రాజునకు చేసిన ఉపదేశం)

క. రాజునకు, ప్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మగాన రాజుం బ్రజయున్
రాజోత్తమ యన్యోన్యవి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్
శాంతి పర్వం – 2 ఆశ్వాసం – 274 పద్యం)

పైన వివరించిన ఒడంబడిక సిద్ధాంతము ద్వారా రాజ్య అవతరణతో బాటు రాజ్య స్వభావం కూడ విశదమౌతుంది ప్రాచీన భారతదేశంలో రాజ్యము ముఖ్యంగా లౌకిక వ్యవస్థ అని విశదమౌతుంది మన భారతదేశపు నూతన రాజ్యాంగములో "లౌకిక" అనే పదము 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడటము అందరికీ విదితమే. ప్రాచీన భారత రాజ్యాలు ప్రజా సేవకు ఏర్పడిన సంస్థలుగా గుర్తింపు పొందాయి. అరాచకము నుంచి ప్రజలను కాపాడడానికి ప్రాచీన భారత రాజ్యాలు ముఖ్య సాధనంగా ఉపయోగ పడేవని తెలుస్తోంది బ్రహ్మదేవుడు ఆవిష్కరించిన దండనీతి అనే బృహద్గ్రంథాన్ని విశాలాక్షుడు, బృహస్పతి, శుక్రుడు, మున్నగువారు దానిని సంక్షేపించి వేయి అధ్యాయముల శాస్త్రముగా రూపొందించారని మహాభారత కథనం. దీనిని అనుసరిస్తూ ప్రజలను రాజు తండ్రివలె పరిపాలిస్తూ వుండేవాడు. అటువంటి రాజు మరియు రాజాధికారం పరిమితమైనదే కాని నిరపేక్షము మరియు నిరంకుశమైనది కాదని తెలియవచ్చుచున్నది.

భారతదేశంలో నేడు శ్రేయోరాజ్య స్థాపనకు అవిరామ కృషి జరుగుతూవున్నది. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కొరకు అనేక బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది పాశ్చాత్య దేశాలు కూడ ప్రజోపయోగ కార్యక్రమాలను ఎన్నో చేబడుతున్నాయి. నేటి కాలంలో ప్రజా శ్రేయస్సుకై అమలుచేయబడుతున్న ఈ కార్యక్రమాలకు ప్రాచీన రాజ్యాలలో అమలు చేయబడిన కార్యక్రమాలకు ఎన్నో సారూప్యాలు ఉన్నాయి కాబట్టి సంక్షేమ రాజ్య భావన క్రొత్తగా బహుళ ప్రచారం లోనికి వచ్చినప్పటికీ ఆధునికమైన పద్ధతులతో నేడు అమలు చేయబడుతున్నప్పటికీ ఇందుకు ప్రాచీన భారత గ్రంథాలు మార్గదర్శకాలని చెప్పడంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదు.

"శ్రీగణపతిని... సేవింపరారె...."

వి. పద్మప్రియ

ఈ సకల చరాచర జగత్తుకు అధినాయకుడు, లయకారకుడు, కన్నతండ్రి అయిన పరమేశ్వరుని గారాబు తనయుడు, అమ్మలగన్నయమ్మ, బంగారుతల్లి కాత్యాయనీదేవి కన్నులపంట, సర్వవిఘ్నాధిపతి అయినట్టి విఘ్నేశ్వరుని పండుగ రావుగారు ప్రతిఏడూ అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుతూ వుంటారు. ఆ చల్లనయ్యను తలుచుకోనిదే వారింట ఏ కార్యమూ ప్రారంభం కాదు, సిద్ధించదు!

రావుగారు లక్ష్మీపుత్రుడు, భాగ్యశాలి! అందువల్లనే పార్వతీతనయుని సేవ అంత వైభవంగా, అద్భుతంగా. నేత్రపర్వమొనరించు రీతిన ప్రతిఏటా జరప గలుగుతున్నారాయన.

"కమలాక్షునర్చించు కరములు కరములు – శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ" అన్నట్లుగా "విఘ్నేశు కర్పించు సంపద సంపద" అను భావంతో పుల కించి తరిస్తారాయన.

నిప్పులు కురిపిన వేసవి చల్లబడింది. తొలకరి కమ్మగా చల్లగా జల్లులు చల్లింది. ఎండిన మోడులు ప్రాణం పోసుకున్నాయి. వానలు విజృంభించాయి. ప్రకృతి పరవశించింది. రావుగారి హృదయం కూడా పరవశించింది భాద్రపదం రాకతో!

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వినాయకచతుర్థి పర్వదినం దగ్గర కొచ్చేసింది.



ఈ ఏడు గణపతి కొరకు ప్రత్యేకంగా పసిడి మువ్వల వడ్డాణం, వెండి కిరీటం, నాగాభరణం, బంగారుగజ్జెలు తయారుచేయించారు రావుగారు.

వాటి సోయగం చూడవలసిందేగానీ వర్ణించనలవి కాదు. గులాబిరంగు కాగితాలలో చుట్టి, పట్టు గుడ్డల సంచీలలో అమర్చి, ధగధగలాడేట్టు నగిషీలు చెక్కి, మిల మిలలాడుతున్న ఆ ఆభరణాలను గంధపు పెట్టెలో భద్రపరచి, పదిలంగా అప్పగించిన కంసాలి వీరాచారికి ముప్పిరిగొన్న ఆనందంతో ప్రత్యేక బహుమతి కూడా యిచ్చి పంపారు రావుగారు.

ఎప్పుడెప్పుడు తన చేతులతో ఆ ఆభరణాలు గణపయ్యకు అలంకరిద్దామా ఎప్పుడెప్పుడు ఆ సుందర దృశ్యాన్ని కన్నులారా చూసి పులకించుదామా అని రావుగారి మనోశరీరాలు రెండూ కలవరించి తపించిపోతున్నాయి!

ఆ శుభదినం రెండురోజులున్నదనగా, వారి ఆస్థాన పురోహితుడు నారాయణశాస్త్రి వచ్చి, కాశీనుండి ఎవరో తెచ్చియిచ్చిన గంగాజలం భద్రంగా రావుగారికి అప్పగించి, "బాబుగారూ ఎంతవరకూ వచ్చింది పండుగ సంబరం" అన్నాడు.

"అంతా సిద్ధమే శాస్త్రిగారూ! ఆ రోజున మీరు సవ్యంగా రావటమొక్కటే ఆలస్యం" అన్నారు రావుగారు చిరునవ్వుతో.

"ఎంతమాట బాబుగారూ భోజనమయినా మానతానుగానీ మీ యింట పూజ మానతానా? ఎల్లుండి ఉదయం ఆరుగంటలకల్లా యిక్కడ వాలనూ?" అన్నాడు శాస్త్రి వినయంగా. చేతులు ముకుళిస్తూ.

"అన్నట్లు చెప్పటం మరిచాను. మీ దంపతులకు, పిల్లలకు ఈ సంవత్సరం ప్రత్యేక సన్మానం ఏర్పాటు చేశాను. అంటే మరేమీ లేదు. మీకిరువురికీ పట్టు వస్త్రాలు, పిల్లలకు దుస్తులు కొని వుంచాము. ఆ రోజు పూజ ముగిసిన తర్వాత అవి మీకిచ్చి సంతోషపరచాలని మా అభిమతం" అన్నారు రావుగారు.

ఆ మాటలు వినగానే శాస్త్రిగారి ముఖం పద్మంలా కళకళ లాడిపోయింది. రావుగారి కాళ్ళమీద పడినంత పని చేస్తూ,

"ధర్మమూర్తులు. సాక్షాత్తు ఆ నారాయణ స్వరూపులేగానీ వేరొకటి కాదు. మీ చల్లని చూపువల్లే మా కుటుంబం మొత్తం పచ్చగా బ్రతుకుతున్నాం. రోజూ మిమ్మల్ని తల్చుకొని దీపం పెట్టుకోనిదే మేము భోజనం కూడా చేయమంటే అతిశయోక్తి కాదు బాబుగారూ!" అన్నాడు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిపోతూ.

"ఏమిటి శాస్త్రిగారూ భట్రాజు పొగడ్తలు! పూజ ఏర్పాట్లు యింకేమయినా మిగిలి వుంటే అవి చూడండి ముందు. అందరం కలసి ఆ దేవదేవుణ్ణి స్తోత్రం చెయ్యాలిగానీ, మనల్ని మనం పొగడుకోవడం దేనికండీ" అన్నారు రావుగారు మందలింపుగా.

"అలా అనకండి బాబూ! ఇంత మంచి మనసున్న తమరు భగవంతుడు కాక మరేమిటి? మీరు వద్దన్నా నాకు మిమ్మల్ని వేనోళ్ళ స్తుతించాలనే అనిపిస్తోంది.

సరే బాబుగారూ సెలవిప్పించండి. ఎల్లుండి ఉదయమే వస్తాను.'' అని వంగి నమస్కరిస్తూ నిష్క్రమించాడు శాస్త్రి.

రావుగారు వేయి కళ్ళతో ఎదురు చూసిన ఆ పర్వదినం రానే వచ్చింది.

తెల్లవారుఝామునుండే యింట రికార్డు చేయబడ్డ సన్నాయి సంగీతం మంద్రస్వరంలో శుభప్రదంగా మ్రోగసాగింది. అభ్యంగన స్నానాలాచరించే హడావిడిలో రావుగారి కుటుంబం మునిగి వుండగా, నౌకర్లు గృహాలంకరణ హడావిడిలో మునిగి తేలుతున్నారు. అంతక్రితమే శుభ్రంగా కడిగి, నాముతో అందంగా ఇల్లంతా రంగవల్లులు, ముత్యాలముగ్గులు తీర్చిదిద్దారు.

గణేశుని పూజాస్థలంలో రావుగారి ధర్మపత్ని స్వయంగా రంగు రంగుల పద్మాన్ని చిత్రించారు. అది బహు సుందరంగా శోభిస్తూ ఆ గది మొత్తానికే వింత అందం తెచ్చింది.

స్త్రీ సేవికలు గడపలకు పన్నీరు కలిపిన పసుపు రాసి, కుంకుమబొట్లు అలది గుమ్మాలకు నవనవలాడుతున్న మామిడాకు తోరణాలు గుమ్మటంగా అలంకరించారు.

బజారులో ఆ రోజు అమ్మిన పత్రిలో సగం రావుగారి యింటనే వుంది.

పూజకోసం అంటే ఎంత ఖర్చుకయినా వెనుకాడరాయన. పూజకు అవసరమయిన ప్రతి వస్తువూ అత్యంత శ్రద్ధతో భక్తిభావంతో తెప్పించి భద్రపరిచారు. పూజాసామాగ్రి కొఱకు ప్రత్యేకంగా వారింట ఒక గదినే కేటాయించారు.

ఆ సామాగ్రి ఒక రకము కాదు, అనేక రకములు.

అటుకులు, కొబ్బరి-పలుకులు, చిటిబెల్లము, నానుబ్రాలు, చెరుకు రసము, టెంకాయలు, పొన్నంటిపండ్లు, నేరేడు, మారేడు నెలవంక మామిళ్లు, పానకము, వడపప్పు, పనసపళ్లు, దానిమ్మ ఖర్జూర ద్రాక్షపండ్లు, తేనెలో మాగిన తీయ మామిడిపండ్లు వీటితోపాటు ఉండ్రాళ్ళు, కుడుములు, కమ్మనినెయ్యి, ముద్దపప్పు బూరెలు గారెలు, నవకాయ పిండివంటలు, నవరస భక్ష్యాలు, పాయసము, జున్ను, మారేడు మాదీఫలంబులు, బత్తాయిపండ్లు, వెలగపండ్లు, ఓహో, ఒకటేమిటి? సర్వమూను! ఇవిగాక, వివిధ రకములయిన పూజాపత్రి!

శ్రీగంథము, కుంకుమాక్షతలు, తామర చంపకములు, మల్లెలు, మొల్లలు, మంచిచేమంతులు, తెల్లగన్నేరులు, మంకెనలు, పొన్నలు, కలువలు. మారేడు గన్నేరు, జిల్లేడు, దేవకాంచన, రేగు, దేవదారు, జాజి, బలురక్కసి, జమ్మి దాసాని పువ్వు, గరికె మాచీపత్రి, మంచిమొలక, అగరు గంధాక్షతలు, దూప దీపాలు, తాంబూల పుష్పోపహారములు...

ఓహో! ఎంత వైభవమానాడు విఘ్ననాధునిది. సిరిదేవి పసిడిమువ్వల పట్టాలు ధరించి ఘల్లుఘల్లున రావుగారి గృహప్రాంగణమున నడయాడుచున్నదా అన్నంత శోభస్కరమై వున్నదానాడు వారి గృహం!

విఘ్నేశ్వర మందిరాలంకరణ కొఱకై ప్రత్యేకంగా ఒక మనిషిని పిలిపించారు.

అతడు అత్యంత శ్రద్ధపూని, రకరకములైన చిత్రవిచిత్రములైన ముత్యాల సరాలతో, పుష్పహారములతో, రంగులద్దిన పాలవెల్లితో, జిలుగు వస్త్రములతో పట్టుతెరలతో పన్నీరు జల్లిన పుష్పగుచ్ఛములతో, కర్పూర దండలతో, కాసుల పేరులతో, విద్యుద్దీపాలతో గణేశ పూజామందిరం అద్భుతంగా అలంకరించాడు. బత్తాయి, వెలగపండ్లు కూడా ఆ అలకరణలో పాలుపంచుకుని తమ జన్మ ధన్యమైనదనుకున్నవి.

ఆ ఉత్తమాలంకరణ తిలకించిన రావుగారి నేత్రాలు మంచుతో తడిసిన ఉదయ పద్మాలవలె ప్రకాశించాయి

రావుగారి సతీమణి కాంచనాదేవి నిలువెత్తు గంధపు పెట్టెలో హాయిగా నిద్రిస్తున్న నాలుగడుగుల గణపయ్యను నిద్రలేపి, పవిత్ర గంగాజలాలతో మంగళస్నాన మాచరింపించి, చీనిచీనాంబరములు కట్టబెట్టి, పూజావేదికపై ఆసీనుణ్ణి చేసి, అక్కడితో తమ బాధ్యత తీరిందన్నట్లుగా పాకశాలలోకి నిష్క్రమించారు.

రావుగారి ఏకైక కుమార్తె పదునైదేండ్ల ఈడుగల పద్మిని పసుపు కుంకుమ పిండి ముగ్గులు, వెండి సామగ్రితో వేదికను తీర్చిదిద్ది, పూజాసామగ్రి అన్నగారి సాయంతో అమర్చిపెట్టింది.

వెండి బొట్టుపెట్టె తెప్పించి, తెరచి, భద్రంగా దాచిన ముద్దులొలికే పసిడి మువ్వల వడ్డాణం, నాగాభరణం, గజ్జెలు, కిరీటం బయటకు తీసి, చేతులార, ప్రీతి దీర పార్వతీ తనయునికి అలంకరించి తృప్తిగా చూసుకున్నారు రావుగారు.

తన ముద్దు ముచ్చటగా జరిపించుకుంటున్న స్వామి వేయిరెట్లు కాంతితో ప్రకాశించాడు.

స్వామి వదనంపై చిఱునగవు ఎంత సుందరంగా వున్నదో! అంత మధుర దరహాసం, ఆ చల్లనిచూపు ఎలా వచ్చాయి తండ్రీ నీకు!

రావుగారు భక్తిపారవశ్యంతో పులకిస్తూ, కనులు తుడుచుకున్నారు. సమయం ఏడుగంటలు కావస్తోంది.

"ఈ నారాయణశాస్త్రి ఏమయినట్లు? పూజాసమయం సమీపిస్తుంటే ఒక ప్రక్క!'' అని విసుక్కున్నారు మనసులోనే. అదే సమయానికి నారాయణశాస్త్రి కుమారుడు పన్నెండేళ్ళవాడు రొప్పుతూ, వగర్చుతూ పరిగెత్తుకొచ్చి,

''నమస్కారం బాబుగారూ! నాన్నకి హఠాత్తుగా జబ్బు చేసింది. ఒళ్ళంతా చెమటలు పట్టి. తల తిప్పి, గుండెదడతో కింద పడిపోయారు. డాక్టరుగారు చూసి యింజక్షను యిచ్చారు. కళ్ళు మూసుకుని అలాగే పడుకొని వున్నారు. ఈ విషయం మీకు తెలియపరచి, ఏమీ అనుకోవద్దని మరీ మరీ చెప్పమన్నారు'' అన్నాడు.

రావుగారు హతాశులయి.

"ఓరి నీ యిల్లు బంగారంగాను! అంతా సిద్ధం చేసుకోగానే యిలా అయిందేమిటి? ఇప్పుడు ఉన్నట్టుండి వేరే పురోహితుడు ఎక్కడ దొరుకుతాడు?'' అన్నారు కోపంగా చూస్తూ.

ఆ కుర్రవాడు వినయంగా,

"చిత్తం బాబుగారూ! మీకు యిబ్బందేమీ లేదు. పురోహితుణ్ణి వెంటపెట్టుకొనే వచ్చాను. ఆయన పేరు రామశాస్త్రిగారు. మా యింటి ప్రక్కనే వుంటారు.'' అన్నాడు. రావుగారి గుండె కుదుటబడింది.

"ఏరీ ఆయన?'' అంటూ వరండాలోకి వచ్చి చూశారు. అక్కడ చేతిలో చిల్లులుపడ్డ సంచితో, మాసిన పంచెతో, శుష్కించిన దేహంతో ఒదిగి ఒదిగి వినయంగా, దైన్యంగా నిలబడ్డ అరవయ్యేళ్లు దాటిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు రావుగారిని చూడగానే వినమ్రంగా చేతులు జోడించి.

"తమరి గురించి నారాయణశాస్త్రి చెప్పని రోజుండదు బాబుగారూ! తమ యింట యిలా అనుకోకుండా పూజ చేయించే అదృష్టం దక్కినందుకు నాకెంతో ఆనందంగా వుంది'' అన్నాడు.

రామశాస్త్రి అవతారం యిబ్బంది కలిగించినా తప్పనిసరిగా దాన్నణుచుకుని.

"రండి లోపలికి. స్నానంచేసి పూజ ప్రారంభించండి'' అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయారు రావుగారు.

"పూజ బాగా చేయించండి శాస్త్రిగారూ! ఏమాత్రం లోపం వచ్చినా బాబుగారు సహించలేరు సుమా!'' అంటూ నారాయణశాస్త్రి కొడుకు ఒక సలహా లాంటి హెచ్చరిక చేసి వెళ్ళిపోయాడు.

రామశాస్త్రి బావివద్ద చన్నీళ్ళ స్నానంచేసి, తడిబట్ట కట్టుకొని, సూర్య భగవానుడికి ఒక నమస్కారం ఆచరించి లోనికి వచ్చాడు. విఘ్నేశుడి పూజా



మందిరం చూసి పులకించిపోతూ. అప్రయత్నంగా రెండుచేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు.

"ధన్యులు బాబుగారూ తమరు! భగవంతుడిచ్చిన సిరిసంపదలు ఆ భగవంతుని సేవకై యింత వైభవంగా వెచ్చించటం...ఆహా! ఎంత కన్నుల పండుగగా ఉంది!" అన్నాడు భక్తి నిండిన కంఠంతో.

రావుగారు తెల్ల పట్టుపంచె, తెల్ల లాల్చీ ధరించి, వచ్చి పీటపై కూర్చున్నారు. పిల్లలిద్దరు కూడా తమ పుస్తకాలు తెచ్చుకొని, వాటిపై పసుపు శ్రీకారం చుట్టి గణపయ్యవద్ద వుంచి, తాము వేసుకొన్న ధరగల దుస్తులు నలుగకుండే విధంగా తెల్లటి బట్టలు పీటలపై వేసుకొని, వాటిపై బుద్ధిగా కూర్చుని పూజ ప్రారంభం కోసం ఎదురు చూడసాగారు.

కాంచనాదేవి ఒకసారి ఆ గదిలోకి తొంగిచూసి, తృప్తిగా పూజాలంకరణ పరికించి, తిరిగి లోనికి వెళ్ళిపోయారు.

రామశాస్త్రి తాను కూడా పీటపై కూర్చోబోయి, ఆగి, "ఇప్పుడే వస్తాను బాబూ" అంటూ పెరట్లోకి వెళ్ళి. ఖళ్ళు ఖళ్ళుమని రెండు నిముషాలు దగ్గి, నోరు శుభ్రం చేసుకొని వచ్చాడు. అసహనంగా చూస్తున్న రావుగార్ని చూసి సంజాయిషీ యిస్తున్నట్టూ,

"ఆరునెల్ల నుండీ పట్టుకొంది బాబుగారూ పాడుదగ్గు. వచ్చిందంటే ఒక పట్టాన వదలదు, రెండురోజులనుండీ వేడిచేసి గొంతును మరీ బాధపెడుతోంది" అని, కూర్చుని,

"కృష్ణకృష్ణా" అనుకుంటూ కుంకుమ తీసి కనుబొమలు మధ్యపెట్టుకొని, పసుపు విఘ్నేశ్వరుణ్ణి చేసి, కొబ్బరిపాలతో అభిషేకం చేస్తూ పూజ ప్రారంభించాడు.

పుస్తకం తెరిచి చదువుతూ, తను చదివే పవిత్ర శ్లోకాలకు అనుగుణంగా రావుగారిచేత, పిల్లలచేతా పూజ చేయించసాగాడు. ఆ వయసులో కూడా ఆయన కంఠం సుమధురంగా, గంభీరంగా ధ్వనించటం ఒక విశేషం.

"శుక్లాంబరధరం విష్ణుం! శశివర్ణం చతుర్భుజమ్, ప్రసన్నవదనం ధ్యాయే...సర్వవిఘ్నోప..." పూర్తి చేయకుండానే దగ్గు తెర వేగంగా ఆయన గళాన్ని చుట్టుముట్టింది.

రెండు నిముషాలకు తెప్పరిల్లి—మళ్ళీ చదవసాగాడు.

"సుముఖశ్చైక దంతశ్చ, కపిలో గజకర్ణక, లంబోదరశ్చ.

వికటో, విఘ్నరాజో గణాధిపః"...ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు...

మళ్ళీ చదవటానికి ప్రయత్నిస్తున్నాడు అతి కష్టంమీద దగ్గును, ఆయాసాన్ని అణచుకుంటూ!

"ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః వక్రతుండ శ్పూ...శ్పూ...ర్ప కర్ణో..." ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు...మళ్ళీ ఊపిరాడకుండా దగ్గు! ఆయన నాలుక బైటకు వచ్చేసింది. గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. పుస్తకం పెట్టి, గుండెలు నిమురుకుంటూ, ముందుకు వంగి పేగులు తెగిపోయేలా దగ్గసాగాడు. నిశ్చేష్టులయి చూస్తున్న రావుగారికి, పిల్లలకు ఆ దృశ్యం బీభత్సంగా కనిపించింది. రావుగారి కనులు, వదనం అసహనంతో, భరింపరాని విసుగుతో కుంచించుకుపోయాయి. మధురగాన ప్రవాహంలో అపశృతిపలె, పవిత్రంగా కొనసాగవలసిన తమ ఆరాధ్యదైవం పూజాకార్యక్రమంలో దారిద్ర్యదేవత మూర్తీభవించనట్టున్న ఆ బ్రాహ్మణుడి కర్ణకఠోరమైన గళకింకారం మహాపచారంపలె, భయంకర తప్పిదంపలె కనపడిందాయనకు. అత్యంత వైభవంగా జరిపించాలని కలలు కన్న ఈ పర్వదినం, పూజావిశేషం ఒక రోగిష్టి ముసలి అసమర్థ బ్రాహ్మణుని వల్ల నిర్జీవమై, నిర్వీర్యమైపోతున్నందుకు రావుగారి హృదయం భగ భగ మండిపోయింది. కళ్ళు మంకెనలయ్యాయి! వెన్నలాంటి స్వరం కరకుతనాన్ని అపాదించుకుంది. వేలితో గుమ్మంవైపు చూపిస్తూ.

"వెళ్ళండి వెళ్ళి బయట కూర్చోండి" అన్నారు మేఘం గర్జించినట్లు. రామశాస్త్రి నీళ్ళు కారుతున్న కళ్ళు తుడుచుకుంటూ, "ఫర్వాలేదు బాబుగారూ!" అని ఏదో చెప్పబోయాడు.

"ఏమిటి ఫర్వాలేదు? వైభవంగా జరగవలసిన పూజంతా భగ్నమయిపోయింది. ఆయాసంతో, దగ్గుతో అవసానదశలో వున్నట్టుగా వున్న మీరు ఏం నిర్వాకం చేద్దామని యిక్కడకు వచ్చినట్లు? అయినా మిమ్మల్నని ఏం ప్రయోజనం? మీలాంటివాణ్ని పంపి పూజ నాశనం చేసిన ఆ నారాయణశాస్త్రి ననాలి ఇంకా చూస్తూ నిలబడ్డారేం? వెళ్ళండి!" తీక్షణంగా చూస్తూ అరిచినట్టే అన్నారు రావుగారు.

రామశాస్త్రి ముఖం పాలిపోయింది. గాయపడ్డ హృదయంతో, వెర్రిగా రావుగారివైపు చూసి, తడబడుతున్న అడుగులతో బయటకు వెళ్ళిపోయాడు.

రావుగారి ఆవేశం తగ్గటానికి పావుగంట పట్టింది. కానీ ఏదో చెప్పరాని బాధ. వెలితి స్మాతం ఆయన మనసుని దట్టంగా కమ్ముకున్నాయి. యాంత్రికంగా పుస్తకం అందుకొని, అలవాటులేక తడబడుతున్న ఉచ్చారణతో కొన్ని మంత్రాలు కథ చదివి ఎలాగో పూజ సమాప్తం చేశారు. పిల్లలు అక్షింతలు వేసుకొన్నారు. కాంచనాదేవి వచ్చి మంగళహారతి యిచ్చి, విఘ్నేశునికి భక్ష్యాలు నైవేద్యం సమర్పించి, అందర్నీ భోజనాలకు రమ్మని పిలిచి, వెళ్ళారు.

రావుగారు వరండాలోకి వచ్చారు రామశాస్త్రిని పిలవటం కోసం! అక్కడ స్థంభానికి ఆనుకొని శూన్యంలోకి చూస్తూ నిలబడి వున్నాడు రామశాస్త్రి. రావుగార్ని చూడగానే నమస్కరించి, "ఇక వెళ్తాను బాబుగారూ సెలవిప్పించండి" అన్నాడు తల వంచుకొని. "అదేమిటి? భోజనం చేసి వెళ్ళండి" అన్నారు రావుగారు గాభరాగా.

"వద్దు బాబూ! నేను చేసిన ఘనకార్యానికి అది కూడా ఎందుకు? అత్యంత శోభస్కరంగా జరుగవలసిన మీ పూజని నా పాపిష్టి దగ్గుతో నాశనం చేసినందుకే ఎంతో కుమిలిపోతున్నాను...ఇంకా నన్ను భోజనానికి పిలిచి మరింత బాధపెట్టకండి. నేను చేసిన అపరాధానికి నన్ను క్షమించండి బాబుగారూ! పెద్ద వయసు మీదపడ్డా, బాధ్యతలు యింకా వదలకపోవటంతో అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, దురాశతో యిలా వచ్చాను. బాబూ! మీరిచ్చే డబ్బుతో నాలుగు రోజులు మనవళ్ళకి, మనమరాళ్ళకి తిండిపెట్టవచ్చన్న పేరాశతో మీ పవిత్రమైన పూజని నాశనం చేసిన నీచుణ్ణయ్యాను. మన్నించండి బాబూ" అన్నాడు రామశాస్త్రి గాజుగోళాల్లాంటి కళ్ళు చిరిగిన కండువాతో అద్దుకొంటూ.

మూర్తీభవించిన దైన్యంలా, అతి కరుణామయంగా, బక్కచిక్కిన దేహంతో తనముందు నుంచుని ఆర్ద్రనయనాలతో చూస్తున్న ఆ వృద్ధుడి రూపం రావుగారి మనసుని కలచివేసింది.

అంతవరకు ఆయనని ఆవరించిన విసుగు, అశాంతి మంచులా కరిగిపోయి. హృదయం ద్రవించింది. పశ్చాత్తాపంతో మనస్సు కలుక్కుమంది. వెంటనే రామ శాస్త్రి చేతులు పట్టుకొని చలిస్తున్న స్వరంతో,

"అంత మాట అనకండి! నిజానికి మీరే నన్ను క్షమించాలి విసుగులో ఏవేవో అన్నాను. అవేమీ మనసులో పెట్టుకోకండి. పూజదేముంది? ప్రతిఏడూ వస్తూనే వుంటుంది. ముందు ఆరోగ్యం ప్రధానం. ఇంత దగ్గుతో నీరసంతో బాధ పడుతూ కూడా డాక్టరు దగ్గరకు వెళ్ళినట్టుగా లేదే మీరు?" అన్నారు బాధగా చూస్తూ.

నిర్లిప్తంగా నవ్వాడు రామశాస్త్రి.

"ఎలా వెళ్ళమంటారు బాబుగారూ! తిండికే గతిలేదు. ఏ పూటకాపూట ఎలా గడుస్తుందా అన్న బెంగతో కృంగే మాలాటివారికి వైద్యానికి వెళ్ళేంత స్తోమతు ఎక్కణ్ణించి వస్తుంది? నా కూతురు భర్తను పోగొట్టుకొని, రోగిష్టిదయి పోయి నలుగురు పిల్లలతో నా దగ్గరే ఉంటోంది. దాని సంసారాన్ని పోషించ డానికి నేను పడుతున్న పాట్లు అన్నీ యిన్నీ కావు. ముసలితనం! జవసత్త్వాలు ఉడిగిపోయాయి. అయినా బ్రతుకు భారాన్ని దించుకోలేక, నాలుగిళ్ళు తిరిగి యాయవారం చేస్తున్నాను. కానీ రోజంతా తిరిగినా నాలుగు గింజలు రాలటం కష్టంగా ఉంది. మనుష్యుల్లో దయ నశించిపోయింది బాబుగారూ! ఇప్పుడు చెప్పండి ఇలాంటి స్థితిలో ఉన్న నాకు వైద్యమేమిటి? నాలాంటివాడికి మరణ మొక్కటే మందు బాబుగారూ!" రామశాస్త్రి కండువాలో ముఖం దాచుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. తన తండ్రి వయసున్న ఆయన అంత దీనంగా రోదిస్తుంటే అసలే వెన్నలాంటి రావుగారి మనసు ఝంఝామారుతం తాకిన మల్లె తీగలా అల్లల్లాడిపోయింది. ఆయన కనులు నీటితో నిండిపోయాయి. బరువెక్కిన గుండెను సవరించుకొంటూ రామశాస్త్రి భుజం మీద చెయ్యివేసి తడుతూ,

"ఊరుకోండి శాస్త్రిగారూ వూరుకోండి! బాధపడకండి కష్టాలు కలకాలం ఉండవు. దేవుడు కరుణామయుడు. అందువల్లనే మీరీరోజు మా యింటికి రావటం తటస్థించిందేయో! ఇక మీరు నిశ్చింతగా ఉండండి. మీ బాధ్యతంతా నాది. అనారోగ్యానికి, దారిద్ర్యానికీ దేనికీ మీరిక జడవవలసిన పనిలేదు. నన్ను మీ కుమారుడుగా భావించి మీ భారం నాకు వదిలేయండి. ఈనాటినుండి మీరే మా యింటి పురోహితుడు. మీకే లోటూ రాదు. దేవుడి సేవకోసం వేలకువేలు ఖర్చు పెట్టే నేను దీనులకోసం ఏమీ చెయ్యలేని రిక్తహస్తుణ్ణి కాను. కాకూడదు కూడాను. రండి! లోపలికి రండి! కడుపునిండా భోంచేసి, అమ్మాయికీ పిల్లలకూ కూడా తీసుకెళ్ళండి! రండి!" అని ఆప్యాయంగా ఆహ్వానించారు రావుగారు.

రామశాస్త్రి దైవసాక్షాత్కారం లభించినవాడిలా పులకించిపోతూ, మితి మీరిన కృతజ్ఞతా భారంతో చప్పున వంగి రావుగారి పాదాలు తాకబోయాడు.

"అయ్యో! అదేంపని పెద్దవారు! లేవండి" అని వారించి, వణుకుతున్న ఆయన చేయి పట్టుకుని భోజనం దగ్గఱకు తీసుకొచ్చారు రావుగారు.

రామశాస్త్రి ముందున్న విస్తట్లో విఘ్నేశ్వరుని కొఱకు చేసిన సమస్త భక్ష్యాలూ వున్నాయి. తడితడిగా వున్న కళ్ళు తుడుచుకుంటూ, కంపిస్తున్న చేతితో ముద్దలు కలుపుకొని తృప్తిగా తినసాగాడు రామశాస్త్రి.


రావుగారికి ఆ దృశ్యం హృద్యంగమంగా వున్నది. ఏ పూజా యివ్వలేని తృప్తి, ఏ వైభవమూ యివ్వలేని ఆనందం ఆనాడు ఆ సన్నివేశం రావుగారి మనసుని మధురానందంతో నింపుతోంది

ఆయన కనులకి రామశాస్త్రి రామశాస్త్రిలా కాక, తన పూజను మెచ్చి, తన యింటికి వచ్చి, పీటపై కూర్చుని, అలవోకగా చూస్తూ చిరునవ్వుతో భక్ష్యాలు, కుడుములు భుజిస్తున్న తన ఆరాధ్యదైవం, బంగారుతండ్రి బొజ్జగణపయ్యవలె కన్పట్టి ఆయన తనువు, మనసు ఏకకాలంలో పులకాంకితమయినాయి!!

విరహిణి రాధ

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

అర విరిసి కొన్న మధుసుధాధరము లందు
అల నగతి చిందు లాడెడు కలికి నగవు-
తలిరు బుగ్గలు, చూర్ణకుంతలపు గుములు-
అళిక కమ్మని కస్తూరి తిలక శోభ-
కజ్జలపు నీలిముల ఓరగంటి చూపు-
సిగపై పింఛము, కేల గ్రోవి, చెవి సుస్నిగ్ధార్ద్ర కల్హారముల్
మగతళుక్కల్ వెలుగొందు కౌస్తుభమణి భ్రాజిష్ణు వక్షస్థలిన్
ధగధగ్ధగచులున్, పదద్వయిని శింజాయుక్త మంజీరముల్
జగతీమోహన సుందరాంగుడ తన్మాత్రాణమీ ధాత్రిలో-
అతడే నేను నేనే అతడుగా ఇన్నాళ్లు
తిరిగినాము బృంద దినము రాత్రి
ఇప్పుడాతడెటకో ఏగినాడట నన్ను
విరహ బాడబాగ్ని మరుగద్రోసి !
యమునా కూల విశాల సైకతములం దాగోపుడున్ నేను
నున్
కమనీయామల పూర్ణచంద్ర రజనీ క్రమానిలా భంగ భం
గములన్ తీర్చిన రాసకేళి గడియలో నా గుండె లోలో
తులం
దు మహోగ్రాహోల గుంపులట్లు నటియించున్ భీదమై
క్రూరమై !
మరువజాలను వాని మధురాంగుళుల స్పర్శ-
తలపైన పులకలే నిలువుటోడల ! -
చెరిగిపోది ఎదతెర వాడు కౌగిట
బిగియించి బుగ్గల పెట్టు ముద్దు ,
కరిగి పోదతడు నా తరుణాధరముల తే
నియల తీయని సోన నింపు స్మృతులు !
తనువు లేకమ్మైన ఘనముహూర్తానంద
భరమెన్ని నాళ్లైన మరుపురాదు !
శాలు నిలువ బోదేదియు కాదుచేత-
తోడు విడివడి కాంతికి దూరమగుచు
అడవిలో గజిబిజి తీగలందు దారి
తెన్ను తెలియని అతి పరిదీన నేను ।



శ్రీ రామమోహనరాయ్

ప్రజాదరం పొందిన పౌరాణిక నాటకాలు

తెలుగు రంగస్థలంపైన గత శతాబ్దికాలంలో పౌరాణిక నాటకాలు ప్రజాదరం పొందినంతగా ఇతర నాటకాలు పొందలేదు. చారిత్రక, సాంఘిక నాటకాలెన్ని వచ్చినా కాలాని కెదురీది నిలబడినవి పౌరాణిక నాటకాలే. విరివిగా వచ్చిన సాంఘిక నాటకాలు కానీ సినిమాలుగానీ పౌరాణిక నాటకాలపట్ల ప్రజల ఆదరాన్ని ఏమాత్రం తగ్గించలేదు. నటుల ప్రఖ్యాతినిబట్టి ప్రేక్షకులు వేలాదిగా వచ్చి యీ నాటకాలను ఆదరిస్తున్నారు. ఒకే పట్టణంలో లేక గ్రామంలో ఒక సాంఘిక నాటకం ఒక నెలలో పలు తడవలు ప్రదర్శింపబడటం మిక్కిలి అరుదు! కానీ కొన్ని పౌరాణిక నాటకాలు కొద్దిరోజుల కాలవ్యవధిలో అదే పట్టణంలో, గ్రామంలో ప్రదర్శించినప్పటికీ ప్రేక్షకులు విరగబడి చూస్తూనే ఉన్నారు.

పౌరాణిక నాటకాలు వందలకొద్దీ వచ్చాయి. కాని వాటిలో ఒక యాభై ఏళ్ళపాటు రంగస్థలంపైన విజయవంతమైన నాటకాలు ఎన్నో లేవు. వీటిలో ముఖ్యమైన వాటిని ఒక పదింటిని లెక్కపెట్టి చెప్పవచ్చు. అవి 1. అభిజ్ఞాన శాకుంతలము (వీరేశలింగంగారి అనువాదం) 2. వేణీసంహారం (వసురాయకవిగారి అనువాదం) 3. చిత్రనళీయము (ధర్మవరం రామకృష్ణమాచార్యులవారి రచన) 4. గయోపాఖ్యానము (చిలకమర్తివారి రచన) 5. పాదుక (పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి రచన) 6. పాండవోద్యోగ విజయములు (తిరుపతి వేంకట కవుల రచన) 7. సత్యహరిశ్చంద్రీయము (బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచన) 8. శ్రీకృష్ణ తులాభారము (ముత్తరాజు సుబ్బారావుగారి రచన) 9. సావిత్రి (శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారి రచన) 10. తారాశశాంకము (కొప్పరపు సుబ్బారావుగారి రచన) ఇవి ఎక్కువ ప్రజాదరాన్ని పొందటంలో రహస్యమేమిటి? రచనా కౌశలమా? నటీనటుల ప్రజ్ఞా? పద్యాలు పాడటంవల్ల కలిగే ఆహ్లాదమా, లేక ప్రేక్షకులలో బాగా నాటుకొనిపోయిన పురాణ కథలూ, కల్పనలూనా? అంటే 'అన్నీ' అని జవాబు చెప్పవలసి వుంటుంది భారతీయ భాషలలో మరి ఏ ఇతర భాషకూ లేనటువంటి సొగసు తెలుగు నాటకానికి వొకటుంది. అది 'తెలుగు పద్యం' దాన్ని రంగస్థలంపై అభినయిస్తూ పాడే తీరు రాగతాళాలతో ప్రేక్షకుల్ని సమ్మోహన పరచే మహత్తర శక్తి యీ తెలుగు పద్యానికున్నది.

చాలీచాలని రంగస్థలం, ఏవో నాలుగు ఎగుడు దిగుడు బల్లల్ని తీసుకువచ్చి అప్పటికప్పుడు చదునుచేసి అమర్చిన రంగస్థలం, ఆకుకు అందకుండ పోకకు పొందకుండ తెరలూ, గుడ్డివెలుగులో కాంతి కంటే వేడి ఎక్కువ ఇచ్చే పెట్రోమాక్స్ లైట్లూ; అవి మధ్య మధ్యలో మండటమూ; నటీనటుల శరీరాలకు శోభ చేకూర్చని దుస్తులూ, కిరీటాలూ గదలూ వగైరా ఆహార్యమో; ముఖాలకు ఒక వింత కాంతితో నింపే మేకప్ సామాగ్రి, నటీనటులకు ఏమాత్రమూ సరిపడని విగ్గులూ, ప్రేక్షకులకు మాట వినిపిస్తే మూర్తి కనిపించని, మూర్తి కనిపిస్తే మాట వినిపించని రంగస్థలమూ: ద్వారపాలకులు వింజామరలు వీచేవారైనా లేని చక్రవర్తుల సభామంటపాలూ యిలా ఎన్నో అసౌకర్యాలు. ఇన్ని ఇబ్బందుల వల్ల పౌరాణిక నాటకాలు అభాసు కావలసిందిపోయి అమోఘమైన ఆదరాన్ని పొందుతున్నాయి. ప్రేక్షకుల విశాల దృక్పథమే ఇందుకు కారణం.

నాటకంలో ఇతివృత్తాన్ని ప్రసిద్ధమనీ, కల్పితమనీ; మిశ్రమనీ మన ప్రాచీనులు మూడు విధాలుగా విభజించారు. వాటిలో పౌరాణిక నాటకాలు చాల వరకు రామాయణ, భారత, భాగవతాలనుండీ ఇంకా ఇతర పురాణాలనుండీ స్వీకరించినవే కాబట్టి పౌరాణిక నాటకాలను ప్రసిద్ధమైన ఇతివృత్తం కలవిగానే భావించవచ్చు. కొన్ని నాటకాలలో కల్పిత పాత్రలూ, సన్నివేశాలూ, కల్పనలూ వున్నాయి. మిశ్రేతి వృత్తంగల యీ నాటకాలుకూడ ప్రేక్షకుల మెప్పు పొందాయి. కథ ప్రజాసామాన్యానికి మిక్కిలి పరిచితమైనది కావటం, అందులో వారి హృదయాలను రసప్లావితం చేసే ఘట్టాలుండటం; జీవిత వాస్తవాలలో లభించని ఆదర్శాలపై ప్రేక్షకులు మక్కువ పడటం యీ ఆదరానికి ముఖ్య కారణాలుగా భావించవచ్చు.

పౌరాణిక నాటకం ; ప్రదర్శన :

మహారాష్ట్రలోని ధార్వాడ ప్రాంతంనుండి "అలటీకర్‌హిందూ డ్రమటిక్ కంపెనీ అనే నాటక సమాజంవారు 1880 ప్రాంతాలలో తెలుగు జిల్లాలలో సంచరించి హిందూస్థానీ నాటకాలు ప్రదర్శించారు. వీరి నాటకాలు కల్గించిన ఉత్సాహంతో ప్రేరణతో శ్రీ వీరేశలింగం పంతులు షేక్స్‌పియర్ "కామెడీ ఆఫ్ ఎర్రర్స్" నాటకాన్ని 'చమత్కార రత్నావళి' పేరిట తెలుగుచేసి, తన విద్యార్థులకు శిక్షణ యిచ్చి ధార్వాడ సమాజంవారి తాటాకుల పాకలోనే తమ నాటకాన్ని గూడ ప్రదర్శించారు. ఈ విధంగా ప్రారంభమైన తెలుగు నాటక ప్రదర్శన అచిరకాలంలోనే పౌరాణిక నాటకాల ప్రదర్శనతో నాటకోద్యమం ప్రారంభమైంది. వీరేశలింగం పంతులుగారు నాలుగు పౌరాణిక నాటకాలు రచించారు. "అభిజ్ఞాన శాకుంతలము; ప్రహ్లాద (1885) దక్షిణ గోగ్రహణము (1885) సత్య హరిశ్చంద్ర (1886)" వీటిలో శాకుంతలం మిక్కిలి ప్రసిద్ధి పొందింది. వీరేశలింగంగారి కంటె కొంచెం ముందుగానో, దరిదాపు అదే కాలంలోనో పరవస్తు వేంకట రంగాచార్యులు 'శాకుంతలం' ఆంధ్రీకరించారు. ఆ తర్వాత యీ నాటకానికి దరిదాపు నూటయాభై అనువాదాలు వచ్చాయి. అయితే వాటిలో నాటికీ, నేటికీ వీరేశలింగంగారి అనువాదమే ప్రసిద్ధి పొందింది.

"వాసన చూడనట్టి ప్రసవంబు నఖంబుల ద్రుంపనట్టి నూ
త్నాసమ పల్లవంబు, బదులాసని క్రొవ్విరి తేనె, సూచి వి
న్యాసములేని రత్నము మహాతత పుణ్యఫలంబుఁబోలు నా
భాసురగాత్రి సోయగమ్మెవండు భుజింప విరించి వ్రాసెనో"

పండితపామరులిరువురినీ ఆకట్టుకొన్నాయి. శ్రీ యడవల్లి సూర్యనారాయణ దుష్యంత పాత్ర ధరించి యీ పద్యం చదివేటప్పుడు ముందుగా కాళిదాస శ్లోకం "అనాఘ్రాతం పుష్పం..." చదివి ఆ తర్వాత వాసన చూడనట్టి ప్రసవంబు" కమనీయంగా ఆలపించేవారట! ఈ విధంగా రెండూ చదవటం ఔచిత్య భంగమే. అయితేనేం యడవల్లివారి గాత్రమాధుర్యానికీ, హావభావ విలాస వైఖరులకు ప్రేక్షకులు ముగ్ధులయ్యేవాళ్ళు. ఆమాటకొస్తే నాటకం మధ్యలో 'వన్స్‌మోర్' కంటె అనౌచిత్యమేమున్నది? మన ప్రేక్షకులకు తగినవాళ్ళే మన నటులుకూడ! ప్రేక్షకుల కోరికను మన్నించి పద్యాన్ని మళ్లీ పాడినట్లే యడవల్లివారుకూడ సంస్కృతం తెలుగూ రెండూ చదివేవారట! నెల్లూరు ప్రాంతాల్లో వేదము వేంకటరాయ శాస్త్రిగారి శాకుంతలానువాదం ఎక్కువ ప్రచారంలో వుండేది. శ్రీ కందాడై శ్రీనివాసన్ (దొరస్వామి అయ్యంగార్) వేదంవారి పద్యాలను కమ్మగా పాడి నాటకాన్ని రక్తి కట్టించేవారు. ఆంధ్రదేశమంతటా రంగస్థలంపైన విశేష ప్రచారాన్ని పొందింది మాత్రం వీరేశలింగంగారి అనువాదమే.

వేణీసంహారం

సంస్కృతంలో రసవంతమైన నాటకంగా ప్రసిద్ధికెక్కిన భట్ట నారాయణుని వేణీ సంహారము వడ్డాది సుబ్బారాయ కవిగారి అనువాదంలో చేవదేరింది. వసురాయకవి స్వయంగా నటులుకూడ. వేణీసంహారంలో భీముడు పలికే ప్రతి పద్యమూ ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్రవేసింది. ప్రస్తావనలోనే విన్పించే

"ఖలులయినాఁడు లక్క యిల్లుగాల్చి, విషాన్నము పెట్టి జూదపుం
గొలువు ప్రవేశపెట్టి, మముఁ గ్రూరత జీవధనంబులందుఁబే
దల నొనరించి, చాలకడి, ద్రౌపది గొప్పను బట్టి యీడ్చి, చీ
రల సభ నొల్చినట్టి ధృతరాష్ట్రజులేఁ గలుగంగ స్వస్థులే?" అనే భీమసేనుని హుంకరింపు ప్రేక్షకుల్ని నాటకం చివరిదాకా ఉత్కంఠతో కూర్చోబెడుతుంది. రంగస్థలంపైన పలు ప్రదర్శనలను పొందిన యీ నాటక ప్రదర్శన యిటీవలి కాలంలో కనుమరుగైపోవటం దురదృష్టం.

చిత్రనళీయము

ఆంధ్రనాటక పితామహులు ధర్మవరం రామకృష్ణమాచార్యులవారు పౌరాణిక నాటకాలను సంస్కృతంనుండి అనువాదం చేయటంగాక స్వతంత్ర రచన చేయటానికి ఒక విధంగా మార్గదర్శకులు. ప్రాచ్య పాశ్చాత్య నాటకరంగాలలో మేలైన అంశాలను స్వీకరించి వీరు ఉత్తమ పౌరాణిక నాటకాలను రచించారు. వీరి నాటకాలలో చిత్రనళీయము, సావిత్రీ చిత్రాశ్వ నాటకము, విరకారి, ప్రమీలార్జునీయము, పాదుకా పట్టాభిషేకము, ప్రహ్లాద ప్రసిద్ధి పొందాయి. వీటిలో చిత్రనళీయము అత్యుత్తమమైనదిగా చెప్పవచ్చు. ధర్మవరమువారి నాటకాలలోని ఔచిత్య భంగం గురించి పానుగంటి మొదలైనవారు తీవ్రంగా విమర్శించారు. కాని గనిలోనుండి తీసిన మొదటి వజ్రాలలో ఒకటిగా చిత్రనళీయాన్ని గుర్తిస్తే యిందులోని అందం బాగా ద్యోతకమవుతుంది. నాటక రచన, దర్శకత్వము, నటన అనే మూడు గుణాలూ ధర్మవరం వారిలో మూర్తీభవించటంచేత వారికి నాటక పితామహ బిరుదం సార్ధకమే.

ధర్మవరం వారు తమ నాటకాలను మొదట వచన నాటకాలుగానే రచించేవారట! తర్వాత తమ 'సరస వినోదినీ సభ' వారికి విన్పించి సూచనలు గ్రహించేవారట! తర్వాత నటీనటులను దృష్టిలో ఉంచుకొని వారి యోగ్యతలను బట్టి పాటలు, పద్యాలు రాసి యిచ్చేవారట! దీనివల్ల నాటక కళకు చెరుపు జరిగి వుండవచ్చు. కాని నాటకానికి పరమావధి ప్రదర్శనలో రక్తికట్టటమే అనుకుంటే యీ పద్ధతి సరిపోతుంది.

నలుడు దమయంతిని విడిపోయేటప్పుడు దుఃఖావేశాన్ని వెల్లడించడానికి ధర్మవరంవారు ఇరవైఏడు పద్యాలు రచించారు. ప్రసిద్ధులైన నటులు ఆ పద్యాలన్నీ రంగస్థలంమీద చదివేవారు. అభినయం తగ్గిపోయి పాటకచేరీచేసినట్లుండేదేఁ ఆ పద్యాలను ప్రేక్షకులు 'నక్షత్రమాల' అని పేరుపెట్టుకొని మళ్ళీ మళ్ళీ చదివించుకునేవారు కీ. శే. బందా కనకలింగేశ్వరరావుగారీ పద్యాలను అలపించటంలో ఘనులు. మహానటులు బళ్ళారి రాఘవ హిరణ్య కశిపుడు బాహుకుడు పాత్రలకు నూత్నవ్యాఖ్యానంచేసి, తమ అమేయమైన అభినయంతో రక్తి కట్టించారు.

గయోపాఖ్యానము

గయోపాఖ్యానము మొదట వచన నాటకమని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. కాని యిది సత్యమే. గయోపాఖ్యానం రంగస్థలంమీద రాణించటానికి మూల కారణం అందులోని పద్యాలేననీ చాలమంది నమ్మకం. శ్రీ ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారి ప్రోత్సాహంతో చిలకమర్తివారు నాటక రచనకు పూనుకున్నారు. మొదట ఆయన 'కీచకవధ' రచించారు. దీన్ని వచనంలోనే రచించారు. వారి నాటక సమాజం సభ్యులు పద్యాలు పాడలేనివారు కావటంచేత యీ నాటకాన్ని వచనంలో రచించారు. తర్వాత చిలకమర్తివారు పార్వతీ పరిణయము, ద్రౌపదీ పరిణయము, గయోపాఖ్యానము, శ్రీరామజననము పారిజాతాపహరణము, నలనాటకము, సీతాకల్యాణము మొదలైన నాటకాలను వచనంలోనే రచించి, వాటిని అచ్చువేయించేటప్పుడు పద్యాలు చేర్చారు.

ఆ కాలంలో గయోపాఖ్యానానికి లభించినంత ఆదరం మరే నాటకానికీ లభించలేదు. దీనికింత ఆదరం ఎందుకు లభించిందో తనకే తెలియదని చిలకమర్తివారు 'స్వీయ చరిత్ర'లో తెలిపారు. చిత్రభారతంలో కథ ఆధారంగా ఆయన యీ నాటకం రచించారు. సంవాద రూపంలోవున్న పద్యాలు యీ నాటకం విజయవంతం కావటానికి ఆయువుపట్లు. 1950కి పూర్వమే ఇది వేలాది ప్రదర్శనలు పొందింది. ఒక లక్ష ప్రతులు పైగా అమ్ముడు పోయింది. గయోపాఖ్యానంలో పద్యాలు చేర్చి ప్రదర్శించినపుడు మొదటి ప్రదర్శనం రాజమండ్రిలో జరిగింది. దానికి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, చేబ్రోలు ప్రాంతాలనుండి ప్రజలు బండ్లు కట్టుకొని వచ్చారట! ఇంతకుమించిన జనాదరం మరేంకావాలి! ఈ నాటకంలో నోరూరగ, చవులు పుట్టేటట్లున్న పద్యాలు చాల వున్నాయి. "అల్లుడా యాదరంబున బిల్వబంపు మామనుబట్టి చంపగలమె!" అనే అర్జునుని ఆక్షేపణ పద్యం వంటిది సామాన్య ప్రజలకు, నిరక్షరాస్యులకు కూడ, కంఠతా వచ్చేశాయి. సంస్కార విహీనులైన నటులు కొందరీ పద్యాన్ని ఖూనీచేసి "అల్లుడా రమ్మని యాదరంబునఁబిల్వ అనే దగ్గర ఆపి చాలాసేపు రాగంతీసి తర్వాత "బంపు మామనుబట్టి చంపగలమె!" అని చదివే వారు. గయోపాఖ్యానికి ఎంత ఖ్యాతి లభించినా చిలకమర్తివారికి బాగా నచ్చిన నాటకం 'ప్రసన్న యాదవము' ఈ నాటకాన్ని ఇప్పటి నాటక సమాజాల వారెవరైనా పునరుద్ధరించి, ఎన్నో సౌకర్యాలున్న ఆధునిక నాటకరంగ స్థలంపై ప్రదర్శిస్తే గొప్ప నాటకంగా రాణిస్తుందనటంలో సందేహంలేదు.

కీ. శే. టంగుటూరి ప్రకాశం పంతులుగారు ఇమ్మానేనివారి నాటక సమాజంలోచేరి, పెక్కు స్త్రీ పాత్రలు ధరించి ప్రసిద్ధి పొందారు.

పాదుక

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు అసాధారణ ప్రజ్ఞా ధురీణులు నాటక రచనలో ఆయన రీతి అనితర సాధ్యమైనది. "రాధాకృష్ణ, విప్రనారాయణ, పాదుక, పట్టభంగ రాఘవము, వనవాస రాఘవము; కల్యాణ రాఘవము, విజయ రాఘవము, "నర్మదా పురుకుత్సీయము" ఆయన రచించిన పౌరాణిక నాటకాలు. వీటిలో రాధాకృష్ణ, విప్రనారాయణ, పాదుకలు ప్రసిద్ధిపొందాయి. "చిదిమిన పాల్గారు చెక్కుటద్దములవాడు" మొదలైన పద్యాలను శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి దశరథ పాత్ర ధరించి ఆలపించినప్పుడు, అటువంటి కవిత్వం రచించటం కాళిదాసు వంటి మహాకవికి తప్ప ఇతరులకు అనితర సాధ్యమని పిస్తుంది. పానుగంటి రచనకు శ్రీ అద్దంకి ప్రాణం పోశారు. భక్తి, హాస్యము, కరుణ వేటికవే పానుగంటివారి నాటకాలలో పాకానబడి రుచి గొల్పుతాయి.

పాండవోద్యోగ విజయాలు

పుంభావ సరస్వతులు తిరుపతి వేంకట కవులు మహా భారతాన్ని ఆంధ్రులకు ఆస్వాదయోగ్యం చెయ్యటానికి తిక్కన తర్వాత తెలుగునాటవెలసిన కారణజన్ములనిపిస్తుంది. మహాభారత కథను వీరు "పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవ రాజసూయము, పాండవ ఉద్యోగము, పాండవ విజయము పాండవాశ్వమేధము" అని ఆరు నాటకాలుగా రచించారు. 1909లో శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రి పాండవ విజయము రచించారు. దాన్ని 1911లో వేంకటశాస్త్రి గారు పెంచి పాండవ ఉద్యోగము, పాండవ విజయము అని రెండు భాగాలు చేశారు: పాండవోద్యోగ విజయాలనే పేరిట యీ నాటకం పొందిన ప్రసిద్ధి అద్వితీయమైనది. ఇది ప్రదర్శింపబడని తెలుగు గ్రామం లేదేమో! పండిత పామరులూ, స్త్రీ బాల వృద్ధులూ మెచ్చిన నాటకమిది. భరతముని నాట్యశాస్త్రంలో


అన్ని రకాల అభిరుచులుగలవారికీ నాటకం ఆస్వాద యోగ్యంగా ఉండాలని చెప్పిన మాట యీ నాటకం విషయంలో సార్థకమైంది. ఈ నాటకానికి శ్రీ మక్కపాటి వేంకటరత్నముగారి 'ద్రౌపదీ మాన సంరక్షణము' నాటకములోని దుర్యోధనుని మయసభా ప్రవేశ ఘట్టాన్ని చేర్చుకొని, మొత్తాన్ని కురుక్షేత్రం పేరిట ప్రదర్శిస్తున్నారు. తిరుపతి వేంకట కవులకు దీటుగా 'మయసభ' ఘట్టాన్ని తీర్చిదిద్దిన మక్కపాటివారి ప్రజ్ఞ ప్రత్యేకంగా కొనియాడదగినది. పాండవోద్యోగ విజయాలలో పద్యాలన్నీ రత్నాలే! పసుల కాపరులుకూడా నోరార చదువుకో గలిగినవి" పేలవము కాని సుబోధకత, భారముకాని ఉదారత-ఇవీ యీ నాటకములకు పెట్టని నగలు" అని పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పిన మాట యథార్థం. లక్ష్మీకాంతంగారీ నాటకంలో ధర్మరాజు పాత్ర ధరించి తనకుతానే సాటి అనిపించుకొనిన గొప్పనటుడు "బావా ఎప్పుడు వచ్చితీవు?" "అలుగుటయే యెరుంగని"--జెండాపై కపిరాజు" మొదలైన పద్యాలను ఆలపించనిదే ఆంధ్రత్వం పరిపూర్ణమైనట్లుకాదు.

హరిశ్చంద్ర

కరుణరస ప్రధానమైన హరిశ్చంద్ర నాటకాన్ని చూచి చలించని రసజ్ఞులుండరు. చూచిన ప్రతిసారీ ప్రేక్షకులు కన్నీరు మున్నీరై పోతున్నా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే నాటకమిది. వేదంలోవున్న హరిశ్చంద్రుడు సత్యసంధుడు కాడు. స్కాందపురాణంలోవున్న హరిశ్చంద్రుని కథను, శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానాన్ని ఆధారం చేసుకొని వీరేశలింగం పంతులుగారు మొదలుకొని చాలమంది యీ కథను నాటకంగా రచించారు. బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి "సత్యహరిశ్చంద్రీయము" నాటకానికి వచ్చిన ప్రశస్తి మరి దేనికీ రాలేదు.

నటులుగా మిక్కిలి ప్రఖ్యాతులైన హరిప్రసాదరావు. డి. వి. సుబ్బారావు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి హరిశ్చంద్ర పాత్ర ధరించటంవల్లనే వారికా ప్రసిద్ధి వచ్చింది. 1912లో రచింపబడిన యీ నాటకం గుంటూరు 'ఫస్ట్ కంపెనీ' వారి ప్రదర్శనవల్ల మిక్కిలి రాణకెక్కింది. హరిప్రసాదరావు నట పితామహులుగా ఖ్యాతి వహించి, కరుణరస పోషణలో నటులకు ఒరవడి పెట్టింది. యీ పాత్ర పోషణనలననే బందరులో డి. వి. సుబ్బారావుగారి నటన ఒక ప్రత్యేకమైన "స్కూల్ ఆఫ్ ఏక్టింగ్". ఇది పురాణం సూరిశాస్త్రిగారి వంటి విజ్ఞుల ప్రశంసలందుకొన్నది. మల్లాదివారు ఆంధ్రలో పెక్కు ప్రాంతాలలో యీ నాటకం ప్రదర్శించి కరుణ రసాన్ని ఒప్పించారు. ఇటీవలి కాలంలో మళ్ళీ డి. వి. సుబ్బారావుగారు (పూర్వపు డి. వి. సుబ్బారావుగారు కాదు) అవతరించి హరిశ్చంద్ర పాత్రను అద్భుతంగా పోషించి, కరుణరసభరితమైన పద్యాలను గుండెలు కరిగిపోయేలాగపాడి ప్రసిద్ధి పొందుతున్నారు. 'సత్యహరిశ్చంద్రీయము'లో 'కాటిసీను'లో నటులు మహాకవి జాషువా ఖండకావ్యం శ్మశానవాటి పద్యాలనుకూడపాడి యీ దృశ్యానికి మరింత గాంభీర్యం కల్పిస్తున్నారు. దీనివల్ల రసపోషణ బాగా జరుగుతున్నది. ఔచితీ భంగమేమీ జరగటంలేదు.

తెలుగు పద్యం పాడటంలో నలుగురిని మార్గదర్శకులుగా విజ్ఞులు భావిస్తారు. వారిలో మొదటివారు దొరస్వామయ్యంగార్. వీరు పద్యం పాడటం



పూర్తి అయిన తర్వాతగూడా రాగం వినపడేది. ఈ పద్ధతిని జొన్నవిత్తుల శేషగిరిరావుగారనుసరించారు. హరిప్రసాదరావుగారి సంగీత నైపుణ్యం అంతా పద్యంలోనే యిమిడి పోయేది. పద్యం పూర్తికాగానే రాగంగూడ పూర్తయ్యేది. బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు పద్యంలో ఎక్కడ ఏ మాటను ఎలా అనాలో ఆ విధంగా అని రక్తి కట్టించేవారు. డి. వి. సుబ్బారావుగారు పద్యం పాడుతుంటే పదబంధం ఎక్కడికక్కడ విడిపడేది. అర్థస్ఫూర్తి కలిగేది: గంభీరంగా వుండేది. శ్రావ్యంగా వుండేది. ఈ నాలుగు బాణీలలో ముగ్గురు హరిశ్చంద్రవల్లనే ప్రఖ్యాతులు కావటం గమనార్హం.

శ్రీకృష్ణ తులాభారము

నాటకంలో స్త్రీపాత్రలుండటం తలనొప్పి అనుకోని మంచి రోజులవి. రుక్మిణీ సత్యభామలు తెలుగుపడుచులైతే ఎట్లా వుంటారో ఆ విధంగా శ్రీ ముత్తరాజు సుబ్బారావు ఆంధ్ర నాటకరంగానికి అందచందాలు సమకూర్చారు. "మీరజాలగలడా నా యానతి" (స్థానంవారి రచన) "భలే మంచి చౌకబేరము" (చందాల కేశవదాసు రచన) పాటలు యీ నాటకంద్వారా మిక్కిలి ప్రచారంలోకి వచ్చాయి.

"ఫలమొ ఘన రసంబొ పత్రమో పుష్పమో
కొనుచు భక్తి నిన్ను గొలుచువారి
కీవు వశుడవగుటయే సత్యమేని యీ
తులసీదళము నిన్ను దూచుగాత!"

అనే పద్యం భక్తుల నోట పదే పదే విన్పిస్తుంది. స్థానంవారు సత్యభామ పాత్రను పోషించి నాటకానికి, నటనకు గౌరవం తెచ్చారు. "కథ ఆకర్షణీయమైనది. సుబ్బారావుగారి కవిత్వము మధురమైనది. రచన ప్రదర్శనానుకూలమైనది - ఆ యీ కారణములవలన నిది ఎక్కువ ప్రసిద్ధికి వచ్చినది" అని శ్రీ పి.యస్.ఆర్. అప్పారావుగారు తలచారు. జనాదరం పొందిన యీ నాటకాన్ని ఇప్పటికి మూడుసార్లు సినిమా తెరమీదికి కూడ ఎక్కించారు.

సావిత్రి

శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు 1915 ప్రాంతాల్లో మైలవరం రాజావారు అప్పటికి అపూర్వమైన సెట్టింగులు, హంగులు సమకూర్చి యీ నాటక ప్రదర్శనకు తోడ్పడ్డారు. తర్వాత మోతేవారి కంపెనీ (ఏలూరు) వారికోసం యీ కవిగారే యీ నాటకాన్ని మరోసారి రచించారు. ఇప్పుడు ప్రచారంలో వున్నది యీ నాటకమే.

సావిత్రీ సత్యవంతుల ప్రణయానికి యముడు విఘాతం కల్పించటం యమునికి సావిత్రికి జరిగిన సంవాదం- యీ నాటకాన్ని రక్తి కట్టించాయి కీర్తిశేషులు వేమూరి గగ్గయ్య, గురజ నాయుడు మొదలైన గొప్ప నటులు యమపాత్రను మరపురాని విధంగా పోషించారు. "సోహాల పో పొమ్మికన్" వంటి హిందూస్థానీ బాణీలు ఆంధ్ర నాటక రంగాలకి ఆరోగ్యకరమైనవి కాకపోయినా ప్రేక్షకులను బాగా ఆకట్టుకొన్నాయి.

తారాశశాంకం

నాటకరంగమీద నీతి అలస్యంగా, అవినీతి తొందరగా ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. శ్రీ కొప్పరపు సుబ్బారావు రచించిన 'తారాశశాంకం'లో తారా చంద్రుల ప్రణయం ప్రేక్షకులను బాగా ఆకట్టుకొన్నది. ముసలిమొగుడు పడుచు పెండ్లాం పాట్లను పురాణాలలోనుండి తీసుకొని శేషము వేంకటపతి శశాంక విజయం రచించాడు. అక్రమ ప్రణయాన్ని సమర్థించాడు. శ్రీ కొప్పరపు సుబ్బారావు యిదే కథను రసవత్తరమైన నాటకంగా మలచారు. కీ.శే. సూరిబాబు యీ నాటకానికి విశేష ప్రచారం కల్పించారు. ఇందులో పద్యాలు రసికులకు కంఠోపాతమైనాయి.

పైన పేర్కొనిన పది నాటకాలుగాక "సక్కుబాయి" (మల్లాది అచ్యుత రామశాస్త్రిగారి రచన) "నారద సంసారం" "భక్తప్రహ్లాద" "తులసీ

ఈ కవిత

ఈ కవిత ఎవతెయో అతివ కంటి వెలుగు కిరణం
తాకి లేచింది కాదు,

ప్రణయాలాపాల పొల్లు పల్లిని తట్టి
ప్రచ్చింది కాదు.
యౌవనోన్మత్త వికృత భ్రమల కన్నింటికి
కోడంగి వేషమును కట్టి చిందాడింది కాదు.
కొండమీ దకస్మాత్తుగా గొప్ప తగిలిన మబ్బు
కురిసిన ఝురము కాదు.

ఎప్పటి నుండియో కురిసిన జడివాన దిగి
లోపలి కుతకుత పదునుగా మృదువుగా
పడుకొని నపుడు,
బావిని త్రవ్వి, యాతము కొట్టి
తెచ్చింది ఈ రాగం !

చివరిమాట

అదీ కావాలి ఇదీ కావాలి
అన్నీ కావాలి నాకు
వందలాది దారులు వెలుతురు రాచనగరికి !

వద్దు నాకు సిద్ధాంతాల రాద్ధాంతం;
నాకులేదు, ఇదేసరి ఇంతే.ిరి అనేపట్టు.
నాకు తెలుసు, ఇవి అన్నీ ఎక్కేడి
ఒక్కొక్క మెట్టు.

వందలాది భావాల బావి; తోడుకో
నీకు కావలసినంత తీపి నీరం,
పాత్రల ఆకారాలను గురించి ఎందుకు జగడం
మనకు కావలసింది దాహపరిహారం.

— మూలం - శ్రీ జి. యస్. శివరుద్రప్ప

అనువాదం - శ్రీ తంగిరాల వెంకట సుబ్బారావు

కిరాతకుణ్ణి...

ఓర్పు నశించి
అసహనంతో ఆక్రన్దించి
కదలబోతూంటే—
మలయమారుతంతో జతకలిసి—
తేలివచ్చిన ఆ సవ్వడి......
చెట్టు చాటు నుంచి చూసి
గభుక్కున ఎదురుపడితే—
తృళ్ళి తూలబోయి,
గుబురుపొదల చాటుకై
పరుగులిడే ఆ నడకలు—
బెదిరిన గుండెకు గురుతులు !
మనో పొదిలోంచి
కోరిక బాణాన్ని తీసి
చూపుల ధనువుతో సంధిస్తే......
ఆ కాంత - కళ్ళకాంతులు
తుషార తెమ్మెరలకి
తలలూపే గరికపూల
మణిమాలలపై ప్రసరిస్తే—
నా చూపులు ఆ జవ్వని
కేశవీధిలో పయనించి—
కేశబంధనంలో పెనవేసుకొని
నిక్కి నిక్కి చూస్తూన్న
పరువపు సిరిమల్లెల దగ్గరాగితే—
నా అసమర్థతని చూసి
అవి ఫక్కున నవ్వాయి !!
వాస్తవంలోకి తలెత్తి చూస్తే
ఎక్కడా వనదేవత ?!
కిరాతకుణ్ణి కనుక
ఆమె స్మృతులని బంధించి
మనో పంజరంలో వుంచి
పోషిస్తున్నా ... — కాదు-కాదు,
పూజిస్తూన్నా !!

శ్రీ జి. బాలాజీ

జలంధర" "రామాంజనేయ యుద్ధము" మొదలైన నాటకాలుగూడ విరివిగా ప్రదర్శింపబడి ప్రేక్షకుల మెప్పు పొందాయి.


భారత స్వాతంత్ర్యానంతరం పౌరాణిక నాటక రచన వెనుకంజ వేసిందనే చెప్పాలి. ఎప్పుడైనా ఒక కవి పౌరాణికేతి వృత్తంతో నాటకం రచించినా అది ఏ ఒకటి రెండు ప్రదర్శనలతోనే ఆగిపోతున్నది:

విశ్వనాథ సత్యనారాయణగారి "నర్తనశాల ? వేనరాజు" త్రిపురనేని రామస్వామి చౌదరిగారి "శంబుకవధ; ఖూనీ: కురుక్షేత్ర సంగ్రామము "విజ్ఞులను ఆకర్షించినంతగా సామాన్య ప్రేక్షకులను ఆకర్షించలేదు.

జమీందారులు పోషకులుగా ఆంధ్రదేశంలో చాల నాటక సమాజాలు వెలిశాయి. నాటక కళాభివృద్ధికి లోడ్పడ్డాయి. కాని ఒక్క కుటుంబ సభ్యులు నాటక సమాజంగా ఏర్పడి, విభిన్న నాటకాలను ఊరూరా ప్రదర్శించి కళామతల్లిని సేవించిన ఘనత సురభి నాటక సమాజంవారిదే! వీరిది సంచార నాటక సమాజం. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి చాలకాలంనుండి కళారంగానికి సురభివారు చేస్తున్న సేవలను గుర్తించి, వారికి ఆర్థికంగా సహాయపడి; వారి కళకు దోహదం కల్పించటం ఆంధ్రప్రభుత్వం తక్షణం చేపట్టవలసిన కర్తవ్యం.

ఏజాతినైనా వెనుదిరిగి చూసుకొని 'ఇది నా వారసత్వం' అని తలచుకోవలసిన అవసరం వున్నది. గత చరిత్రను తలచి గర్విస్తే సరిపోదు. వర్తమానాన్ని పదిల పరచుకొని భవిష్యత్తుకు బాట నిర్మించుకోవాలి. పౌరాణిక నాటకాలను "ఫ్యూడల్; బూర్జువా" నాటకాలనో మరో పేరుతోనో నిందించక వాటిని పునరుద్ధరించుకోవటం మంచిది. ఆధునిక కాలంలో లభ్యమవుతున్న సాంకేతిక సౌకర్యాలను పౌరాణిక నాటకాలకుగూడ సమకూర్చుకొని, వాటిని యింకా రసవంతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలి. సమర్థవంతమైన నాటక సమాజాలు పౌరాణిక నాటకాలను అశ్రద్ధచేయక; మన జాతి సంపదగా, కళలకు కాణాచిగా భద్రపరచుకోవాలి.

I SET



ఉచితం

మూలం: కులదీప్ బగ్గా
స్వేచ్ఛానువాదం: సుంకర భాస్కరరావు

ధరలు పెరిగిపోతున్నాయ్. తట్టుకోటం ప్రతి మనిషికీ కష్టంగానే వుంది. మన ఆదాయాలు మాత్రం పెరగటం లేదు. లెక్క జీతంరాళ్ల తప్ప, పై ఆదాయానికి వీలులేని ఉద్యోగం నాది. అయినా నా బడ్జెట్ ఎప్పుడూ గాడి తప్పదు. ఘనత నాదికాదులెండి, మా ఆవిడది. నా జీతాన్ని చాలా పొదుపుగా ఖర్చు పెడ్తుంది.

సాయంత్రం కూరలు కొంటానికి మార్కెట్ కెళ్ళినప్పుడు, ఉచితంగా వచ్చే కొత్తిమీరా-పచ్చిమిరపకాయలూ అడిగి తీసుకోటమెప్పుడూ మర్చిపోదు మా ఆవిడ. నా జీతం పెరక్కపోయినా యిలా బతగ్గలుగుతున్నానంటే అందుక్కారణం మా ఆవిడ పొదుపే.

అప్పుడప్పుడు ఉచిత కొత్తిమీర తీసుకోటం దగ్గర కొట్టువాడితో మా ఆవిడ గొడవ పెట్టుకోవటం, నాకు కోపం రావటం, నేనేం చెయ్యలేకపోవటం మామూలే!

"ఈ కొట్లో మరోసారి ఎప్పుడూ కూరలు కొనగూడదు!" కొట్టువాడి ముఖం మీదే నిర్మొహమాటంగా అనేస్తుంది.

"ఏం?" నా ప్రశ్న.

"కొత్తిమీరేదో బంగారమన్నట్టు-భిక్షగాడికేసినట్టు, నాలుగు లెక్కపెట్టి పడేస్తాడు!" ఆవిడ జవాబు.

మొదట్లో ఆమె అమాయకత్వానికి నవ్వుకునేవాణ్ని. ఆమె పొదుపుకి మనసులోనే తెగమెచ్చుకునేవాణ్ణి.

ఒకనాడిలాగే కూరలు కొంటున్నాం. ఒకచోటి బంగాళాదుంపలు మంచి వున్నాయ్ అక్కడే కొనాలని రెండుసార్లు అనెళ్ళబోయాను. నా ప్రయత్నం సాగనీయలేదావిడ.

"అక్కడున్న బంగాళాదుంపలంత మంచివి ఈ మార్కెట్లో మరెక్కడా లేవు." అన్నాను ఉక్రోషం పట్టలేక.

"కానీ అక్కడ ఉచిత కొత్తిమీరా-మిరపకాయలూ దొరకవ్. తెలిసిందా డియర్?"

"ఉచితంగా వచ్చేవాటివెనక ఎందుకిలా పరుగు పెడతావ్?" చిరాగ్గా అడిగాను.

"ఎందుకా? మన్లాటివాళ్ళకి వాటి అవసరమెంతో వుంది గాబట్టి."

ఆ క్షణమే నాకు జ్ఞానోదయమైంది. ధరలు పెరుగుతున్నా - పెరగని జీతాల నాలాంటివాళ్ళింత ఆనందంగా ఎలా బతుకుతున్నారన్న ప్రశ్నకి జవాబిది.

మా ఆవిడంటే ఎవరనుకున్నారు? కల్తీలేని అసలు సిసలైన పంజాబీ స్త్రీ. హోటల్స్‌లో రొట్టెల్తో ఉచితంగా కూర తిన్న అనుభవం ఆమె రక్తంలో ప్రవహిస్తోంది. ఎన్నో వస్తువులు ఉచితం అని ప్రకటనల్తో ఆశలు రేపే ఘనత ఇప్పటికీ పంజాబ్‌కే దక్కుతుందేమో! ప్రతి హోటల్లోనూ రొట్టెలతో కూర ఉచితంగానే దొరుకుతుంది ఇప్పటికీ—

ఎన్ని ప్రణాళికలొచ్చినా ధరలు పెరిగిపోతూనే వున్నాయ్. సమ్మెలు జరుగుతున్నాయ్. ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు. ఆకాశాన్నంటే ధరల్ని చూసి గుండెలు బాదుకుంటున్నారు. కాని మా ఇంట్లో పరిస్థితి మారలేదు. మా బడ్జెట్ ప్రశస్తంగా కొనసాగుతూనే వుంది. కారణమేంటో తెలుసా మీకు? ధరల్తో పాటు మా ఆవిడ తెలివితేటలు కూడా పెరిగిపోతూ వున్నాయ్. అటు ధరలూ, ఇటు మా శ్రీమతి తెలివితేటలూ. ఎవరి చెయ్యీ పైనుండకుండా, సమవుజ్జీలయిపోతున్నాయ్ రెండూ. అదిగో, అందుకే మా బడ్జెట్ బేషుగ్గా కొనసాగుతూ వుంది. ఇక, మా శ్రీమతి తెలివితేటలు ఎలా పెరిగాయో చెప్పమంటారా?

ఉచితంగా-పాతబట్టలకి స్టెయిన్‌లెస్‌స్టీల్ సామాన్లు తీసుకోవటం మొదలెట్టింది. సమయానికి, అంటే ఉచితంగా స్టీల్ సామాన్లిచ్చేవాడు వచ్చిన సమయానికి, పాతబట్టలు లేవనుకోండి—అయినా ప్రమాదం లేదు, నలిగిన బట్టలు ఐనా సరే యిచ్చేసి ఆ స్టీలు సామాన్లు ఉచితంగా పుచ్చుకొంటుంది.

నలిగిన బట్టలంటే మా ఆవిడకో ప్రత్యేకమయిన డెఫినిషనుందండోయ్. 'పేంటు కుట్టించిన ఆరునెలల్లో ఎప్పుడైనా అది నలిగిన వస్త్రమగును' అనేది మా ఆవిడిచ్చే దాని పరిభాష.

ఆవిడగారు చేసే యిటువంటి పనికెప్పుడైనా కించిత్తు చికాకు నేను లోనయినట్లయితే, ఆవిడ ప్రత్యేకంగా నాకు జ్ఞానబోధ లేదా గీతోపదేశంలాంటిదేదో చేస్తుంది-"నలిగిపోయిన ఆ జత బట్టలు పోతే పోనిద్దురూ! ఏది శాశ్వతం చెప్పండి? చక్కటి స్టీలుసామాను ఉచితంగా వస్తుందాయె. ఔను, బయట స్టీలు ధరెంతో మీకు తెలుసా? వెండి ధరతో పోటీపడి అమ్ముడయిపోతూ వుందటనండీ!"

ధరల పెరుగుదలతో మా బడ్జెట్ దెబ్బ తినలేకపోయింది. ఉచిత కొత్తిమీరా. పచ్చిమిరపకాయల్తో ఇంట్లో అవసరాలు తీర్తున్నాయ్. మా ఇల్లాలు తన సొంత తెలివితేటల్తో ఉచితంగా వచ్చిన, అదీ వెండిధరతో పోటీపడి అమ్ముడైపోతూ వున్న స్టీలు పాత్రల్తో వంటిల్లు ముచ్చటగా అలంకరించి పారేస్తూ వుంది.

బట్టల ఖర్చు కొంచెం పెరిగిందనుకోండి. కించిత్తు మా బడ్జెట్ తలకిందులయితే మాత్రం యేం, మా ఆనందం ఏమీ తగ్గలేదు, అసలు ఈ ఖర్చు పెరగటానికి మూలకారణం మరోటుండట. బట్టల్కిధరల్లో పెరుగుదల కాదట, ఫ్యాషన్లు రోజురోజుకి మారిపోవటంవల్లనే బట్టలు ఖర్చులు పెరుగును అని మా ఆవిడ వాదన.

ఓ రోజు, ఆఫీసుకెళ్ళేముందు పేపరు చదూతున్నాను. సడెన్‌గా ఓ సబ్బుల కంపెనీ ప్రకటన కనిపించి, గుండె జల్లుమంది. 'మూడు సబ్బుడబ్బాలు కొన్నవారికి అయిదు రూపాయల్కి ఓ అందమైన ప్లాస్టిక్ బకెట్ ఉచితం!' అని వుంది.

ఈ ప్రకటన చూసాక, మా ఆవిడకి కాంప్లిమెంట్సు చెప్పాలనిపించింది. మా ఆవిడ ఉచిత కొత్తిమీర-పచ్చిమిరపకాయల అలవాటునుంచి ఈ కంపెనీ యేదో మాంచి బ్రయిట్ ఇన్‌స్పిరేషన్ కొట్టేసింది.

వెంటనే నా బడ్జెట్ గుర్తొచ్చింది. నెల చివరి రోజులు గుర్తొచ్చాయి. ఈ ప్రకటన గురించి మా ఆవిడకి కాంప్లిమెంట్స్ చెప్పకపోటమే మంచిదనిపించింది.

ప్రపంచం తల్లకిందులైపోయినా మా ఆవిడ పేపరు చదవదు. అంత వరకూ గ్యారంటీ యివ్వగలను. అసలు మా ఆవిడకి పేపరు చదవవలసిన ఖర్మేం



ధరలు పెరిగిపోతున్నాయ్.

ఉచితంగా సామాన్లు పంచిపెట్టే కంపెనీలు పెరిగిపోతున్నాయ్.

ఇల్లు గడపటానికి ఇల్లాలి తెలివితేటలు పెరిగిపోతున్నాయ్.

బడ్జెట్ సంగతెందుకు చెప్పండిక?

తిండి సమస్యే లేదు-ఆహార పదార్థాలన్నీ ఉచితం. పచ్చి మిరపకాయలు ఉచితం. హోటల్లో పూరీల్తో కూర ఉచితం.

ఇంట్లోకి కావలసిన స్టీలు సామాన్లు ఉచితం. ప్లాస్టిక్ బకెట్లు ఉచితం. అబ్బ! ఎన్నెన్ని ఉచితం!

నా తల మీద అప్పు పెరిగిపోతూ వుంది. మా ఆవిడ పొదుపుగానే ఖర్చు పెడుతూ వుంది. ఉచితంగా వచ్చేవేవీ పోనీకుండా చూసే తెలివైన ఇల్లాలే నా బడ్జెట్ వ్యవహారాలు చూస్తూ వుంది. ఓహ్-కొత్తిమీర, పచ్చిమిరపకాయలు, ప్లాస్టిక్ బకెట్లు అన్నీ ఉచితమే! బయట వెండి ధరతో పోటీపడుతూ అమ్ముడయ్యే స్టీలు సామాన్లు ఉచితమే! 'ఉచితం' అన్న పేపరు ప్రకటనల ఉచిత సలహాలూ-వాటి లాభాలూ ఉచితమే! ఇన్ని ఉచితాలు ఉపయోగించుకుంటున్నా నా జీతం నాకెందుకు చాలటం లేదో బొత్తిగా అర్థం కాలేదు. బడ్జెట్ తలకిందులవుతూనే వుంది. అప్పు పెరిగిపోతూనే వుంది. ఉచితంగా ఎన్ని దొరికినా ఇలా అప్పులెలా పెరుగుతాయన్న సంగతి నాకేకాదు, మా ఆవిడకీ అర్థం కాలేదు. ఎప్పటికీ అర్థం కాని ఈ సంగతి గురించి మేమెప్పుడూ అంతగా పట్టించుకోం.



లేదు. స్థానిక వార్తలు అతి నమ్మకమైన సూత్రాలద్వారా మా ఆవిడ దగ్గరనుంచే విడుదలౌతాయ్. అవి విన్నాక న్యూస్ పేపరూ, నేనూ సిగ్గుపడిపోటం మాత్రం ఖాయం.

ఆఫీసునుంచి సాయంత్రం రాగానే మా ఆవిడ చిరునవ్వుతో కనిపించింది

"ఇవాళేదైనా ఉచితంగా దొరికిందా?" అడిగాను.

మెరిసే కొత్త ప్లాస్టిక్ బకెటొకటి నా ముందు పెట్టింది ఆవిడ.

"ఇదెక్కడిది?"

"మూడు డబ్బాల సబ్బు కొనగానే, అయిదు రూపాయలకే ఉచితంగా వచ్చిందిది!"

"ఎంత ఖర్చు చేసావ్?"

"పాతికుండొచ్చు."

"జీతంలో పదిరూపాయల కాయితమొక్కటే మిగిలిందన్నావ్?"

"మిగతాది అప్పు చేసాను."

జుట్టు పీక్కోవాలనిపించింది. అది చాతకాలేదు.

"ఇంత తొందరెందుకు? ఫస్టుకే కొనుండొచ్చుగా?"

"సరుకు కొంచెమే వచ్చిందన్నాడు కొట్టువాడు. పైగా ఇలాంటి స్కీములు ప్రతిరోజూ రావు కదండీ!"

నాకో నిజం తెలిసింది.

భక్త జయదేవ (నాటిక)

పెద్దాడి సుబ్బారావు



పాత్రలు		వయస్సు
1. బ్రాహ్మణుడు	(పద్మావతి తండ్రి)	40 సం॥
2. లోకబాంధవి	(బ్రాహ్మణుని భార్య)	35 సం॥
3. భోజదేవుడు	(జయదేవుని తండ్రి)	50 సం॥
4. రామాదేవి	(భోజదేవుని భార్య)	45 సం॥
5. జయదేవుడు		19 సం॥
6. లక్ష్మణసేన మహారాజు		40 సం॥
7. పద్మావతి	(జయదేవుని రెండవ భార్య	16 సం॥
8. రాణి	(మహారాజు భార్య)	35 సం॥
9. 1వ దొంగ		
10. 2వ దొంగ		
11. దౌవారికుడు		
12. కోయదొర		
13. చెలికత్తె		

కాలము :-

* 13 వ శతాబ్దము.

ప్రథమాంకము

స్థానము : జగన్నాథ దేవాలయము.

[ఒక బ్రాహ్మణుడు నిష్ఠాగరిష్ఠుడై పూజా కార్యక్రమము నిర్వహించి జగన్నాథుని ప్రార్థిస్తూ పాడుతూ వుంటాడు. స్టేజిపై దేవాలయ వాతావరణము స్పష్టంగా కనిపిస్తుంటుంది. దేవుని చుట్టూ పుష్పములు వుంటాయి. దేవుని ముందు అగరువత్తులు, దీపజ్యోతి వెలుగుతూ వుంటాయి. విద్యుత్కాంతి మందంగా వుంటుంది.]

శ్లో॥ కదా చిత్కాళిందీ తటవిపిన సంగీత తరళో!
ముదాభీర్నారీ వదన కమలాస్వాద మధుపః!
రమా శంభు బ్రహ్మ సురపతి గణేశార్చిత పదో!
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
భుజే సవ్యేవేణుం! శిరసి శిఖిపింఛం! కటితటే
దుకూలం! నేత్రాంతే సహచర కటాక్షం విదధతే
సదా శ్రీమద్ బృందావన వసతి లీలా పరిచయో
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
మహాంభోధేస్తీరే కనకరుచిరే నీలశిఖరే
వసన్ ప్రాసాదాన్తః సహజ బలభద్రేణ బలినా
సుభద్రా మధ్యస్థః సకల సురసేవా వసరదో

జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!

జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!

నయన పథగామీ భవతు మే!

పథగామీ భవతు మే...!

[ఒక్కసారిగా విద్యుత్కాంతి మాయమై మెల్లిగా స్టేజి కుడిప్రక్క పై భాగంనుంచి బ్రాహ్మణునిపై ఎరుపు, ఆకుపచ్చ, నీలంరంగులు ఒకేసారి ప్రసరిస్తాయి. బ్రాహ్మణుడు కనులు మిరుమిట్లు గొలుపుతుండగా రెప్పలు ఆర్పుతూ సంభ్రమాశ్చర్యాలతో కాంతి వచ్చిన దిశగా పైకి చూస్తూ చేతులు జోడించి లేచి నిలుచుంటాడు)

నేపథ్యంలో : (గంభీరంగా) భూసురోత్తమా! అనన్యాసక్తమైన నీ భక్తికి సంత సించితిని. నీవు చిరకాలముగా నన్ను గూర్చి మిక్కిలి నిష్ఠా గరిష్ఠుడవై వ్రతములు, పూజలు సలిపితివి. నీ మనోభీష్టము నాకెరిగించిన ఇష్టకామ్యార్థసిద్ధి కాగలదు.

బ్రాహ్మణుడు : దేవ దేవా! ఇన్నాళ్ళకు యీ దీనునిపై కరుణ చూపితివా స్వామీ! నిజముగా నా తపము ఫలింప జేయుటకు సాక్షాత్కరించితివా జగన్నాథా! స్వామీ! నీకు నా యెడల యింత దయగలదని తెలిసి నోటమాట రాకున్నది. (మోకరిల్లి) అయినను మహామహులైన మునివార్యులకు మాత్రమే లభ్యము కాగల నీ దర్శనము యిన్నాళ్ళకు నా నోము పండి లభ్యమైనది. కావున...

నేపథ్యంలో : నిర్భయముగా చెప్పు విప్ర శిరోమణి!

బ్రాహ్మణుడు : పరాత్పరా! చిరకాలము నుండి సంతానములేక తల్లడిల్లుచున్న వాడను, అపత్యహీనులకు సద్గతి లేదని పురాణములు ఘోషించుచున్నవి. మరియు పితృఋణము తీర్చుకొనుట మర్త్యులకు విధి. కావున ప్రభూ! యీ దీనుని కనికరించి సంతానమును అనుగ్రహింపుము. (నమస్కరించి, శిరస్సువంచి కనులు మూయును)

నేపథ్యంలో : ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు.

[బ్రాహ్మణునిపై ప్రసరించిన విద్యుత్కాంతి క్రమముగా క్షీణించును. మామూలు దీపాలు వెలుగుతాయి. బ్రాహ్మణుడు ఉన్మత్తంగా... చేతులు చాచి పాడుతూ వుంటాడు.]

బ్రాహ్మణుడు : ధన్యుణ్ని పరంధామా! ధన్యుణ్ని.

శ్లో॥ (కదాచిత్కాళిందీ తటవిపిన సంగీత తరళో!
ముదాభీర్నారీ వదన కమలా స్వాద మధుపః!
రమా శంభు బ్రహ్మ సురపతి గణేశార్చిత పదో!
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
నయన పథగామీ భవతు మే!
పథగామీ భవతు మే)


(లేక)

కృపా పారా వారః! సకల జలద శ్రేణి రుచిరో!
రమా-వాణీ రామః! స్ఫురదమల పంకేరుహముఖః!
సురేంద్రై రారాధ్యః! శ్రుతిగణ శిఖాగీత చరితో!
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!
నయన పథగామీ భవతు మే!
పథగామీ భవతు మే! (పదేపదే గానం చేస్తాడు)

లోకబాంధవి : (ప్రవేశించి) ఏమండీ! పూజా కార్యక్రమము పూర్తి అయినదా!

బ్రాహ్మణుడు : (ఆమెతో మాట్లాడక 'పథగామీ భవతు మే' అనే అర్ధచరణాన్ని గానం చేస్తూ తన్మయుడై ఉంటాడు)

లోకబాంధవి : (ఒకప్రక్కగా నిలబడి విస్మయంతో పరిశీలిస్తూ వుంటుంది. బ్రాహ్మణుడు గానం చేస్తూ చేస్తూ తన్మయంతో మూర్ఛితుడవు



తాడు. లోకబాంధవి కంగారుగా ఆయన చెంతకు చేరి కలశంతో నీళ్ళు కొద్దిగా ఆయన ముఖంపై చిలకరించి) ఏమండీ! ఏమండీ!...? ఏమయింది? (అని ఆతృతగా చెయ్యి పట్టుకుని కుదుపుతుంది)

బ్రాహ్మణుడు : (తెప్పరిల్లి కళ్ళు కొద్దిగా తెరచి...కనురెప్పలు రెపరెప లాడిస్తూ) ఎవరూ...? లోకబాంధవి...? నువ్వా? (లేచి కూర్చుని దేవునికి ప్రణామమాచరించి నిలబడతాడు)

లోకబాంధవి : (ఆమె ఆశ్చర్యంగా అతనిని అనుసరిస్తుంది) ఏమండీ?... ఏమిటిది? యీ రోజు పూజ ఆలస్యంగా ముగిసిందేమిటి? మీరు యిలా మూర్ఛితులు...

బ్రాహ్మణుడు : లోకబాంధవి! మనము ధన్యులమైతిమి. మన కలలు ఫలించాయి.

లోకబాంధవి : ఏమిటండీ మీరనేది? స్పష్టంగా చెప్పండి.

బ్రాహ్మణుడు : తన్వీ! మన తపస్సు ఫలించింది. ఇన్నాళ్ళకు ఆ జగన్నాథస్వామి కరుణించాడు.

లోకబాంధవి : మీ మాటలు నాకు స్పష్టంగా అర్థం కావడము లేదు.

బ్రాహ్మణుడు : (పైకి చూస్తూ) ఈ రోజు ఆ జగన్నాథస్వామి నాకు దర్శన మిచ్చాడు. మనం కోరుకున్న వరమిచ్చాడు. మనకు సంతానం కలుగుతుంది.

లోకబాంధవి : (ఆశ్చర్యంతో) నిజంగానా? నా జన్మకు అంత అదృష్టం పట్టిందా!

బ్రాహ్మణుడు : అవును. గొడ్రాలువనే లోకనింద నీవు యిక భరించవలసిన అవసరము లేదు.

లోకబాంధవి : (కళ్ళు మూసుకుని-చేతులు పైకి చాచి) లోకేశ్వరా! జగన్నాథా! ఇన్నాళ్ళకు కనికరించావా స్వామీ! జీవితం అసార్థకం అనుకునే తరుణంలో నా ఆడజన్మకు అర్థాన్ని కల్పించావా ప్రభూ! నీ కరుణా కటాక్షాలు అనంతం! నీ చర్యలు అగోచరం! నీవు లీలా మానుష విగ్రహుడవు! మధురాతి మధురమయిన నీ లీలలు గానం చేయకుండా మేము బ్రతుకజాలం కదా!

ఇద్దరూ : రథారూఢో గచ్ఛన్ పథి మిలిత భూదేవ పటలైః
శ్లో స్తుతి ప్రాదుర్భావం ప్రతి పదముపాకర్ణ్య సదయః
దయా సింధుర్బంధుః; సకల జగతాం సింధు సదయో
జగన్నాథః స్వామీ! నయన పథగామీ భవతు మే!—

— తెర పడుతుంది —

ద్వితీయాంకము

స్థానం : ఒక కుటీరం.

(సర్వత్రా గృహ వాతావరణం కనిపిస్తుంది అంతా నిశబ్దం. ఒక బల్లపై భోజదేవుడు నిర్వికారంగా కూర్చుని వుంటాడు. గడ్డం బాగా పెరిగి విచారంగా వుంటాడు. ఇంతలో రామాదేవి భర్త దగ్గరకు వస్తుంది. ఆమె మధ్యవయస్కురాలైనా మంచి స్ఫురద్రూపంతో ఖద్దరు చీర ధరించి నిరాడంబరంగా వుంటుంది.)

రామాదేవి : నాథా! మీరు కూడ యిలా విచారిస్తూ కూర్చోవడం ఏమీ బాగుగా లేదు. గతాన్ని గూర్చి విచారించడం మనపండితవారికి తగదు. అబ్బాయికి ధైర్యం చెప్పి చుట్టూరా అలుముకున్నా శోకాన్ని పోగొట్టాలి. వాడు మహా దుఃఖంలో మునిగి వున్నాడు. వాణి ఓదార్చటం మాని మీరే యిలా కూర్చోవడం—

భోజదేవుడు : రామా! ఏమని ఓదార్చమంటావు? నీ భార్య బ్రతికి వస్తుందన మంటావా? లేక మరో వివాహం చేసుకోమని చెప్పమంటావా? ఏమని చెప్పమంటావు?

రామాదేవి : ఏమని చెప్పమంటావు అని అడిగితే నేనేమని చెప్పను మీకు? సాంసారిక విషయాలలో యేనాడు ఆసక్తి లేదు వాడికి. పెళ్ళి జరిగి సంవత్సరము కూడ తిరగకుండానే కోడలు యీ లోకం విడిచి వెళ్ళిపోయింది. (కంటనీరు పెట్టుకుంటూ) వాడి కడుపున ఓ కాయ్ కాస్తే చూచి ఆనందించాలని, పిల్లా పాపలతో వాడి సంసారం ముచ్చటగా ఉండాలని యెంతగా ఆశించానో అంతగా కుమిలిపోవాల్సి వచ్చింది. (కంటనీరు తుడుచుకుంటుంది)

భోజదేవుడు : నువ్వు చెప్పింది నిజమే. వాడు పరధ్యానంగా ఉండటం భరించలేక, పెళ్ళి చేస్తే మార్పు వస్తుందని కొందరు చెప్పగా విని, వివాహం జరిపించాను. సుగుణరాశియైన కోడలు పసితనంలోనే మనకు అన్యాయముచేసి స్వర్గానికి వెళ్ళిపోయింది. పిల్లాపాపలతో యిల్లు కళకళలాడాలనే నీ ఆశ అడియాశ అయ్యింది (ఇంకా విచారంగా) దీనికంతటికి నేనే బాధ్యుణ్ణి...నేనే బాధ్యుణ్ణి!

రామాదేవి : అబ్బాయి అసలే విరాగి. ఇలా ఒంటరిగా వదలేస్తే మనకు కాకుండా పోతాడని నా అంతరాత్మ ఘోషిస్తోంది.

భోజదేవుడు : మరి యేం చెయ్యమంటావు...యేం చెప్పమంటావు? అబ్బాయి మామూలు మనిషి కాడు. సకల శాస్త్రాలు అధ్యయనం చేసిన పండితుడు. నేను సామాన్యుణ్ణి. వాడి విచారం ఎలా పోగొట్టగలను?

రామాదేవి : అయితే అబ్బాయి అలా పిచ్చివాడిలా, మాటామంతీ లేకుండా, పూజామందిరంలో రాత్రి పగలూ తేడా లేకుండా, పూజా విగ్రహాల వేపు పిచ్చిగా చూస్తూ, యెన్ని రోజులు కూర్చున్నా,చూస్తూ వూరుకుంటారా?

భోజదేవుడు : నన్నేం చెయ్యమంటావో చెప్పు. నువ్వు చెప్పినట్టే చేస్తాను.

రామాదేవి : ఎవరికైన గొప్ప వైద్యునికి చూపించి, ఔషధం యిప్పించండి. కొంతైన మార్పు వస్తుంది.

భోజదేవుడు : అబ్బాయి అనారోగ్యంగా వున్నాడని అంటే వైద్యులు నవ్వుతారు. వాడు మంచి ఆరోగ్యవంతుడు. ఆ దేవదేవునిపై వున్న అనన్యానురాగంవల్ల లోకానికి దూరంగా వుంటూ ఆయన సాన్నిధ్యంలోనే కాలం గడుపుతున్నాడు...

రామాదేవి : నేను ఒకమాట చెబుతాను. వింటారా?

భోజదేవుడు : చెప్పు.

రామాదేవి : అబ్బాయికి రెండో పెళ్ళి జరిపించండి. వాడిలో మార్పు వస్తుంది.

భోజదేవుడు : రామా! నువ్వు యిలాంటిదేదో అంటావని నాకు మొదటినుంచీ అనుమానమే. కాని అన్నింటినీ విడిచిపెట్టి వైరాగ్యలక్ష్మిని మోహించిన పండితునితో అనవలసిన మాటలేనా యివి?

రామాదేవి : పెళ్ళి నూరేళ్ళ పంట. యీసారి మరికాస్త చురుకైన అమ్మాయిని చూచి పెళ్ళి జరిపిస్తే ఆ అమ్మాయే వాడిలో మార్పు తీసుకొని వస్తుంది. ఇదివరకు ఘోటక బ్రహ్మచారులమని వూరంతా చెప్పుకున్నవారు ఎంతోమంది బ్రహ్మాండంగా సంసారాలు సాగిస్తున్నారు.

భోజదేవుడు : "స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః" అని అందుకే అన్నారు పెద్దలు. లౌకిక జీవితంపట్ల మీకు వున్న ఆసక్తిని పరిశీలిస్తే పురుషుల

ఔన్నత్యానికి మీరు ప్రతిబంధకాలు అనేది స్పష్టంగా అర్థమవుతుంది యౌవన వేగాన్ని తృణప్రాయంగా జయించి మహా సత్యాన్ని తెలుసుకొనగోరే కారణజన్మునికి యినుప సంకెళ్లు తగిలించి ఆనందించమంటున్నావు.

రామాదేవి : లేనిపోని వేదాంతంతో నన్ను విసిగించకుండా నేను చెప్పినట్టు చెయ్యండి. నా ఏకైక పుత్రుడు నా ఆశలు అడియాసలు చేస్తే నేను భరించలేను. వాడి కడుపు పండి వంశం శాఖోపశాఖలుగా విస్తరిల్లితే నాకు గంపెడానందం. నన్ను ఏవిధంగా మీరు నిందించినా ఫరవాలేదు. కాని రెండు పదులు కూడా నిండని వయసులో అబ్బాయి శేష జీవితం వైరాగ్యానికి అంకితం కావడం నేను సహించలేను. వార్ధక్యంలో వాడూ, వాడి పిల్లలే మనకు దిక్కు....

భోజదేవుడు : సర్వం దైవాధీనం, అడిగి చూస్తాను. అబ్బాయిని పిలువు (రామాదేవి ఆనందంగా లోపలికి వెళుతుంది) మనిషికీ మనిషికీ యెంత విభేదం! పంచభూతాలు సూక్ష్మశరీరాన్ని ఆవరించి సత్వరజస్తమో గుణాలతో రజస్సుకు తమస్సుకు ప్రాధాన్యత కల్పించడం ఎంత విచిత్రం! (రామాదేవి జయదేవుని వెంటబెట్టుకొని వస్తుంది.)

జయదేవుడు : (సవినయంగా ప్రవేశిస్తూ) నాన్నగారూ! నన్ను వెంటనే రమ్మన్నారట ఎందుకో...

భోజదేవుడు : (పైకి లేచి) అవును నాయనా! కూర్చో! నీవు నిరంతరం మౌనంగా ఏకాంతంగా మనస్సును ఎందో నిలిపి కాలం గడపడం నీ జననీ జనకులమైన మేము భరించలేకుండా ఉన్నాము.

జయదేవుడు : నాన్నగారూ! జీవనం బుద్బుదప్రాయం అని మీకు తెలియనిది కాదు. విషయవాంఛా నిలయమయిన ఈ శరీరాన్ని సాధన మాత్రముగా గైకొని ఆ జగన్నాటక సూత్రధారిని తెలుసుకొనే ప్రయత్నం చెయ్యడమే ఈ శరీరధారణయొక్క పరమావధిగా భావిస్తున్నాను.

భోజదేవుడు : బాబు! నీవు జ్ఞానివి. నీ మాటలు అక్షరసత్యాలు. కాని బ్రహ్మచర్యం దాటిన తర్వాత గృహస్థాశ్రమాన్ని సక్రమంగా నిర్వర్తించి, అనంతరం వానప్రస్థ, సన్యాసాశ్రమాలను స్వీకరించాలని పురాణాలు చాటుతున్నాయి. తద్వారా చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయని నీ వెరుగనిది కాదు.

జయదేవుడు : నాన్నగారూ! ప్రాణి బాల్య యవ్వన కౌమారాలు దాటి వార్ధక్యంలో ప్రవేశిస్తాడు. కాని ఆ వయస్సులో పరమార్థచింతనకు సమయము, అవకాశము చాలక ఇంతవరకు గడిపిన జీవితం వృధా అయినది గదా అని ముముక్షువు అయినవాడు చింతిస్తాడు. ఈ రహస్యాన్ని యౌవన ప్రారంభంలోనే గ్రహించి రాజపుత్రుడైన గౌతముడు పచ్చి బాలింత అయిన భార్య యశోదరను, పుత్రుడైన రాహులుని సాహసోపేతంగా పరిత్యజించి రాజభోగాలను అవలీలగా తృణీకరించి అరణ్యవాసాన్ని స్వీకరించలేదా?

రామాదేవి : బాబూ! అవి చరిత్రగా చెప్పబడుతున్న కథలు మాత్రమే. అవి జరిగినట్టు సాక్ష్యాలు లేవు. అయిన సంసార జీవితాన్ని కొనసాగించి సత్సంతానాన్ని పొంది పితృఋణం తీర్చుకోవడం, తర్వాత దైవసేవాతత్పరులు కావడం మానవ లక్షణం.

జయదేవుడు : అమ్మా! మీ మాటలు పూర్తిగా నాకు అర్థం కావడం లేదు. నేను వివాహితుడనై అచిరకాలములోనే భార్యను పోగొట్టుకుని ఉన్నాను.

యుగాంతం

శాస్త్రం
శస్త్ర శిఖవుల్ని ప్రసవిస్తే,
మతం
దారుణ హింసా వ్రతాన్ని ప్రబోధిస్తే,
హాలం
హాలాహలాంబుధుల్ని పంపిస్తే,
కలం
అఖిలమై
కలకల నినాదాలు వికృతంగా వినిపిస్తే,
జనం
విలయ యుద్ధంగా ప్రకటిస్తే
క్రాంతి పోతే.......

శ్రీ గవేయహారం శేషఫణిశర్మ

ఆ విధంగా గృహస్థాశ్రమాన్ని కూడా నేను తగిన వయస్సు రాక మునుపే పూర్తి చేశాను.

భోజదేవుడు : జయదేవా! నామమాత్రంగా వివాహం జరిగినా కోడలు యుక్త వయస్కురాలు కాకమునుపే స్వర్గలోకానికి చేరుకుంది. అందుచేత నీవు గృహస్థాశ్రమాన్ని నిర్వర్తించావనడం సత్యదూరం. కావున-

జయదేవుడు : చెప్పండి నాన్నగారు! కావున...?

భోజదేవుడు : పునర్వివాహం చేసుకోమని నీ తల్లి నేను అడుగుతున్నాము.

రామాదేవి ; అవును బాబు! అదే మా కోరిక.

జయదేవుడు : అమ్మా! నీ కుమారుడు ఇంతటి అపసవ్యానికి పాల్పడతాడనే అనుకున్నావా? నాన్నా! మీరు గూడ నా మనోగతాన్ని ఇంతవరకూ ఇంతవరకూ గ్రహించలేదా?

రామాదేవి : బాబూ! బిడ్డల భవిష్యత్తు తీర్చిదిద్దడం తల్లిదండ్రుల ప్రథమ కర్తవ్యం. గతించిన నీ వివాహజీవితం ఒక కల మాత్రమే.

భోజదేవుడు : అవును బాబు! నీ తల్లి మాటలు యదార్థములు.

జయదేవుడు ; నాన్నగారూ! మీ కుమారునికి తల్లిదండ్రుల మాట తృణీకరించాడనే అపవాదు రానివ్వవద్దు. నా యీ శేషజీవితాన్ని ఆ గోపికా వల్లభుని సేవకై వినియోగించనివ్వండి. నాకు యిక ఏ ప్రతిబంధకాలూ వద్దు. ఆ బృందావన విహారి! ఆ లీలామానుష విగ్రహుడు! ఆ మురవైరి! ఆ కరుణామయుడు! ఆ దీన బాంధవుడు! ఆ శరణాగత వత్సలుడు! అనుగ్రహించి నన్ను తనలో ఐక్యం చేసుకొనే అవకాశాన్ని ప్రసాదించండి. మరోవిధముగా మాతా పితలైన మీకు వివరింపలేను. నన్ను క్షమించండి.

రామాదేవి : బాబూ!

జయదేవుడు :

యది హరిస్మరణే సరసం మనో
యది విలాస కలాసు కుతూహలం
మధుర కోమల కాంత పదావలీం
శృణు తదా జయదేవ సరస్వతీం

వేదానుద్ధరతే! జగన్నివహతే! భూగోళ ముద్బిభ్రతే!
దైత్యాం ధారయతే! బలిం ఛలయతే! క్షత్రక్షయం కుర్వతే!
పౌలస్త్యం జయతే! హలం కలయతే! కారుణ్య మాతన్వతే
మ్లేచ్ఛాన్ మూర్ఛయతే! దశాకృతి కృతే కృష్ణాయ,
తుభ్యన్నమః

(అని చేతులెత్తి పాడుకొంటూ తన్మయత్వంతో జయదేవుడు నిష్క్రమిస్తాడు. భోజదేవుడు రామాదేవి నిర్ఘాంతపోయి 'బాబూ, నాయనా' అంటూ అతనిని అనుసరిస్తారు)

(తెర పడుతుంది)

తృతీయాంకము

స్థానము : రాజదర్బారు.

(లక్ష్మణసేన మహారాజు సింహాసనముపై ఆసీనుడై వుంటాడు. ఆయన ప్రక్కనే మహారాణి ఉచితాసనముపై కూర్చుని ఉంటుంది. రాజదర్బారు ఆడంబరముగా అలంకరింపబడి వుంటుంది. దర్బారుకు రెండు ప్రక్కల కొన్ని ఆసనాలు వుంటాయి)

దౌవారికుడు : (ప్రవేశించి వంగి సమస్కరించి) రాజాధిరాజ! రాజమార్తాండ! అరివీర భయంకరా! శ్రీ శ్రీ శ్రీ లక్ష్మణసేన మహాప్రభువులుంగారికి జయము! జయము!

లక్ష్మణసేనుడు : నీ రాకకు... కారణమేమి?

దౌవారికుడు : మహారాజా! జయదేవుడని పేరుగల ఒక వయోజనుడు తమ దర్శనార్థము వచ్చియున్నాడు. రాజసందర్శనము చేయవలసిన దని అతనికి ప్రభువులు గతములో వర్తమానము పంపిరట.

లక్ష్మణసేనుడు : జయదేవ కవియా? అతడు తన కవితా పాటవముచేతను, గాన మాధుర్యము చేతను, దైవారాధనా తత్పరత చేతను వేనోళ్ళ పొగడబడుచున్నాడు. అతనికి రాజాస్థానమున ఆస్థానకవి పదవిని స్వీకరింపుమని ఉత్తరువులు పంపితిమి. తక్షణమే ప్రవేశ పెట్టుము.

దౌవారికుడు : చిత్తం ప్రభూ! (వంగి సమస్కరించి బయటికి పోవును)

మహారాణి : జయదేవుడను పేరు ప్రథమముగా వినుచున్నదానను. ఆ భక్త కవి ఎచ్చటివాడు ప్రభూ?

లక్ష్మణసేనుడు : ఆతడు కిందు బిల్వమనబడు గ్రామనివాసి. మహాభక్తుడు, కవి, గాయకుడు.

మహారాణి : అటులనా? ఆతనికి రాజాస్థానమున తప్పక పదవి నీయవలసినదే.

జయదేవుడు : (ప్రవేశించి రెండు చేతులు జోడించి రాజదంపతులకు సవినయంగా నమస్కరిస్తూ) శరణాగత వత్సలులైన రాజదంపతులకు జయదేవుని అభివాదములు. పార్వతీ పరమేశ్వరులవలె శోభిల్లు భవదీయ దర్శనముచే ఈ జయదేవుడు కృతార్థుడయినాడు.

లక్ష్మణసేనుడు : (లేచి ఎదురేగి జయదేవుని సాదరముగా ఆహ్వానిస్తూ [కుడి ప్రక్క ఎదురుగానున్న ఆసనము చూపించి] భక్తకవీ! జయదేవా! ఆహ్వానము. మీబోటి భక్తుల వలన ఉత్కళ సామ్రాజ్య కీర్తి చంద్రికలు దశదిశలా వ్యాపించుచున్నవి. ఆసనమును అలంకరింపుడు.

జయదేవుడు : (కూర్చుంటూ) విజయోస్తు రాజరాజా విజయోస్తు.

లక్ష్మణసేనుడు : కవివర్యా! భక్తి పారవశ్యముతో మీరు గానము చేయు అష్టపదులు ఆసేతు హిమాచలము ప్రతిధ్వనించుచున్నవి. మా ఆహ్వానము మన్నించి మీరు వెంటనే ఇట కరుదెంచుట మాకు మిక్కిలి ముదావహముగా నున్నది.

జయదేవుడు : భూపతీ! అంతయు దైవేచ్ఛ! మనము కేవలము నిమిత్తమాత్రులము.

లక్ష్మణసేనుడు : మీరు భక్తాగ్రగణ్యులు. సరస్వతియు మీ నోట లాస్యము చేయుచున్నది. మా కోరిక నంగీకరించి ఆస్థాన కవి పదవిని స్వీకరింపుడు.

జయదేవుడు : నృపవర్యా! ఐహికములైన పదవులు, ధన సంబంధితములైన జీవనవిధులు నాబోటివారికి అంతరాయములు. భగవదనుగ్రహము కొరకు తపించువానికి ఈ పదవులేల?

లక్ష్మణసేనుడు : మీరు సర్వసంగ పరిత్యాగులని మేమెరుగుదుము. దైవారాధనకు మా పాలనలో మీకు ఎట్టి అవాంతరము కలుగనీయము. మీరు కోరినచోట మీ యిచ్ఛానుసారము ఆశ్రమ నిర్మాణము కూడా గావింతుము. కాదనకుడు.

మహారాణి : కవీశ్వరా! మహారాజుల పాలనలో భక్తకవులైన తమకు భగవదారాధనకు, సరస్వతీసేవకు, ఆటంకము వాటిల్లనేరదు. రాజాహ్వానము ప్రకారము ఆస్థాన కవి పదవి నలంకరించుటకు సందేహింపకుడు.

జయదేవుడు : అమ్మా! రాజ్యమందలి జనులందరకు మీరిరువురు మాతాపితలు. మీ మాట ప్రకారము నాకు శాంతి భంగము కలుగని యెడల రాజాహ్వానము, మహాభాగ్యముగా దలంచి శిరసావహింప గలవాడను.

లక్ష్మణసేనుడు : ధన్యోస్మి జయదేవా ధన్యోస్మి!

మహారాణి : మీ నిర్ణయము ఆనందదాయకముగా నున్నది.

జయదేవుడు : (పైకి లేచి రాజదంపతులకు అభివాదము సల్పి) ప్రస్తుతము స్వగృహమున కరుదెంచి, రేపటి దినమున ప్రభాతవేళ దర్శనము చేయుదును. సెలవిండు.

మహారాణి : సుకవీ! మిమ్ము దర్శించిన మరుక్షణమునుండి మీ కవితా రసాస్వాదన గావింపవలెననియు, ఆ భక్తి మాధుర్యమును చవి చూడవలెననియు, నా మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. ఒక్కసారి మీ కవితామృతమును గ్రోలజేసి కృతార్థురాలును చేయుడు.

జయదేవుడు : అమ్మా! కవియు, కవితయు ఆ లీలామయుడే! పార్థివ శరీర ధారినైన నేను నిమిత్తమాత్రుడను.

శ్లో॥ జయ జగదీశహరే! జయ జగదీశహరే!
ప్రళయ పయోధి జలే ధృతవానసి వేదం
విహిత వహిత్ర చరిత్రమ ఖేదం
కేశవ! ధృత మీన శరీర! జయ జగదీశహరే!
కేశవ! ధృత మీన శరీర! జయ జగదీశహరే!
జయ జగదీశహరే! జగదీశ హరే!
జగదీశహరే! జగదీశహరే!

(జయదేవుడు తన్మయత్వంతో పాడుతూ వుంటాడు)

[తెర పడును]

చతుర్థాంకము

స్థానం : రాజదర్బారు.

(రాజు, రాణి, కొంతమంది రాజవంశీకులు ఉచితాసనాలపై కూర్చుని గీత గోవిందంలోని అష్టపదులు జయదేవుడు భక్తిప్రపత్తులతో గానం చేస్తూ ఉండే వింటూ ఉంటారు. జయదేవుని తల కొంచెము తెల్లగా వుండును)

జయదేవుడు : శ్లో॥ పద్మాపయోధర తటీ పరిరంభలగ్న
కాశ్మీర ముద్రిత మురో మధుసూదనస్య
వ్యక్తాను రాగ మివ ఖేల దనంగ ఖేద
స్వేదాంబు పూరమను పూరయతు ప్రియంవః॥

శ్లో॥ వసంతే వాసంతి కుసుమ సుకుమారై రవయవై
ర్భ్రమన్తీం కాన్తారే బహువిహిత కృష్ణానుసరణామ్
అమన్దం కన్దర్ప జ్వర జనిత చిన్తాకుల తయా
వలద్బాధాం రాధాం సరస మిదమూచే సహచరీ॥

దౌవారికుడు : (ప్రవేశించి రాజుకు సవినయముగా వంగి నమస్కరిస్తూ మహా రాజులకు జయము! జయము!

లక్ష్మణసేనుడు : ఏమది?

దౌవారికుడు : ప్రభూ! ఒక వృద్ధ బ్రాహ్మణుడు ఒక యువతిని వెంటనిడుకొని రాజసందర్శనము చేయగోరుచున్నాడు. తమ అనుమతి ఐన యెడల...

లక్ష్మణసేనుడు : భూ సురోత్తముడా?... శీఘ్రమే ప్రవేశపెట్టుము.

దౌవారికుడు : చిత్తం ప్రభూ! (వంగి నమస్కరించి వెళ్ళిపోవును. వృద్ధుడైన ఒక బ్రాహ్మణుడు పదహారు సంవత్సరాల వయస్సు గల తన కుమార్తెను వెంటనిడుకొని ప్రవేశిస్తాడు)

బ్రాహ్మణుడు : వీరాధివీర! వీరకులభూషణ! వీరశిరోమణి! లక్ష్మణసేన మహా ప్రభువులకు ఈ నిరుపేద విప్రుని నమస్కారములు.

లక్ష్మణసేనుడు : విప్రవర్యా! ఆహ్వానము. మీరు ఎచ్చటివారు? ఇటకరుదెంచుటకు గల కారణమేమి?

బ్రాహ్మణుడు : నరేంద్రా! నేను మన పూరీ నగరవాసిని. ఈమె నా కుమార్తె పద్మావతి. దైవసంకల్పానుసారము జయదేవ నామముతో వెలుగొందు భక్తకవిని కలుసుకొనవలసి యున్నది. ఆ కవి రాజాస్థానమున కలడని ఎరిగి ఇట కరుదెంచితిని.

లక్ష్మణసేనుడు : విప్రోత్తమా! జయదేవకవి మీ సమక్షముననే యున్నవాడు. [జయదేవునివైపు చూచి] కవీంద్రా! విప్రవర్యుని పలుకులు విని యుంటిరి కదా? ఆయనను తమ నివాస స్థలమునకు గొంపోయి ఆయన చనుదెంచిన కారణము నరసి, కార్య సంపూర్తి గావించుట ఉచితమని తలంతును.

జయదేవుడు : మహారాజా! బ్రాహ్మణోత్తముని పలుకులు వింటిని. ఆయన దైవసంకల్పానుసారము ఇట కరుదెంచినట్లు తెలియుచున్నది. వారు చెప్పు మాటలు తమ సమక్షముననే వినగోరుట నా అభీష్టము. [బ్రాహ్మణునివైపు చూచి] బ్రాహ్మణవర్యా! జయదేవుని ప్రణామము స్వీకరించి తమరు వాకృచ్చిన దైవసంకల్పమును ఎరింగింపుడు.

బ్రాహ్మణుడు : చిరాయురస్తు. కవీంద్రా! నరేంద్రా! సావధానముగా వినగోరుచున్నాను. ఆవిలో సంతానము లేక చిరకాలము జగన్నాథుని ఆరాధించి ఆయన వరముచే ఈ కుమార్తెను బడసితిని.

లక్ష్మణసేనుడు : అయినన?

బ్రాహ్మణుడు : నా కుమార్తె యుక్త వయస్కురాలు కాగానే ఒకనాడు స్వప్నములో జగన్నాథుడు సాక్షాత్కరించి జయదేవ కవితో ఈమె పాణిగ్రహణము జరిపింపుమని ఆదేశించినాడు. తత్కార్యసిద్ధికై మీ ముందు నిలుచుంటిని.

జయదేవుడు : హతవిధి! ఏమి ఈ పరీక్ష?

లక్ష్మణసేనుడు : బాగుబాగు. దైవకార్యములు కల్పనాతీతములు. కవీంద్రా! సందేహము వీడి వివాహమునకు సమ్మతింపుడు.

జయదేవుడు : రాజరాజా! ఇదియంతయూ వింతగానున్నది. కడు బాల్యముననే నాకు వివాహము జరిగినది. కాని విధివశాత్తు ఆమె స్వర్గస్థురాలయినది.

లక్ష్మణసేనుడు : రామరామ! ఆస్థానకవి జీవితమున ఇంతటి ఘోరమైన సంఘటన జరిగినదని ఇంతవరకు మేము తెలుసుకొన జాలమైతిమి కదా!

జయదేవుడు : అనంతరము నాకు ద్వితీయ వివాహము చేయ సంకల్పించి, నేను నిరాకరించుటచే దీన హృదయముతో మంచమునబడి మదీయ మాతాపితలు ఈ లోకమును విడచినారు.

అందరు : ఎంత ఘోరము!

లక్ష్మణసేనుడు : జయదేవా! తమ గత జీవనసంస్మృతులు ఇంత కటువుగా ఉన్నవని మేము ఊహింపజాలమైతిమి.

మహారాణి : ఇంతటి దారుణములు జరిగియుండుట వలననే కవీశ్వరుని యౌవనముననే వైరాగ్యము ఆవరించినది.

బ్రాహ్మణుడు : దైవలీలలు మానవుని మేధస్సుకు అందరానివి. ఇటువంటి సంఘటనలు భరించుట ఎవరికైనను కష్టతరమే. గతంగతః. దైవాజ్ఞను మన్నించి, కన్యాదానము స్వీకరించి, గృహస్థాశ్రమమును అవలంబింపుడు. తద్వారా నన్ను అనుగ్రహింపుడు.

జయదేవుడు : విప్రశిరోమణీ! నన్ను క్షమించండి. ఈ భారమును స్వీకరించుటకు నేను సిద్ధముగా లేను. (రెండు చేతులతో కనులు మూసుకొనును)

బ్రాహ్మణుడు : గతమునకు లోబడి వర్తమానమును నిరాకరించుట ఉచితము కాదని మీకు తెలియనిది కాదు. జీవితము చీకటి వెలుగుల సమ్మిశ్రణము. ఎప్పటికప్పుడు దైవదత్తానుసారము ప్రవర్తించుట వివేకవంతుల లక్షణము.

లక్ష్మణసేనుడు : కాదని ఎట్లన గలము?

మహారాణి ; గతించిన వడి దుడుకులను విస్మరించి ఈ కన్యను ధర్మపత్నిగా కవివర్యులు స్వీకరించుట ఉచితము.

జయదేవుడు : అమ్మా! మీరు కూడా అట్లే అనుచున్నారా?

బ్రాహ్మణుడు : ఏది ఏమైనను భగవత్ సంకల్పమును నేను మాత్రము కాదనజాలను. ఈశ్వరాదేశానుసారము కవీంద్రుడు నడచుకొనకపోయినచో నా కుమార్తెను ఇచ్చటనే వీడి వెడలెదను. ఆమెను ఆ జగన్నాథుడే రక్షించును. శలవు...(వెళ్ళబోవును)

లక్ష్మణసేనుడు : విప్రశిరోమణీ! శాంతింపుము.

బ్రాహ్మణుడు : మహారాజా! నేను నిలచియుండుటకు ఇక ఏమియును మిగులలేదు. జయదేవకవి భగవదాదేశమును తిరస్కరించినాడు. కాని జగన్నాథుని పదపద్మాను రక్తుడనైన నేను నా కుమార్తెను వెనుకకు తీసుకొని పోజాలను. సకల జనులను పరిపాలించు మీరు మీ బుద్ధికి తోచినట్లు గావింపుడు. నేను మరలుచున్నాను (కుమార్తెతో) అమ్మా! జగన్నాథస్వామిని స్మరింపుము. ఆతడే నీకు శ్రీరామరక్ష (వెడలిపోవును).

[బ్రాహ్మణుని కుమార్తె తండ్రి వెడలిన దిక్కువైపు చూస్తూ గట్టిగా విలపిస్తుంది]

మహారాణి : అమ్మాయీ! పద్మావతి! చింతింపకుము. నీకు భయము వలదు.

పరిస్థితులు చక్కబడునంత వరకు నీవు రాజభవనంలో నిర్భయముగ ఉండవచ్చును.

[మహారాజుతో] ప్రభూ! ఈమె తండ్రిని వెనుకకు రప్పించిన ఈమెకు కొంత ఊరట కలుగును.

లక్ష్మణసేనుడు : దేవీ! ఆయన సద్బ్రాహ్మణుడు మరియు పరమ ఛాందసుడు. నిరంతర విష్ణుదీక్షా తత్పరుడు. కలయందైనను దైవమును విస్మరించనివాడు. ఆయనను వెనుకకు పిలిచి ప్రయోజనము లేదు. తిరుగులేని ఆయన నిర్ణయము యిసుమంతైనను మార దనుటలో సందేహము లేదు. పద్మావతి విషయము ఇక మనము ఆలోచించవలసినదే.

జయదేవుడు : ప్రభూ! పరిస్థితులు ఆత్మహత్యా సదృశమములుగా నున్నవి.

మహారాణి : కవీంద్రా! మీరు సర్వజ్ఞులు. ప్రతి ప్రాణియందును పరమేశ్వరుని దర్శించు మీకు ఈ కన్య భారము కాజాలదు.

లక్ష్మణసేనుడు : పూర్వము అరణ్యవాసులైన మునీశ్వరులు కూడా తమ తమ అర్ధాంగుల పరిచర్యలు పొందుతూ ఘోరతపస్సు కొనసాగించి పరమాత్మని కైంకర్యమును పొందరని మీకు తెలియనిదా జయదేవా!

జయదేవుడు : మహారాజా! మహర్షులు జితేంద్రియులు 'పద్మపత్రమివాంభసా' అనునట్లు వారి ఐహిక జీవితము పారలౌకిక జీవితమునకు సోపానమాత్రముగా ప్రవర్తిల్లినది. నేను సామాన్యుడను. ఈ క్షణమందు నేను ఒగజారిన యెడల పరమాత్మ సేవకు భంగము వాటిల్లునని నమ్ముచున్నాను.

మహారాణి : కవివర్యా! శంకరచరితము మీకు సుపరిచితమే గదా! పరమ భాగవతోత్తముడైన శంకరుడు కూడా పరకాయ ప్రవేశము ద్వారా లౌకిక జీవనము కొనసాగించిన తరువాత మాత్రమే మండనమిశ్రుని జయించినాడని మీకెరుగరా? ధర్మపత్నీ సహితమైన లౌకిక జీవనము కూడా పురుషార్థ సిద్ధికి దోహదకారి యగునే కాని వేరొండు గాదు.

జయదేవుడు : రాజదంపతులు కూడా ఆ భూసురోత్తముని వాదమును సమర్థించుచున్నారు.

రాజదంపతులు : నిజము జయదేవా! అది భూసురోత్తముని వాదము కాదు. జగన్నాథుని ఆదేశము.

జయదేవుడు : ప్రభూ! మీరు యింతగా నన్ను బలవంత పెట్టుచున్నారు గదా! ఇంతకూ పద్మావతి మనోగతము నెరింగినారా?

పద్మావతి : (మహారాణి చేరువగా వచ్చి మందస్వరముతో కన్నీరు వొత్తుకొనుచూ) అమ్మా! మజ్జనకుడు దైవేచ్ఛ ప్రకారము నన్ను యిచ్చట వదలి వెళ్ళినాడు. ఆయన ఆశయము నెరవేర్చుటే నా జీవనధ్యేయము. (క్రీగంట జయదేవుని చూస్తుంది)

లక్ష్మణసేనుడు : విన్నారు గదా! కవీశ్వరా! అమ్మాయి తన మనోగతము నెరింగించినది. ఇక మీ కళ్యాణమునకు ఏర్పాట్లు గావింతును మహారాణీ! ఇక నిష్క్రమింతము.

మహారాణి : కథ సుఖాంతమైనది ప్రభూ!

జయదేవుడు : అంతా ఈశ్వరేచ్ఛ. సర్వం ఖల్విదం బ్రహ్మ. (తెరపడును. వెంటనే 'జయ జయ దేవహరే' అను గీతము నేపథ్యమునుండి వినిపించును)

(తెర పడును)

పంచమాంకము

స్థానము : అరణ్యమందలి కాలిబాట.

సమయము : సాయంకాలము

(జయదేవుడు, పద్మావతి తీర్థయాత్రలు చేసుకొంటూ అరణ్యములో సంచరిస్తున్నారు)

జయదేవుడు : శ్లో॥ లలిత లవఙ్గలతా పరిశీలన కోమల మలయ సమీరే
మధుకర నికర కరమ్బిత కోకిల కూజిత కుఞ్జ కుటీరే
యువవిహరతి హరిరిహ సరస వసన్తే నృత్యతి సఖి!
విరహిజనస్య దురన్తే
ఉన్మద మదన మనోరథ పథిక వధూ జన జనిత విలాపే
అలికుల సంకుల కుసుమ సమూహ నిరాకుల వకుల కలాపే
మృగ మద సౌరభ రభస వశం వదన దళ మాల తమాలే
యువజన హృదయ విదారణ మనసిజ నఖిరుచి కింశుకజాలే
జయ జయదేవ హరే...

(జయదేవుడు తన భార్య పద్మావతితో బయలుదేరి, వివాహానంతరం దేశమందలి వివిధ యాత్రాస్థలాలు దర్శిస్తూ, ఒకనాడు సాయం సమయమున ఒక వన్యమార్గంగుండా ప్రయాణిస్తూ భగవన్నామ సంకీర్తన చేస్తూ వుంటాడు. ఇరువురు నెత్తిపై కొన్ని మూటలు మోస్తూ వుంటారు)

పద్మావతి : స్వామీ? కాకులు దూరని ఈ కారడవిలో దినమంతా నడిచాము. కాని కనుచూపుమేరలో గ్రామములున్నట్లు కనిపించుట లేదు. ఉదయమునుండియు ఒక్క చుక్క కూడా మంచినీరు దొరక లేదు. అంతులేని ఆకలి దప్పికలతో ప్రాణము సొమ్మసిల్లినట్లున్నది. ఇక ముందుకు సాగుట నావల్ల కాదు. (అని రొప్పుతూ నెత్తినున్న మూట క్రిందికి దించి అక్కడే కూర్చుండిపోవును)

జయదేవుడు : (కీర్తన ఆపి, మూట క్రిందికి దించి, ఆమె చెంత కూర్చుని దీనస్వరంతో) పద్మావతీ! నీ సహకారంతో కాశీ, రామేశ్వరము ఆదిగాగల సమస్త పుణ్యక్షేత్రాలూ దర్శించి రమ్మని మనకు వివాహము జరిపించిన మన ప్రభువు అంతులేని ధనము యిచ్చి దీవించి పంపినాడు. కాని మార్గాయాసము వలన సేదదీరుద మనుకొన్న మనకు ఈ ధనము ఇసుమంతయు ఉపయోగపడుట లేదు. దినమంతయు గాలించినను యెచ్చటను జలము కనిపించుట లేదు. చేరువలో గ్రామములున్న జాడలేదు. నా వలన నీకు ఇన్ని యిక్కట్లు సంభవించినవి గదా! ఈ పరిసర ప్రాంతములలో ఎందైన నీరు కలదేమో వెతికి చూతును. (అని ఆమెను వదలి, మూటయందలి స్వర్ణ జలపాత్ర చేతబట్టి వెళ్లను. పద్మావతి భర్త వెళ్ళిన దిక్కువైపు చూస్తూ కూర్చుంటుంది)

(మరుక్షణములో యిద్దరు దొంగలు అతనిని లాగుకొని రంగస్థలముపై ప్రవేశింతురు. పద్మావతి దొంగల అధీనములోనున్న భర్తను చూచి భయముతో కంపిస్తూ, కెవ్వుమని అరచును)

పద్మావతి : ఎవరు మీరు? చలిచీమను కూడా కాలితో త్రొక్కి యెరుగని నా భర్తను యిలా ఎందుకు బంధించారు? (ఏడుస్తుంది)

1 వ దొంగ : నీ భర్త చేతిలో బంగారు పాత్ర కనిపించినది, మాకు కావలసినది, మీవోటి దాటిసారులే!

2 వ దొంగ : నీవు ధరించిన బంగారు ఆభరణములు, దాచి వుంచిన సొమ్ము వెంటనే మా ముందు పెట్టు.

పద్మావతి : (ఆకాశమువైపు చూస్తూ, కన్నీరు కారుస్తూ, చేతులెత్తి) హే!

జగన్నాథా! ఏమిటీ విచిత్ర పరీక్ష? పవిత్ర తీర్థస్థానాలు దర్శిస్తూ ఒక్క క్షణం కూడా నిన్ను విస్మరించని మాకు ఈ వైపరీత్యమ తగునా? (విలపించును)

జయదేవుడు : పద్మావతీ! వీరిరువురు గజదొంగలు. వీరు నన్ను ఏమి చేసినను సరే నీవు పారిపొమ్ము. ఎవరైనా దయార్ద్రహృదయులు చూసి పడి, అభయమిచ్చి, కాపాడవచ్చును.

1 వ దొంగ : (జయదేవుని పడి భుజముపై గుద్ది) మూర్ఖుడా! ఏమి తెలివిరా నీది? వంటినిండా బంగారము నింపుకొనియున్న ఆడుదానిని నీవనుకొనినంత సులభముగా పారిపోనిత్తుమా?

2 వ దొంగ : (మొలనున్న కత్తిని పైకి తీసి, ఝుళిపిస్తూ) వెంటనే నీ వస్తువులన్నీ తీసి మూటకట్టి మాకు యివ్వు. లేదా (కత్తిని జయదేవుని కంఠముపై పెట్టి) నీ భర్త ప్రాణాలు కోల్పోయి నీ కళ్ళ ముందే కోడిపెట్టవలె గిలగిలా కొట్టుకొనును.

పద్మావతి : [ఏడుస్తూ] వద్దు వద్దు. మీకు చేతులెత్తి నమస్కరిస్తాను. నా భర్త కలనైనా హరిస్మరణవీడని పరమభక్తుడు. సూర్యోదయము నుండి ఆహార పానీయాలు దొరకక ఈ అడవిని దారి తప్పి సంచరించుచున్నాము. సింహాచలక్షేత్రమును దర్శించవలెనని మా కోరిక. మా వద్దనున్న ధనమంతా మీకు సమర్పిస్తాను. కావాలంటే నా ప్రాణాలు కూడ తీసుకోండి. నా భర్తను మాత్రము విడిచిపెట్టండి. భగవంతుడు మీకు మేలు చేస్తాడు. (పద్మావతి తన వంటినున్న ఆభరణాలు తీస్తుంది)


వ దొంగ : [మీసం మీద చేయి వేసుకుంటూ, వికృతంగా నవ్వి] డబ్బు, బంగారము యిస్తే ప్రాణాలెందుకే కూనా?

జయదేవుడు : దుష్టులారా! నా భార్య అమాయకురాలు. జగన్నాథ వర ప్రసాదిని. మా పెళ్ళి జరిగి మాసము దినములు కూడా గడువలేదు. లక్ష్మణసేన మహారాజు కట్నకానుకలిచ్చి మమ్ము తీర్థయాత్రకు పంపించాడు. మీ దౌష్ట్యము ఆయనకు తెలియకపోదు. ఆయన మిమ్ములను శిక్షింపకపోడు. ఇప్పటికైనా నిజము తెలుసుకొని మమ్ములను విడిచిపెట్టండి. లేనియెడల మీరు సర్వనాశన మగుట తథ్యము.

2 వ దొంగ : [క్రోధావేశంతో కత్తి పైకెత్తి] ఎవడురా లక్ష్మణసేన మహారాజు? మాకు రాజులూ గీజులూ తెలియదు. నీవు ఇంకా మాట్లాడితే నీ భార్య బొట్టు, గాజులు తీయాల్సి వస్తుంది. ఏ రాజు వచ్చి రక్షిస్తాడో చూస్తాం, [అని తటాలున జయదేవుని ఎడమ కాలుపై నరుకుతాడు. జయదేవుడు "హా శ్రీహరీ! అంటూ క్రింద పడిపోతాడు. రక్తము ధారలా ప్రవహిస్తుంది. పద్మావతి స్వామీ! స్వామీ! అని ఘోరంగా విలపిస్తూ పడిపోయిన భర్తపై పడి రోదిస్తుంది.]

దొంగలు : [దొంగలు వారి మానాన వారిని వదిలి పద్మావతి తీసిపెట్టిన ఆభరణములు, మూటలోనున్న సొమ్మును వేరే మూట కట్టుకొని వికృతంగా నవ్వుతూ] మా సంగతి ఎవరికైనా చెబితే మీరెక్కడున్నా సరే ప్రాణాలు తీసేస్తాం. [అని ఒకరి వెనుక ఒకరు వెళ్ళిపోతారు]

పద్మావతి ; [బోరున విలపిస్తూ] పరమేశ్వరా! ఎందుకీ ఘోరం తలపెట్టావు? నిన్ను తప్ప వేరొండు తలంచని జయదేవ కవీంద్రునికా ఈ శిక్ష? [హృదయ విదారకంగా రోదిస్తుంది]



కోయదొర : (ఇంతలో ఒక కోయదొర వెలుగుచున్న కాగడా పట్టుకొని అక్కడకి వస్తాడు. విలపిస్తున్న పద్మావతిని, క్రిందపడి ముచ్చెమటలు పట్టివున్న జయదేవుని చూచి) కూనా? ఏ ఊరు మీది? ఏమైనాది? (ఇంకా దగ్గరకు వచ్చి రక్తము కారుతున్న జయదేవుని కాలును చూచి) అఁ కొండదేవరా! ఘోరం జరిగి పోనాది. రకతము కారిపోనాది. పసరు పిండుతానుండు. (అని ప్రక్కకు వెళ్ళి కొన్ని ఆకులు తెచ్చి పసరు గాయంపై పిండుతాడు. రక్తప్రవాహం ఆగిపోతుంది)

జయదేవుడు : కొంచెం పైకి లేచి, రెండు చేతులు వెనుకకు ఆనుకొని కూర్చుంటాడు)

పద్మావతి : కోయదొరకు (నమస్కరిస్తూ) బాబా! మా ప్రాణాలు కాపాడడానికి వచ్చిన దేవుడివి నీవు.

కోయదొర : కూనా! అసలేటి జరిగినాది?

పద్మావతి : బాబా! ముందు మా దాహం తీర్చడానికి కొంచెము నీరు తెచ్చి పెట్టు. ఆయన సేదదీరిన తరువాత జరిగిందంతా వివరిస్తాను.

కోయదొర : కూనా! నీవు నీ జతగాడి దగ్గరే కూసునుండు. సిటికెలో నీళ్ళు తెచ్చిగలను (వెళతాడు)

పద్మావతి : స్వామీ! కొంచెము ఓపిక పట్టండి. ఆతను చాలా మంచివానిలా ఉన్నాడు. ఈ వేళప్పుడు ఇటు రావడం మన అదృష్టం.

జయదేవుడు : (తల ఊపుతూ) అంతా దైవ లీల.

కోయదొర : (నీళ్ళతో ప్రవేశించి) ఇదిగో నీళ్ళకుండ. దాహం తీరేదాకా పట్టించు కూనా!

పద్మావతి : (జయదేవునికి తన దోసిలితో నీరు పడుతుంది. అనంతరం తన చీరె చెంగు నీటిలో ముంచి జయదేవుని ముఖాన్ని వత్తి తను కూడా కొంచెము నీరు త్రాగుతుంది)

కోయదొర : (పద్మావతి నీరు పట్టే సమయంలో ఏవో ఆకులు కోసుకొచ్చి జయదేవుని గాయానికి కట్టుకడుతూ) బుల్లోడా! నీ కొచ్చిన భయము నేదు. నానిచ్చిన మందేసుకున్నావంటే సగమే కాదు. పూర్తిగా తెగినా నయమవుతాది. ఈ రేతిరికి నా గూడెంలో కునుకేద్దురుగాని నానంటే ఎవరనుకుంటున్నావ్? మా కొండోళ్ళందరికి నేనే పెద్దని. నానేటి సెబితే అదే సెయ్యాల. (కట్టు బిగించి కడుతూ) ఇంతకీ మీదే వూరు? ఈ దిసికెందుకొచ్చినారు? ఇక్కడేమైనాది?

పద్మావతి : బాబా! మాకు పెళ్ళయిన వెంటనే కట్నకానుకలతో లక్ష్మణసేన ప్రభువు యాత్రలకు పంపించారు. వివిధ తీర్థస్థలాలు దర్శించి సింహాచలక్షేత్రం చేరకోడానికి మేము ఈ అడవి దారిన పడ్డాము. పొద్దుటినుంచీ నడుస్తూనే ఉన్నాము. ఎక్కడా తిండి, నీరు దొరకలేదు సరికదా ఒక్క పల్లెగ్రామమైనా కనిపించలేదు. ఇంతలో ప్రొద్దుపోయింది. దాహం భరించలేక నేనిక్కడ చతికిల పడ్డాను. నీరు వెదకడానికి వెళ్ళిన నా భర్తను ఇద్దరు దొంగలు పట్టుకొని మా బంగారం, సొమ్ము కాజేసి, ఈ అఘాయిత్యం జరిపి వెళ్ళిపోయారు. ఇంతలో నీవు వచ్చి దేవునివలె కాపాడావు. (విలపిస్తుంది)

కోయదొర : ఏడీ? అట్టాగా? ఒక్క చ్చనం ఆగితే నా కొడుకులు నాకు దొరికిపోదురు. నీ బంగారము, సొమ్ము ఇప్పించిద్దును. కాని పారిపోనారు. పోనీలే. పోతే పోయిం డబ్బు, పానాలకు దోకా లేదు. లెగండి. గూడేనికి పోయి సక్కగా తిండి తిందురు గాని. రేపు పొద్దొడిచినాక మళ్ళీ మందేసి, మా జనాన్ని తోడిచ్చి బుల్లోడ్ని, నిన్ను కావిడిలో మోయించి మీ మారాజు దగ్గరకు తోలీగలను. లెగండి. (జయదేవుని భుజం కాసి లేవనెత్తినాడు. ఒంటికాలిపై కుంటుతూ జయదేవుడు హరినామస్మరణ చేస్తాడు. పద్మావతి అనుసరిస్తుంది.

శ్లో॥ తిర్యక్కంఠవిలోల మౌళితరళోత్తంసస్య వంశోచ్చర
ద్దీప్తి స్థాన కృతావధాన లలనా లక్షైర్న సంలక్షితాః
సంముగ్ధే మధు సూదనస్య మధురే రాధా ముఖేందౌ సుధా
సారేక స్థగితాశ్చిరం దదతుః క్షేమం కటాక్షోర్మయః

(తెర పడుతుంది)

షష్ఠాంకము

స్థానం : (రాజదర్బారు)

(లక్ష్మణసేనుడు సింహాసనారూఢుడై ఉంటాడు. ఆయన ప్రక్కనే మహారాణి ఉచితాసనాన్ని అలంకరించి వుంటుంది)

జయదేవుడు : (ప్రవేశించి) రాజదంపతులకు నమోవాకములు.

శ్లో॥ వృష్టివ్యాకుల గోకులావనరసా దుద్ధృత్య గోవర్ధనం
బిభ్రద్వల్లవ వల్లభాభిరధికానందాచ్చిరం చుంబితః
దర్పేణైవ తదర్పితాధర తటీ సింధూరముద్రాంకితో
బాహుర్గోప తనోస్తనోతు భవతాం శ్రేయాంసి కంసద్విషః॥

(వైశాలి సాయంతో కుంటుకుంటూ వచ్చి శ్లోకం పఠించి దీనంగా చూస్తూ నిలబడతాడు, రాజదంపతులు ఆశ్చర్య చకితులై జయదేవుని గుర్తిస్తారు)

లక్ష్మణసేనుడు : (పైకి లేచి జయదేవుని సమీపించి) ఎవరూ? జయదేవ కవియా?! ఏమిటీ వైపరీత్యము? మీరు యాత్రలకు వెళ్ళియుంటిరి కదా! అచట ఏమి జరిగినది? మీ కాలు...?

మహారాణి : జయదేవా! ఏమి జరిగినది? మీకు ఇంతటి అన్యాయము ఎట్లు జరిగినది? మీ సహధర్మచారిణి పద్మావతి ఎక్కడ!

జయదేవుడు : అమ్మా! మహారాజా! తమకు మా యందు అపారమైన ప్రేమాభిమానాలు కలవని నాకు తెలియును. విధివ్రాత తప్పించుకొనుట ఎంతటివారికైనా సాధ్యపడదు? ప్రారబ్ధమే అన్నింటికీ మూలము. గతమును తలంచి చేయగలిగినది ఏమియు ఉండదు.

లక్ష్మణసేనుడు : కవీంద్రా! యాత్రాగమనమున ఎందులకు యిట్లు జరిగినదో వివరించండి?

మహారాణి : రాజ్యములో బ్రాహ్మణులు, స్త్రీలు, భాగవతోత్తములు, పసికందులు, గోసమూహములు కష్టముల పాలపడినచో రాజ్యమునకు అరిష్టము, మీరు పరమ భాగవతోత్తములు. అందున మహారాజు అభిమానము చూరగొని ఆస్థానకవి పదవియందు ఉన్నవారు. మీ వివాహము మా చేతుల మీదగా జరిగినది. మీకు ఈ కష్టము దాపురించుటకు గల కారణమును మీరు రహస్యముగా ఉంచినచో భరించజాలము.

జయదేవుడు : అమ్మా! ప్రజలందరకూ తల్లిదండ్రులు మీరు. మీకడ నాకు రహస్యములేమిటి? నన్ను ఆదరించి పలు విధములుగా అభిమానించిన మిమ్ములను నా దీనగాథలతో విసిగించి బాధింపజాలక...

లక్ష్మణసేనుడు ; జయదేవా! మీరు సామాన్య మానవులు కారు. ప్రజల కష్టసుఖముల నరయుటయే ధర్మనిరతుడైన రాజునకు కర్తవ్యము.

మీబోటి గొప్పవారి విషయమున ఆ కర్తవ్యము మరికొన్ని రెట్లు అధికముగా నుండును. ఇటు వచ్చి సావధానముగా మీ ఆసనము అలంకరించి ఈ దుస్సంఘటనకు దారితీసిన సమాచారమంతటిని వివరింపుడు. మిమ్ము వికలాంగునిగా చూచిన మరుక్షణం నుండి మా హృదయము తల్లడిల్లుచున్నది.

జయదేవుడు : (కుంటుకుంటూ తన ఆసనము వద్దకు పోయి జాగ్రత్తగా దానిపై కూర్చొని) రాజేంద్రా! మీవద్ద నాకు దాపరిక మెందులకు ఉండును? జరిగినదానిని వినుడు. మేమిరువురము తమరిచ్చిన కట్న కానుకలు స్వీకరించి సుమారు ఇరువది దినములు ఎన్నియో తీర్థక్షేత్రములను దర్శించితిమి. చివరగా సింహాచల క్షేత్రమును దర్శించి రాజధానికి చేరుకొను ఉద్దేశ్యముతోనుండగా ఒకరోజు ఒక అడవిలో, మమ్ములను దొంగలు దోచుకున్నారు. వారిని ప్రతిఘటించుటకు ప్రయత్నించిన ఫలమిది. ఇందులకు మీరు విచారింపవలదు.

లక్ష్మణసేనుడు : గ్రామప్రాంతాలలో దొంగల బెడద ఉన్నదన్నమాట కవీంద్రా! ఒక విధముగా ఇది మా పరిపాలనా దక్షతకు సవాలువంటిది. నేనిప్పుడే నాలుగు దిక్కులకు వేగులను పంపి, ఆ బందిపోటులను పట్టింతును. మీకు జరిగిన అన్యాయము భర్తీ చేయుటకు వీలుకానిది. ఇందుకు మేమెంతయో బాధ పడుచున్నాము.

జయదేవుడు : మహారాజా! శివుని ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదని ఋషి వాక్కు. దీనికంతటికీ పూర్వసంచితమైన ప్రారబ్ధము కారణమగును. మీరు ఎంతమాత్రము చింతింపవలదు.

మహారాణి : భగవంతుడు మీపట్ల ఎంత కర్కశముగా ప్రవర్తించినాడు? ఇంతటి దారుణము గని ఎట్లు ఊరుకొనినాడు?

జయదేవుడు : అమ్మా! అట్లనవలదు. పరమేశ్వరుడు సర్వాంతర్యామి. సృష్టి స్థితి లయ కారకుడు. ఆది మధ్యాంతరహితుడు. ఆయనపట్ల నింద తగదు. మీకు నా యెడల గల ఆదరాభిమానముల వలననే అట్లనుచున్నారు. అదియును ఆయనకు తెలియును.

లక్ష్మణసేనుడు : నిజము కవీంద్రా! నిజము!

జయదేవుడు : శ్లో॥ రాధా ముగ్ధ ముఖారవింద మధుప స్త్రైలోక్య మౌళిస్థలీ
నేపథ్యోచిత నీల రత్న మవనీ భారావ తీరాంతకః
స్వచ్ఛందం వ్రజ సుందరీజన మనస్తోష ప్రదోషోదయః
కంసధ్వంసన ధూమకేతు రవతు త్వాందేవకీ నందనః॥

(తెర పడును)

సప్తమాంకము

స్థానము : రాణివాసము

(మహారాణి ఆసనముపై కూర్చొని ఉంటుంది. చెలికత్తె ఆమె జుత్తు సవరిస్తూ పూలతో అలంకరిస్తుంది.)

మహారాణి : ఏమే చంద్రలీలా! నా తల వెంట్రుకలు ఎక్కడైనా నెరసినవా ఏమి?

చంద్రలీల : అమ్మగారూ! మీది మన్మధుని రాణి రతిని తిరస్కరించు లోకోత్తర సౌందర్యము. మీ సౌందర్యము వాడిపోవుట ఎన్నటికీ జరగని పని. సువర్ణమును త్రోసిపుచ్చు దేహచ్ఛాయ, చంద్రబింబమును కప్పిపుచ్చు ముఖవర్చస్సు, తుమ్మెదలను కాదను కాటుక వర్షపు వేణీ బంధము ఎన్నని వర్ణించనమ్మ.

మహారాణి : అయిననూ ప్రభువులకు రాణివాసములోని మిగత రాణులపై మోజు తగ్గుట లేదు కదా?

చంద్రలీల : అమ్మా! తుమ్మెద ఎన్నో పుష్పములపై వాలును. అది దాని సహజ స్వభావము. అయిననూ మందార పుష్పమునందలి మకరందము గ్రోలిన తర్వాతనే తుమ్మెద మహదానందము ననుభవించును. ప్రభువులు తాత్కాలికముగా బాధ్యతాస్ఫురణచే అన్య రాణులందు మక్కువ చూపిననూ చివరికి మీ గూటికే చేరుదురు కదా! మహారాణిగా మీకున్న అందము, అధికారము, రాజఠీవి మిగతావారి కెక్కడవమ్మా?

మహారాణి : చంద్రా! మన ఆస్థానకవియైన జయదేవుని భార్య పద్మావతి చాలా అందమైనది కదూ?

చంద్రలీల : అందమైనదేనమ్మా! కాని మీయంత అందమైనది కాదు.

మహారాణి : ఊరుకోవే! నన్ను పొగడమని కాదు అడిగినది.

చంద్రలీల : నేనెక్కడ పొగిడానమ్మా? ఉన్నది ఉన్నట్టు చెప్పానంతే!

మహారాణి : అవును గాని చంద్రా! జయదేవునికి జరిగిన అన్యాయము శత్రువులకు కూడా జరగరాదు.

చంద్రలీల : నిజమమ్మా! ఆ మహాభక్తుడు చాలా గొప్పవాడు. బందిపోట్లు ఆయన కాళ్ళు నరికి గంపెడు పాపము మూట కట్టుకొనినారు. పాపము పద్మావతి ఆయనతో ఎలా గడుపుతుందో ఏమో?

మహారాణి : నిజమేనే చంద్రా! పాపము ఆ అమ్మాయికి 16 ఏండ్లు కూడా నిండలేదు. భర్త అవిటివాడయ్యాడు. జీవితాంతము ఎలా నెగ్గుకొస్తుందో! ఏమో! ముద్దా ముచ్చటా తీర్చని ముసలివాడిచేతిలో పడినట్టయింది.

చంద్రలీల : అమ్మా! పద్మావతికి జయదేవ కవిమీద మునుపటి ప్రేమాను రాగాలు...కాలు పోయిన తరువాత కూడా ఉన్నాయంటారా?

మహారాణి : ఆ సంగతి మనకెలా తెలుస్తుందే?

చంద్రలీల : మీరు పరీక్షించాలమ్మా!

మహారాణి : ఆమె దైవ వర ప్రసాదిని. నేను ఎలా పరీక్షించగలను?

చంద్రలీల : నా సలహా పాటిస్తే తెలుస్తుందమ్మా!

మహారాణి : ఏమిటే అది?

చంద్రలీల : ఏమీ లేదమ్మా చాలా సులభము.

మహారాణి : మురిపించడం మాని చెప్పవే.

చంద్రలీల : అమ్మా! నిన్న మహారాజులుంగారు వేటకు బయలుదేరుతూ సరదాగా జయదేవకవిని కూడా రథము ఎక్కించి తీసుకు వెళ్ళారా?

మహారాణి : అవునూ...వెళ్ళారు. వెళితే?

చంద్రలీల : పద్మావతిని పిలిపించి మీరు చిన్న అబద్ధము ఆడితే ఆమె ప్రేమ సంగతి తేలిపోతుందమ్మా. అంత చిన్నపిల్ల తనకంటె చాలా పెద్దవాణ్ణి కట్టుకుని అతను అవిటివాడు ఐపోయినప్పుడు, ఆమె మనస్సు ఎలా ఉంటుందో క్షణములో తెలిసిపోతుంది.

మహారాణి : ఎందుకే మనకీ బాధ? ఆమె మనస్సు తెలుసుకొని మనం ఏం చేస్తాము?

చంద్రలీల : ఊరికేనమ్మా. తిని కూర్చుని ఏం చేస్తాం? రాజావారు ఎలాగూ ఊళ్ళో లేరు. ఏదో వినోదము ఉండాలి కదా?

మహారాణి : ఇంతకీ ఏమిటా అబద్ధం?

చంద్రలీల : ష్! గట్టిగా అనకండమ్మా. గోడలకు చెవులు ఉంటాయి. ఏదో వినోదము కోసం చేస్తున్నాము. (రాణి చెవిలో రహస్యంగా ఏదో చెబుతుంది)

మహారాణి : సరేలే! వెళ్ళి పద్మావతిని పిలుచుకురా! అలాగే అంటాను.

చంద్రలీల : (అక్కడనుంచి దౌడు తీసికొనివెళ్ళి పద్మావతిని వెంటబెట్టుకొని వస్తుంది)

పద్మావతి : (పద్మావతి వస్తుంది) మహారాణి వారికి పద్మావతి నమస్కార ములు.

మహారాణి : రా పద్మా! కూర్చో. కుశలమా?

పద్మావతి : మీ దయవలన కుశలమేనమ్మా.

మహారాణి : ప్రభువులు మృగయా వినోదానికి ఆస్థానకవిని కూడా తీసుకెళ్ళి నారు కదా! అక్కడ ఒక ఘోరము జరిగిపోయినది.

పద్మావతి : (కంగారుగా) ఏమిటమ్మా అది?

మహారాణి : ఒక క్రూర వ్యాఘ్రము మీదకు లంఘించి నీ భర్త ప్రాణాలు తీసినదట.

పద్మావతి : హా జగన్నాథా! (అని నేల కూలింది)

మహారాణి : చంద్రా! త్వరగా వెళ్ళి నీరు తీసుకొనిరా! భర్తపట్ల ఆమెకు ఎంత ప్రేమ ఉన్నదో తెలిసినదా!

చంద్రలీల : (గదిలో ఒక మూలనున్న నీళ్ళు తెచ్చి పద్మావతి ముఖం మీద చల్లుతుంది. ఆమె చలించదు. ముక్కు దగ్గర చేయిపెట్టి చూచి) అమ్మా! (ఏడుస్తూ) పద్మావతి చనిపోయింది.

మహారాణి : ఆఁ! (నాడి పట్టుకొని చూచి 'పద్మావతి' అని పిలిచి) ఎంత ప్రమాదం జరిగిపోయింది? యిప్పుడు తిరిగివచ్చే జయదేవకవికి ఏమి చెప్పగలను? (చెలికత్తెవైపు తిరిగి) నీచురాలా! నీ సలహా వల్ల ఒక నిండు ప్రాణం బలై పోయింది. ఈ సంగతి తెలిస్తే ప్రభువుల్లు నన్ను, నిన్ను బ్రతుకనివ్వరు. (సన్నగా చీరచెంగు నోట పెట్టుకుని విలపిస్తుంది)

చంద్రలీల : అమ్మా! (గట్టిగాఏడుస్తూ) క్షమించండమ్మా! నన్ను క్షమించండి! (విలపిస్తూ రాణి కాళ్ళపై పడుతుంది)

మహారాణి : నన్ను క్షమించేవారు ఎవరు? (విలపిస్తుంది) పద్మావతి! నీ పెండ్లి జరిపించిన నేనే పరిమాణము ఊహింపక నిన్ను పొట్టన పెట్టు కొన్నాను. నా పాపానికి నిష్కృతి లేదు! (విలపిస్తుంది)

(తెర పడుతుంది)

అష్టమాంకము

స్థానం : అరణ్యము.

(జయదేవుడు ఒక చెట్టు క్రింద కూర్చొని ఉంటాడు. తన్మయత్వంతో అష్టపది గానం చేస్తూ ఉంటాడు)

శ్లో : కథిత సమయేఽపి హరి రహహ! నయయౌవనం.
మమవిఫల మిద మమల రూప మపి యౌవనమ్ యామిహే! క మిహ శరణం

స ఖీజన వచ వంచితా ఽహమ్?
యదనుగమనాయ నిశి గహన మపి శీలితమ్

యామి......వంచితా ఽ హమ్ 2
మమ మరణమేవ పరమతి వితథ కేతనా

కిమితి విషహామి విరహానల మచేతనా
యామి......వంచితా ఽ హమ్ 8

లక్ష్మణసేనుడు : (విల్లంబు చేతబట్టి ప్రవేశించి) కవీంద్రా! మీ సాధనకు భంగము కలుగచేయు చున్నందులకు అన్యధా భావింపకుడు.

జయదేవుడు : మహారాజా! మృగయా వినోదమునకై తమరు ఇటకరుదెంచి నారు. నాకును తమవెంట వచ్చి. అనన్య రామణీయకమైన ఈ ప్రకృతిని తిలకించి పులకించునట్లు అనుగ్రహించినారు. తమ స్వేచ్ఛావిహారము నాకెంత మాత్రము భంగకరము కాదు. తమ మనోగము నెరింగింపుడు.

లక్ష్మణసేనుడు : కవివర్యా! క్షణము క్రితము ఒక సింహకిశోరము ఇటు పరు గెత్తుకు వచ్చినది. మీరు గాంచితిరేమో యని...

జయదేవుడు : మహారాజా! చాలా సమయమునుండి ఒక జింకయైననూ ఇటు రాలేదు. సింహకిశోరము మాట అటు వుండనిండు. ప్రభూ! మనము రాజధానిని వదలివచ్చి సుమారు ఒక సప్తాహం గడచి నది. ఇంతవరకు తపోనిమగ్నులైన మహర్షులకు అశాంతిని కలుగజేయు ఎన్నియో క్రూరమృగములను తమ ధనుర్బాణము లకు గురి చేసినారు. ఇక రాజధానికి బయల్వెడలుట ఉచితమని తలంచుచున్నవాడను.

లక్ష్మణసేనుడు : కవిరాజా! మీరు అనునది సముచితమే. నాకునూ అట్టి యోచన కలుగక పోలేదు. కాని యిక ఈ దినమున అర్ధాంతరముగా ఈ వ్యసనమును విరమించుటకు అశక్తుడను. రేపటి దినమున మీ మాట ప్రకారము రాజధానికి బయల్వెడలెదము. (దూరముగా

చూస్తూ) అదిగో సింహకిశోరము! దానిని సంహరించి క్షణంలో వచ్చెదను. (వేగముగా పరుగెత్తును)

జయదేవుడు : అంతయూ విచిత్రము. సృష్టి అంతయు విచిత్రము.

శ్లో : తత్కిం కామపి కామినీమభిసృతః! కింవాకలా కేళిభిః
బద్ధోబంధుభి! రంధకారిణి వనాభ్యర్ణే కిముద్భ్రామ్యతి!
కాంతః క్లాంతమనా మనాగపి పథి ప్రస్థాతుమే వాక్షమః
సంకేతీకృత మంజు వంజుళల తాకుంజే౽పి యన్నాగతః॥

కోయదొర : (ప్రవేశించి)ఏపే పే పేటీ? ఈ బుల్లోడు మళ్ళీ దొంగనాకొడుకులకు దొరికిపోనాడేటి? (దగ్గరకొచ్చి, కళ్ళు మూసుకొని, గానం చేస్తున్న జయదేవుని స్పృశించి) బుల్లోడా! మళ్ళీ ఎప్పుడొచ్చేసినావ్? మా బుల్లిని ఏం జేసేసినావు?

జయదేవుడు : (నెమ్మదిగా కళ్లు తెరచి) ఎవరూ? కొండదొరా?

కోయదొర : ఔను. నానే

జయదేవుడు : బాబా: మన ప్రభువైన లక్ష్మణసేన మహారాజులుంగారు వేటకు బయలుదేరి వెంట నన్ను కూడా తీసుకు వచ్చినారు.

కోయదొర : ఇంటికాడ మరి మా బుల్లి సక్కగుందా?

జయదేవుడు : భగవంతుని దయవలన ఆమెయు క్షేమమే.

కోయదొర : మరి నీ కాలొచ్చేసినాదో, నేదో సూపించు.

జయదేవుడు : బాబా! నీ దయవలన ఆ గాయము మానిపోయినది. వైశాఖి సహాయంతో ఎట్లో ఒంటికాలుపై బ్రతుకు వెళ్ళదీయుచున్నాను.

కోయదొర : ఏటీ? అయితే నీ కాలు రానేదన్నమాట. వుండు (తలపాగా లోంచి, ఒక వనమూలికను బయటకు తీసి) యిదిగో యేరు ముక్క. పంటి కిందెట్టుకొని కసపిస నమిలేయ్. అప్పుడు సూద్దుగాని దాని సంగతి మరి.

జయదేవుడు : ఎందుకు బాబా యిది?

కోయదొర : నానన్నదానికి ఎదురుసెప్పమాక. నామీన నమ్మకం ఉంటే శుభ్రంగా నమిలెయ్. ముందే అడిగితే నానేటి సెప్పేది.


జయదేవుడు : [నవ్వుతూ వేరు ముక్క (వనమూలిక) తీసికొని కళ్లు మూసుకొని నములుతుంటాడు]

కోయదొర : (చిందులు త్రొక్కుతూ)
అమ్మరాయమ్మ!
తల్లిరాయమ్మ!
పెద్దిరాయమ్మ!
సల్లగ సూడమ్మ!
నీ బంటు కొండోడి...
బాసలు నిలబెట్టమ్మ! ॥అమ్మ॥

(రెండుసార్లు పాడి తన ఎడమకాలి ధూళితో జయదేవుని నుదుట బొట్టు పెడతాడు)

జయదేవుడు : (రెండుచేతులు పైకెత్తి, వంగి తన రెండు కాళ్ళు తడిమి చూచు కుంటూ వెనుకకూ ముందుకు అడుగులు వేస్తూ)

శ్లో : ప్రళయ ప్రయోధిజలే ధృత వానసి వేదం
విహిత వహిత చరిత్ర మఖేదమ్
కేశవ! ధృత మీన శరీర! జయజగదీశ! హరే!
క్షితిరతి విపులతరే తవ తిష్ఠతి పృష్ఠే
ధరణి ధరణ కిణ చక్రగరిష్ఠే
కేశవ! ధృతకచ్ఛపరూప! జయ జగదీశ! హరే!



బాబా! నీవు ఈ కుంటివాడిని నడిపించడానికి వచ్చిన పరమాత్ముడవు. నీకుగల దయ, జాలి, కరుణ అనంతము కదా! (అని సాష్టాంగ దండప్రణామము చేస్తాడు)

కోయదొర : (లేవనెత్తుతూ) ఏటీ? నాకు దండాలు పెడతన్నావా? నానేటి జేసినాను. మా కొండదేవత దయవల్ల ఈ ఏరు ముక్క అల్ల 'ఎర్ర బట్ట' సాధువు ఇచ్చిపోనాడు. అది నాను నీ కిచ్చేసినాను. నీ కాలొచ్చేసినాది. (వంగి జయదేవుని కాలు తడిమి చూస్తూ) ఏది నడూ సూద్దాం (అని రెక్క పట్టుకొని జయదేవుని అటూ ఇటూ నడిపిస్తాడు. అనంతరము ఒకచోట ఆపి ఎదురుగా నిల బడి) ఈపాలి మా బుల్లెమ్మ నిన్ను సూసుకొని భలే భలే ఎంత ఇదయిపోతాదో?

లక్ష్మణసేనుడు : (ప్రవేశిస్తాడు. అతనివెంట ఇద్దరు బందీలు ఉంటారు. ఆశ్చర్యంగా జయదేవుని చూస్తూ) జయదేవా! నేను చూచేది నిజమా? భ్రమా? మీకు పోయిన కాలు ఎలా వచ్చింది! నేను ఇచ్చట లేనప్పుడు ఏమి జరిగింది? ఎవరీతడు?

జయదేవుడు : ప్రభూ! అంతా భగవదేచ్ఛ ఆనాడు యాత్రల సమయంలో నా కాలు నరికినప్పుడు కట్టుగట్టి, ఆశ్రయమిచ్చి, తన అనుచరులను తోడిచ్చి మమ్ములను కావడిలో మోయించి రాజధానికి చేర వేసిన ఈ మహానుభావుడు సామాన్యుడు కాడు. క్షణము క్రితము ఈతడిచ్చిన వనమూలిక సేవించుట వలన నరకబడిన నా కాలు యథాపూర్వముగా పునః ప్రాప్తించినది. ఈతని మేలు నేను మరువజాలను. ప్రభూ తమవెంట బందీలుగా ఉన్నవారు...?

లక్ష్మణసేనుడు : ఆటులనా? క్రూర మృగములతో చెలిమిచేయు గిరిజనులు నాగరికుల మనుకొనేవారికన్న ఎక్కువ దయాశీలురు కదా! జయదేవా! వీరు ఆనాడు మిమ్ము దోచుకొన్న గజదొంగలు. వీరిని బంధించడంతో నా అరణ్యప్రయాణ లక్ష్యం నెరవేరింది. (కోయ దొరవేపు చూస్తూ...మందహాసంతో) గిరిజన నాయకా! నీవు ప్రశంసార్హుడవు. మావెంట గొంపోయి రాజాస్థానమున నీకు తగిన కానుకలొసంగెదము.

కోయదొర : (నమస్కరించి) దండాలు దొరా! నాకేటి తెలదు. ఆ సాదూ గోరు ఆ ఏరు ముక్క నాకిచ్చేసినారు. నాను దెచ్చి బుల్లోడి కిచ్చేసినాను. అంతే తవరు దొంగల్ని మా గొప్పగ పట్టిసినారే!?

లక్ష్మణసేనుడు : సాధు సాధు! నీవు స్వార్థము, అహంకారము లేని యథార్థమైన ఆదర్శమానవుడవు. నీ జన్మ సార్థకమైనది (జయదేవుని వేపు చూచి) జయదేవా! మీరు కారణజన్ములు. పూర్వపు పరిస్థితులలో

దేవుడి సాచ్చికంగా

కూటి కెడితే కూడులేదు
సెట్టు నీడే గూడు
సెంద్రయ్య మంచోడు
దీప మిత్తా ఉండు
సేరువమ్మ నీళ్ళిచ్చి
గొంతు తడిపింది
సెట్టమ్మ కాయిచ్చి
కడుపు నిమిరింది
గాలమ్మ ధూలమ్మ
అందరూ మంచోళ్ళు ....
ఎన్నెల్లు సీకట్లు
ఎప్పుడేం జెయలేదు
మడి సొక్కడే నన్ను మాయజేత్తా ఉండు
సాటిమడిసి _______ * * *

శ్రీ అడబాల ఏ. వి. సత్యనారాయణ

జాతస్య

చర్మంతో నిర్మించిన
శరీరం కవరులో
గుండె ఉత్తరాన్ని
ఆశనిరాశల ఊసుల కూపిరిపోసే
ఊహాల ఊయల ఆందోళనా
డోలికల నింపి ;
విధివ్రాసే చిరునామా
మృత్యువు గార్కి!
అంత వరకూ వేచి ఉండాల్సిన
ఈ లోకం
ఊపిరాడని పోస్టు బాక్సు !!

శ్రీ చల్లా రామ ఫణి

మిమ్ము చూచుచున్న మేము పొంగిపొరలుచున్న ఆనందాతిశయమును పట్టజాలకున్నాము. మీరెంతటివారో కనులారా గాంచు భాగ్యము ఈ దొంగలకు కూడా కలిగినది.

జయదేవుడు : అంతా పరమేశ్వరుని లీల ప్రభూ! వీరిని క్షమించి విడిచి పెట్టండి...

లక్ష్మణసేనుడు : మహాకవీ! నేటితో మా మృగయా వినోదము ముగిసినది. మీకు పోయినకాలు వచ్చుట గొప్ప శుభ సంకేతము. గడచిన వారము దినములనుండి మా బాణముల ధాటికి ప్రాణములు కోల్పోయిన సింహ, శార్దూల, హరిణ మదేబాధుల చర్మములును శుభ్రపరుచబడినవి. వెంటనే రాజధానికి బయల్వెడలి జరిగిన శుభకార్యమును మీ అర్ధాంగి పద్మావతికి ఎరింగింపవలసి యున్నది. ఆమె ఆనందమునకు అంతు ఉండదు కదా! మిమ్ము కష్టాలు పాలు చేసిన ఈ దొంగలు క్షమార్హులు కారు. రాజధానిలో వీరికి తగిన శిక్ష విధించబడును.

కోయదొర : అవును బుల్లోడా! మా బుల్లికి ఈ ఇసయం తెలిసిపోనాదంటే గంపెడు సంబరమై పోతది. నడు ఎల్దాం. దొంగోళ్ళు కూడా దొరికిపోనారు మరి.

దౌవారికుడు : (ప్రవేశించి) ప్రభువులకు జయము జయము.

లక్ష్మణసేనుడు : ఎవరదీ? అంతఃపుర సేవకుడా? రాజధానినుండి నీవింత దూరము వచ్చుటకు గల కారణమేమి?

దౌవారికుడు : ప్రభూ, మన్నించాలి. అంతఃపురంలో ఒక ఘోరం జరిగిపోయింది.

లక్ష్మణసేనుడు : ఏమదీ? ఏమి జరిగినదీ?

దౌవారికుడు : కవిగారి భార్య పద్మావతి...

లక్ష్మణసేనుడు : పద్మావతి...?

దౌవారికుడు : పద్మావతీదేవి అకస్మాత్తుగా నేటి ఉదయం మరణించారు ప్రభూ!

లక్ష్మణసేనుడు, జయదేవుడు, కోయరాజు : ఆఁ ఎంత ఘోరం!?

జయదేవుడు : పద్మావతి! ముక్కుపచ్చలారని వయస్సులో జయదేవుని జీవితములో ప్రవేశించి అకారణముగా ఏకాకిని చేసి వెళ్ళిపోయావా? దేవీ! నేనేమి అపరాధం చేసానని నీవు చెప్పకుండా వెళ్ళిపోయావు? అసలు నా జీవితంలో ఎందుకు ప్రవేశించినావు? భగవాన్ ఈ జీవితం ఇంతేనా? అడుగడుగున పరస్పర విరుద్ధాలైన సంఘటనలు ప్రతిక్షణము సంభవిస్తుంటే భరించగలనను కొన్నావా ప్రభూ! ఇంతో అన్యాయం చేస్తూ ఈ కాలు ఎందుకు ప్రసాదించావు స్వామీ! నా మీద ఎంత పగ నీకు? అయినా నిన్ను విడిచేది లేదు. నీవు కష్టాలు పెట్టినంత మాత్రాన ఈ జయదేవుడు నిన్ను వదిలిపెడతాడనుకొన్నావా దేవా! లేదు! నిన్ను నేను ఎన్నటికీ విడువను. నీవు దూరం చేసేకొద్దీ చేరువవుతాను.

శ్లో : రాధావదన విలోకన వికసిత వివిధ వికార వి భంగం
జలనిధి మివ విధు మండలదర్శన తరళిత తుంగ త రంగమ్
హరి మేకరసం చిర మభిలషిత విలాసం
సా దదర్శ గురుహర్ష వశం వద వదన మనంగ నివాసమ్।

—విషాద సంగీతము వినపడును.

(తెర పడును)

డా॥ ఆకురాతి పున్నారావు

డోలాభూషో త్తరీయాణి

పై సమాసం ఆంధ్ర శబ్దచిన్తామణికి సుప్రసిద్ధ వ్యాఖ్యానమయిన కవి శిరోభూషణలోని 20వ సూత్ర వ్యాఖ్యానంలో ఉటంకించబడిన ఒక కారికలో భాగం. ఆ కారిక, ఇంకా అటువంటివే అనేక కారికలు అథర్వణ కృతాలుగా వ్యాఖ్యాత ప్రకటించాడు. అతడు, ఆ వ్యాఖ్యాత, ప్రభజనం అహోబలపతిగా తన తెలుగు పేరును సంస్కృతీ కరించుకున్న గాలి ఓబలయ్య. అతడు ఈ కారికా ప్రవేశానికి కల్పించిన సందర్భాన్ని, దాని అర్థాన్ని, తద్వారా తెలియవచ్చే ఇతర నూతనాంశాల్ని పరామర్శించడమే ఈ రచనకు తాత్పర్యం.

అహోబలపతి చింతామణిలోని "అద్యః క్రియాసు భూతార్థ ద్యోతిన మాద్యగం వినా సర్వః" (చింతా. సంజ్ఞా 20) అనే సూత్రానికి వ్యాఖ్యచేస్తూ తాను సాగించే చర్చను సూత్రంలోని లొసుగులవైపు కొనిపోతూ, పోయెదన్' పయ్యెద - ఇత్యాది స్థలాల్లో గూడ యకారం మీద ఎత్వ ముందే ! అయినపుడు సూత్రం, భూతార్థక క్రియల్లోనిదీ, నామాదిలోనిదీ తప్ప ఇతరమయిన యకారం సర్వమూ అత్తుతోనే ఉండాలి - అని నిర్దేశిస్తూ ఉండటం వలన, ఆ పదాలు (పొయ్యెదన్, పయ్యెద వంటివి) తప్పులు కావలసి వస్తున్నదే (మొదటిది భూతార్థం గాదు; రెండోది నామాద యకారం గాదు కాబట్టి) అని శంకించి ఆ పదాలకు సాధుత్వ ప్రతిపాదనం చేయడానికై అథర్వణ కృతాలంటూ క్రింది కారికలు రెండింటిని ఉటంకించాడు.

"భావిక్రియాసు యస్య స్యా దేత్వమేవ ప్రయోగతః
డోలా భూషో త్తరీయాణి వినైత్వం నాస్తి మధ్యయే"

ఈ రెండు కారికలూ పై రెండు పదాల్ని (పోయెదన్, పయ్యెద) యథాక్రమంగా సాధువుల్ని చేయడానికి ఉద్దిష్టమయినవి. అయితే ఆ ఉద్దేశం స్వసంకేత ప్రసిద్ధార్థంగా ఉండి, ఒక్క ఆకారికా కర్తకు తప్ప ఇతరు లెవరికీ బోధపడే అవకాశం లేదు. కాగా ఆ కారికలకు స్వతః ఉన్న అర్థమేమిటి? కారికా కర్తకు అభిప్రేతమయిన అర్థమేమిటి ? పరిశీలిద్దాం.

ఉన్న అర్థం :-

భావిక్రియాసు=భవిష్యదర్థక క్రియల యందు, ప్రయోగతః= ప్రయోగాను సారముగ యస్య=యకారానికి ఏత్వం + ఏవ=ఏత్వమే (తెలుగులో నయితే ఏత్వముండిగాని సంస్కృతాన ఏత్వ మెకలె; భాష సంస్కృతం గదా !)

భవిష్యదర్థక క్రియల్లో యకారానికి ఏత్వం వస్తుంది - ఈ మాటకు తాత్పర్యమేమిటి ?

చిన్తామణి తరువాతిది కారికావళి. పైగా చింతామణి సూత్రాలను సవరించడానికీ, వివరించడానికీ, పూరించడానికి పుట్టినదది. చింతామణిలో భవిష్యదర్థక క్రియల్లో యకారంగాని, దాని మీద ఏత్వంగాని, కంచు కాగడా పెట్టి వెదికినా కనబడవు. చింతామణి నిర్దేశించే భవిష్య దర్థక క్రియలివి :-

ఘటింపఁగలఁడు - ఘటింపఁ గలవు - ప్రథమ పురుష
ఘటింపఁగలవు - ఘటింపఁ గలరు - మధ్యమ "
ఘటింపఁ గలను - ఘటింపఁగలము - ఉత్తమ "

చింతామణి ప్రకియా విధానంలో భవిష్యదర్థంలో 'కల' అనె' అను బంధం లేకుండా పదమే ఏర్పడదు. కాగా భావిక్రియల్లో యకారమే లేదు. లేని యకారానికి ఏత్వ విధాన మెలా జరిగినది ? కారికా కర్తకే తెలియాలి. అన్యులకు తెలియదు.

అభిప్రేతార్థం :- కారికా కర్త ఇక్కడ 'పోయెదన్' - వంటి క్రియల్ని భవిష్యదర్థకాలు - అనుకున్నాడు అటువంటి రూపాలను వర్తమానార్థకాలుగా నిర్దేశించిన వ్యాకర్తలు, అహోబలపతికీ, బాల సరస్వతికీ (ఆంధ్ర శబ్దచింతామణి తొలివ్యాఖ్యాత) పూర్వులున్నారు. కేతన ఆంధ్రభాషా భూషణంలోను (1+4ప పద్యం) విన్నకోట పెద్దన్న కావ్యాలంకార చూడామణిలోనూ (9 - 151) అట్టి రూపాలు నిష్పన్నం చేసి చూపించారు. కాని భావ్యర్థకాలుగా అట్టి రూపాల్ని వ్యాకరణల్లో చూపినవారు మృగ్యులు.

అయితే అటువంటి ఎదగాగమంగల క్రియలకు, ప్రాచీన కవి ప్రయోగాల్లో భవిష్యదర్థాలు గూడ ఉన్నమాట నిజం. (భారత 1-3-108; 1-4-125) అయినపుడు 'భావిక్రియాసు' అనే పదానికి పోయెదన్ - వంటి విష యాలవుతాయని మాత్రం కారికాకర్తకు తప్ప ఇతర వైయాకరణు లెవరికీ తెలిసే అవకాశం లేదు-వ్యాకరణ వాఙ్మయాన్ని బట్టి చూస్తే.

చింతామణి పక్కకి దూరంగా ప్రాచీన వ్యాకరణాలయిన ఆంధ్రభాషా భూషణ కావ్యాలంకార చూడామణులలో భావిక్రియలుగా

పలుకును - పలుకుదురు (ఆం. భా. భూ 146)
చేయును - చేయుదురు (కా. చూ. మ. 9 - 15)

వంటి రూపాలు నిర్దిష్టాలై ఉన్నాయి. కాగా కారికాకర్త వైయాకరణులకు దూరంగా 'పోయెదన్' - వంటి దానిని భావిక్రియగా భావించి ప్రయోగించడం స్వసంకేత ప్రసిద్ధార్థమయిన పని.

భావ్యర్థకాలు చిన్తామణిలో అస్తిధాత్వను బన్ధ సహితాలుగా (కల), ఇతర వ్యాకరణాల్లో దుగాగమ సహితాలుగా ఏర్పడి ఉన్నాయి తప్ప ఎదగా - గమ సహిత రూపాలు లేవని తేలిపోయినది.

ఇక రెండో కారికను తీసుకుందాం.

ఉన్న అర్థం :- డోలా=ఊయెల లేక ఊయాలవంటి యానం, అందలం
భూషా= అలంకారం; అలంకరణం, నగ
ఉత్తరీయాణి = పైబట్ట
వినా=మినహాయించి, మధ్యయే=మధ్యస్థయకారమనందు, ఏత్వం=ఏ కారము, నాస్తి=లేదు

ఊయెల, నగ, పైబట్ట - అనే ఈ తెలుగు పదాలలో తప్ప మధ్యస్థ మయిన 'యా' కి ఏత్వముండదట ! ఈ వాక్యానికి తాత్పర్యమేమిటి ?

డోలా శబ్దం వాస్తవానికి డోలి యానమయినా దాని స్వరూపంలో 'ఊయెల' గూడ ఉంది గాబట్టి అక్కడ - ఆ శబ్దంలో, ఉండే డోలా శబ్దానికి తెలుగు పర్యాయమయిన 'ఊయెల'లో 'యె' వర్ణాన్ని కారికాకర్త నిర్దేశించాడని అనవచ్చు. నిజమే. కాని మిగిలిన రెండు సంస్కృత శబ్దాల తెలుగు పర్యాయాలు 'నగ', పైబట్ట లేక 'పై పంచె' అనేవి బొత్తిగా అసమర్థాలై ఏ అర్థాన్ని ఇవ్వ జాలక మిగిలిపోయాయి.

అభిప్రేతార్థం :- ఏ సంస్కృతాంధ్ర విద్వాంసునికయినా, వైయాకరణునకయినా కొత్తగా, ఇటీవలి వికృతి వివేక (అథర్వణ కారికల నామాంతరం) పఠన పాఠనాల వలన కల్గిన సంస్కారాన్ని దిగవిడిచి, చూచినపుడు భూషోత్తరీయ శబ్దాలు తెలుగులోని తాయెతు పయ్యెద శబ్దాల పర్యాయాలు - అని తెలుస్తుందా? కనీసం ఆ స్ఫూర్తి, ఆ ఊహ కలిగే అవకాశముందా ? నిష్పాక్షికంగా, ఆర్జవం నిండిన మనసుతో ఆలోచించాలి !

కారికాకర్త భూషా - ఉత్తరీయ పదాలు రెండింటిని, తాయెతు పయ్యెదలకు సంస్కృత పర్యాయాలుగా భావించి సంకేతించి ప్రయోగించాడు. ఆ సంకేతం అతనికే తెలుసు. అతడై వివరిస్తే ఇతరులకు తెలిసివస్తుంది

భూషా శబ్దం, కేవలం, భూషణాన్ని. తెలుగు పర్యాయమయిన 'నగ' ను తెలుపుతుందే గాని 'తాయెతు' ను తెలియ జేయడానికి బొత్తిగా

భాష్యం

రఫి

ఈ లోకం శృతి తప్పని సంగీతం
పిల్లంతా అలవాటు పడ్డ నేరస్థులు;
నువ్వు వెళ్లు పచ్చపచ్చని తోటలగుండా ....
బాటకిరువైపుల రగిలిస్తారు జ్వాలలుతమ చూపుల ద్వారా!
రోజులు యుగాలుగా మారతాయి.
నీ భ్రమ తప్ప, నువ్వెన్నటి చూడ లేవు పిల్లలో
ఇనుమంత మార్పు;
హృదయం లేదు వీరిలో;
స్పందన తెలీదు ఈ జీవాలకు
మొదటే అన్నా కదా, పిల్లంతా అలవాటు పడ్డ
నేరస్థులని ——— "

చాలదు. ఆ సంస్కృతీ కరణం తాయెతునే చెప్పవలసి వస్తే, అది స్వసంకేత ప్రసిద్ధార్థమనీ కాగా అసమర్థమూ, అసంగతమూ, అయిన సంస్కృతాను వాద మనీ చెప్పవలసి ఉంటుంది.

ఇక ఉత్తరీయ పదం గూడ 'పయ్యెద'కు సంస్కృత పర్యాయం కాజాలదు. ఉత్తరీయ శబ్దాన్ని పై గుడకు, పై పంచెకు పర్యాయంగా మనం నేడు వాడుకుంటున్నాం. కాగా దాన్ని పయ్యెద మాత్రానికి పర్యాయంగా ప్రయోగించడమంటె అదీ సంకేతిత్వార్థ ప్రయోగమే అవుతుంది.

ఫలితార్థమేమంటే, ఈ కారిక, తెలుగులోని ఉయ్యెల, తాయెతు, పయ్యెద శబ్దాల్ని అసమర్థంగా సంస్కృతీకరించగా ఏర్పడినదని నిర్ధారణకు రాగలగడం. అయితే ఈ అనువాదానికి, తెలుగును సంస్కృతంలోనికే స్వసంకేత ప్రసిద్ధార్థంగా అనువదించడానికి మూలమేమిటి ?

పై మూడు పదాల్నీ ఒకచోట చేర్చి, వాటిలోని యకారాన్ని గురించీ, దాని మీద చేరే అచ్చును గురించీ ప్రసంగించిన తొలి తెలుగు లాక్షణికుడు ముద్దరాజు రామన్న. అతడు తన 'కవిజన సంజీవని'లో ప్రథమ తరంగాన 117వ పద్యంగా

"తాయెతయు నుయ్యెలయుఁ బయ్యెదయుఁ దక్క
గలుగదెత్వ! బు మధ్య యకారమునకుఁ
దుదను గ్రియఁ దక్క నెత్వంబు గదియదాది
నత్వ మొందదు తెనుఁగుల నబ్జనాభ !".

అనే లక్షణం చెప్పాడు. అతడు తన కాలాన ఏర్పడిన ఉచ్చారణ భ్రంశాన్ని, తద్వారా గ్రంథాల్లో చోటు చేసికొంటున్న అపరూపాల్నీ నివారించ డానికై ఇటువంటి లక్షణం చేయవలసి వచ్చినది. తన లక్షణానికి చంద్రభాను చరిత్ర, భారత అరణ్యపర్వం, యయాతి చరిత్రల నుండి క్రమంగా తాయెతు, ఉయ్యెల, పయ్యెద శబ్దాల్ని ఉదాహరించాడు లక్ష్యాలుగా. అంటే, "ప్రయోగ శరణం వ్యాకరణమ్" అన్న ధర్మానికి అనుగుణంగా, ముద్దరాజు రామన్న తొలుత వాఙ్మయ పరిశీలనం చేసి లక్ష్యాలు సేకరించి వాటి ఆధారంగా లక్షణ నిర్దేశం చేశాడు. కాబట్టి ముద్దరాజు రామన్నను చదివి, అతని లక్షణాన్ని ఆంధ్రీకరించగా ఏర్పడినదే ఈ కారిక "డోలా భూషోత్తరీయాణి". అని నిర్ధారించవచ్చు.

ఇక్కడ పూర్వపక్ష మొకటిచేయవచ్చు. అధర్వణకారికకే ఈ తెలుగు లక్షణం (ముద్దరాజు రామన్నది) ఆంధ్రీకరణం కాకూడదా ? అని. ఇంతవరకు జరిగిన పరిశీలనం తరువాత ఈ పూర్వ పక్షం అకార్యం. అయినా దానినీ స్వీక రించి సమాధానమిద్దాం.

ముద్దరాజు రామన్న కాలానికి ఉనికీ, మనికీ లేనిది వికృతివివేకం. దాన్ని అప్పకవీ ఎరుగడు. ఇక ముద్దరాజు రామన్న బాల సరస్వతికి ఈషత్పూర్వుడు. బాలసరస్వతికీ ఈ 'వికృతి వివేకం' తెలియదు. అసలు అది (వికృతి వివేకం) ఒక అపూర్వమయిన కృతి విశేషమని అహోబలపతి తన వ్యాఖ్యాన ప్రారంభ - ఉపసంహారాల్లో తెలియ జెప్పాడు. కాగా అట్టి వికృతివివేకాన్ని ముద్దరాజు రామన్న చూచి ఉండటం అసంభవం. ముద్దరాజు రామన్న లక్షణమూ, తత్కర్తృత్వమూ, కాలమూ వివాదాస్పదం కావు. పైగా ఆ అన్నిటినీ మించినదీ, ప్రధాన పరిశీలనార్హమూ అయిన అంశమేమిటంటే, భూషా - ఉత్తరీయ శబ్దాలు తెలుగు పదాలయిన 'తాయెతు, పయ్యెదల' అసమర్థ - అనువాదాలు - అనేది. అవి స్వతంత్రంగా అర్థస్ఫూర్తికి అయోగ్యాలై తమ అనువాదితత్వాన్ని తామే బట్ట బయలు చేసికొంటున్నాయి - అనేది.

ఇక అధర్వణునిదిగా అహోబలపతి చేత ఉటంకించబడిన ఈ కారిక లోని పూర్వార్థం (భావిక్రియాసు యస్యస్యాదేత్వమేవ ప్రయోగతః) కూడ రామన్న యొక్క క్రింది లక్షణం నుండి ఏర్పడినదే. ఎట్లంటే,

"తుదను గ్రియఁ దక్క నెత్వంబు గదియదాడి
నత్వ మొందదు తెనుఁగుల నబ్జనాభ !"

(కవిజన సంజీవని 1 - 117)

ఈ లక్షణం క్రియల చివరతప్ప 'యా'కు ఏత్వముండదని నిర్దే శిస్తున్నది. ఆ నిర్దేశాన్నే యధాతథంగా కాక ఒకింత మార్చి సంస్కృతీక రించడం జరిగినది. అయితే ఆ సంస్కృతీకరణంలో తెలుగు లక్షణంలోని స్పష్టత భగ్నమయినది.

రామన్న లక్షణం ప్రకారం 'యా'కు ఏత్వముండటమంటే, (యే అక్షరం) అది క్రియల చివర మాత్ర ముంటుందనడం వల్ల 'జనియె, వినియె' వంటివి లక్ష్యాలని ఆలోచించి గ్రహించవచ్చు. పైగా లక్షణకర్త లక్ష్య నిర్దేశం గూడ చేస్తున్నాడు గాబట్టి అర్థస్ఫూర్తికి ఆటంకముండదు. కాని సంస్కృతీకరణంలో ఆ అవకాశం లేదు. ఈ అంశం మొదట సోదాహరణంగా నిరూపించ బడినది గదా

కాగా మొత్తం మీద రామన్న ఉపజ్ఞగా ఉన్న లక్షణాన్నే సంస్కృతీ కరిస్తే పై కారికలు రెండూ ఏర్పడినాయని నిర్వివాదంగా నిర్ధారణకు రావచ్చు. ఈ నిర్ధారణవల్ల ఈ కారికావళి అథర్వణ కృతమనే వాదం స్వయం పరాస్త మవుతుంది. అధర్వణుడు 13వ శతాబ్దివాడు. 16వ శతాబ్ది పూర్వార్థంలోని ముద్ద రాజు రామన్నను అతడు అనువదించడం అసంభవం.

ఈ సందర్భాన గమనించదగ్గ విశేషాంశం మరొకటి ఏమిటంటే, 'తాయెతు' పదం తెలుగు వాఙ్మయంలో జొరబడి లక్షణ గ్రంథాల కెక్కడం మిక్కిలి అర్వాచీనమయిన పరిణామమని, కాగా, దానిని కారికాబద్ధం చేసిన వికృతి వివేకం అథర్వణకృతం కాజాలదని, ఆచార్య తూమాటి దొణప్ప తమ "భాషా చారిత్రక వ్యాసావళి" (ఆంధ్ర సారస్వత పరిషన్ముద్రణం, హైదరాబాద్, 1972) లో శాస్త్రీయ పరిశీలనానంతరం నిరూపించి ఉన్నారు.

ముద్దరాజు రామన్న "కవిజన సంజీవని" ఆ రచయిత కాలానికి నవీనమయిన దేశీయ లక్షణ గ్రంథం. లక్షణాలు స్వయంగా రచించి, లక్ష్యాలు ప్రాచీన కవుల నుండి ఉటంకించడం - అనే ప్రక్రియను బహుశః ఆంధ్ర లక్షణ వాఙ్మయంలో ప్రథమంగా ప్రవేశపెట్టిన గ్రంథమదే కావచ్చు. అది వెల్వడిన స్వల్పకాలానికే దానికి మంచి వ్యాప్తి పండిత లోకంలో కలిగి గ్రంథం సుప్రసిద్ధమయినది. రచనాగత మయిన ఈ నూతన ధోరణి - (లక్ష్యాలు ప్రాచీనులవి; లక్షణాలు ఆధునికునివి) దాని ప్రసిద్ధికీ, ప్రాముఖ్యానికీ ఒక కారణమై ఉండవచ్చు. రామన్న బహు శ్రమించి తన లక్షణాలు తిరుగులేని ప్రమాణాలుగా నిలిచిపోవాలనే సంకల్పంతో కావచ్చు, యతిప్రాస స్థల సంఘటితాలుగా ఉండే లక్ష్యాలను ఏర్చి తన గ్రంథాన కూర్చాడు. కవిజన సంజీవనీ కర్త వేసిన ఈ నూతన మార్గాన్నే, అనంతర లాక్షణికుడు అప్పకవి గూడ అనుసరించి, అప్పకవీయమనే పేర తన లక్షణ గ్రంథానికి గొప్ప ప్రామాణ్యాన్ని సంపాదించుకోగలిగాడని తెలిసికోవచ్చు.

అలనాడు సుప్రసిద్ధమై కవిపండిత సముపాదేయమై నిలిచిన కవిజన సంజీవనిలోని అనేక లక్షణాలు అథర్వణకృతిగా పేర్కొనబడే వికృతి వివేకంలోని కారికలు అనేకాలకు మాతృకలుగా కనిపిస్తున్నాయి. ఆ రెండు లక్షణ గ్రంథాలను తులనాత్మకంగా పరిశీలించినపుడు ప్రాచీన కాలాననే తెలుగు వాఙ్మయం కొంత సంస్కృతం లోనికి అనువాదితమయినట్లు తెలిసివస్తుంది. ●

అవధూతస్వామి

డొక్కరసుమ్మనూరు రమేష్‌బాబు

రాత్రి పదిగంటలు దాటి ఉంటుంది.

శివుణ్ణీ పార్వతినీ నిద్రపుచ్చి గుడి తలుపులు వేసేటప్పటికే శివరామ శాస్త్రికి బాగా ఆయాసం వచ్చింది.

అరువదులు నిండాయి. ముదిమి అలుపుతో ఆడుకొంటోంది.

గంభీర రూపానికి తగ్గ మేఘస్వరం! ఆ కంఠధ్వనికి తగ్గ పాండిత్య పాటవం! సరస్వతీ పుత్రుడని ఊరంతా పొగడుతారు. కాని శాస్త్రి మాత్రం "నేనెంత? నా పాండిత్యమెంత?" అని వినయంగా తనకు ఆపాదించిన గొప్ప తనాన్ని త్రోసిపుచ్చుతూ ఉంటాడు.

అదీ ఆయన సంస్కారం!

ఊరిబయట శ్మశానవాటికకి కాస్త ఎడంగా వున్న శివాలయానికి జీత భత్యాలు లేని పూజారి అతడు.

తను నివేదించుకున్న అర్చనకు ఎంత ప్రాప్తమో దానితోనే తృప్తిపడడం శాస్త్రిగారి రోజువారీ జీవితంలో ఒక భాగం!

ఎంతో గొప్పమేధావి అయిన శాస్త్రి ఏమీ ఆర్జించకుండా నిత్యం పేద రికంలో మగ్గడం ఆయన భార్య భ్రమరాంబకు మాత్రం బొత్తిగా ఇష్టం ఉండేది కాదు. అయినా భర్త మాటను సరదాకైనా త్రోసిపుచ్చని దొడ్డ యిల్లాలు ఆ తల్లి!

వారి గారాల కొడుకు సుబ్రహ్మణ్యశాస్త్రి! తండ్రి పోలికలు అన్నింటా పుణికిపుచ్చుకొన్నవాడు.

యశస్సు శాశ్వతం కాని ఐశ్వర్యం కాదని నాన్న చెప్పిన మాటలు- సుబ్రహ్మణ్యశాస్త్రికి ఎప్పుడూ గుర్తుకుంటాయి.

అందుకే ఫలం, పత్రం, పుష్పం, తోయం అంటూ ఎవరేమి ఇచ్చినా, ఎంత ఇచ్చినా పుచ్చుకొని వేదశ్రుతులను నిత్యం వల్లెవేస్తూ ఉంటాడు. అవసరా లకు తీరిపోగా మిగిలింది శివార్పణమంటూ ఏ దిక్కూలేనివారిని ఆదుకోవడం సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకృత్యాలలో అతి ముఖ్యమైంది.

తనయుని చూచీ, తన అర్ధాంగిని చూచీ ఎంతో సంతోషపడుతూ ఉంటాడు శివరామశాస్త్రి!

కొడుక్కి తగిన సంబంధం చూచి కోడల్ని తెచ్చుకోవాలన్న ముచ్చట రోజు రోజుకి ఎక్కువవుతోంది ఆయనకు.

గుడి తలుపులకు తాళంవేసి గట్టిగా లాగి చూచాడు. మెట్లు దిగి నెమ్మదిగా నడక సాగించాడు అంగవస్త్రాన్ని ఒంటినిండా కప్పుకొని శివనామస్మరణ చేస్తూ ఇంటికి వెళుతున్నాడు.

మాఘమాసపు చలి. గిజగిజలాడిస్తోంది. దానికితోడు ఊదరగొట్టే ఈదురు గాలి. శాస్త్రి నడకవేగం హెచ్చించాడు. "ముసలితనమంటే ప్రకృతికి కూడా ఎంత ఎకిరింత" అని అనుకొన్నా "పండుబారిన ముసలితనంలోని అనుభవం ఎంత గొప్పదో కదా" అని కూడా అనుకొంటూ వడివడిగా అడుగులు వేస్తున్న శివరామశాస్త్రి మంత్రించినట్లు స్థాణువులా నిలబడిపోయాడు.

ఆయన చూపులు కాలుతున్న కాష్ఠం దగ్గర ఆగిపోయాయి. ఎర్రని ఆ మంట వెలుగులో కళ్ళనీళ్ళు నింపుకొని మూఖావంగా నిలబడి వున్న అవధూత స్వామి!

"అవును. ఆ కాష్ఠమువద్ద నిలబడ్డది సందేహం లేకుండా అవధూతస్వామే! ఆ దిగంబర సన్యాసికి ఆ చితిమంటలవద్ద ఏమి పని? అందునా ఎప్పుడూ ఏ భావాన్నీ కనబర్చని ఆ సన్యాసి కళ్ళల్లో నీళ్ళా? నేను పొరపాటు పడడం లేదు కదా!" అని అనుకొంటూ ఆ అవధూతస్వామికి దగ్గరగా వెళ్లాడు శివరామశాస్త్రి.

శాస్త్రిని చూచాడు స్వామి! ఎంతోమంది మొక్కుతారు శాస్త్రికి! కాని శాస్త్రి మాత్రం ఒక్క స్వామిముందు తల ఒగ్గుతాడు, శివుని తరువాత!

స్వామి కళ్లు చిత్రంగా వున్నాయి. అరుణజ్యోతుల్లా మెరుస్తున్నాయి.

శాస్త్రికి అంతా ఆశ్చర్యంగా ఉంది.

స్వామి గట్టిగా ఏడ్చాడు. అచ్చం పసిపిల్లవాడిమాదిరి! మరుక్షణం అంత కంటే గట్టిగా నవ్వాడు. పిచ్చివాడిలాగున!

శాస్త్రిని చూస్తూ ఆకాశంవైపు చూస్తూ చితిమంటవైపు చూస్తూ శివాలయం వైపు చూస్తూ ఊరికి దక్షిణంగా వున్న మర్రిచెట్టువైపుకి నడుచుకొంటూ, పరు గెత్తుతూ వెళ్ళిపోయాడు ఆ అవధూతస్వామి!

ఒంటిమీద నూలుపోగు లేదు. తైలసంస్కారం అసలు లేదు. స్నానంచేసి ఎన్ని రోజులయిందో! మలమూత్రాల దుర్గంధం ఆ స్వామిని ఎప్పుడూ అంటు కొనే ఉంటాయి.

శివరామశాస్త్రి అవధూతస్వామిని గురించి ఆలోచిస్తూ నడవసాగాడు. స్వామి చేష్టలు ఎప్పుడూ అంతే! అంతుబట్టవు. అసహ్యంగా, ఆందోళనగా, అద్భు తంగా, బీభత్సంగా, ఘోరాతి ఘోరంగా, పరమ నికృష్టంగా ఉంటాయి,

మలాన్ని గంధంలాగా పూసుకొని తిరుగుతాడు ఒకరోజు!

ఆవుపేడను ఫలహారంలాగా భోంచేస్తాడు ఇంకొకరోజు!

పళ్ళెంలో పెట్టిన సంగటి ముద్దను గజ్జికుక్కతో సహా పంచుకొంటాడు మరో రోజు!

పందులమధ్య పడుకొని నిశ్చింతగా నిద్రపోతూ వుంటాడు ఇంకోరోజు!

దిగంబరంగా చలిరాత్రుల్లో శ్మశానాల వెంటబడి తిరుగుతాడు.

సమాధులపైన వెల్లకిలా పడుకొని ఆకాశంలోకి చూస్తూ ఉంటాడు. నేల మీది బొరియల్లో చేయిపెట్టి ఏదో వెదుకుతూ వుంటాడు. విషక్రిములను సైతం అరచేతిలో పెట్టుకొని అదేపనిగా చూస్తుంటాడు.

మనిషి రూపంలో వున్న మృగం అనిపిస్తుందొకసారి.

కాదు మహానుభావుడు అని తోస్తుంది మరోసారి.

శివరామశాస్త్రి అవధూతస్వామిని మూడేళ్ళుగా చూస్తున్నాడు. ఎప్పుడు చూచినా ఇదే తంతు! ఎప్పటి కప్పుడు కొత్తగా వింతగా అగుపిస్తాడు అవధూత స్వామి!

అతణ్ణి ఎవరూ ఏమీ అనేవారు కాదు. అతడి దయ కలిగితే చాలు అదృష్టం వరించినట్లే భావించేవారు.

ఎవరి ఇంటికి ఎప్పుడు ఏ మేరకు ఖరాబు చేసేవాడో ఎవరికీ తెలిసేది కాదు.

ఆ స్వామి నీడ పడినచోట లక్ష్మి తాండవిస్తుందని ఎంతోమంది నమ్మే వారు. అది నిజమయ్యేది!?

ఆ స్వామి పాదం తగిలితే చాలు దారిద్ర్యదేవత తిరిగి చూడదని గ్రామం మొత్తం కూడబలికేది. అది వాస్తవమయ్యేది!?

అందుకే ఎవరికి వారు ఆ అవధూతస్వామి దర్శనభాగ్యం కోసం తపించి పోయేవారు.

ఆయనకు పళ్ళు ఫలహారాలు, పాలూ, పిండివంటలూ ఎన్నో పెట్టేవారు.

ఆయన తింటే తినేవాడు. లేదా విసిరికొట్టేవాడు. కాకపోతే వాటిని కాలితో తొక్కేసేవాడు. లేకపోతే ఆయనకు తోచినవాళ్ళను పిలిచి పంచిపెట్టేవాడు.

అంతేకాని ఏం చేస్తాడో ఎవరికీ తెలిసేది కాదు.

ఒకరోజు పసులకొట్టంలో గడిపేవాడు.

ఒకరోజు దిగుడుబావి మెట్లమీదే ఉండేవాడు.

ఊరిచివర ఉన్న కొండపైనే కొన్ని రాత్రులు నివసించేవాడు. ఆ కొండకి దిగువగా వున్న చెరువు గట్టుమీద మిట్టమధ్యాహ్నపు ఎండల్లో హాయిగా పవళించేవాడు.

ఎప్పుడు ఎక్కడ ఎలా ఉంటాడో తెలిసేది కాదు.

ఆయన ఎవరో, ఎక్కడివాడో, ఎక్కడినుంచి వచ్చాడో ఎవరికీ తెలియదు.

ఆయన భాషేమిటో అంతుపట్టడం లేదు.

ఆ అవధూతస్వామికి మాటలే రావని అందరూ అనుకొనేవారు.

ఊరు మొత్తం ఆ దిగంబరసన్యాసి ఒక దేవతా స్వరూపమని విశ్వసించిందనే చెప్పవచ్చు.

అలాంటివాడు ఈ వేళ కాలిపోతున్న శవం దగ్గర నిలబడి కన్నీళ్ళు కార్చడమేమిటి?

చనిపోయిన జానకమ్మకు కూతురు దేవిక తప్ప మరెవ్వరూ లేరాయె!

మరి ఈ సన్యాసి ఎందుకేడుస్తున్నట్లు?

అవధూతలు అన్నింటికీ అతీతులు కదా! ఈ సంఘటన యాదృచ్ఛికమేనా?

మమకారాలే ఉండని సన్యాసులు కంటతడి పెడతారా?

ఈ సంఘటన వెనుక ఏదైనా నేపథ్యముందా?


శివరామశాస్త్రికి అంతుబట్టడం లేదు.

అలా ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్నాడాయన.

అన్యమనస్కంగానే భోజనం ముగించి నిద్రకుపక్రమించాడు.

అయినా నిద్రరావడం లేదు. ఆ అవధూతను గురించిన ఆలోచనలే!

మళ్ళీ ఆ అవధూత ఆ చితి దగ్గరికొచ్చాడేమో! అలా అనుకోవడమే తడవు శివరామశాస్త్రి లేచి నిలబడ్డాడు.



ఆ అర్ధరాత్రి నిర్మానుష్యంగా ఉన్న భీతావహ వాతావరణంలో శివరామ శాస్త్రి దత్తాత్రేయునిలాగా నడుస్తున్నాడు.

మరుభూమిని చేరుకొన్నాడు. రగులుతున్న కాష్ఠం దగ్గర బిగ్గరగా రోదిస్తున్న అవధూతస్వామిని చూడనే చూచాడు. "తన ఊహ నిజమే. ఆ స్వామికి చనిపోయిన జానకమ్మకి ఏదో సంబంధముంది. అయితే ఆ సంబంధం ఎలాంటిదో ఏలా చెప్పడం?"

శివరామశాస్త్రిలో విస్మయంతో కూడుకొన్న ఎన్నో సందేహాలు!

ఏదో నిశ్చయించుకొన్న వాడిమల్లే ముందుకు కదిలాడు.

రోదిస్తున్న స్వామి దగ్గరకి వెళ్ళాడు. చేతులు జోడించి నిలబడ్డాడు.

నెమ్మదిగా అతి కష్టంగా అన్నాడు.

"స్వామీ! మీరెప్పుడూ ఇలా రోదించింది నేను చూడలేదు. సర్వసంగ పరిత్యాగులైన మీరు కూడా ఇలా దుఃఖించడం నాకు ఆశ్చర్యంగా ఉంది. చనిపోయిన ఈ జానకమ్మపట్ల మీరెందుకింత మమకారాన్ని కనబరుస్తున్నారు. తెలుసుకోవచ్చా?"

అవధూతస్వామి తలెత్తి సూటిగా శివరామశాస్త్రి కళ్ళల్లోకి చూచాడు.

మౌనంగా ఉండిపోయాడు.

"చెప్పండి స్వామీ! ఎందుకాగిపోయారు? మీ భాష ఏదైనా నేను అర్థం చేసుకొంటాను, సైగ చేసినా చాలు! పోతే నేను అర్థం చేసుకొని చేసేదేమిటని అనుకోకండి. ఒక మనిషిగా మనిషికి సహాయపడడంలో ఎంతో తృప్తి ఉంటుంది. ఆ తృప్తి మోక్షంకంటే కూడా గొప్పది" శివరామశాస్త్రి అన్నాడు.

అవధూతస్వామి ముందుకు కదిలాడు.

సన్నని తుంపర మొదలయింది. ఉత్తరదిశగా మెరుపు మెరిసింది.

ఆకాశం భారంగా ముభావంగా వుంది. భూమాత స్తబ్దంగా మవునంగా తిలకిస్తోంది.

"చెప్పండి స్వామీ" మళ్ళీ శివరామశాస్త్రి అన్నాడు.

"శివా" అని పలికాడు అవధూతస్వామి.

మేఘగర్భం చీలినట్లుంది. కుండపోతగా వర్షం ప్రారంభమయింది.

"శివా" మళ్ళీ అన్నాడు అవధూతస్వామి.

శివరామశాస్త్రికంతా అయోమయంగా వుంది.

చేతనాచేతనావస్థలో ఉండిపోయాడు.

"శివా! శివా! శివా! శివా!"...

ఆ పిలుపు పదైదు సంవత్సరాల క్రితం తనకెంతో ప్రాణప్రదమైన ప్రాణమిత్రుని పిలుపు! అంటే అవధూతస్వామి తన ప్రాణమిత్రుడు గణపతి శాస్త్రి?"

ఊహించలేకపోతున్నాడు శివరామశాస్త్రి.

"శివా! ఆశ్చర్యంగా ఉందా? నేను, నేనా గణపతిని." అంటూ వలవల మంటూ ఏడ్చాడు అవధూతస్వామి.

శివరామశాస్త్రికి నోట మాట రాలేదు.

"ఏరా మాట్లాడవ్! ఇప్పుడర్థమయిందా నేసీ చితి ముందు నిలబడి ఎందు కేడుస్తున్నానో—" అవధూతస్వామి మాటలకు అడ్డు తగిలాడు శివరామశాస్త్రి.

"గణపతీ! నువ్వు గంగా ప్రవాహంలో కొట్టుకొని పోలేదా? నీవు చనిపోయావనే అనుకొన్నాం కదరా! ప్రతికుంది కూడా ఎందుకు తిరిగి రాలేదు. ఇదంతా నిజమేనా? నీవు అసలు గణపతివేనా?"—

శివరామశాస్త్రికి ఆవేదన, ఉద్వేగం రెండూ ఎక్కువయ్యాయి.

గణపతి కళ్ళు మూసుకొనే అన్నాడు.

"శివా! నే చనిపోలేదు. దూరతీరాలకు కొట్టుకుపోయాను. అక్కడొక ఋషితో పరిచయం కలిగింది. సంసారంమీద రోత పుట్టింది. సర్వసంగ పరిత్యాగినయ్యాను. అంతటితో ఆగిపోలేదు. అవధూతను...పరమావధూతను కావాలనుకొన్నాను. పెంటకుప్పల్నీ, లడ్డుముక్కల్నీ ఒకేలా చూడటం నేర్చుకొన్నాను. పడుచుపిల్ల సౌందర్యాన్నీ పసిపాప బోసినవ్వునీ ఒకేలా చూడడానికి అలవాటు పడ్డాను. మౌనమనే భాషను నేర్చుకొన్నాను. నా భాషను పూర్తిగా దూరం చేసుకొన్నాను. రాగద్వేషాలకు అతీతంగా ఉంటూ వచ్చాను. కామాన్ని జయించాలని ఎంతో తాపత్రయపడ్డాను. కొన్ని సందర్భాలలో కామపరమైన కోరికలను అదుపులో పెట్టడానికిగాను నా శరీరాన్ని నేను కృశింపజేసుకొన్నాను. లైంగికపరమైన ఆలోచనలే నాలో రాకుండా అనుక్షణం జాగ్రత్తపడ్డాను. ఇప్పుడెలాగూ ముసలివాడినయ్యాను. ఈ అంత్యదశలో ఎందుకోమరి జానకినీ, నా బిడ్డ దేవికనూ చూడాలనిపించింది. విచిత్రమైన ఈ కోర్కెను చూచి నాపై నాకే నవ్వు వచ్చింది. కాని కోర్కెను అణచుకోలేకపోయాను. అందుకే జానకిని వెదుక్కుంటూ ఇక్కడికొచ్చాను. వైధవ్యంతో, దారిద్ర్యంతో బాధపడుతున్న జానకిని చూచి మనసు ద్రవించినా విచలించలేదు. పెళ్ళీడుకొచ్చిన దేవిక నన్ను భయంతోనో భక్తితోనో మ్రొక్కితే మనసు స్పందించేది కాని మారేది కాదు. చిన్ననాటి మిత్రుడవయిన నిన్ను చూచినప్పుడల్లా ఆరాటం కలిగేది కాని అభిమానం పుట్టుకొని వచ్చేదికాదు. విడ్డూరమేమిటంటే నన్నెవరూ క్షణమాత్రంగానైనా గుర్తుపట్టలేకపోయారు. కట్టుకొన్న భార్య సైతం నా దగ్గరికొచ్చి నాకు నమస్కరించేది కాని నేనే తన భర్తనని గుర్తించలేకపోయింది, ఈ జగన్నాటకంలో నా జీవితం విచిత్రమైందని అనుకొంటూ కాలం గడిపేవాణ్ని. హఠాత్తుగా హృద్రోగంతో జానకి మరణిస్తే నిర్వికారంగా ఉండలేకపోయాను. అలా అని హృదయానికి హత్తుకొని మనస్ఫూర్తిగా రోదించలేకపోయాను. తండ్రి వుండి కూడా దిక్కులేని అనాథలా విలపిస్తున్న చిట్టితల్లి దేవికను చూచి మనసు హైరానా పడేదేకాని ఊరడించలేకపోయింది. అందుకే ఈ చితిదగ్గర...అర్ధరాత్రి...బిగ్గరగా రోదిస్తున్నాను. సంజెమంటలు ఆర్పుకొంటున్నాను. శివా-ఏమిరా మాట్లాడవు? ఇప్పటికీ నీకు నమ్మశక్యంగా లేదా?"—

గణపతి మాటలకు మ్రాన్పడిపోయాడు శివరామశాస్త్రి.

"లేదురా గణపతీ! నమ్ముతున్నాను. నా ప్రియమిత్రుణ్ణి నేను అనుమానించడమేమిటి? ఊరుకోరా! ఊరుకో! ఏడవకు! ఏనాటికైనా ఎడబాటు తప్పదు. ఎవరూ విధిని ఎదిరించలేరు. అందరమూ వెళ్ళిపోయేవాళ్ళమే-"

శివరామశాస్త్రి మాటలకు చిత్రంగా నవ్వాడు గణపతి.

"నేనొకటి కోరుతాను. చేస్తావా?"

గణపతి మాటలకు సరేనని సమాధానమిచ్చాడు శివరామశాస్త్రి.

"నా కూతురు దేవికను నీ కోడలిగా స్వీకరిస్తావా? అంతిమ ఘడియలో హాయిగా, ఆనందంగా వెళ్ళిపోతాను."

"అవధూతస్వామి కోరిక ఎలాంటిది?" శివరామశాస్త్రి మనసులోనే ఆశ్చర్యపడ్డాడు. నవ్వుకొన్నాడు. స్థిరనిశ్చయంతో అన్నాడు.

"గణపతీ! అలాగే! నే నిత్యం కొలిచే శివుని సాక్షిగా చెబుతున్నాను. నీ కూతురు దేవిక నా ఇంటి కోడలవుతుంది."

"తథాస్తు" అని మాత్రమే ఉచ్చరించి కుప్పలా కూలిపోయాడు గణపతి.

"గణపతీ" అంటూ అదుర్దాగా దేహం పట్టుకొన్నాడు శివరామశాస్త్రి.

కళ్ళు తెరవలేదు గణపతి. శ్వాసని ఆపివేశాడు. కొద్దిసేపట్లోనే ఒళ్ళు చల్లబడిపోయింది. మరి కాసేపటికే అది గట్టిపడిపోయింది.

అవధూతస్వామి పరమపదించాడు.

మమకారం అనే బంధంనుంచి కూడా తప్పించుకొన్నాడు.

శివరామశాస్త్రి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

చిన్ననాటి స్నేహానికి ఆనవాళ్లుగా అనుభూతులు మిగిలాయి.

శాస్త్రి ఏదో నిశ్చయానికొచ్చాడు.

సరిగ్గా అప్పుడే ప్రాగ్దిశలో వెలుగు వచ్చింది. □

శ్రీ ములుకుల ఉపేందర్
శ్రీ యం. రమేష్‌రెడ్డి

ఆహారధాన్యాల విక్రయం కాగల మిగులు - నిర్దిష్ట అధ్యయనం

ఆర్థికాభివృద్ధి జరగాలంటే వ్యవసాయోత్పత్తి పెరగడమేకాకుండ వ్యవసాయరంగంనుండి లభ్యమయ్యే నాణ్యమైన విక్రయంకాగల మిగులుకూడా పెరగవలె వ్యవసాయోత్పత్తి పెరుగుతున్నప్పటికి విక్రయంకాగల మిగులు మార్కెటబుల్ సర్‌ప్లస్ విక్రయమైన మిగుల మార్కెటెడ్ సర్‌ప్లస్ పెరగనట్లు అయితే ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం తన ప్రాధాన్యతను కోల్పోతుంది. రెండవ ప్రపంచ యుద్ధము తరువాత సంభవించిన ఆహార కొరత ఫుడ్‌షార్టేజి వలన ఆహారధాన్యాల విక్రయం కాగల మిగులు' విశేష ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. ప్రస్తుత అధ్యయనము వరంగల్ జిల్లాలో విక్రయం కాగల మిగులు వరిధాన్యమునకు సంబంధించినది.

విధానక పరిధి

ప్రస్తుత వ్యాసములో ఆహారధాన్యాల విక్రయం కాగల మిగులుకి ఉత్పత్తికి మధ్యగల సంబంధ స్వభావమును అధ్యయనము చేయడానికి ప్రయత్నము చేయడం జరిగినది. ఈ ఉద్దేశ్యముతోపాటు ఈ క్రింది పరికల్పనను హయిపొతెసిస్ పరీక్షించుటకు ఉద్దేశింపబడినది. "విక్రయంకాగల మిగులుకి ఉత్పత్తిపరిమాణమునకు మధ్యగల ప్రత్యక్ష సంబంధము పాసిటివ్ రిలేషన్‌షిఫ్ ఉన్నది. క్షేత్ర అధ్యయనం నిమిత్తం వరంగల్ జిల్లాను వరణం చేసుకొనబడినది. జిల్లాలోని ప్రతి తాలూకానుండి ఒక గ్రామము చొప్పున 15 గ్రామాలను ప్రతిగ్రామమునుండి అయిదుగురు వ్యవసాయదారులను స్తరిత యాదృచ్ఛిక ప్రతిచయ్యన పద్ధతిపైన ఎంపిక చేసుకోవడము జరిగినది.

ప్రస్తుత అధ్యయన నిమిత్తం ప్రాథమిక దత్తాంశ ప్రయిమరీ డాటాను సేకరించడము జరిగినది. అందుకోసం నియమిత ప్రశ్నావళిని ఉపయోగించి యాదృచ్ఛికముగా వరణం చేయబడిన వ్యవసాయక-మత యజమానులనుండి సంబంధిత బోగట్టాను సేకరించడం జరిగినది. జిల్లాలోవరి ముఖ్యమైన పంటగా దాని ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత అధ్యయనమును వరిపంటకు మాత్రమే పరిమితము చేయడము జరిగినది. ఖరీఫ్ మరియు రబీ కాలాలలో దత్తాంశమును వేరువేరుగా సేకరించడము జరిగినది. అందువల్ల అధ్యయనం 1984-85 వ్యవసాయ నంవత్సరమునకు మాత్రమే పరిమితమైనందున క్షేత్ర అధ్యయన విశ్లేషణ ఫలితాలు మధ్యచ్ఛేద దత్తాంశము క్రాస్ సెక్షన్ డాటాపైననే ఆధారపడి యుండును.

విక్రయంకాగల మిగులు నిర్వచనము

ఒక సంవత్సర కాలంలో 1984-85 ఉత్పత్తి చేయబడిన ఆహార ధాన్యాల (వరి) నుండి రైతు తన కుటుంబావసరాలకు, శ్రామికులకు వస్తురూపేణ వేతనాలకు, విత్తనాలకు ముందు ఒప్పందం ప్రకారము యితరులకు చెల్లింపబడే ధాన్యము తరుగు (వేస్టేజి) మొదలైనవి పోను విక్రయానికి తేగలిగే ధాన్యమును "విక్రయం కాగల మిగులు" అనవచ్చు.

జిల్లాకి సంబంధించిన సంక్షిప్త పరిచయము

తెలంగాణా ప్రాంతంలోని వరంగల్‌జిల్లా 28,00,295 జనాభాతో 12,846 చ. కి. మీ. విస్తీర్ణమును కలిగివున్నది. జిల్లాలోని మొత్తం గ్రామాల సంఖ్య 989. ప్రధానమైన పంటలు వరి, జొన్న, వేరుశెనగా, కాయధాన్యములు పంట దిగుబడిలో వరి; పంట విస్తీర్ణంలో జొన్న అగ్రస్థానములోనున్నది. జిల్లాలో ముఖ్యమైన నీటివనరులు రామప్ప, పాఖాలా, లక్నవరం, ములుగు-ఘణపుర్ మరియు చలివాగ్ ప్రాజెక్టులు. అంతేకాకుండా వర్షపు నీటిపై ఆధారపడి చెరువులు, కుంటలు, బావులు మొదలైనవి.

అధ్యయన ఫలితాలు

ఈ క్రింది పట్టిక-1 వ్యవసాయదారులు సేద్యంచేసిన మొత్తంభూమి (ఎకరాలలో) కుటుంబ సభ్యుల సంఖ్యకి సంబంధించిన వివరాలను తెలియచేయును.

పట్టిక - 1

వ్యవసాయదారుల తెగ	కమతం పరిమాణం ఎకరాలలో	ప్రతిచయన కమతాల సంఖ్య	కుటుంబ సభ్యుల సంఖ్య	సేద్యంచేయబడిన మొత్తం భూమి ఎకరాలలో
చిన్నతరహా వ్యవసాయదార్లు	1-5	25	109 (27.66)	68 (11.48)
మధ్యతరహా వ్యవసాయదారులు	5-10	25	157 (39.84)	175 (29.56)
పెద్దతరహా వ్యవసాయదారులు	10 అంతకంటె ఎక్కువ	25	128 (32.48)	349 (58.95)
మొత్తం :		75	394	592

(బ్రాకెట్లలో శాతమును తెలియచేయును)

అధ్యయన నిమిత్తం వరణం చేయబడిన ప్రతిచయన చిన్న వ్యవసాయదారుల సేద్యం చేసిన భూమి మొత్తం భూమిలో 11.48 శాతము, మధ్యతరహా వ్యవసాయదారులు 29.56 శాతము. పెద్దతరహా వ్యవసాయదారులు 58.95 శాతము. అయితే ప్రతిచయన వ్యవసాయదారులలో పెద్దతరహా వ్యవసాయదారులే అధికంగా భూమిని సేద్యం చేయడం జరిగినది. చిన్నతరహా వ్యవసాయదారుల సగటు కమతం పరిమాణం 2.72 ఎకరాలు, మన వ్యవసాయదారుల సగటు కమతం పరిమాణం 7 ఎకరాలు, పెద్దతరహా వ్యవసాయదారుల

సగటు కమతం పరిమాణం 13.96 ఎకరాలు. మూడు తెగలకు చెందిన ప్రతిచయన వ్యవసాయదారులను సరిసమాన సంఖ్యలో యాదృచ్ఛికంగా వరణం చేసినప్పటికి వారి కుటుంబ సభ్యుల సంఖ్యలో తేడాలున్నవి. మొత్తం ప్రతిచయన వ్యవసాయదారుల కుటుంబ సభ్యుల సంఖ్యలో తేడాలున్నవి. మొత్తం ప్రతిచయన వ్యవసాయదారుల కుటుంబ సభ్యుల సంఖ్యలో చిన్న వ్యవసాయదారులు 27.66 శాతము మధ్య వ్యవసాయదారులు 39.84 శాతము పెద్ద వ్యవసాయదారులు 32.8 శాతము కుటుంబ సభ్యులను కల్గివుండిరి. చిన్న వ్యవసాయదారుల కుటుంబ సభ్యుల సంఖ్య చిన్నవిగా ఉండేదుకు ముఖ్య హేతువు ఏమిటంటే వివిధ కారణాలవల్ల కమతాల విభజన విఘటన తప్పనిసరై ఈ తెగ వ్యవసాయదారులు చిన్నచిన్న కుటుంబాలుగా వేరు పడటంవలన కుటుంబ సభ్యులు తక్కువగా ఉన్నారు. మిగతా మధ్యతరహా పెద్దతరహా వ్యవసాయ దారులు యింకను ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఉండి వ్యవసాయ కార్యక్రమాలను కొనసాగించుటవలన వారి కుటుంబసభ్యుల సంఖ్య పెద్దవిగా నున్నవి.

పట్టిక - 2

వ్యవసాయదారులు సేద్యంచేసిన భూమి మొత్తం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు తెలియచేయును.

వ్యవసాయదార్ధుల తెగ	సేద్యం చేయబడిన మొత్తంభూమి ఎకరాలలో	మొత్తం సేద్యం చేయబడిన భూమిలో శాతం	మొత్తం ఉత్పత్తి (బస్తాలలో)	మొత్తం ఉత్పత్తిలో శాతం
చిన్నతరహా వ్యవసాయ దారులు	68	11.48	2,046	13.44
మధ్యతరహా వ్యవసాయ దారులు	175	29.56	5,425	35.64
పెద్దతరహా వ్యవసాయ దారులు	349	58.95	7,750	50.91
మొత్తం	592	100	15,221	100

(* ప్రతి బస్తా సుమారు 75 కిలోల ధ్యాన్యమును కలిగియుండును)

ఈ జిల్లాలో ప్రతిచయన వ్యవసాయదారులు ఖరీఫ్, రబీ కాలంలో ఉత్పత్తిచేసిన మొత్తం వరిధాన్యంలో చిన్నతరహా వ్యవసాయదారులు 13.44 శాతము, మధ్యతరహా వ్యవసాయదారులు 35.64 శాతము పెద్ద వ్యవసాయ దారులు 50.91 శాతము, బస్తాలలో ధాన్యాలను ఉత్పత్తి చేసిరి. కమతం విస్తీర్ణం పెరిగిన కొద్ది ఉత్పత్తి పరిమాణంకూడా పెరగడాన్ని మనం పై పట్టిక ద్వారా అవగాహన చేసుకొనవచ్చును. అయితే ప్రతి పంట కాలంలో ఏకారా పంట దిగుబడి ఈ మూడు తరగతుల వ్యవసాయదారుల తెగల విషయములో చెప్పుకోతగినంత మార్పులేదు. ఏకరాభూమి ఉత్పాదకత మూడు తెగలకు చెందిన వ్యవసాయదారుల విషయములో ఒకే విధంగా ఉండడము గమనించతగిన విషయము దీనికి ముఖ్యకారణం చిన్న వ్యవసాయదారులు తమ వ్యవసాయ కార్య కలాపాలను శ్రమసాంద్రితమైన తమ కుటుంబ సభ్యులే నిర్వహించడము, మధ్య పెద్ద వ్యవసాయదారులు అధిక పెట్టుబడితో సమయానుకూలంగా వ్యవసాయ కార్యకలాపాలను శ్రమ సాంద్రత మరియు మూల ధన సాంద్రిత వద్ధతులను అనుసరించడంద్వారా ఏకరాభూమి ఉత్పాదకలో మార్పులు లేవు.

ఈ క్రింది పట్టిక వ్యవసాయదారుల తెగలవారిగా మొత్తం ఉత్పత్తి (టోటల్ ప్రొడక్షన్) అన్ని అవసరాల నిమిత్తం ఉపయోగించబడిన (రిటెంషన్) ధాన్యం పంపిణీని తెలియచేస్తుంది.

పట్టిక - 3

వ్యవసాయ దారుల తెగ	మొత్తం ఉత్పత్తి (బస్తాలలో)	శ్రామికులకు దాన్యం రూపంలో ఇచ్చే వేతనాలు (బస్తాలలో)	ఒప్పందాల ప్రకారం ఇతరులకు చెల్లించబడిన దాన్యం	కుటుంబ అవసరాల నిమిత్తం	అన్నిఅవసరాల నిమిత్తం ఉపయోగించబడిన దాన్యం
చిన్నతరహా వ్యవసాయ దారులు	2046 (13.44)	609 (18.88)	300 (50.67)	980 (15.96)	1889 (18.79)
మధ్యతరహా వ్యవసాయ దారులు	5425 (35.64)	1300 (39.13)	160 (27.02)	2118 (34.50)	3578 (35.59)
పెద్దతరహా వ్యవసాయ దారులు	7750 (50.91)	1413 (42.53)	132 (22.29)	3040 (49.52)	4585 (45.61)
మొత్తము	15.221	3222 21.82°	592 3.88°	6135 40.32°	10052 66.04°

(బ్రాకెట్లలో శాతమును తెలియచేయును)
° మొత్తం ఉత్పత్తిలో శాతమును తెలియచేయును.


పై పట్టికను పరిశీలిస్తే ఉత్పత్తి పెరుగుదలతోపాటు శ్రామికులకు ధాన్యం రూపంలో చెల్లించబడిన వేతనాలు, కుటుంబ అవసరాల నిమిత్తం ఉపయోగించబడిన ధాన్యం క్రమేణా పెరుగుతున్నది అని తెలియచేయుచున్నది. కాని ఒప్పందాల ప్రకారము ఇతరులకు చెల్లించబడే ధాన్యం ఉత్పత్తి పెరిగే కొద్ది యిది తరుగుచున్నది. ఈ రెండింటిమధ్య ప్రస్తుత క్షేత్రి అధ్యయన పరిశీలన వల్ల విలోమ సహ సంబంధము ఇన్‌వర్స్ కారిలేషన్‌ను తెలియచేస్తుంది. యికపోతే కుటుంబ వినియోగ నిమిత్తం ఉపయోగించబడిన ధాన్యం విషయాన్ని కాస్తే ఉత్పత్తి పరిమాణం పెరుగుచు ఉన్నప్పటికి, కుటుంబసభ్యుల సంఖ్య (పట్టిక-1) పెరగడము వలన యిది పెరుగుచున్నది. కుటుంబ సభ్యుల సంఖ్యకి అవసరాల నిమిత్తం వినియోగించబడే ధాన్యముకు ధనాత్మక సంబంధము పాసిటివ్ రిలేషన్‌షిప్‌ను తెలియచేయుచున్నది.


వరి ఉత్పత్తికి ఒప్పందాల ప్రకారము యితరులకు చెల్లించబడి ధాన్యం (కాంట్రాక్ట్యువల్ అబ్లిగేషన్స్) నకు మధ్య విలోమ సంబంధమును గమనించవచ్చు. కమత పరిమాణం పెరిగేకొద్ది ఉత్పత్తి పెరుగుదలవలన వ్యవసాయదారులు అన్ని అవసరాలను చాలావరకు తీర్చుకోవడం జరగడమువలన పెద్ద మరియు మధ్య వ్యవసాయదారు విషయములో ఒప్పందాల ప్రకారం యితరులకు చెల్లించబడి ధాన్యము పరిమాణము తగ్గుతుంది. కేవలము చిన్న వ్యవసాయదారుల విషయములో మాత్రము అన్ని అవసరాల నిమిత్తము యితరులనుండి ముందు ఒప్పందాల ప్రకారం తీసుకొన్న ద్రవ్యపరమైన ధాన్య,

CORRECTION

In the Statement of ownership and other particulars relating to Bharati Published in the March 1986 issue of BHARATI the name of the Publisher was worngly mentioned as S. Nageswara Rao in the Last Paragraph of the statement. The Name should have been S. RADHA KRISHNA.

(Sd.) **S. RADHAKRISHNA,**
Publisher.





అప్పులను తీర్చడానికిగాను వారు ఉత్పత్తిలో ఎక్కువ భాగాన్ని చెల్లిస్తారు: స్థూలంగా ఉత్పత్తికి అన్ని అవసరాల నిమిత్తం ఉపయోగించబడిన ధాన్యం మధ్య ప్రస్తుత అధ్యయన ఫలితాల విశ్లేషణాధారితముగా ధనాత్మక సంబంధమును గమనించవచ్చు.

ఈ క్రింది పట్టిక-4 వరి ఉత్పత్తికి విక్రయంకాగల మిగులుకి మధ్యగల సంబంధాన్ని తెలియచేస్తుంది.

పట్టిక - 4

వ్యవసాయదారుని తెగ	మొత్తం సేద్యం చేయబడిన భూమి ఎకరాలలో	మొత్తం ఉత్పత్తి	అన్ని అవసరాల నిమిత్తం ఉపయోగించ బడిన ధాన్యం	విక్రయం కాగల మిగులు
1	2	3	4	5
చిన్నతరహా వ్యవ	68	2046	1889	157
సాయ దారులు	(11.48)	(13.44)	(18.79)	(3.03)
మధ్యతరహా వ్యవ	175	5425	3578	1847
సాయ దారులు	(29.56)	(35 64)	(35.59)	(35.73)
పెద్ద తరహా వ్యవ	349	7750	4585	3165
సాయ దారులు	(58.95)	(50.91)	(45.61)	(61.23)
మొత్తం	592	15221	10052	5169
			66.04⁰	33.95⁰

(బ్రాకెట్లలో శాతమును తెలియుచేయును)
⁰ మొత్తం ఉత్పత్తిలో శాతమును తెలియజేయును.


పై పట్టికను పరిశీలిస్తే సేద్యం చేయబడిన భూమి విస్తీర్ణం పెరిగే కొద్ది ఉత్పత్తి పరిమాణంకూడా పెరుగుతుంది. వాటి మధ్యగ ధోరణిని పరిశీలిస్తే వాటి మధ్య ప్రత్యేక సహ సంబంధమున్నట్లు తెలియుచున్నది. అదేవిధముగా ఉత్పత్తికీ విక్రయంకాగల మిగులుకి మధ్య ప్రత్యక్ష సంబంధమును తెలియ జేయుచున్నది. అయితే చిన్నతరహా వ్యవసాయదారుల విషయములో మొత్తం విక్రయంకాగల మిగులులో వారి వాటా కేవలం 3.03 శాతము, అయితే మధ్య పెద్ద వ్యవసాయదారుల విషయములో వారి వాటా వరుసగా 35.73 శాతము మరియు 61.23 శాతము.

వ్యవసాయదారులను తెగల (గ్రూపు) వారిగా విశ్లేషిస్తే చిన్నతరహా వ్యవసాయదారుల విషయంలో మొత్తం ఉత్పత్తి 2046 బస్తాలయితే విక్రేయం కాగల మిగులు 7.67 శాతము మాత్రమే మధ్యతరహా వ్యవసాయదారుల విషయంలో మొత్తం ఉత్పత్తి 5425 బస్తాలయితే విక్రయం కాగల మిగులు 34.04 శాతము మరియు పెద్దతరహా వ్యవసాయదారులు విషయములో మొత్తం ఉత్పత్తి 7750 బస్తాలయితే విక్రయం కాగలమిగులు 69.02 శాతము. మొత్తం ప్రతిచయన వ్యవసాయదారులు ఉత్పత్తి పరిమాణం 15221 బస్తాలయితే అన్ని అవసరాల నిమిత్తం ఉపయోగించబడిన ధాన్యం 66.04 శాతము అయితే విక్రయం కాగల మిగులు 33.95 శాతము మాత్రమే. ముఖ్యంగా గమనించవలసిన అంశము ఏమిటంటే ఏ వ్యవసాయదారుడుకూడా తాను పండించిన ధాన్యంను విత్తనాలుగా ఉపయోగించుకో లేదు. వివిధ విక్రయ సంస్థలనుండి అధిక దిగుబడినిచ్చే వరివంగడాలను కొని విత్తనాలుగా ఉపయోగిస్తున్నారు.

ముగింపు :

క్షేత్ర అధ్యయన నిమిత్తం వరణం చేయబడిన వివిధ వ్యవసాయదారుల తెగలనుండి సేకరించిన దత్తాంశం అధారితముగారాబట్టిన ఫలితాలను విశ్లేషిస్తే కమతాల పరిమణం పెరిగేకొద్ది వరి ఉత్పాదితముకూడా పెరుగుతున్నది. బోధపడు చున్నది.అంతేకాకుండ "వరి ఉత్పత్తి పరిమానమునకు-విక్రయంకాగల మిగులుకి మధ్య ప్రత్యక్ష సంబంధం కలదు"-అనే పరికల్పన వాస్తవమైనదని ప్రస్తుత క్షేత్ర అధ్యయన ఫలితాలు నిరూపిస్తున్నవి. కావున చిన్నచిన్న కమతాల సమీకరణ అధిక ఉత్పత్తికి అనివార్యం అని, కమతాల విభజన, విఘటన అధికోత్పత్తికి అవరోధం అని వ్యవసాయదారులు గ్రహించవచ్చును. వ్యవసాయా దారితమైన మన ఆర్థిక వ్యవస్థలో ఆర్థికాభివృద్ధి వేగంగా జరగాలంటే సాంద్ర, విస్తృత వ్యవసాయముద్వారా వ్యవసాయోత్పత్తిని పెంచడమేకాకుండ వ్యవసాయ రంగమునుండి లభ్యమయ్యే విక్రయంకాగల ఆహారధాన్యాల మిగులు పెరగవసలెని ప్రతి వ్యవసాయదారుడు ఆర్థికాభివృద్ధి సాధనలో తనవంతుపాత్రను గుర్తించుకొన వలసి వుంటుంది. అంతేకాకుండా పండిన పంటలో అన్ని అవసరాల నిమిత్తం ఉపయోగించబడే ధాన్యంను సాధ్యమైనంతవరకు తగ్గించి విక్రయం కాగల మిగులు పెరిగేందుకు ప్రతి వ్యవసాయదారుడు కృషిచేసినప్పుడే ఆర్థికాభివృద్ధి పథకంలో వ్యవసాయరంగానికి కీలకపాత్ర నిచ్చిన వారగుదురని ఆశిద్దాం.

[రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయం యొక్క అర్థశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థులు.] □


AMRUTANJAN'S
SWAS
MINTS
అమృతాంజన్
వారి మరొక గొప్ప తయారీ
స్వాస్
మింట్
బిళ్ళలు
అమృతాంజన్ లిమిటెడ్

గర్ల్‌ఫ్రెండ్

వి.వి.బి. రామారావు

రిక్షా అబ్బాయి మువ్వ గలగల లాడిస్తూ ముందుకు దూసుకుపోతున్నాడు. 'ఎరైవింగ్ టెన్ షైల్' అని ఢిల్లీనుంచి టెలిగ్రాం ఇచ్చాడు మామయ్య,

మెయిలు మూడుగంటలకి రావాల్సి ఉండే టెలిగ్రాం రెండున్నరకొచ్చింది. శెలవుచీటీ ఒకటి రాసి పెట్టేసి దిగ్గున లేచి రిక్షా ఎక్కేశాను.

అయినా మావయ్య ఇంత హఠాత్తుగా ఎందుకొస్తున్నట్టు?

ఈ ప్రాంతానికి నేనే కొత్త. విజయవాడనుంచి వచ్చి రెండు నెలలైంది. సరియైన ఇల్లు దొరకలేదు. ఆలోచన ఎవరికొచ్చిందో కాని ఆఫీసు ఊరికవతల ఆరు కిలోమీటర్ల దూరంలో ఉద్యోగులకు రవాణాసౌకర్యం ఖచ్చితంగా లేని పారిశ్రామిక ప్రాంతంలో కోట్లు పోసి పెట్టేశారు...

ఊర్లో దోమలు—నీటి ఎద్దడి-మురికి కాల్వల కంపు, జిల్లా కేంద్రం కావడంతో ఎక్కడ చూసినా రద్దీ. బజారులో దుకాణాలన్నీ రేషను షాపుల్లానే ఏడుస్తున్నాయి. పాలకి క్యూ, నీళ్ళకి క్యూ, కిరసనాయిలుకి క్యూ. బట్టలకొట్టులో, బంగారం కొట్టులో రద్దీయే-గలీజు రోడ్లు-చీకటిలో గతుకులు...అసలు ఇక్కడి మనుషులు మనుషులేనా! ఇదే బెజవాడలో అయితేనా...

'మెయిలు గంట లేటటబా(వూ నన్నదర గొట్టేసినారు' రిక్షా అబ్బాయి జా పోస్తున్నాడు

ఆలోచనల్లోంచి తేరుకుని "అయితే వెళిపోతానంటావా? మామయ్య వస్తున్నాడుగా—మళ్ళీ రిక్షా కావాలని చెప్పాగా"

"ఉంటాను బా(వూ...ఓ రూపాయిదెయ్యండి. కసింత టీయ తాగుతా—ఈడ్నే ఉంటాలెండి"

ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుని తీరికగా ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఎక్కడ నుంచున్నా-ఎటు తిరుగుతున్నా చేపలకంపు-లేకపోతే మిర్చి ఘాటు. ప్లాట్‌ఫారంమీద కూచోడానికని వేసిన సీట్లు అన్నీ నిండిపోయాయి. టో ప్లాస్టు కుర్చీలు, సిమ్మెంటు బెంచీలు-షెడ్ స్థంభాలకోసం వేసిన దిమ్మలూ అన్నీ మనుషులు ఆక్రమించేశారు. వచ్చేబండి మూడో ప్లాట్‌ఫారం మీదకొస్తుంది.

సింహాచలంనుంచి మొక్కు తీర్చుకున్న ఒడ్రభ్రాతలు ఎక్కడంటే అక్కడ ప్లాట్‌ఫారం మీద చక్కగా ఆదమరచి నిద్రపోతున్నారు. విజయనగరం కోట చూడడం వాళ్ళ యాత్రలో చివరి ఘట్టం. రాయపూర్ ప్యాసింజరు రాత్రి ఏడింటివరకూ రాలేదు. ప్లాట్‌ఫారం క్రిక్కిరిసిపోయింది.

మూడో సిగరెట్టు ఊది పారేస్తుండగా చటుక్కున ఆలోచన మెరిసింది. నేను సిగరెట్లు ఊదెయ్యడంవల్ల వచ్చే బండి వేగంగా వచ్చేయదు.

ఇంతకీ మావయ్యకి ఈ ఊళ్ళో పనేవుందబ్బా?-ఢిల్లీ పట్నంనుంచి ఉన్న పళంగా ఇలా దిగబడడానికి కారణం నామీద అభిమానమే!—

కావచ్చు.

మావయ్య మహా సెంటిమెంటల్‌గా ఉండే మనిషి. ఎంత మితభాషో అంత ఆత్మీయత చూపించే మనిషి. అతని చిరునవ్వులో ఏదో అందం ఉట్టిపడుతూ ఉంటుంది-కళ్ళలో ఏదో చిలిపితనం-చిన్నతనం అనడంకంటె పసితనం అనడం న్యాయమేమో! దేనినయినా అతి తేలికగా తీసుకుని నవ్వగలిగిన మనిషి-కష్టంలో కుంగిపోడు-కలిగింది కదా అని మిడిసిపడడు-కష్టం సుఖం తెలిసిన మనిషి మనుషుల్ని పుస్తకం చదివినట్లు చదివేస్తాడు.

ఒరేయ్ అబ్బీ మనిషి నేర్చుకోవాల్సింది చిరునవ్వు నవ్వడమెలా అంటూ ఒక కథ చెప్పాడు ఓసారి.

రమణాశ్రమంలో మహర్షి ఉన్న రోజుల్లో ఓసారు వెళ్ళాడట సరదాకి. ఊసుపోకకి మౌనంగా ఉన్న మహర్షిని చూసి నేరుగా ఒకటే ప్రశ్న వేశాడట.

'ఏమిటా నవ్వు? దాని అర్థం ఏమిటి?' అని.

—'చిరునవ్వు సాధన చేస్తున్నా' జవాబు.

చిరువయసుతో ఉరకలేసిన చిలిపితనం మావయ్యలో ఆలోచనాశక్తిని మేల్కొలిపింది. ఎంత ఆలోచనాపరుడో అంతగా తనని చూసి తెగ నవ్వుకోగలగటం అతనిలో ప్రత్యేకత.

డీజల్ ఇంజన్ ఖ(య్‌మని శబ్దం చెయ్యడంతో మళ్ళీ ప్లాట్‌మీద కొచ్చాను.

రైల్లోంచి మావయ్య నన్ను గుర్తు పట్టడానికి వీలుగా కాక తెరిపిగా ఉన్న చోట నుంచుని ముందుకెళుతున్న కిటికీలవంకా దర్వాజాల వంకా ఆత్రంగా చూస్తున్నాడు.

మావయ్య సూట్ ఇట్టే కళ్ళముందునుంచి దూసుకుపోయింది.

రైలుతోనే పరిగెత్తాను.

బ్రీఫ్‌కేస్ అందుకుని "ఏం మావయ్యా! ప్రయాణం కులాసాగా జరిగిందా?

"ఆ! మొత్తం పడుకునే వచ్చా మరి...నా చిన్నతనంలో ఇంత సుఖం ఎరగవే ఎరగం..." నవ్వుతూ మావయ్య నాతో నడిచాడు.

"ఒరేయ్ బుజ్జీ...నీకెవరయినా గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారా?" నవ్వుతూ అడిగాడు.

నా మొహం ఎర్రగా అయిపోయింది.

"అంత సిగ్గుపడ్డ మెందుకోయ్. గర్ల్‌ఫ్రెండ్ ఉండడం మా రోజుల్లోనే తప్పని నేననుకోలేదు."

మావయ్య హాయిగా నవ్వగలడని నాకు తెలుసు. కాని మావయ్య గర్ల్‌ఫ్రెండ్‌ని నేనూహించడం అసంభవం. మావయ్య అల్లాంటివాడు కాదు.

నా మొహం చూసి "సరేలే. మరీ అంత సీరియస్‌గా ఉండడం మనసుకి అంత ఆరోగ్యం కాదు" అంటూ మళ్ళీ ఓ చిరునవ్వు విసిరాడు.

ఇంటికి రావడం లలితను ఆప్యాయంగా పలకరించడం చంటాణ్ణి నిమిషంలో ఆకట్టుకోవడం—వాడితో ఆడుకోవటం వీటన్నింటినీ చూస్తున్న మావయ్య గర్ల్‌ఫ్రెండ్ గురించి ఆలోచిస్తూనే వున్నా.

మావయ్య గర్ల్‌ఫ్రెండ్ ఎలా ఉండి ఉంటుంది?

"మావయ్యా! అత్తయ్యను తీసుకురాలేదేం?

"ఓరి నీ దుంపతెగ! దాన్నెందుకోయ్—నాకయితే డేటా పని. దానికేం-"

"డేటా పనా?

"డియ్యే-టియ్యే-సెమినార్‌కి వచ్చా విశాఖపట్నం-నువ్విక్కడ ఉన్నావ్.... చదువుకున్న ఊరు."

"నువ్వు విజయనగరంలో చదువుకున్నావా?"

"విజయనగరం అంటే ఏమనుకుంటున్నావ్ కుర్రనాగమ్మా....ఆ రోజుల్లో అటు మద్రాసుకీ ఇటు బరంపురానికీ మధ్య ఎన్ని కాలేజీలున్నాయనుకుంటున్నావ్?"

ఇక్కడ చదువుకోడమంటే ఒక గౌరవం, ఒక దర్జా... అసలు ఈ ఊరు



గాలిలో, నెల్లిమర్ల ఏటి నీటిలో....ఈ మట్టిలో సంగీతమేమిటి? సాహిత్యమేమిటి? ఈ ఊర్లోకి వచ్చి పడటం కేవలం నీ పూర్వజన్మ సుకృతం..."

నాకేమనాలో తెలియలేదు.

"మావయ్యా ఈ ఊరు నిజంగా అంత గొప్పదా....?"

భోజనాలూ అవీ అయ్యాక....జమ్ జమ్ కెళదాం పద!" మా ఆవిడ కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది.

"నువ్వూ వస్తావా?"

"అబ్బే, మీ పుత్రరత్నం నన్ను రానివ్వడు-" అనేసింది లలిత.

"మావయ్యా! జమ్ జమ్ అంటే?-"

"హారినీ ...మూడు లాంతర్ల దగ్గర జమ్‌జమ్ కిళ్ళీ దుకాణం ఉండేది.... ఇలా కాలేజీ మీదనుంచి దేవీ దుకాణం దగ్గరకెళ్ళి మెయిన్‌రోడ్డు మీదనుంచి వస్తూ మూడు లాంతర్ల దగ్గర జమ్ జమ్ దగ్గర ఒక కిళ్ళీ బిగిస్తే....అదీ కులాసా! ఖుషీ....

గురజాడ వారింటిదగ్గర కొచ్చాం-

"అదికాదురా అబ్బాయ్! ఈ వీధిలోంచి వెళదాం...." అంటూ సందులోకి తీసుకెళ్ళాడు మావయ్య.

"ఇది కోడుగంటివారి వీధి" నేను వీధిలోకి తెగగొట్టేసి ఉన్న కొళాయి గొట్టాలవంకే చూస్తున్నా....

మావయ్య దృష్టిలో మురికి కాల్వలూ, ఇరుకు సందులూ, నీళ్ళుపడని కొళాయిలు లేవు. అతనికి ఏదో మరో లోకంలో తిరుగుతున్న అనుభూతి కలుగుతుండడం నాకు కనిపించింది....ట్యూబ్ లైట్ వెలుతుర్లో.

"ఈ ఎడమచేతి పక్క ఇల్లు చూడు...."

"అవును..."

"అది మా గర్ల్‌ఫ్రెండ్‌ది...."

"మావయ్యలో ఉరకలేస్తున్న ఉత్సాహం. అరుగు ఎక్కివెళ్ళి తలుపు తట్టేలా ఉన్నాడు.

"మావయ్యా ఎన్నేళ్ళ కిందట?"

"అదే చచ్చు ప్రశ్న....ఎన్నేళ్ళ క్రిందయినా గర్ల్‌ఫ్రెండ్‌కి వయసు రాదబ్బాయ్!"

నిజానికి మావయ్య థర్డు బియస్సీ కుర్రాడిలా కనబడ్డాడు.

అతన్ని ఊహాలోకంలోంచి క్రిందకి తీసుకురావడం నాకు ఇష్టం లేకపోయింది.

"కుర్రనాగమ్మా! గర్ల్‌ఫ్రెండ్ అంటే నీ మనసులో ఓ అమ్మాయి ఉంటుంది. మరి నా గర్ల్‌ఫ్రెండ్ గురించి చెబుతా...."

ఆ ఇల్లు దాటి కాలేజీ ముందుకొచ్చాం-"సాయంకాలం కాలేజీ నుండి ఇంటికి వెళుతున్నా...గురజాడవారి వీధిలోంచి వెళ్ళడంకంటే నాకు ఈ వీధిలోంచి వెళ్ళడం సరదాగా ఉండేది. ఫిజిక్స్‌మెయిన్‌లో ఒకే ఒక అమ్మాయి ఉండేది.

ఆ అమ్మాయి పేరు సుబ్బలక్ష్మి. నేను ఇందాక చూపించిన ఇంట్లో ఉండేది.



కాలేజీలో అమ్మాయిల వంక చూడడానికే భయం .. అమ్మాయిలతో మాట్లాడడమే...

మేష్టర్లంటే చచ్చేటంత భయం.

క్లాస్‌లోకి మాస్టారొచ్చాక వచ్చేది సుబ్బలక్ష్మి. మాస్టారి పాఠం అయిపోగానే ముందు ఆ అమ్మాయే వెళ్ళిపోయేది-

ఊఁహే! బయట మాటాడటం అప్పట్లో సుమారు అనూహ్యం.

"మరి గర్ల్ ఫ్రెండ్...."

"ఉండు నన్ను చెప్పనియ్!"

ముందుకు వెళుతున్నాం,

"దేవీ సుకాణం ఇది... ఇక్కడ జిలేబీ.... ఆ రోజుల్లో సుమారు విశాఖపట్నం జిల్లాకే ప్రసిద్ధి.

అబ్బాయ్! ఓ అరకేజీ జిలేబీ...."

జిలేబీ పొట్లాం, మల్లెపూలూ తీసుకొని గంటస్థంభంవంక వస్తున్నాం.

"ఈ గడియారాలు"

"ఈ మధ్యనే పనిచేస్తున్నాయి...."

"గడియారాలు ఆగిపోయి వుంటే నేను కాలేజీలోనే విద్యార్థిగా ఉండిపోయి ఉంటే...."

మావయ్యని చూస్తే నాకు నిజంగానే జాలివేసింది. నేను ఊరుకున్నాను.

ముందు లాంతర్ల దగ్గరకొచ్చి "మూడు జమ్ జమ్!" అన్నాడు. కిళ్ళీకొట్టు మనిషి చకచకా కిళ్ళీలు కడుతున్నాడు.

మావయ్య చేతిలో జిలేబీలు-నా చేతిలో పూలు,

'సుబ్బలక్ష్మి!'

"ఆఁ చెబుతున్నా"... కిళ్ళీ బుగ్గన పెట్టి-'పద' అన్నాడు.

ఓ రోజు సాయంకాలం ఇంటికొస్తుండగా

"ఏమండీ...." అంది సుబ్బలక్ష్మి.

నా కాళ్లు ఆగిపోయాయి-బండి డిరెయిల్ అయినంత పనయింది.

"బామ్మా మరో అబ్బాయిని తీసుకొచ్చా-"

నాకు గుండె దడదడలాడింది.

"రా నాయనా లోపలకిరా...."

ఓ పెద్దావిడ నన్ను లోపలికి పిలిచింది.

"నూతి దగ్గరికి వెళ్ళి కాళ్లు కడుక్కో!"

సుబ్బలక్ష్మి కోసం చుట్టూ చూశా....

"నూతి దగ్గరే వుంది...."

నిజమే సుబ్బలక్ష్మి తువాలుతోసహా ఉంది నూతిదగ్గర.

కాళ్ళూ చేతులూ కడుక్కోగానే తువాలు చేతికందించింది.

"ఆ పీట వాల్చుకుని కూచో" అంది పెద్దావిడ.

"మీ ఇంటి పేరు...." ఆవిడ అడిగింది.

చెప్పాను.

"చూశావా బామ్మా నేను ఎంత సరిగ్గా పోల్చానో...."

కొంపతీసి పెళ్ళి సంబంధం కాదు గదా?.... గోత్రం అడుగుతుందేమో అనుకున్నాను.

ముందు ఓ పెద్ద అరిటాకు వేసింది.

అందులో ముందు అట్లూ - ఒక వెండిగిన్నెలో బియ్యం పరమాన్నం.

"తిను బాబూ...." ఆవిడ వేస్తూనే ఉంది.

నేను కడుపునిండా తిన్నాను....

అయినా నా మనసులో ఏదో బెంగ....ఈ సుబ్బలక్ష్మివంక క్లాసులో కొన్ని కోట్లసార్లు చూశాను.

కానీ ఆమె నావంక చూసిన స్వర్గక్షణం నాకయితే గుర్తు లేదు.

నా మీద ఎందుకింత ఆపేక్ష?-

ఆపేక్ష అయితే మరొకర్ని తీసుకొచ్చానంటుందేం?

కొంపతీసి ఇది స్వయంవరం కాదు కదా....

కడుపునిండా తిన్నానేమో కొంచెం ఆయాసం వస్తోంది. పీటమీద కూచున్నవాడిని గోడకి చేరగిలబడ్డా...."

"మామ్మ నందికేశ్వరుడి నోము చేసుకుంది. ప్రసాదాలు ఇంట్లోంచి బయటికి వెళ్ళకూడదు....అంతా ఖర్చయిపోవాలి....మిగలకూడదు...."

అపుడు నా మనసులో మెరుపు మెరిసింది.

"అమ్మయ్య నా నోము ముగించావ్ బాబూ! మీ పెద్దలకో వెయ్యి దండాలు. నీకు కోటి దీవెనలు. ఇక దీపం పెట్టుకుంటా." అంది ముసలావిడ.


నేను గబ గబ మెట్లు దిగిపోయాను.


"సుబ్బలక్ష్మి ఇప్పుడు ఎక్కడ ఉందో?" అంటూ మావయ్య కథ ముగించాడు.

పార్కుల్లోనూ, సినిమాల్లోనూ, వీధుల్లోనూ తారసపడే క్షుద్రకారుల గర్ల్ ఫ్రెండ్స్ నా మనసులోంచి మాయమయ్యారు.

ముప్పైఏళ్ళ క్రిందట గర్ల్ ఫ్రెండ్‌ని మావయ్య కళ్ళతో నేను చూస్తున్నాను.

"తెల్లవారుఝామునే లేవాలి." అంటూ మావయ్య మంచంమీద మేను వాల్చాడు.





చాణక్య

షారియత్ రక్షణోద్యమం

సుప్రీంకోర్టు తీర్పు

పోయిన ఏప్రిల్ చివరి వారంలో తామా తీర్పు ఇచ్చినప్పుడు తాము దేశంలో పెద్ద రాజకీయ దుమారాన్ని లేపుతున్నామని ఆ అయిదుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు తెలిసుండదు. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, దేశాయి, చిన్నపరెడ్డి, వెంకట్రామయ్య, రంగనాథమిశ్రాలు ఆ ధర్మాసనంలో ఉన్నారు ఆ తీర్పు వారి ఏకగ్రీవ నిర్ణయం.

దానిలోని వాస్తవాలివి: మహమ్మద్ అహమ్మద్‌ఖాన్ న్యాయవాది. 1932లో షాబానోబేగంను వివాహం చేసుకున్నాడు, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు. తిరిగి 1946లో ఇతను రెండవ వివాహం చేసుకున్నాడు, ఆ భార్యకు ఆరుగురు సంతానం కలిగారు. 1975లో అంటే 43సంవత్సరాల వైవాహిక జీవితం తరువాత షాబానోబేగంను ఆ న్యాయవాది భర్త వెళ్ళగొట్టాడు. మూడు సంవత్సరాల తరువాత ఆవిడ 1978 ఏప్రిల్‌లో ఇండోరు మేజిస్ట్రేటు కోర్టులో క్రిమినల్ ప్రొసీజరు కోడ్ 125వ సెక్షను క్రింద మనోవర్తి కోరుతూ పిటీషను వేసుకుంది. ఆవిడ కోరిన మనోవర్తి నెలకు 500 రూ॥లు. వెంటనే భర్త నవంబరు 6న ఆవిడకు 'తలాక్' 'తలాక్' 'తలాక్' అని విడాకులిచ్చేశాడు. ఆవిడ ఇకముందు తన భార్య కాదనీ, కాబట్టి ఆవిడకు మనోవర్తి ఇవ్వవలసిన బాధ్యత తనకెంత మాత్రం లేదనీ, అప్పటికే రెండు సంవత్సరాలు నెలకు 200ల చొప్పున ఇచ్చాననీ, ఇద్దత్ కాలంలో (భార్యాభర్తలు విడిపోయిన తరువాతి 3 నెలలు) ఇవ్వవలసిన 600లు, 'మెహర్' మొత్తం క్రింద 3000 రూ॥లు కోర్టులో డిపాజిట్ చేశాననీ అతని వాదం.

1979 ఆగష్టులో ఆ మేజిస్ట్రేటు 'దొర'వారు నెలకు 25రూ॥ల చొప్పున మనోవర్తి ఇస్తూ తీర్పు చెప్పాడు. ఆవిడ ఆరోపణ తన భర్తకు న్యాయవాదిగా సంవత్సరానికి 60000ల ఆదాయముంటుందని. మధ్యప్రదేశ్ హైకోర్టువారు ఆ మనోవర్తిని 179-20 రూ॥లకు పెంచారు. ఇది 1980 జులైలో జరిగింది.

దానిమీద ఆ భర్త సుప్రీంకోర్టు కొచ్చాడు.

అక్కడ సుప్రీంకోర్టు కోరికమీద భార్య తరఫున న్యాయవాది డేనియల్ లతీఫ్ వాదించాడు. భర్త తరఫున ఇద్దరు రిటైరుడు హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తులు, రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తులు, ఒకప్పటి డిప్యూటీ లా మంత్రిగార్లు న్యాయవాదులు. అంతేకాక తమంత తాముగా అనేకమంది జోక్యం చేసుకున్నారు ("ఇంటర్ వీనర్సు") భర్త తరఫున "రేడియన్స్" సంపాదకుడు సయ్యద్ అమీనుల్‌హిసన్‌రజ్వీ, అల్ ఇండియా ముస్లింపర్సనల్ లా బోర్డు (అధ్యక్షుడు, ముస్లింలీగ్ అధ్యక్షుడు ఇబ్రహీం సులేమాన్‌సేట్) జమైత్-ఉల్-ఉలేమాహింద్ అధ్యక్షుడు, కాంగ్రెసు ఎం.పి. మౌలానా అసద్‌మదానీ, జమైత్‌ఇస్లామీ వగైరాలు "ఇంటర్‌వీనర్సు" భార్య తరఫున ముస్లిం సాంఘిక సేవకురాండ్రు టెమూర్‌జహాన్ బేగం, అమీర్‌కాల్బే ఆలీఖాన్‌బేగంలు "ఇంటర్ వీనర్సు."

నిజానికి క్రిమినల్ ప్రొసీజరుకోడ్‌లోని 125వ సెక్షను ముస్లింలకూ వర్తిస్తుందని 1979, 80ల లోనే సుప్రీంకోర్టు రెండుతీర్పులు ఇచ్చింది. అవి జస్టిస్ కృష్ణయ్యర్ తీర్పులు. అందులో న్యాయమూర్తులు తుల్జాపుర్‌కార్, పథక్. చిన్నపరెడ్డి, ఎ. పి. సేన్‌లు ఉన్నారు. అయినా న్యాయమూర్తులు ముర్తుజా ఫజుల్ అలీ, వరదరాజన్‌లు ఇంకొకసారి పరిశీలించమని 1981 ఫిబ్రవరిలో విస్తృత ధర్మాసనాన్ని కోరారు. దాని ఫలితంగా ఈ ధర్మాసనం ఏర్పడింది.

ఈ తీర్పు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ రచన. ఇంతవరకూ క్రి. ప్రొ. కోడ్ ప్రకారం భార్య మనోవర్తిని పొందగలిగినా, తరువాత భర్త విడాకులిచ్చినట్లయితే, భార్య కోర్టుద్వారా పొందిన హక్కును కోల్పోతుంది. కారణమేమిటంటే ముస్లిం లా ప్రకారం విడాకులివ్వబడిన భార్యకు "ఇద్దత్" (మూడు నెలల) కాలంలోనే మనోవర్తి హక్కు ఉంటుంది. అంటే న్యాయస్థానాల ఆజ్ఞలను కూడా విడాకులతో తప్పించుకోవచ్చన్నమాట. అలా తప్పించుకోవచ్చని ముగ్గురు గ్రంథకర్తలు ముల్లా, తయాబ్జీ, పరస్ దివాన్‌లు తమ గ్రంథాల్లో వ్రాశారు.

కాని ఆ దృక్పథం సరియైనది కాదనీ ముస్లిం న్యాయశాస్త్రాన్ని సమగ్ర దృష్టితో చూస్తే ఆ తప్పు కనపడుతుందనీ చంద్రచూడ్ అభిప్రాయపడ్డాడు. దీనికిగాను ఆయన యూసఫ్ అలీ, మహమ్మద్ జఫ్రుల్లాఖాన్, బోర్డు ఆఫ్ ఇస్లామిక్ పబ్లికేషన్సు ఢిల్లీ, డాక్టరు నూరీ, మర్మదుకేపిక్తాల్, ఆర్థర్ ఆర్‌బెర్రీల ఖురాన్ అనువాదాల నుంచి ఉదహరించాడు.

ఖురాన్‌లో ఈ విషయం రెండు పద్యభాగాల్లో-అయాత్‌లు 241, 242 లలో వర్ణింపబడింది. వాటి అనువాదాల విషయంలో కూడా తగాదా ఏమీ లేదు. అయాత్ 241లో అరబిక్‌లో "మాతాఉన్" అని ఉంటే, దాని అర్థం మనోవర్తా ("మెయింటెనెన్సు") లేక సౌకర్యం లేదా వీలు కల్గించటమా (ప్రొవిజన్) అనేదే తగాదా. దీనిని గురించి సుప్రీంకోర్టు 'మనోవర్తి' అర్థాన్ని స్వీకరించింది. ఇంటర్ వీనర్ ముస్లిం పర్సనల్ లా బోర్డు వారు చెప్పిన అర్థం ఆ మాట-"ముత్తాక్వేనా" అంటే శుద్ధజీవనులకు, భగవద్భక్తులకు మాత్రమే అనువర్తిస్తుందనీ, సామాన్య ముస్లిం జనావళికి "ముసల్మీన్"కు వర్తించదన్న వాదాన్ని సుప్రీంకోర్టు కాదంది, కారణమూ చెప్పింది: అయాత్ 242లోనే "తఖ్‌లీన్" అంటే నీవు నీ సాధారణ జ్ఞానాన్ని వాడతావని ఊహించబడుతుంది అని ఉంది.

అలాగే డా. అల్లామాఖాదిమ్‌రహ్మానీనూరీ 'ఖురాన్‌వ్యాఖ్య' నుంచి కూడా ఒక పేరాను ఉదహరించాడు చంద్రచూడ్.

ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డువారు తమ వాదాన్ని వ్రాత పూర్వకంగా ఇచ్చారు కూడా. అందులో విడాకులు ఇవ్వబడిన ముస్లిం స్త్రీ ఎలా బ్రతుకుతుందనే ప్రశ్న అనవసరం ("ఇర్రెలెవెంట్") అన్నంతదూరం పోయారు. అంతగా కాకపోతే ఆ స్త్రీ తన జీవికకు తన మిగతా బంధువుల మీద ఆధార పడాలని సమాధానం చెప్పారు. ఈ ధోరణిపట్ల సుప్రీంకోర్టు చాలా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది.

ఆ సందర్భంలో అనుచ్ఛేదము 44ను ఉదహరించి, కామన్‌సివిల్‌కోడ్ అనేది ఆ అనుచ్ఛేదంలో ప్రస్తావించబడిందనీ, అది జాతీయైక్యతకూ దోహదకారి అవుతుందనీ, ఏ కమ్యూనిటీ తనంత తానుగా ఈ విషయంలో ముందుకు రాదనీ, అది రాజ్యం 'స్టేట్' బాధ్యత అనీ అన్నారు. తమకు వినపడేటట్లుగానే ఒక న్యాయ వాది, చట్టం చేసే అధికారం కలిగి ఉండటం, దానికి కావలసిన రాజకీయ ధైర్యం కలిగి ఉండటం వేరు వేరు విషయాలని అన్నాడనీ, ఇందులోని సాధక బాధకాలు తమకు తెలుసనీ, కాని ఎక్కడో ఒక ప్రారంభం జరగాలనీ అన్నారు.

(ఎ కౌన్సిల్ ఇన్ ది కేస్ విన్‌పర్‌డ్, సంవాట్ ఆడిట్లీ, దట్ లెజిస్లేటివ్ కాంపి టెన్స్ ఈజ్ ఒన్‌థింగ్, ది పొలిటికల్ కరేజ్ టు యూజ్ దట్ కాంపిటెన్స్ ఈజ్ క్వైట్ అనదర్")

తరువాత తాహిర్ మొహమ్మద్ తన "ముస్లిం పర్సనల్ లా" లో వ్రాసిన వాక్యాలను ఉదహరించారు. "సెక్యులర్ ఆదర్శానికి అనుగుణంగా మన రాజ్యం మతం ఆధారంగా వ్యక్తిగత న్యాయాన్ని చేకూర్చటం ఆపివేయాలి." ఇదే రచయిత సాటి మతస్థులకు చేసిన ఈ క్రింది విజ్ఞప్తిని ఉదహరించారు:" ప్రభుత్వానికి చట్టాలు చేయగల హక్కునుండి తమ పారంపర్య వ్యక్తిగత న్యాయాన్ని ("పర్సనల్‌లా") రాజకీయశక్తుల ద్వారా అతీతమని అనిపించేందుకు తమ శక్తి సామర్థ్యాలను వ్యర్థం చేసేబదులు, ముస్లింలు, నిజమైన ఇస్లామిక్ లా అర్థరహితమైన, కాలానుగుణ్యం కాని వివరణలనుంచి బయటపడి కామన్‌సివిల్‌కోడ్ ఆఫ్ ఇండియాను ఎలా బలపరచగలరో నిరూపించాలి."


అయితే వీటన్నిటికీ 'లీడ్' మెజారిటీ కమ్యూనిటీ నుంచి రావాలంటాడు డా. మొహమ్మద్. కాని సుప్రీంకోర్టు 'లీడ్' ఉన్నా లేకపోయినా, రాజ్యం జోక్యం చేసుకోవాలంది. ("హి వాంట్స్ ది లీడ్ టు కం ఫ్రంది మెజారిటీ కమ్యూనిటీ బట్, ఉయ్ మస్ట్ హావ్ తాట్ దట్, లీడ్ ఆర్ నో లీడ్, ది స్టేట్ మస్ట్ యాక్ట్.")

సుప్రీంకోర్టు తన తీర్పు చిట్టచివరలో 1955 ఆగస్టులో పాకిస్తాన్ ప్రభుత్వంచేత నియమింపబడిన "కమీషన్ ఆన్ మారేజి అండ్ ఫామిలీలాస్" నుంచి ఉదహరించింది. ఒక ప్రశ్నకు సమాధానంగా ఆ కమీషన్ ఈ విధంగా పేర్కొంది: "చాలామంది మధ్యవయస్కులైన స్త్రీలు ఎలాంటి కారణాలు లేకుండా విడాకులకు గురవుతున్నారు. నిలవటానికి నీడ లేకుండా తమకు గాని తమ సంతానానికి గానీ ఏమాత్రం ఆహారం లేకుండా వారు వీధులపాలు కాకూడదు."

ఆ పాకిస్తాన్ కమీషను రిపోర్టు ఈ విధంగా ముగిసింది. "అల్లామా ఇక్బాల్ మాటలలో చెప్పాలంటే, సమీప భవిష్యత్తులో ముస్లిం దేశాలు ఎదుర్కోబోయే ప్రశ్న ఇది: ఇస్లామిక్ లా పరిణామక్రమానికి ("కేపబుల్ ఆఫ్ ఇవల్యూషన్") వీలైనదా కాదా అని—దానికి ఖచ్చితమైన సమాధానం అవుననే, కాని దానికి విపరీతమైన బౌద్ధికశ్రమ కావాలి" ఈ కమీషన్ అధ్యక్షుడు ప్రధాన న్యాయమూర్తి అబ్దుర్‌రషీద్. ఇంత శ్రమ తరువాత సుప్రీంకోర్టు ఈ నిర్ణయానికొచ్చింది.

ఈ కామన్ సివిల్‌కోడ్ అవసరాలను గురించి తిరిగి న్యాయమూర్తి చిన్నపరెడ్డి ఇంకో తీర్పులో పేర్కొంటూ, పై తీర్పునుంచి ఉదహరించాడు.

ఈ విధంగా తీర్పుల పర్వం ముగిసింది.



1973లో స్థాపించబడిన ఈ ముస్లిం పర్సనల్‌లా బోర్డుకు కార్యదర్శి 74 సంవత్సరాల మౌలానా మిన్నతుల్లారహమనీ. ఈయన బీహార్‌లోని ఇమారత్ షరియా అధిపతి.

ఈ తీర్పు తరువాత దాదాపుగా రాజకీయనాయకులంతా షారియత్‌ను రక్షించాలనే నినాదంతో ఏకమయ్యారు. ఇందులో ముస్లింలీగ్, కాంగ్రెసు, జనతా నాయకులున్నారు.

కాని రిటైర్డు సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ మీర్జాహమీదుల్లాబేగ్, రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి బహిరుల్ ఇస్లాంలు ఈ తీర్పును బలపరిచారనీ, అలాగే అనేకమంది ప్రముఖులు-గుజరాత్ మాజీ విద్యాశాఖామంత్రిణి ఆయేషాబీగం, అలీగర్ ముస్లిం విశ్వవిద్యాలయానికి చెందిన డా. అబిదాసయీముద్దీన్, భోపాల్‌కు చెందిన డా. నుస్రత్‌బెనోరుహి, హైదరాబాద్ మెహబూబియా కాలేజి మాజీ ప్రిన్సిపాల్ శ్రీమతి మెహబూబ్‌నస్సుల్లా, ముస్లింలా మీద గ్రంథాన్ని రచించిన కుమారి కమిలాతయాబ్‌జీ, సుప్రీంకోర్టు న్యాయవాదిని శ్రీమతి సోనాకోహన్‌లు ఈ తీర్పును బలపరిచాడంటాడు — సుప్రీంకోర్టులో ఈ కేసులో వాదించిన డేనియల్ లతీఫ్ "ది వీక్" లో (ఆగష్టు 18) ఒక వ్యాసంలో.

అయితే ఈ తీర్పుమీద జనతాషహబుద్దీన్ వాదన వేరు. ఆయన ప్రకారం-241 అయాత్‌లో ఈ మనోవర్తి బాధ్యత సత్ప్రవర్తన గల వారి మీద ఉంది అన్నారు ("ఆన్ ది రైట్యువస్") పైగా ఇస్లామిక్‌లా ప్రకారం వివాహం ఒక కాంట్రాక్టు మాత్రమే, కాబట్టి అది రద్దయిన మరుక్షణం ఆ స్త్రీ తన స్వంత కుటుంబానికి తిరిగి వస్తుంది. అప్పుడు ఆవిడ మనోవర్తి బాధ్యత తండ్రి, కుమారుడు, సోదరులు మొదలైన ఆవిడ రక్తబంధువులది అంటాడు. ఇదే అభిప్రాయాన్ని ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ కార్యదర్శి బనత్‌వాలా కూడా వెల్లడించాడు, ముస్లింలాలో ఒక ప్రకరణం మొత్తం స్త్రీల రక్షణకేననీ, స్త్రీ తనకు గల హక్కు ప్రకారమే రక్షణ పొందగలదనీ అంటాడు.

క్లుప్తంగా చెప్పాలంటే, విడాకులు పొందిన స్త్రీ తన పుట్టింటి వారి నుంచి మనోవర్తి పొందవచ్చంటారు వీరు (షి స్టాండ్స్ ఇన్‌హర్ ఓన్ రైట్ టు గెట్ హర్ మెయిన్‌టెనెన్స్. షి ఈజ్ ఎన్‌టయిటిల్‌డ్ టు గెట్ ప్రొటెక్షన్ ఫ్రం హర్ బ్లడ్ రెలేషన్స్"-'ది వీక్' ఆగష్టు 18)

జనతాషహబుద్దీన్ ఇప్పుడు పేరుకు జనతా నాయకుడు, ఆచరణలో ముస్లిం నాయకుడు, "ముస్లిం ఇండియా" సంపాదకుడు. జులై 27-28లలో దేశంలోని అన్ని రాజకీయ పక్షాలకు చెందిన ముస్లిం ఎం.ఎల్.ఎలు, ఎం.పీ ల సమావేశాన్ని ఏర్పాటు చేశాడు, మాజీలతో సహా-కాని అది జరగలేదు. ఈ సమావేశానికి బి.జె.పికి ఆహ్వానమే లేదు, సిపియం తిరస్కరించింది, లోక్‌దళ్ సమాధానం చెప్పలేదు. కన్వీనర్లలో ఇద్దరు లీగ్ ఎం.పిలున్నా, ఇది సమయం కాదన్న వంకతో వారూ సహకరించలేదు.

దీనికి ఒక కారణం షహబుద్దీన్ ముస్లింల నాయకుడుగా పేరు పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడన్న అనుమానం ఒక కారణం.

సుప్రీంకోర్టు ముందు లోక్‌దళ్ యూనస్‌సలీం ముస్లిం పర్సనల్ లా బోర్డు తరఫున ఒక న్యాయవాది. కేవలం రేపు వాదన జరగబోతుందనగా ఈ రాత్రి ముస్లిం లీగ్ సులేమాన్‌సేట్ తనని వాదించమన్నాడనీ అది తన మతస్థులకు సంబంధించింది కాబట్టి, ఇతర సీనియర్ న్యాయవాదు లంగీకరించలేదు కాబట్టి, తానంగీకరించాననీ, తనూషహబుద్దీన్ సంయుక్తంగా లిఖితవాదనలు కోర్టుకు దాఖలు చేశామనీ చెప్పాడు.

షహబుద్దీన్ జులై 85 "ముస్లిం ఇండియా" సంచికలో ప్రాస్తూ: షెడ్యూలు కులాల వారికి కేటాయించబడిన లోక్‌సభా స్థానాలలో కొన్నిటిలో ముస్లిం జనాభా జాస్తిగా ఉందనీ, అయినా ఈ కేటాయింపు వలన ముస్లింలు ఆ స్థానాలలో పోటీచేసే అవకాశం కోల్పోయారనీ, ఆయా స్థానాలలో గల ముస్లిం

జనాభాను గురించి తనకు తెలియచేయమని పాఠకులను కోరాడు. ఉదాహరణకు అస్సాంలోని కరీంగంజి, కర్ణాటకలోని బీదర్, రాజస్థాన్‌లోని టోంక్, ఉత్తర ప్రదేశ్‌లోని బిజనూర్ లను చెప్పాడు.

కేరళ తతంగం

ఇంతలో కేరళలో ఇంకో తతంగం జరిగింది,

త్రివేంద్రంకు దగ్గరగా 40-45 కిలోమీటర్ల దూరంలో బీమేపల్లి గ్రామం ఉంది, సుమారు 15000ల మంది ముస్లింలున్నారు. మశీదు చాలా భాగ్యవంత మయింది, సుమారు కోటి విలువ గల ఆస్తులుండటమే కాకుండా, రోజూ వచ్చే కానుకలే వేలల్లో ఉంటాయంటారు.

ముస్లింలకు ఒక జమాత్ ఉంది, దానికి ఎన్నికలు, ఒక జనరల్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ వగైరా. అంతులేని అధికారాన్ని ఈ జమాత్ ఆ ముస్లింల మీద చలాయిస్తుంది. ఇంకో విశేషం ఈ జమాత్ కార్యదర్శి సెలవుమీద వున్న పోలీసు కానిస్టేబుల్ జాఫర్ అయితే, అధ్యక్షుడైన ఇస్మాయిల్ సిపియం కార్డు కలిగిన సభ్యుడు.

ఏప్రిల్ 20 వ తేదీన జమాత్ కార్యదర్శి 40-45 సంవత్సరాల సులేఖాబీబీకి ఒక ఉత్తరం పంపాడు. ఆవిడకు 8 మంది సంతానం, అందులో ముగ్గురికి వివాహమయింది. 9 మనుమ సంతానం.

ఆ ఉత్తరం సారాంశమిది. నీవు 17న జమాత్ కార్యాలయానికి విచారణకు రాలేదు కాబట్టి నిన్ను నేరస్తురాలుగా తీర్మానించాం. నీవు వ్యభిచరించిన నేరానికి 5 కిలోల బరువు కొరడాతో 101 దెబ్బలు, తల నున్నగా గొరగటం, మద్యం సేవించినందుకు 50 రూ॥ల జరిమానా, జమాత్ ముందు హాజరు కానందుకు 301 రూ॥ల జరిమానా—ఈ శిక్ష నీకు విధించాము.

దీనితో బెదిరిపోయిన సులేఖాబీబీ తన భర్తకు ఉత్తరం వ్రాస్తే అతను అబూధాబీ నుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు. వ్యవహారాన్ని న్యాయవాది మొహమ్మద్ షరీఫ్ చేతుల్లో పెడితే అతను జూన్ 15న జమాత్‌కు నోటీసిచ్చాడు.

దీనితో జమాత్‌కు ఇంకా కోపం వచ్చింది. ఇదివరలో తాము ఇలాంటి శిక్షలు విధించినా ఎవ్వరూ మాట్లాడలేదు. పైగా తమవద్ద ఖచ్చితమైన సాక్ష్యాధారా లున్నాయనీ, "సాక్ష్యులవద్ద టేప్‌రికార్డు చేసిన సాక్ష్యముంది" అంటూ సులేఖాబీబీ కుటుంబాన్ని వెలివేసి, ఒక వ్యానుకు మైకు బిగించి ఈ విషయాన్ని గ్రామమంతా ప్రకటించారు. ఇంతకూ ఈ నేరం మోపిందెవ్వరు? కన్యాకుమారి జిల్లా తిరువిత్తముాడు గ్రామకాపురస్తుడు హమీద్. ఇతను సులేఖాబీబీ భర్త వహీద్‌కు వ్యాపారంలో భాగస్తుడు, ఇద్దరికీ పడకే వహీద్ అబూధాబీ వెళ్ళాడు.

తనతో మద్యం సేవించిందనీ, వ్యభిచరించిందనీ హమీద్ ఆరోపణ. ఇంతకూ ఈ రెండు నేరాలు తాను కూడా చేశానన్న హమీద్‌కు జమాత్ ఏమీ శిక్ష విధించలేదు సుమా!


జమాత్ అంటె సామాన్యమయింది కాదు, దాని నిబంధనావళి అచ్చులోనే 326 పుటలుంటాయి. అందులో 15వ ప్రకరణం "శిక్షాస్మృతి"

తరువాత జమాత్ ఎలాగైతేనేమి "మన్నింపొండి, క్షమించండి" అంటూ తప్పుకుంది. ఒక విషయం తథ్యం. ప్రభుత్వం వలెనే ఒక సమానాంతర వ్యవస్థను జమాత్ నడుపుతుందన్నమాట.

దీనిమీద కేరళ ప్రభుత్వం అనుజ్ఞ లేకుండా మైకు వాడినందుకూ, సెక్రటరీ జాఫర్‌ను శెలవుపెట్టి ఈ కార్యదర్శి ఉద్యోగంలో ఉన్నందుకూ నోటీసు లిచ్చింది. సి.పి.యం మట్టుకు ఇస్మాయిల్‌ను పార్టీనుంచి బహిష్కరించింది.

రాజకీయ పరిణామాలు—సి.పి.యం వ్యవహారాలు

కాని దీని రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా తయారయ్యాయి



కేరళలోని సిపియం నాయకుడు నంబూద్రిపాద్ అఖిలభారత సిపియం నాయకుడు, సిద్ధాంతవేత్త. ముస్లింలీగ్ అధికారంలో వున్న రాష్ట్రం కూడా అదొక్కటే. అక్కడ రెండు ముస్లింలీగ్‌లు ఉన్నాయి. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ కాంగ్రెసుతో కలిసి అధికారాన్ని పంచుకుంటున్నది. వారి నాయకుడు అవుకోకాదర్‌కుట్టిసహా డిప్యూటీ ప్రధానమంత్రి, అహమ్మద్ పరిశ్రమల శాఖా మంత్రి. రెండవది ఆల్ ఇండియా ముస్లింలీగ్, ఇది సిపియంతో కూడిన లెఫ్ డెమోక్రాటిక్ ఫ్రంట్‌లో ఉంది.

విచిత్రమేమిటంటే కాంగ్రెసు, సిపియం ఉభయులూ ఎవ్వరూ ముస్లిం లీగ్‌ను మతతత్వపార్టీ అని దూరంగా ఉంచలా (ఒక విధంగా అది ముస్లింలీగ్ చాకచక్యమని అనుకోవచ్చేమో!)

సిపియం కేరళలో రెండుసార్లు అధికారంలో ఉంది, 1967-69 లో నంబూద్రిపాద్ ముఖ్యమంత్రి. అప్పుడు యూనియన్ ముస్లింలీగ్ వీరితో కలిసి ఉంది. తిరిగి 1980-81 ఇ.కె. నాయనార్ ముఖ్యమంత్రి, అప్పుడు ఆల్ ఇండియా ముస్లింలీగ్ వీరితో కలిసి ఉంది. కాబట్టి దాదాపుగా గత 18 సంవత్స రాలనుంచీ ఏదోవిధంగా సిపియం తన మార్క్సిజం-లెనినిజాన్ని లీగిజమ్‌తో సమన్వయం చేసుకుంటూ, దేశమంతా మతతత్వాన్ని గూర్చి నిందిస్తూ తిరుగు తుంది. కాని ఏప్రిల్ సుప్రీంకోర్టు తీర్పు, దానిమీద జూన్ 14న షారియత్‌ను రక్షించాలంటూ ముస్లింలీగ్ నినాదాన్నివ్వటం, సిపియం ఇస్మాయిల్ బీమేపల్లి జమాత్ నిర్ణయానికి బాధ్యుడు కావటం దాని కళ్ళు తెరిపించిందనుకోవచ్చు.

ఈ వాతావరణంలో జూన్ మధ్యలో జరిగిన స్టేట్ కమిటీ సమావేశాలకు సమర్‌ముఖర్జీ, బి. టి. రణదివె, నంబూద్రిపాద్‌లు కేంద్రనాయకులుగా హాజ రయ్యారు. కేవలం కాంగ్రెసు వ్యతిరేకశక్తుల ఐక్యతానినాదం కాకుండా, లెఫ్టిస్టుల మరియు సెక్యులర్ శక్తుల ఐక్యతా నినాదం తీసుకున్నారు.

జులై 20న కాలికట్‌లో సమావేశమైన ఆల్‌ఇండియా ముస్లింలీగ్‌లెఫ్ట్ ఫ్రంట్‌నుంచి బయటపడింది. ఆగష్టు మొదటివారంలో అక్కడనే రెండు ముస్లింలీగ్‌లూ సమావేశమై తమ కలయికను ప్రకటించాయి. షారియత్ పరి రక్షణా నినాదం ఈ విధంగా రెండు ముస్లింలీగ్‌ల కలయికకూ దారితీసింది.

దురదృష్టమేమిటంటే, ఇన్ని సంవత్సరాల సాహచర్యం తరువాత, తన మంత్రిత్వహాయాంలో మల్లాపురంను ప్రత్యేకజిల్లాగా ప్రకటించినా, వారిలో వారు హత్యలదాకా వెళ్ళి కలహించుకుంటున్న-ఆర్.యస్.యస్, సి.పి.యం లు సమాన మన్నాడు సులేమాన్‌సేట్, నంబూద్రిపాద్‌ను తీవ్రంగా దుయ్యబట్టాడు. ("ఎల్లో అండ్ రెడ్ కాంప్స్" అని వాడాడు సేట్)

మనకు తెలిసినంతవరకు ఆర్‌యస్‌యస్ దీని విషయమై నోరు మెదపలా, అయినా నింద తప్పలేదు.

దీని ఫలితంగా ఆగస్టులో సిపియం 'ఆత్మవిమర్శ' లాంటిది 'దేశాభిమాని' వ్యాసరూపంలో నంబూద్రిపాద్ కలంనుంచి వెలువడింది. కాంగ్రెసులాగే ఇంత వరకూ సిపియం కూడా కేరళలో అవకాశవాద రాజకీయాలనే అమలు చేసిందనీ, లెఫ్ట్‌ఫ్రంట్‌నుంచి ముస్లింలీగ్ నిష్క్రమణతో అలాంటి గతానికి స్వస్తి చెప్పే అవకాశం కలిగిందనీ, ఇక కాంగ్రెసుయొక్క అవకాశవాద పార్లమెంటరీ రాజకీయాలను' ఎదిరించాలని అన్నాడు.

అలాగే కాంగ్రెసువారికొక 'బహిరంగ లేఖ'ను కూడా వ్రాశాడు. ఇస్లామిక్ ముస్లింలీగ్, క్రిష్టియన్ కేరళ కాంగ్రెస్‌ల సహకారంతోనేనా మీరు రాజీవ్‌గాంధీ ఆశించిన 21వ శతాబ్దంలోనికి దేశాన్ని తీసుకుపోదలుచుకుంది అని ప్రశ్నించాడు. "మాకు ఎన్నికలలో విజయాలకన్నా, తాత్కాలికపు సౌలభ్యాల కన్నా, మతైకవాదులు ('రెలిజియస్ ఫండమెంటలిస్ట్') మూర్ఖమతైక శక్తుల ('కమ్యూనల్ ఫెనటిక్స్)కు వ్యతిరేకంగా అభివృద్ధికర శక్తులతో సహకారమే ముఖ్యం" అన్నాడు.

అయితే ఒక విషయాన్ని మనం మరువగూడదు. అసలు ముస్లింలీగ్‌కు ఒక గౌరవస్థానాన్ని కలిగించి ప్రభుత్వంలో పీట వేసింది 1967 లో నంబూద్రిపాదే. కాబట్టే 'బహిరంగ లేఖ' లో ఇలా వ్రాశాడు. "మతైక 'సెక్టేరియన్' శక్తులను తృప్తిపరచే మీ నాయకత్వపు విధానాన్ని ఎదిరించేందుకు ఒక దశలో మేమూ ముస్లింలీగ్‌తో చేతులు కలిపిన మాట వాస్తవమే. ఈ ప్రస్తుత సమయంలో దాని మంచిచెడుల జోలికి నేను పోవటం లేదు."

ఇది ఎంత అవాస్తవికమో అందరికీ తెలుసు. దీనికి వీలుగా 'ఆత్మ విమర్శ' అనే ఆయుధాన్ని వాడటం చాలా తేలిక గదా! 1967-85 దీర్ఘకాలంలో ఈ 18 సంవత్సరాల చరిత్రలో మారింది పరిస్థితులు కావు, ముస్లింలీగ్ కాదు, కాంగ్రెసు సిపియంలే.

దీనిని గ్రహించే ఒక సిపియం కార్యకర్త ఇలా వాపోయాడంటారు: "ఏ విధంగా చూచినా-జనాభాపార్టీ సభ్యత్వం నిష్పత్తి రీత్యా అయినా-కేరళ సిపియం పశ్చిమబెంగాల్ సిపియం కన్నా మంచి స్థితిలోనే వుంది. కాని అక్కడవలె కాకుండా ఇక్కడ మేం ముస్లిం లేదా క్రైస్తవ 'మతైక శక్తుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉన్నాం" ఇది సత్యదూరం కాదేమో!

ఒకటి తథ్యం. 18 సంవత్సరాల సిపియం సాహచర్య ఫలితంగా, రెండుగా వున్నా లౌక్యంగా రాజకీయాలను నడిపిన ముస్లింలీగ్‌లు, ఒక సామాన్య మనోవర్తి హక్కు వంకతో ఒక్కటయ్యాయి-ఇంకా అజేయమైన శక్తిగా తయారయ్యాయి.

ఇంకొక విషయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. ఈనాడు ముస్లింలీగ్ రాజకీయపక్షంగా మనగలుగుతున్నది ఒక్క కేరళలోనే. షారియత్ రక్షణ తతంగానికీ వారే నాయకులు. దీనికి పూర్తి బాధ్యత వహించవలసింది అనుక్షణమూ ఇతరులను మతోన్మాదులని నిందిస్తూ, తాము సెక్యులరిజాన్ని ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే కాంగ్రెసు, సిపియంలే.

సర్లే గతం నాస్తి. ఇప్పుడు సిపియం ఈ సమస్యను ధైర్యంగా బజారు కెక్కించింది. సంతోషం.

దీనిమీద ఊరేగింపులు, ఉపన్యాసాలు, దానివలన ఘర్షణలు మొదలయ్యాయి. ఇక ముందు ముందు ఎలా దీనిని సిపియం నిర్వహిస్తుందో వేచి చూడవలసిన విషయం. అలాగే దీనిని దేశమంతటా సమస్యను చేస్తుందో లేదో కూడా వేచి చూడవలసిన విషయం.

సమాధానాలు దొరకని ప్రశ్నలు

ఇప్పుడు ముస్లింలీగ్ లేవనెత్తే సమస్యలకు సమాధానాలు ఎప్పటికీ దొరకవేమో! జూన్ 25న కొచ్చిన్‌లో మాట్లాడుతూ సులేమాన్‌సేట్, ముస్లింలను షారియత్‌లో ఉదహరించిన "నేరశిక్షాస్మృతి" అవలంబించమన్నా తనకభ్యంతరం ఉండదన్నాడు. అలాగే కామన్‌సివిల్‌కోడ్ కావాలి అనే 44వ అనుచ్ఛేదం రద్దుకు లీగ్ తీవ్రంగా కృషి చేస్తుందన్నాడు.

షారియత్‌లోని నేరశిక్షాస్మృతి అంటే దాదాపు ఖొమేనీపాలన అన్నమాట, మనకు తెలిసినంతవరకు దొంగతనానికి, కరచరణాల ఖండన, వ్యభిచారానికి రాళ్ళతోకొట్టి చంపటం వగైరా. వగైరా. కాని ఈ దేశంలో ముస్లింలొక్కరే పౌరులు కారు, కనీసం ఇంతవరకు మెజారిటీ ముస్లిమేతరులే. కాబట్టి ఒక ముస్లిం ముస్లిమేతరుని పట్ల ఇలాంటి నేరం చేస్తే లేదా ముస్లిమేతరుడు ముస్లింపట్ల ఇలా ప్రవర్తిస్తే ఎలా వ్యవహారం నడపాలో ఎవ్వరూ చెప్పలేరు.

ఇంతవరకూ ఏ ముస్లిం రాజకీయ నాయకుడూ, సాంఘిక నాయకుడూ తలపెట్టని సమస్య ఇంకొకటుంది, హైదరాబాద్ వాస్తవ్యులకు ఇది చాలా మామూలు విషయం. గల్ఫ్ దేశాల నుంచి అనేకమంది వయస్సు చెల్లినవారు రావటం, ఇక్కడ చిన్నపిల్లలను పెళ్ళి చేసుకోవటం, రెండు మూడు నెలల తరువాత విడాకులివ్వటం సర్వసాధారణమయింది. ఈ వివాహాలన్నీ బహిరంగంగా కాజీల ఆధ్వర్యానే జరుగుతున్నాయి. ఆ వరునికి ఆ దేశంలో వివాహమయిందా? అయితే ఎంతమంది భార్యలున్నారు-ఈ విషయాలు ఎవ్వరూ పట్టించుకోవటం లేదు, పొరపాటున ఏ ముస్లిమేతరుడన్నా ఈ విషయం ప్రస్తావిస్తే అది 'సెక్యులర్' భావనకు వ్యతిరేకంగా చిత్రించబడుతుంది.

కేరళలోనూ పరిస్థితి దీనికి భిన్నంగా లేదు. "స్టేట్స్‌మన్" పత్రిక ప్రకారం ఆగష్టు 1న కాలికట్‌లోని ఒక అధునాతన హోటల్‌లో 60 ఏళ్ళకు పైబడ్డ ముగ్గురు అరబ్బులను-మైనర్లను వివాహమాడినందుకు అరెస్టు చేశారు. లైలా, షఫియా, రజియాబాయి అనే ముగ్గురు మైనరు బాలికలను 3000ల మహర్ చెల్లించి వివాహమాడారు. సరే కాజీ సర్టిఫికేట్‌తో తరువాత వారిని విడుదల చేశారు. ఆ అరబ్బులు తమ దేశం పోయేటప్పుడు వీళ్ళకు విడాకులిచ్చి వెళ్ళిపోతారు. మళ్ళీ ఇంకో షేక్‌కు వీరు భార్యలవుతారు. ఈ విధంగా వీరిలో అందమున్నంతవరకు, ఆకర్షణీయంగా ఉన్నంతవరకూ ఈ తతంగం సాగుతూ వుంటుంది. దీనికి అందరి మద్దత్తూ, చట్టాల ఆధారం ఉంది. "ఇస్లామిక్‌లా" సపోర్టూ వుంది.

కనీసం భారతీయ పౌరులుగానన్నా వీరికీబానిసత్వం తొలగించవలసిన బాధ్యత మన ప్రభుత్వం మీద లేదా?

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తరువాత అనేక ఉత్తరాలు పత్రికలలో వచ్చాయి. ఆ ఉత్తరాలలో ఒకరు మహమ్మద్ ప్రవక్త తన జీవితకాలంలో ఈ బహుభార్యాత్వాన్ని ప్రోత్సహించటానికి కారణం ఆ రోజులలో అనేక మత యుద్ధాలు జరగటం, సైనికులు భక్తుయీ మరణించటం, వారి భార్యలు అనాధలుగా సమాజం నిరాదరణకు గురి కావటం ఇష్టం లేకనే సుమా అంటాడు.

మహమ్మద్ ప్రవక్త తన జీవిత కాలములో 13 మందిని వివాహమాడాడనీ, అందులో రెండవ భార్య ఆయేషాబీబీ తప్ప మిగతావారందరూ విధవలేననీ, అందులోనూ మొదటి భార్య ఖడీజాబీబీని తప్ప మిగతావారందరినీ తన 50వ ఏట తరువాతనే వివాహమాడాడనీ, ఇది కేవలం వారికి సమాజంలో గౌరవస్థానం కలిగించటానికేననీ అంటాడు. అరబ్ డబ్బు ప్రభావంతో మన దేశంలో అనేక మంది స్త్రీల జీవితాలు నాశనమవుతున్నాయని వాపోయాడు.

ఈ సందర్భంలో ఇంకో వార్త మన మతిని పోగొడుతుంది. టర్కీలోని ఇమామ్ ఆలీరిజాడెమ్రికాన్ అన్నాయన "సెక్సువల్ లైఫ్ యకార్డింగ్ టు ఇస్లాం" అని ఒక పుస్తకం ప్రచురించాడు. దాని ప్రకారం నేటి అధునాతన ఇస్లాం చెప్పేటట్లు నలుగురు భార్యలు కాకుండా, ప్రాచీన ఇస్లాం చెప్పినట్లుగా తొమ్మిదిమంది భార్యలుండాలని ప్రవచించాడు. అయితే టర్కీలో ఆయనమీద ఈ ప్రచారానికి గాను కేసు పెట్టారు.

ఏ దేశంలోనైనా

నాయకుల
తత్వం
"కుతంత్రం"
కవుల
లక్ష్యం
"పంచతంత్రం"

కవిత జెప్పిన

విషాన్ని గ్రక్కుతున్నప్పుడు
అణగ ద్రొక్కి
బుద్ధిని గఱపే
మహానందాంగనా డింభకుని
పదనర్తనంలా
విఱ్ఱవీగుతున్నప్పుడు
పీచమణచి
వివేకాన్ని బోధించే
రుద్రమూర్తి తాండవ విలాసంలా
ఉద్భాసిస్తుండాలి !!

స్త్రీ

శిలకయినా ప్రాణంపోసే
శ్రీ రామ చంద్రుని పాదస్పర్శా దీప్తియో
చచ్చిన హారికయినా తెలివిని కలుగ జేసే
శుక్రాచార్యుని సంజీవని విద్యా రూపమో ....
మొద్దుల్నయినా చిగురొత్తింపజేసే
వాసంత సమీర పరిమళమో .... !!

శ్రీ. కె. కిశోరు బాబు
శ్రీ. కె. అశోకుబాబు

ఇంకొక అనుమానం

దేశంలో అధిక జనాభా సమస్య అయింది. ప్రభుత్వం దీనిని గురించి విపరీతంగా ప్రచారం చేస్తున్నది, సంతానం నియంత్రణను అమలు చేసినవారికి అనేక సౌలభ్యాలు కలుగచేస్తున్నది. కాని ఆలోచించగలిగిన ఎవరికైనా కనపడే వాస్తవం ఇది హిందూ కుటుంబ నియంత్రణ మాత్రమేనని.

పోప్‌యూ, మదర్‌థెరిస్సాయూ దీనికి వ్యతిరేకులు.

ముస్లింలు ప్రస్తుతానికి ఆ విషయాన్ని ప్రస్తావించకపోయినా, నల్గురు భార్యలు తమ జన్మహక్కంటున్నారు. న్యాయవాది అహమ్మద్‌ఖాన్‌కే మొన్న మొన్నటిదాకా ఇద్దరు భార్యలు, పదకొండుమంది సంతానం. ఇప్పుడు షాబానో బీగంకు విడాకులిచ్చాడు కాబట్టి, ఇంకా ముగ్గురు భార్యలను కలిగే హక్కుంది.

ఇంతమంది సంతానాన్ని లేదా దంపతులు ఒక్కరికంటే ఎక్కువమందిని కనగూడదన్న నిషేధం మన దేశంలో లేదు. ఉందనుకున్నా ముస్లింలకు నల్గురిని కలిగే హక్కుంటే, ఇతరులకు ఒక్కరినే కనగల హక్కుంటుంది. ఏది ఎలాగున్నా, ఎంతమందికి ఎంత సంతానమున్నా, వారెలా ప్రవర్తించినా—ప్రజలందరికి తిండీ, బట్టా గృహవసతి, ఉద్యోగం చూపెట్టవలసిన బాధ్యత ప్రభుత్వానిది. కాని ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోగూడదు.

ఆచరణలోని సెక్యులరిజమిది.

ఇంకొక విషయం కూడా ఉంది. అది తమ మతైక విషయం కాబట్టి, పార్టీలతో నిమిత్తం లేకుండా అందరు మహమ్మదీయ నాయకులూ చేతులు కలిపారు. కాని హిందువులలా కాదు గదా! ఏ శంకరాచార్యులవారూ దీని విషయమై మాట్లాడరు, మాట్లాడగూడదు—అలా మాట్లాడతానని ముందే సూచిస్తే ఇప్పుడు వారి దగ్గరకొచ్చే కరుణాకరన్, పి.వి.నరసింహారావులు వారికి దూరంగా వుంటారు. హిందువుల బహుభార్యత్వపు ఆచారాన్ని పరిహరిస్తూ చట్టాన్ని తెచ్చినపుడు, డా.రాజేంద్రప్రసాద్ తటపటాయించినా, ఏ హిందూనాయకుడూ దానిని వ్యతిరేకించలా. నాకు తెలిసినంతవరకూ ఏ మతాచార్యుడూ దానికి నిరశన తెలుపుతూ ఉద్యమాలు నడపలా.

అప్పుడే ప్రభుత్వం అందరికీ సమానంగా కామన్‌సివిల్‌కోడ్‌ను ఎందుకు ప్రతిపాదించలేదనేది ఈ రచయితకూ ఇంతవరకూ అర్థంకాని విషయము.

డా. తాహిర్‌మొహమ్మద్ తన గ్రంథంలో దీనికిగూడా "లీడ్" మెజారిటీ కమ్యూనిటీనుంచి రావాలంటాడు.

ఒక్కటి తథ్యం. పరిస్థితి కొన్నాళ్ళీ విధంగానే సాగితే జనతాషహాబుద్దీన్ ఏయే నియోజకవర్గాలలో ముస్లింలు అధికసంఖ్యాకులో లెక్కపెట్టవలసిన బాధ ఉండదు.

కాబట్టే ఇదంతా చివరికి హిందువుల బాధగా మిగులుతుంది. విచిత్రమేమిటంటే మన హైదరాబాద్‌లో స్వయంగా ముస్లిం స్త్రీలే తమకు మనోవర్తి హక్కు అక్కరలేదనీ, నల్గురి భార్యలను కలిగివుండే హక్కు తమ పురుషులకు ఉండాలనీ ఊరేగింపుగా వెళ్ళి మన ముఖ్యమంత్రి రామారావుగారిని కోరారు!

"విడాకులీయబడిన స్త్రీకి తగిన ఆధారాన్ని చూపాలని ఖురాన్ నొక్కి చెప్పింది. ఈ విధంగా ఆధారాన్ని చూపాలని తిరిగి తిరిగి నొక్కి చెప్పడానికి వేరే కారణమేమీ లేదు, తులనాత్మకంగా చూస్తే స్త్రీ బలహీనురాలు, కాబట్టి ఆవిడ హక్కులు సక్రమంగా రక్షింపబడాలి అనేదే కారణం."

(మౌలానా అబుల్‌కలాం అజాద్ వ్రాసిన ఖురాన్ వ్యాఖ్య 'తర్జుమాన్ అల్‌ఖురాన్'కు డా.సయ్యద్ అబ్దుల్‌లతీఫ్ అనువాదం నుంచి — డేనియల్‌లతీఫ్ వ్యాసంలో ఉదహరించింది)

ఇంకొక వార్త. జులై 22న కువైటు పార్లమెంటు సమావేశమై, ముస్లిం స్త్రీలకు వోటింగుహక్కు పనికిరాదనీ, ఖురాన్ దీనికి అనుమతించదనీ, స్త్రీల ధర్మమల్లా పిల్లలను కనటం, పెంచటమేననీ తీర్మానించారు. ఖురాన్ అర్థ వివరణ కోసం ఏర్పాటు కాబడిన సంఘం నిర్ణయమిది.

ముస్లింలీగ్ పార్లమెంటు సభ్యుడు బనత్‌వాలా ప్రవేశపెట్టిన బిల్లులో విడాకులు పొందిన ముస్లింస్త్రీ భర్తనుంచి మనోవర్తి పొందే హక్కును రద్దు చేయాలని కోరాడే తప్ప, పోనియ్యి భర్తను మినహాయించినా ఆ స్త్రీకి పుట్టింటి వారందరినుంచీ, తండ్రి సోదరులనుంచి మనోవర్తికి హక్కును కలగ చేయమని కోరటం లేదు సుమా!

షరియత్ రక్షణోద్యమంతో కదిలిన సంగతులివి. □

కలగూరగంప

ఆధునిక కథా రచనలో ఒక ఉదాహరణ—

లూయి బోర్గెస్ కథాకౌశలం

"కథానిక" అనగానే అలా ఒక సంఘటననో, పాత్రనో లేదా సన్నివేశాన్నో విసుగులేకుండా సూక్ష్మాతిసూక్ష్మంగా వర్ణించుకొంటూ-వివరించుకుంటూ రాసుకుపోవడమేననే దురభిప్రాయం ఇప్పటికీ తెలుగు కథాలోకంలో వ్యాపించి వుంది. వివరణ లేదా కథనం అనేది కథకు ముఖ్యమైన భూమిక-దీనిని ఎవరూ కాదనరు. కాని వూరికే సోదిచెబుతున్నట్టు ఏకరవు పెడుతూపోవడమే అత్యధిక సంఖ్యాకులైన తెలుగు కథకులు చేస్తున్నపని.

కథకు ప్రాణమైన కథాకథన కౌశలాన్ని ఎంతమంది కథకులు చూపించగలుగుతున్నారు? చూపించినా ఎంతమంది పాఠకులు గ్రహించి మెచ్చుకోగలుగుతున్నారు? చెదరని ముద్రవేసి ఆయా సన్నివేశాల్లో వెంటాడగలిగే శిల్ప చాతుర్యాన్ని లేదా కథన కౌశలాన్ని పట్టించే మనోవృత్తాన్ని వ్యక్తం చేయగలుగుతున్నారు.

ఇలాంటి చెరగని ముద్రవేసి ప్రపంచంలోని వివిధ భాషల్లోకి పాకిపోయిన కథారచయిత జోర్గేలూయి బోర్గెస్. జీవితపు చరమాంకంలో గుడ్డివాడైపోయిన బోర్గెస్ స్పానిష్ భాషలోనే కథలు రాసాడు. ప్రధానంగా తాను నివసించిన బ్యూనస్ ఏర్స్ మహానగరంలోని అట్టడుగు జీవితాలగురించి ఆసక్తికరంగా-తెలివిగా కథలు అల్లాడు. అర్జెంటీనా (దక్షిణ అమెరికా) రాజధానిగావున్న బ్యూనస్ ఏర్స్ ప్రపంచంలోని ఇతర మహానగరాల్లానే చుట్టూ మురికివాడలతో-అధోజగత్ సహోదరులతో కిక్కిరిసివున్న యాంత్రికమైన ఒక మహానగరం.

ఆ మహానగరంలోని యాంత్రిక జీవితాన్ని జీవించి ఎంతో నిర్లిప్తంగా తాత్వికంగా-తనదికాదన్నట్లుగా అక్కడి జీవితాలగురించి కథలు చెప్పిన ప్రత్యేకత లూయి బోర్గెస్‌ది. రౌడీలు, తాగుబోతులు, కిరాయి హంతకులు, వేశ్యలు, గూండాలు తదితర "లంపన్" మనుష్యులు సాధారణంగా నాగరికులకు మనుషులుగా కనపడరు. ఆ లంపన్ రౌడీముఠాలతో బతికి-ఆనందించి-మొండిగా జీవితాన్ని ముందుకు తోసి చివరికి ఎవరి కత్తిపోటుకో లేదా పిస్తోలు గుండుకో బలయిపోయే ఆ మనుషులు అంత భయంకరంగా మారిపోవడానికి, అమానుష మనస్తత్వాన్ని పెంచి పోషించే పెట్టుబడిదారి వ్యవస్థే మూలకారణం అనేది ఒక యధార్థం.

ఈ యాంత్రిక వాతావరణంగురించి ఉద్బోధచేసే వైఖరితో కాకుండా, అందులో ఒకడిగా బోర్గెస్ ఆ నగర జీవితంలోని సంఘటనలను చిత్రించాడు. అయితే ఇలాంటి తెలివైన చిత్రణవల్ల ఒక ప్రమాదం లేకపోలేదు. లంపన్(రౌడీ) వ్యక్తుల జీవితాలపట్ల ఆకర్షణ కలిగించి, అదేదో వీరోచితమైన ధైర్యసాహస గాధగా భ్రమింపచేసే అవకాశం వుంది. వ్యభిచారం, తాగుడు, రౌడీముఠాల కొట్లాటలు, హత్యలు-బెదిరింపులు-కిరాయి గుండాలుగా జీవించి ఏ విలువలేకుండా కేవలం సులభంగా ఏదో గడించి తాగితందనాలాడే బతుకులపట్ల వ్యామోహం కలిగించే బలహీనతా వుంది ఇలాంటి కథల్లో.

బోర్గెస్ రాసిన ఒక కథను పన్నెండేళ్ళక్రితం "ఎన్‌కౌంటర్" (లండన్ సాహిత్య పత్రిక)లో చదివాను. అప్పటికే అది ఇంగ్లీషులో వెలువడి ఎనిమిది సంవత్సరాలయిపోయింది. తిరిగి ఇటీవల ఆ కథను చదివినపుడు కలిగిన భావాలను మీ అందరితో పంచుకోవాలని ఇలా...

అసలు బోర్గెస్ రచించిన ఆ కథ పేరు "మేన్ ఆఫ్ ది రెడ్ కార్నర్" దీన్ని "ఎర్రటి మలుపు దగ్గరి మనిషి"గా అనువదించుకోవచ్చునేమో!

బోర్గెస్ "ఫస్టుపర్సన్"లో కథను ప్రారంభిస్తూ ఇలా అంటాడు— "ఆ చనిపోయిన ఫ్రాన్సిస్కో-రియల్ గురించి మీరేమీ చెప్పనక్కరలేదు నాకు. అతను నాకు తెలుసు. ఈ జిల్లావాడు కాదని తెలుసు, ఆ 'గౌడాలుపా' సరస్సు దగ్గరుండే 'నోర్టే' ప్రాంతంలో పెద్ద దాదాగా పేరుమోసినవాడు. అతన్ని నేను మూడుసార్లు మాత్రమే కలుసుకున్నాను. ఆ మూడుసార్లుకూడా ఆ రాత్రి పూటే! ఆ రాత్రి నేను మరచిపోలేను.-లూజనేరా ఆ రాత్రి పిలవకుండానే నా రేకుల గుడిసెలోకి పడుకోడానికి వచ్చింది. అప్పుడే రోజెండో జోరేజ్ తన మంచికోసం "ఆర్రో" ప్రాంతాన్ని వదిలివెళ్ళి పోయాడు. అతన్ని మీరు గుర్తించలేరులెండి! అలాంటివాడి గురించి మీరు తెలుసుకొనే రకం కూడా కాదు. రోజెండో "కత్తి" వీరుడు. డాన్-నికోలస్ ముఠావాడు. అవసరానికి పనికొచ్చే కత్తి మనిషి"

ఇలా ప్రారంభమయ్యే ఈ కథలో బోర్గెస్ స్వయంగా జరగబోయే సంఘటనను కళ్ళారా చూసినవాడు--అందులోని ఒక పాత్ర! మిగతా ముఖ్యమైన వ్యక్తులు రోజెండో (కిరాయి గూండా), లూజనేరా (వేశ్య) ఫ్రాన్సిస్కో-రియల్ (నోర్టేప్రాంతంనుంచివచ్చిన మరో కత్తివీరుడు-కిరాయిగూండా)

బ్యూనస్ ఏర్స్ నగర పరిసరాలలోని రేవు ప్రాంతంలో వున్న ఒక సారాయి కొట్టు—అక్కడే తాగుడు-అమ్మాయిలతో నృత్యం చేయడం చాలా మందికి మామూలే! ముఖ్యంగా కిరాయి రౌడీల స్థావరం అది. (ఈ పరిసరాలు సన్నివేశాలు చదువుతుంటే విశాఖరేవుపట్నం-ఆ పట్నంలో నేరాలపై బతికేసే లంపన్ మనుషుల తెగించే విహారాలు-"రత్తాలు-రాంబాబు మొదలయిన రా. వి. శాస్త్రి)గారి నవలలు-కథలు అనాయాసంగానే స్ఫురణకు వస్తాయి)

జూలియా నడిపే ఆ సారాయి అంగడి (బార్)లో ఆ రాత్రి రోజెండో తన ప్రియురాలు లాజనేరాతో ఇంకా ఇతరులతో తాగి తందనలాడుతుంటాడు. అప్పుడు హఠాత్తుగా ప్రవేశిస్తాడు ఫ్రాన్సిస్కో. రోజెండో దగ్గరికి దూకుడుగా వెళ్ళి సవాల్ చేస్తాడు. ఈలోగా మిగతావాళ్ళు ఫ్రాన్సిస్కోను కిందపడవేసి ముక్కు పగిలేలా కొట్టినా లెక్కచేయడు. కాని కత్తి వీరుడని పేరున్న రోజెండోతోనే తలపడి తేల్చుకోవాలంటాడు. తన జేబులోంచి చాకుతీసి పైకెత్తుతాడు. అప్పుడు మధ్యలోకి దూసుకొని వస్తుంది లూజనేరా, ఫ్రాన్సిస్కో మెడలో చేయివేసి "రోజెండో బొంద ఏంకొట్లాడుతాడులే, నీతో"నని బుజ్జగిస్తుంది. ఆ అమ్మాయి ఆకర్షణలో ఫ్రాన్సిస్కో తన బాకును ఆ బార్‌లోని కిటికీలోంచి బయట పారుతుండే కాలవలోకి గురిచూసి విసిరేస్తాడు. (ఈ బాకుని విసిరివేయడం అనే సన్నివేశాన్ని బోర్గెస్ నేర్పుగా ఆ ప్రాంత స్వభావానికి-ప్రవర్తనకు అతికేలా, ప్రతీకగా తీర్చి దిద్దాడు.

ఫ్రాన్సిస్కో ఆ చీకట్లోనే లూజనేరాతో ఆనందించడానికి చేలల్లోకి వెళ్ళిపోతాడు. అక్కడ రోజెండో ముఠావాడెవడో పచ్చి పొడిచేస్తాడు. ఆ రక్తం కారే గాయంతో తిరిగి ఫ్రాన్సిస్కో బార్‌లోకి లూజనేరాతోబాటు వస్తాడు కిందకూలి చివరి శ్వాస వుండగా "నా ముఖాన్ని కప్పి వుంచండి" అని పురమాయిస్తాడు. తన అహాన్ని కృంగిపోనివ్వకుండా, చచ్చే ముందు వికృతంగామారే ముఖాన్ని చూపకుండా వుండాలని ఫ్రాన్సిస్కో కోరిక.

"ఎంత అహంభావం ఆ మనిషికి! కాని ఇప్పుడో ఈగలు మూగడానికి మాత్రం సరిపోతున్నాడు!" అని అక్కడున్నవాడొకడు వ్యాఖ్యానిస్తాడు.

పోలీసులు గుర్రాలపై వస్తున్న చప్పుడవుతుంది. ఆ పోలీసులు అనవసరంగా ముఖాముఖిగా గూండాలతో తలపడడం ఎందుకనీ కాబోలు, అంతా

అయిపోయాక వస్తున్నారని, ఇప్పుడు ఫ్రాన్సిస్కో శవాన్ని' పారే కాలువలోకి విసిరేయడానికి వచ్చారని రచయిత చెబుతూ ఆ కత్తి గురించి జ్ఞాపకం చేస్తాడు "మీకు గుర్తుందా—ఆ కిటికీలోంచి దూసుకొని వెళ్ళి మెరుపులా బయట పడిపోయిన ఆ కత్తి? దాని వెనకాలే ఆ నల్లని పొడుగాటి మనిషి పోడానికి ఎంతో కాలం పట్టలేదు.

ఆ ఫ్రాన్సిస్కో దుస్తుల్లోంచి డబ్బు తీసుకొన్నారు. ఉంగరాన్ని లాక్కోడానికివేలునరికేశారు. శవంపై తమ ప్రతాపాన్ని చూపుతున్న అక్కడి సాహస వీరులంతా రక్షణలేని ఫ్రాన్సిస్కోను దోచేస్తున్నారని ఆ బార్‌లోవుండే మిగతా మనుషుల స్వార్థాన్ని కళ్ళకు కట్టిస్తాడు బోర్గెస్! ముగింపులో కథా రచయిత బోర్గెస్ తన జేబులో ఆత్మ రక్షణకు వుండే బాకు గురించి అంటాడు...నా బాకును తీసి చూసుకొన్నాను. అది కొత్తగా, అమాయకంగా, ఏమాత్రం రక్తం మరకలు లేని కత్తిగా కనపడింది."

బోర్గెస్ ఈ కథా కథన శైలివల్లనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధునిక కథారచయితగా పేరుతెచ్చుకొన్నాడు. ఆ తర్వాత మరో లాటిన్ అమెరికన్ కథా రచయిత (నవలా రచయిత) మార్క్వెజ్, గత సంవత్సరం నోబెల్ బహుమానంతో ముందుకు వచ్చాడు. తెలుగులో బోర్గెస్ కథాకౌశలంలాంటి ధాటచక్యంవున్న కథా రచయితలు రా. వి. శాస్త్రి, త్రిపుర. శాస్త్రిగారి నైపుణ్యం చాలామంది తెలిపయిన పాఠకులని ఆకట్టుకొంది. కాని త్రిపురగారి ఇంగ్లీషు తెలుగుశైలి పరిమితంగా కొద్ది మంది దగ్గరికే చేరుకోగలిగింది.

నిఖిలేశ్వర్

తెలుగు భాష ప్రత్యేకంగా ఒకటున్నదా?

—అని అనిపించకమానదు, ఇటీవల మన విశ్వవిద్యాలయ తెలుగు పరిశోధకుల సిద్ధాంత వ్యాసాలు చదువుతుంటే. సెప్టెంబరు 1985 భారతిలో శ్రీ ఆదవాని హనుమంతప్ప (అ. హ.) గారివ్యాసం "అనంతపురం జిల్లా గ్రామవ్యక్తి నామాలు, కన్నడ ప్రభావం" అనేవ్యాసం (కలగూరగంప) దీనికొక ఉదాహరణ.

"కల్లు" పేరుతో ఆంధ్రలో ఇతర ప్రాంతాలలో కూడా గ్రామాలున్నాయని నేను వ్రాసితిని. శ్రీ విజయ దత్తాత్రేయ శర్మగారు "కల్లు" పేరుతోగల గ్రామ నామాల పట్టికనే ఇచ్చిరి. ఇంతవరకు కన్నడప్రభావం సరిహద్దుజిల్లా అయిన అనంతపురంవరకే అన్న అ. హ. గారు మిగతా జిల్లాల్లో కుడా కన్నడ ప్రభావం ఉన్నదీలేనిదీ ఆలోచించ వలసివుంది అని అంటున్నారు. అంటేవారి సిద్ధాంతం (సరి) హద్దు మీరిపోతున్నదని యర్థం. దీనికి వత్తాసు శ్రీ కూరిగనూరు నరసింగ రావుగారు 1980 లో వ్రాసినవ్యాసం. కల్‌బావి (=రాతిబావి), నెల్లూరు (కన్నడ నెల్లు=వడ్లు) విజయవాడ లోని "వాడ" కన్నడంనుంచి వచ్చిందన్నారట. ఈ వెర్రియకి ఆకరాలెందుకు? పరిశోధకులు తామే ఆలోచించవలెనండీ. శ్రీ నరసింగరావుగారి మూడుదాహరణాలూ తప్పే. "కల్లు" కన్నడంలో మాత్రమే లేదు. అరవంలోనూ మలయాళంలోనూ ఉంది. తమిళనాడులో "దిండిగల్" (తిండుకల్లు) కేరళలో "కొట్టకల్" అనే వూర్లున్నాయి. "కల్లు" తెలుగులోనూ ఉంది కన్నడం వారి సొత్తుకాదు. ఇంతకీ "కల్లు" ఏకమూలపదం. నెల్లూరులోని "నెల్లు" తమిళంలోనూ ఉంది, నెల్లూరు తమిళనాడు సరిహద్దులో, ఉందికదా కనుక 'నెల్లూరు' మీద అరవప్రభావం ఉందనడంలో కొంత సామంజస్యం ఉండ గలదు కాని కన్నడ ప్రభావం ఉందని ఎట్లనడం? మన అ. హ. గారు అరవంపై కన్నడ ప్రభావముంది అని సరిక్రొత్త సిద్ధాంతం చేయవచ్చును. అసలుకు 'నెల్లూరు' పేరు సరికాదు అది 'నల్లూరు' (ప్రాచీన "కాల్పట్టణం")

"వాడ" కన్నడం కాదు

"వాడ" సంస్కృత శబ్దం "వాట" నుండి ప్రాకృతం ద్వారావచ్చినది, "వాడ" పేర్లుగల వూర్లు మహారాష్ట్రలోనూ గజరాతులోనూ ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి "వాడ" శబ్దం తెలుగులోవుంది, యుద్ధమల్లుని శాసనం (క్రీ. శ 9వ శతాబ్దం) లో "బెజవాడ" పదంవుంది ("రమనతో బెజవాడ కెల్ల...")

వ:

కెంచన అనే అయన పేరుతో కట్టిన చెరువును ఏలాగు నామీకరణం చేయవలెనో అ. హ. గారిని కోరుతున్నాను "కెంచనకెరె" అనియా "కెంచనవకెరె" అనియా?

మత ప్రభావం:

సాంస్కృతిక ప్రభావంవల్ల వచ్చినపేర్లను భాషా ప్రభావంగా పరిగణించడం తప్పు. ఏసు, మహమ్మదు, మొగ్గల్లన, నేమినాథ వంటి పేర్లలో క్రైస్తవ, ఇస్లాం, బౌద్ధ, జైన మత ప్రభావాలున్నాయి కాని, హీబ్రూ, అరబ్బీ, పాళి, సంస్కృత ప్రభావాలుకాదు. కన్నడం మాట్లాడుతూ, తెలుగులో వ్రాస్తూవుండే ఒకాయన తిరుమలరావు అనిపేరుపెట్టుకొనును. ఇచట వైష్ణవ ప్రభావముంది కాని అరవప్రభావంకాదు. ప్రభావం అని ఎందుకనవలె. ఆయాపదాలు ఆయా భాషలకు చెందిన వనేదిస్పష్టం.

తిప్ప:

అ, హ. గారు ఇచ్చిన "పెంటయ్య" కథ సందర్భోచితిలేనిది తిప్పయ్య అన్నది రుద్రునికి మారుపేరుగా భావించ వచ్చును అన్నారు. అ. హ. గారు. ఆ పేరు గలవారు. మెడలో తింటె ధరిస్తారు అనిచెప్పడం భాషాశాస్త్రమా? "తిప్పయ్య" అనేపేరు రుద్రునికి ఎలాగు వచ్చింది? నేను చెప్పుతాను.

తిరుపతి→తిర్పతి→తిప్పతి→తిప్ప అనికదా శబ్దక్రమం! "తిరుపతి" అంటే వేంకటేశ్వరుడే అనుకొనేరు సుమండీ! శివుడుకూడా "తిరుపతి" యే.

"తిరు" అనే శబ్దం "శ్రీ" భవం అని నేను ఇతఃపూర్వం "భారతి" లో చూపించినాను. కావున "తిరుపతి" అంటే శ్రీపతి క్షీరసాగర మధనంలో రెండు శ్రీలు పుట్టినవి. లక్ష్మి, విషం, లక్ష్మిపరించిన విష్ణువు శ్రీపతి అయినాడు విషమును వరించిన శివుడూ శ్రీపతి అయినాడు. ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలం=తిరుమల ఆ శైలపతి శివుడు శ్రీపతి లేదా తిరుపతి. ప్రసిద్ధ వైష్ణవక్షేత్రం తిరుమల అంటే శ్రీ శైలం ఆ శైలపతి విష్ణువు, తిరుపతిలేదా శ్రీపతి. కాబట్టి తిప్పయ్య అనుపేరు విష్ణుపరంగా కానీ రుద్ర పరంగాగానీ పెట్టుకొనవచ్చును. ఎందరో రుద్రులు వుండబట్టి, ప్రత్యేకించి తిప్పేరుద్రుడని శ్రీ శైలదేవునిపేరు పెట్టుకుంటారు.

అప్ప:

"అప్ప" పదం నాల్గుదాక్షిణాత్య భాషలలోనూఉంది. ఆమె, ఆపె, ఆకె వలె అమ్మ, అప్ప, అక్కపదాలున్నా "అప్ప" కన్నడ ప్రభావంకాదు. విజయ నగర (విశాఖపట్నంజిల్లా) సంస్థానంలో జరిగి నట్లు వ్రాయబడిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి ప్రసిద్ధనవల "వడ్ల గింజలు" లోని కథానాయకుని పేరు "తంగిరాల శంకరప్ప."

ణ్ణ, న్న:

కన్నడం మాతృ భాషగాకల్గి, తెలుగునూ ధారాళంగా మాట్లాడేవారు తమలోతాము మాట్లాడుకొనేటప్పుడు కన్నడలింగనీ, తెలుగు లింగనీకూడా "లింగణ్ణ" అని రెఫర్ చేస్తారు. కన్నడలింగని సంబోధించేటప్పుడు "లింగణ్ణా" అనీ, తెలుగు లింగని సంబోధించేటప్పుడు "లింగన్నా"అనీ పల్కుతారు. పరిశోధకులు పరిశీలించమనవి. ఇదీనేను చెప్పినదీ, చెప్పుతున్నదీ.

ఇటీవల కాలంలో మన విశ్వ విద్యాలయాల్లో "ప్రభావ" సిద్ధాంతాలు పెచ్చ్రేగిపోతున్నాయి. అందులోకన్నడ ప్రభావ సిద్ధాంతమొక్కటి. ఈ ధోరణి ఎంత వరకు పోయిందంటే వంతపాటల్లో పలికే "తందాన తాన" అనేది కన్నడం నుండి వచ్చిందని ఒక విశ్వ విద్యాలయ "పాఠకుడు" (రీడరు) వ్రాసెను. దీనికి కన్నడం అర్థం ఏమిటట? తందాన=తెచ్చినాడు తాన=తానే. తానే అంటే కాలం అట. కాలం అన్ని మార్పులూ తెస్తుందని దీని రహస్యార్థమట ఇది కర్ణాటకుల సంప్రదాయమట! "తందానతాన" అనేది అరవల వంతపాటలలోనూ వుంది. ఒక

చరణం జానపదగీతం పాడి "తందానతాన" (వివిధలయలలో) అనడం పరిపాటి. "తందానతాన" అనేది సంగీత శాస్త్రంలోని బోల్‌తాన్ (తరాన, తిల్లానా) కానీ వేరుకాదు ధ్రువపదగానంలో ఖ్యాల్ పాటల్లోనూ ద్రుతగతిలో తన తన తాన అంటూ బోల్‌తాన్ పల్కుతారు ఇది జానపద సంగీతంలోని "తందానతానే" కాని వేరుకాదు. జానపద సంగీతంనుండి శాస్త్రీయ సంగీతంలోకి పోయిందా? శాస్త్రీయ సంగీతం నుంచి జానపద సంగీతంలోకి వచ్చిందా అనేది చర్చనీయాంశ మనుకోండి. అది విషయాంతరం. తులనాత్మక పరిశీలన చేయువారు సమగ్రదృష్టి కల్గివుండవలె పైపైసామ్యాలు చూచి "ప్రభావ" సిద్ధాంతాలు చేయరాదు. "తి" గారు వ్రాసిన విషయాలు గాలిలోతేలి పోతున్నట్లుగా వున్నాయంటే సరా? నేను ఉటంకించిన సమస్యలకు సదుత్తరాల్విండి అట్లు చేయనంతకాలం నేను వ్రాసిన విషయాలు గాలిలో తేలుతూనే ఉంటాయి. భోజకాళిదాస కథలలోని "శుకం" వలె "సవనవ?" అని ప్రశ్నిస్తూనే ఉంటాయి.

"తి"

మినీ కవిత - లక్షణచర్చ

మినీకవిత సుమారు పదేళ్ళ నుండి క్రమక్రమంగా వికాసం పొందుతూ వచ్చి, కొద్దిసంవత్సరాలుగా బాగా స్థిరపడింది. ఈనాడు చాలా మంది (ముఖ్యంగా యువకులు) మినీ కవితలు ఎక్కువగా రాస్తున్నారు, దీర్ఘకవితలు తగ్గిపోయినై అని నా భావంకాదు. మినీకవితా ప్రక్రియ ప్రచురమయిందని చెప్పడమే నాఉద్దేశం. ఇలాంటి మినీ కవితా ప్రక్రియ సుమారు ఐదేళ్ళక్రితం ఒక వేగాన్ని పుంజుకునే దశలోకి వచ్చినప్పుడు, నేనూ, శ్రీ రావి రంగారావు, ఇంకా కొందరు, యింతగా ఆకర్షిస్తున్న మినీ కవితకి ఏ వైనా ప్రత్యేక లక్షణాలు ఉన్నయ్యా అనే అన్వేషణ సాగించి, దాన్ని గురించి కొన్ని వ్యాసాలురాశాం, నా వ్యాసాలన్నీ కలిసి ఒక సంపుటిగా 'మినీ కవిత' అనేపేర 1980 నవంబరులో వచ్చింది. శ్రీ రావి రంగారావు కూడా ఒక చిన్న పుస్తకాన్ని ప్రకటించారు.

శ్రీ చేకూరి రామారావుగారు ఫిబ్రవరి నెల 'భారతి' లో 'కవిత్వమూ - పరిమితి' అనే వ్యాసంలో మినీ కవితమీద కృషిచేసిన కొందరు వెలువరించిన అంశాలు కొన్నిటిని పరాస్తం చెయ్యడానికి ప్రయత్నిస్తూ చివరికి 'ఇంతకీ మినీ కవిత్వానికి పట్టేలక్షణాలేమిటి? అని చూస్తే ఒకటే నని పిస్తుంది. అది సైజు మాత్రమే. అయితేయిదికూడా అబ్సల్యూట్ వాల్యూకాదు. రిలటివ్‌వాల్యూ. కవిత్వం ఏ సైజులోఉన్నా కవిత్వమే' అని సిద్ధాతం చేశారు. ఇలాటి పరిశీలనకి ఆయన నాకు సంబంధించినంతవరకూ నేను, 'మినీకవితా విప్లవం' అనే కవితా సంకలానికి రాసిన పీఠికావ్యాసం 'మినీకవితకి మార్క్స్ ఆహ్వానం' అనే దాన్ని మాత్రమే తీసుకున్నట్టు కనిపిస్తుంది. ఆ వ్యాసమూ, దానితోపాటు మరికొన్ని వ్యాసాలు కలిపిన పుస్తకం నా 'మినీ కవిత'. రామారావుగారు కొందరి రచనల్నుండి తీసుకున్న అంశాల్లో ముఖ్యమైన వాటిని పరిశీలించడం ఈ వ్యాసం లక్ష్యం.

మొదటి అంశం నా వ్యాసంలో ఉన్న అస్పృష్టత, వైరుధ్యం మొదలైన లక్షణాలు, మినీ కవిత సైజూ అనే విషయాలకి సంబంధించింది. "గురజాడ లోనూ, గాథా సప్తశతిలోనూ మినీ కవిత్వాన్ని గుర్తించిన రామమోహనరావుగారు దీన్ని వచన కవితాయౌవన రూపంగా అభిభాషిస్తున్నారు" అన్నారు రామారావుగారు. నేను ఈనాటి • మినీ కవితా లక్షణాల్ని, గురజాడ రచనలో గాథాసప్తశతి మొదలైన వాటిలో కనిపించే మినీ కవితా స్ఫురణనీ వేరు వేరు గానే చెప్పాను. సందర్భాన్ని మినహాయించి కోట్ చెయ్యడం వల్ల అపార్థమే మిగుల్తుంది. నేనన్న మాటలు ఇవి: "ఒక ప్రత్యేకమైన ఉద్యమపు ఊపుతో వస్తున్న ఈ నాటి మినీ కవిత వస్తువులో అభివ్యక్తిలో ఎంతో ఆధునికతని సంతరించుకుంది, ఇప్పుడొచ్చే మినీకవిత్వపు వెల్లువ, పై చెప్పిన పూర్వ కవిత్వాల పరిణామంగా వచ్చిందని కాని, వాటి ప్రేరణ ఈ విధంగా రూపొందిందని కాని నాఅభిప్రాయంకాదు. మినీ కవితలో భావాన్ని చెప్పే ప్రత్యేక ధోరణి ఏదో ఒక రూపాన ఉన్నదనీ, అందువల్ల అది దీర్ఘ కవితకి హ్రస్వరూపం కాదనీ ఇంప్రెస్ చెయ్యడానికే పై ఉదాహరణ లిచ్చాను" ఈ పంక్తుల్లో ఏ మాత్రమూ అస్పష్టతలేదు. ప్రాచీనమైన వాటిలోకనిపించే మినీ కవితా లక్షణానికీ, ఈ'నాటి మినీ కవితకీ భేదాన్ని స్పష్టంగా చెప్పాను. అందుకే ఈ నాటి మినీకవిత 'వచన కవితా యౌవనరూపం' అన్నాను.

"మినీ కవితలో భావాన్నిచెప్పే ప్రత్యేక ధోరణి ఏదోఒక రూపాన్న ఉన్నది" అనడం ఆలోచనలో ఉన్న అస్పష్టతని సూచిస్తుందంటారు రామారావు గారు. 'ప్రత్యేకధోరణి ఏదో ఒకరూపాన' అన్నదానికి అర్థం, అక్కడవరకు, ప్రత్యేకధోరణి ఎన్ని రూపాల్లో ఉండవచ్చని చెప్పడం మాత్రమే. ఒకవ్యాసంలో చెప్పబడే విషయాలు ఆ వ్యాసపు పరిధి ప్రయోజనం. అవసరం మొదలైన అంశాలదృష్ట్యా చెప్పబడతై. వివరణ అవసరం లేనిచోట వివరించకపోతే అది ఆలోచనలో అస్పష్టత అనడం తొందరపాటు. 'మినీకవిత' పుస్తకంలోని తర్వాత వ్యాసాల్లో ఆధోరణుల ప్రత్యేకతలు వివరించబడినై.

"మినీ కవితలో ఒక విధమైన శిల్పవైచిత్రి పరాకాష్ఠకు పోతున్నది" అనే నావాక్యం తీసుకుని 'ఏమిటి ఆ ఒక విధమైన శిల్పవైచిత్రి?" అని ప్రశ్నిస్తారు. రామారావుగారు. 'మినీకవిత' పుస్తకంలోని వ్యాసాల్లో 'మినీకవిత' శిల్ప స్పృహ' అనే శీర్షకతో ఒకవ్యాసం ఉంది. అందులో శిల్పరీతులు వివరించబడినై అందువలన నా ఆలోచనలో అస్పష్టతగాని నామాటల్లో కన్‌ఫ్యూజ్ చెయ్యడంగాని లేవు.

గురజాడ రాసిన ఈ క్రింది కవితని 'మినీకవిత' అని చెప్పడానికి 'సైజ్' ఒక్కటే కారణమని రామరావుగారన్నారు—

"మనిషి చేసిన రాయిరప్పకు
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయిరప్పల
కన్నకనిష్టంగాను చూస్తావేల"—

ఇందులో 'సైజు' తప్ప మరేమీలేదా? ఇందులో మనిషి రాయిని చేశాడనీ, రాయికంటె దాన్నిచేసిన మనిషే హీనంగా చూడ బడు తున్నాడనడంలో చమత్కారంవుంది. ఆకాలానికి గురజాడ కొత్తగాతెచ్చిన హేతువాద మానవతా వాదాల ధ్వని అతిస్పష్టంగా ఉంది. అవిలేకపోతే ఆ పంక్తులు కేవలం 'సైజు' వల్ల గొప్పకవితగా నిలబడవు.

రెండో అంశం, క్లుప్తత, ధ్వని ప్రధాన లక్షణాలుగా నేనుచెప్పడం. 'సైజు క్లుప్తతని నిర్ణయిస్తుందనడానికి సందేహించడానికి సందేహించ నక్కరలేదు' అంటారు రామారావుగారు. సైజువేరు , క్లుప్తతపేరు, పెద్ద సైజు కవితల్లోకూడా భావాన్ని యీడ్చి పాడు చెయ్యవచ్చు. అటువంటి చోట్ల క్లుప్తత లేనట్టే. అందుకే చలం 'ఎకానమీ ఆఫ్‌వర్డ్స్' కావాలన్నాడు. క్లుప్తత ఏకవిత్వానికైనా కావలసిన లక్షణం. అదిలేని 'ఏ సైజు' కవిత్వ మైనా వైఫల్యంపొందినట్లే. ఒక్కొక్క సుదీర్ఘ కవిత చదివి 'దీన్ని నాలుగు మాటల్లో చెప్పవచ్చునే!' అనుకుంటాం. అంటే ఆ కవితలో క్లుప్తతా గుణం లేదని అర్థం. అందుకే మినీ కవితలో క్లుప్తత ప్రధాన లక్షణాల్లో ఒకటిగా చెప్పబడింది. మినీ కవిత బలంగా ఉందంటే అక్కడ 'అల్పాక్షరాల్లో అనల్పార్థరచన' ఉందనే అర్థం,

ఇక ధ్వని గురించి. కవిచెప్పిన విషయాన్ని బట్టిచెప్పిన విషయాలు స్ఫురించడమే ధ్వని. విజయవంతమైన మినీ కవితలలో చివరవచ్చే మలుపులో ఎక్కువుగా ధ్వనే ప్రధానంగా ఉంటోంది. ధ్వని లేకుండా బలంగా చెప్పడం కుదరదా?" అన్నది రామారావుగారి ప్రశ్న. చెప్పవచ్చు. కాని ప్రాచుర్యం దృష్ట్యా ఒకలక్షణం నిర్ణయించబడుతుంది. నేను చమత్కారం, వైచిత్ర, శిల్పవైచిత్రి ధ్వని, బలంగా చెప్పడం యివన్నీ ఒకటే ననుకుంటున్నానని రామారావుగారి ఉద్దేశం. అదిసరి

కాదు. వేరు వేరు సందర్భాల్లో వాడిన పదాలన్నీ ఒకచోట చేర్చి నా ఉద్దేశాన్ని ఊహిస్తున్నారు రామారావుగారు. వీటిల్లో ఏదో ఒకటి మినీ కవితల్లో ఉంటోందన్నదే నా అభిప్రాయం, అంతేగాక విభిన్న వాక్యల్లో అక్కడి సందర్భానికి అతికి నట్లుండేపదాల్ని పోగుచేసి రచయిత అభిప్రాయం ఇదేఅనుకోవడం సముచితంకాదు. మినీ కవితకి ధ్వని తప్పకుండా ఉండాలనడం ప్రమాదకరమైన ధోరణి' అంటు న్నారాయన. అలానేనలేదు. 'ధ్వని' చాలావరకు మంచి మినీ కవితల్లో కనిపిస్తుంది కాబట్టి ధ్వనికి ప్రాధాన్యమిచ్చి చేసిననిర్వచనమే నేనన్నఈమాటలు. 'మినీకవితకి ఉచ్ఛ్వాసంక్లుప్తత, నిశ్వాసం ధ్వని' 'ధ్వనిలేకుండా బలంగా చెప్పడం కుదరదా?' అనే రామారావుగారి ప్రశ్న, శాస్త్రీయ విషయాల్ని వదిలిపెట్టి, కళా సంబంధమైన ఏ నిర్వచనం తీసుకున్నా, వేసే అవకాసం ఉంది. ఎందుకంటే కళా సంబంధి. నిర్వచనాల్లో విమర్శకుడి హృదయం మీద ప్రభావం చూపిన ప్రబలమైన అంశాల్నిబట్టి లక్షణ నిర్వచన చెయ్యబడుతుంది. ఉదాహరణకి 'ధ్వన్యాలోకం' లో 'రసధ్వని' కవిత్వానికి ప్రధానలక్షణంగా చెప్పబడింది కాబట్టి అదిలేనిచోట కవిత్వం లేనట్టేనా అని ప్రశ్నించవచ్చు. కావ్యాత్మ గూర్చి విభిన్న ఆలంకారికులు విభిన్న నిర్వచనాలు చేశారు. అలాగే పాశ్చాత్యులు పొయిట్రీ గురించి అనేక నిర్వచనాలు చేశారు. మాత్యూఆర్నాల్డు పొయిట్రీ ఈస్ ది క్రిటిసిజమ్ ఆఫ్ లయిఫ్ అన్నాడు. జీవనవిమర్శ లేనిది కవిత్వంకాదా అంటే సమాధానం ఏమిటి? అందువలన కళాసంబంధమైన నిర్వచనాల్లో, రామారావుగారు వేసిన ప్రశ్నలాటివి వెయ్యడం కుదరదనిపిస్తుంది.

నా విమర్శలో ఒక వైరుధ్యంగా ఈ కింది విషయాన్ని ప్రస్తావించారు రామారావుగారు. నేను రాసిన వాక్యాలు ఇవి: "మినీకవితను వాచ్యంగా పొడిగించడం సాధ్యంకాదు. ఏదో ఒక చమత్కారం, వైచిత్రి స్వయంసమగ్రంగా ఉండ వలసిందే. అవి ఉన్నంతలో భావప్రచారానికి మినీకవిత పనికిరాదనుకో నక్కరలేదు. భావాన్ని బాగా చెప్పగలవాడికి మినీకవితలు వేమన కవితల్లా గుండు దెబ్బల్లా ఉపయోగపడగలవు" పై వాక్యాల్లో మొదటదానికీ మూడోదానికీ వైరుధ్యం ఉందంటున్నారు. మొదటివాక్యానికీ మూడోవాక్యానికీ ఏమీ సంబంధంలేదు. అందుకే వైరుధ్యమనే ప్రశ్నలేదు. తర్వాత రామారావుగారి వివరణ బట్టి 'రెండో దానికీ నాలుగో దానికి వైరుధ్యంఉంది' అనబోయి పైవిధంగా పొరపాటుగా రాశారనుకుంటాను. ఆయన అన్న వైరుధ్యం యిది. "చాలా వేమన పద్యాలు వాచ్యంగా ఉంటాయి. వ్యంగ్యం, వైచిత్రి కావాలంటూ వేమన పద్యాలను పోలిక తీసుకురావడం వైరుధ్యంకాదా" (ఇక్కడ, పైననేను అనని 'వ్యంగ్యం' అనే పదాన్ని రామారావుగారు కొత్తగా చేర్చారన్నది గమనించాలి). భావాన్ని బాగా చెప్పగలవాడికి మినీకవితలు వేమనకవితల్లా గుండు దెబ్బల్లా ఉపయోగపడగలవు అన్నప్పుడు, ఆ బాగాచెప్పడం ఏమిటి అంటే, భావప్రచారానికి పనికిరావడం, చమత్కారం వైచిత్రి ఉండటం అని పై వాక్యాల్నుండి తెచ్చుకోవచ్చు. వేమన పద్యాల్లో వాచ్యంగా ఉన్నవీ ఉండవచ్చు మరోవిధమైనవీ ఉండవచ్చు భావం బాగా చెప్పగలగడంలో, భావప్రచారానికి పనికిరావడంలో, చమత్కారం, వైచిత్రి ఆయన కవితలకి ప్రాణం కావడంలో భిన్నాభిప్రాయం లేదుగదా.

మూడో అంశం రావి రంగారావుగారి "సవ్యబంధురశైలి" అదియిది: ఖచ్చితమైన పదనిర్మాణం, అంటే ఒక పదాన్నితీసివేసి ఇంకోపదంతో పూరించడానికి వీలుకాని కూర్పును కలిగి ఉండటం, ఒకవేళ అలాచేస్తే సహజత్వం తగ్గిపోవడంకాని, ఒకోసారి పూర్తిగా సారహీనం కావడంగాని జరుగ గలదన్న మాట" ఇవి రంగారావుగారి మాటలుగా రామారావుగారు కోట్ చేశారు. దాని పైన తన అభిప్రాయాన్ని చెప్తూ అసలు వచనానికీ కవిత్వానికి ఉన్నమౌలిక భేదమే 'ఆదేశ అసహిష్ణుత' అంటున్నారు. 'కవిత్వంలో విషయాన్ని ప్రతిపాదించే శబ్ద సంయోజనకూడా ముఖ్యమే' అన్నారు. కాని అందరి కవిత్వాల్లోనూ ఈ ఆదేశ 'అసహిష్ణుత' ఉండదు. అది రచయితశ్రద్ధ, ఉద్దేశాలమీద ఆధారపడి ఉంటుందని మళ్ళీ రామారావుగారే అంటున్నారు. మినీకవితలో భావాన్ని క్లుప్తంగా చెప్పే అవసరం ఎక్కువకాబట్టి అశ్రద్ధ, ఉద్దేశం రచయితలోచాలా వ్యగ్రంగా ఉండాల్సిన అవసరం ఎక్కువ ఉన్నది. అందుకే మినీకవితలో 'ఖచ్చితమైన పదనిర్మాణం' మిగిలిన రూపాల్లోకంటె ఎక్కువ అవసరమౌతోంది. సామాన్యభావ విషయే ప్రధానమైంది. విషయాన్ని గ్రహించగానే దాన్ని బోధించిన వాక్యాన్ని, వాక్యసముదాయాన్ని మరచిపోతాం. అందువల్ల ఒకరు చెప్పిందాన్ని మరొకరికి చెప్పేటప్పుడు ప్రధాన విషయబోధ జరిగినా వాక్యనిర్మాణం, పదసంయోజన వేరుకావడం మన అనుభవ పరిధిలోదే. అదే కవిత్వం విషయంలో అట్లాజరగ నియ్యం అంటున్నారు రామారావుగారు. కాని అన్ని కవిత్వాలూ, అందరి కవిత్వాలూ యిలాటి లక్షణం కలిగి వుండవు. పదాలన్నీ కవిచెప్పిన క్రమంలో ముద్రపడి ఆదేవిధంగా మరొకరికి చెప్పవలసినశక్తి కొన్ని కవిత్వాలకే, కొందరి కవిత్వాలకే ఉంటుందన్నది గమనించాలి.

నాలుగో అంశం రావి రంగారావుగారు చెప్పిన శీర్షికాలక్షణం. ఈ శీర్షికా లక్షణచర్చా, తర్వాతి అంశమైన మినీకవితచివరలో వచ్చే చమత్కారం గూర్చిన చర్చా, చేసేముందు, ఒక మౌలిక విషయాన్ని చెప్పకోవలసిఉంది. అదేమిటంటే, ఒక వస్తువుకో, ఒక ప్రక్రియకో లక్షణ నిర్దేశం ఎలా చెయ్యబడుతుంది? అన్నది. ఆ వస్తువులో కనబడే లక్షణం మరోచోటకూడా కనబడవచ్చు. కాని ఆ వస్తువులో ఆ లక్షణం 'ప్రచురంగా' కనబడ్డప్పుడు, ఆ వస్తువుని ఆ లక్షణం కలదిగా నిర్ధారణచేస్తాం ఉదాహరణకి 'తిక్కన నాటకీయరచన చేస్తాడు' అన్నప్పుడు, నన్నయ కవితలో గాని మరొకరి కవితలోగాని అలాటి రచన కనిపించదనికాదు. తిక్కనలో ఆ లక్షణం 'ప్రచురంగా' ఉన్నదనే అర్థం, అలాగే ప్రబంధలక్షణాల్లో వర్ణనాత్మకత ఒకటిగాచెప్తాం. మరో ప్రక్రియలో వర్ణన ఉండదని అర్థంకాదు. ప్రబంధంలో దానికి ప్రాచుర్యం ఎక్కువఅనే. లక్షణనిర్దేశలక్షణం' యిలా ఉంటుంది. రామారావుగారు మినీకవితని విమర్శించడానికి ఈ మౌలిక లక్షణపరిశీలనని ఉల్లంఘిస్తున్నారు 'మినీకవితలో శీర్షికను సార్థకంగా ఉపయోగించుకోవచ్చునని రంగారావు, జింబో గార్లు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ రకమైన టెక్నిక్కు ఇతరులుకూడా పూర్వం వాడుకున్నారు అని ఒక ఉదాహరణ రామారావుగారు ఇచ్చారు. పైగాతానే అంటున్నారు "శీర్షిక కవిత్వంలో భాగంకావడం ఒక మంచి టెక్నిక్ అనడానికి అభ్యంతరం లేదు. అయితే యిది మినీకవితకు ప్రత్యేక లక్షణంగా చెప్పడం కుదరదు" పైననేను వివరించిన లక్షణనిర్దేశలక్షణం గూర్చి ఆలోచిస్తే, మినీకవితల్లో ఈ గుణం 'ప్రచురంగా' ఉందికాబట్టే యిది మినీకవితా లక్షణాల్లో ఒకటిగా చెప్పబడింది.

అయిదో అంశం మినీకవిత చివరలో వచ్చేమలుపు. ఈమలుపుకూడా ఒక్క మినీకవితలోనేగాక ఎంకిపాటల్లో ఒకచోట, నాయని సుబ్బారావుగారి పద్యాల్లో చాలాచోట్ల ఉన్నాయంటారు రామారావుగారు. ఈ లక్షణం ఎక్కడా లేకుండా మినీకవితల్లో మాత్రమే ఉందని ఎవరూ అనడంలేదు. మినీకవితల్లో నూటికి తొంభైతొమ్మిదెంటిలో ఈ మలుపు ఉంటుంది. (ఈ మలుపు, చమత్కారం వగైరా లన్నిటినీ రామారావుగారు 'కవిత చివర్లో రకరకాల మార్గాల అన్‌ఎక్స్‌పెక్టెడ్‌నెస్' అంటున్నారు) అందుకే మినీకవితకి దీన్ని ఒక లక్షణంగా చెప్పడం జరిగింది,

ఈ పరిశీలనలో తేలిన అంశాలివి. మినీకవితకి అతిస్పష్టంగా కొన్ని ప్రత్యేక లక్షణాల్ని నిర్దేశించే అవకాశం ఉంది, ఆ కవితచివరిలోమలుపు, క్లుప్తత, బంధురశైలి, శీర్షికాప్రాధాన్యం. ఇవన్నీ కేవలం 'సైజు' నిబట్టి సిద్ధించవు. కాబట్టి మినీకవిత్వానికి 'సైజు' మాత్రమే లక్షణ మన్నది, మినీకవితని సరిగా పరిశీలించక చెప్పిన మాట మాత్రమే. ఇలాటి పరిశీలనలు పాఠకుల్ని పెడదోవ పట్టిస్తై. ఇవి ఆధునిక కవితా విమర్శకి ఏ మాత్రం దోహదం చెయ్యవు.

అద్దేపల్లి రామమోహనరావు

గ్రంథ విమర్శలు

సాలగ్రామ శాస్త్రమ్

[తాత్పర్య విశేషార్థ సహితము. సంపాదకులు: శ్రీ కపిలవాయి లింగమూర్తి, డెమ్మీ-10+44+184 పుటలు, వెల 15రూ.లు ప్రతులు దొరకు చోటు: శ్రీ కె. కిశోరుబాబు, 15-34, వాణీసదనం, నాగర్ కర్నూలు-509209]

మూల్లగ్రంథ సంపాదకులు, లింగమూర్తిగారు సుప్రసిద్ధ విద్వత్కవులు, విమర్శకులు. ఈయనకు సాహిత్యాభినివేశంతోపాటు ఆధ్యాత్మిక చింతన, దైవ భక్తి ఎక్కువ. వీరిదివరకే చక్రతీర్థ మాహాత్మ్యం, శ్రీమత్ప్రతాపగిరి ఖండం మున్నగు గ్రంథాలను రచించి ప్రజానీకంలో దైవభక్తిని పెంపొందింపజేశారు. ఇప్పుడీ సాలగ్రామశాస్త్రాన్ని తమ తాత్పర్యంతోను, విశేషాలతోను చక్కగా ముద్రింపించి ప్రకటిస్తున్నారు.

మనవారు విగ్రహారాధనతోపాటు సాలగ్రామపూజ చేస్తూ వుంటారు. చాలా మంది ఆ పూజ సంప్రదాయ సిద్ధమైనదని మాత్రం అంటారు. సాలగ్రామాల వైశిష్ట్యాన్ని గురించి ఎరిగినవారు చాలా తక్కువ. వాటి తత్త్వాన్ని లోకానికి తెలియజేయాలనే దృఢ సంకల్పంతో శ్రీ లింగమూర్తిగారు మద్రాసు-ఓరియంటల్ లైబ్రరీలోని మూలగ్రంథానికి నకలు వ్రాయించి తెప్పించి, సంస్కృతంలో వున్న ఆ గ్రంథాన్ని బాగా అవగాహన చేసుకుని తమ తాత్పర్యంతోనూ, విశేషాంశాలతోనూ మనకు అందిస్తున్నారు. వీరు తమవద్ద వున్న ప్రతినీ, బైరంపల్లి ప్రతినీ కూడా సంప్రతించి, సముచిత రీతిని ముద్రణ కోసం చక్కని ప్రతిని తయారు చేశారు.

సంపాదకులు లింగమూర్తిగారు దీనికి వ్రాసిన పీఠిక మిక్కిలి ముఖ్యమైనది. అది యీ గ్రంథానికి ఎంతో విలువను సమకూరుస్తున్నది. లింగమూర్తిగారు అగ్నిపురాణం, బ్రహ్మవైవర్త పురాణం, గరుడపురాణం, దేవీభాగవతం మున్నగు పురాణాలనూ, వేదతంత్రాలనూ పరిశీలించి, అనేక విషయాలను సంగ్రహించి సాలగ్రామభేదాలనూ, ఇతర విశేషాలనూ ఇందులో వివరించారు. తమిళంలో సాలగ్రామాలను గూర్చి వ్రాయబడిన గ్రంథాన్నుంచి కూడా వివరాలను సేకరించారు. సాలగ్రామాలకు చెందిన గాథలను కూడా చెప్పారు. ఇది సాలగ్రామములను గురించిన సమస్త విషయాలనూ వివరించుట వల్ల 'సాలగ్రామసర్వస్వ'మని చెప్పదగి వున్నది. సాలగ్రామాలను గురించి సమగ్రంగా తెలుసుకొనదలచినవారు దీనిని చదివితే చాలును. దీన్ని పరిచయం చేస్తున్నవారూ, బహుభాషావిశారదులూ, విద్వద్విమర్శకులూ, బహుగ్రంథకర్తలూ అయిన డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు ఎన్నో విషయాలను తెలిపి, ఈ గ్రంథానికి మెరుగుపెట్టారు. ఇట్టి గ్రంథానికి తిరుమల-తిరుపతి దేవస్థానాలవారి ఆర్థిక సహాయం అందడం ఎంతో సముచితంగా ఉన్నది. సులభ తాత్పర్యంతో వున్న యీ గ్రంథం అందరి ఆమోదాన్ని పొంద గలదని నా విశ్వాసం.

బులుసు వేంకట రమణయ్య

మిణుగురులు

[కుంటిమద్ది శేషశర్మ; వెల-రు.2-25లు. ప్రతులకు: కుంటిమద్ది శేషశర్మ; 2.228, 4వ అడ్డరోడ్డు; అనంతపురం-515004]

కుల మతాలు అర్థకామములు, పురుషులలోని భేదాలు, చదువులు, పరపక్షిణులు, భార్యా భర్తలు అనే శీర్షికలకింద శేషశర్మగారు రాసిన ఈ చిన్న కవితా సంకలనానికి మిణుగురులు అని పేరు పెట్టారు. ప్రతి కవి పాఠకులకు ఏదో ఒక సందేశాన్ని ఇవ్వాలని ప్రయత్నం చేస్తాడు. తను ఇచ్చే సందేశాన్ని తనలాంటి అభిప్రాయం కలిగిన వాళ్ళందరూ ఆమోదిస్తారు, లేనివారు వ్యతిరేకిస్తారు.

'మిణుగురులు' లో వీరు చెప్పిన చాలా అంశాలు వర్తమానంలో అధిక సంఖ్యాకులు అంగీకరించరు. ఉదాహరణకు-

"ఒక్కొక్క కులమునకు నొక్కొక్కరీతి
ధర్మములు శాస్త్రవిహితమ్ములై యుండు
వాని చేతనే పొందు వాడు మోక్షమ్ము."
"పూర్వజని గుణ కర్మమూలకమ్మైన
కులము మార్చుట నరులకును వీలుగాదు
మతము మతి పశ్యమ్ము మార్చుకొనవచ్చు"

ఈ బ్రతుకంతా ఉత్తి మాయ అని ఇక్కడ పడే కష్టాలు, అనుభవించే దుఃఖం అంతా మిథ్య అని పారలౌకికమైన ఆలోచన ఒక్కటే మనిషికి ముక్తి దాయకమని చెప్పే వేదాంతం ఇవ్వాళ కొత్తదిగాదు. ఆ భావాన్నే శర్మగారు తన రీతిలో, గీతిలో చెప్పారు:

"ఇహలోక సౌఖ్యమునే గోరువారు
చనును ప్రేయోమార్గమున, గాన మరల
పుట్టుచును, గిట్టుచును పొందు దుర్గతుల.
అందుచే నీచ విషయాసక్తి వదలి
భవ బంధముక్తికై పాటుపడుమంచు
ముక్తి(ఁ) బురుషార్థముగ(ఁ) దెల్పినారు"

ఇది జీవితంపట్ల వీరి ఆశయం. ఇంకా అనేక నీతి విషయాలుమీద వీరు పద్యాలు చెప్పారు. ఆర్థిక విషయాలు, నేటికాలపు చదువులు, కామ విషయాలు, భార్యా భర్తల సంబంధం మొదలైన విషయాలపై వీరు ఈ కావ్యంలో పద్యాలు చెప్పారు. శైలి సుబోధకంగా ఉండటం, సూక్తులు కొన్నిచోట్ల, బోధలు కొన్ని చోట్ల ఉపయోగించటం వీరి ఈ కావ్య ప్రత్యేకత.

ఆక్రందన శతకము

[డా॥ బొడ్డుపల్లిపురుషోత్తం, వెల;రు.4-00లు; ప్రతులకు: శ్రీ గిరిజా ప్రచురణలు, బి-31; విద్యాలంకార్; శ్రీనివాసనగర్ కాలని, గుంటూరు-6]

ఇది భక్తి శతకం. ఆంజనేయుడిపై బొడ్డుపల్లి వారికి గల భక్తి, ఈ కాలపు సంఘంలో దిగజారుతున్న విలువలపై ఆయన పడుతున్న వేదన ఈ శతక కావ్యంలో కనబడతాయి. పద్యాలు చాలా సరళంగానూ, సూటిగాను, కొండొకచో వ్యంగ్యాత్మకంగానూ వున్నాయి. కోగంటి సీతారామాచార్యులుగారు ఈ కావ్య హృదయాన్ని ఆవిష్కరిస్తూ ఇట్లా అన్నారు." పరమ దుస్థితిలో నున్న దానిని యిప్పుడెవ్వరునూ బాగుచేయచాలరని నా కన్నవారెరుగుదురు. కావున వారాక్రందించిరి. ఈ య్యాక్రందనము నెవరు వినవలయును? వేదమూర్తియగు సీతారాముడు వినవలయును. ఆ సీతారాముడు వినుటెట్లు? అంజనేయుని ద్వారమున వినవలయును. అందువలన ఈ పురుషోత్తముడు వేదమూర్తులగు సీతారామాంజనేయుల శ్రీపాదసన్నిధిలో ఆక్రందించినాడు."

తేలికైన తేటగీతుల్లో 'ఆలకింపు మాక్రందన మాంజనేయ' అనే మకుటంతో తన అభిప్రాయాలను శ్రీ బొడ్డుపల్లివారు కవితారూపంలో ఆవిష్కరించారు.

"నరనరాలకు ప్రాకె సోమరితనము
ప్రబలమగు క్షుద్ర హృదయ దౌర్బల్య గరిమ
ఇహపరములు లే వొక్క యహముదక్క"

అని ఈనాటి మనిషి అహంకారాన్ని ఆంజనేయుడికి నివేదిస్తున్నారు. సంఘంలో ధర్మం నశించిపోయిందని, అవినీతి తాండవిస్తోందని, ఎక్కడ చూచినా మోసం, స్వార్థం తప్ప మరొకటి మనకు కనపట్టం లేదని-ఈ దుస్థితినుంచి సంఘాన్ని సముద్ధరించటానికి అంజనేయుడే సమర్థుడని తన హృద్గత వేదనను ఆయనకు ఈ కవి తెలియపరుస్తున్నాడు.

"ధర్మమునకు నీతికి తిలోదకములిచ్చి
పశువులకు ఖ్యాతి గూర్చెడి బిరుదులిచ్చు
మానవుల నుద్ధరింప సమర్థులెవరు?"

అంతర్జాతీయం

[మాచిరాజు సావిత్రి, వెల: రు.10-00లు. ప్రతులకు: చేతన; లిటరరీ అండ్ కల్చరల్ అసోసియేషన్; 15/8 అరండల్ పేట; గుంటూరు-2. ఎ.పి. ఇండియా]

శ్రీమతి సావిత్రిగారు విదేశాలలోనే విద్యాభ్యాసంచేసి గడిచిన 12 సంవత్సరాల నుండీ అమెరికాలో నివసిస్తున్నారని, ఆమె వృత్తిని, ప్రవృత్తిని గురించి జె. బాపురెడ్డిగారు ఈ కవితా సంకలనానికి ముందు మాటలో రాశారు. శ్రీమతి సావిత్రిగారి దృక్పథం అంతర్జాతీయం. మనుషుల మధ్య, దేశాల మధ్య, సంకుచిత భావ పరిధుల్లో అడ్డుగోడలు నిర్మించుకోవటం అనుచితమని సావిత్రిగారు ఈ సంకలనం ద్వారా సందేశం ఇచ్చారు.

మనుషులంతా వర్ణ వర్గ, ప్రాంతీయతత్వాలతో జీవిస్తున్నారని, ఇది మానవ సంక్షేమానికి, మనుగడకు అడ్డంకు అని ఈమె తీవ్రంగా చెబుతున్నారు. అమెరికాలోనైనా, అంతరిక్షంలోనైనా మనవారు "ఏ జాతి? ఏ భాష? ఏ రాష్ట్రం? ఏ ఊరు? ఏ కులం? ఏ శాఖ? మనవాడా? పరాయివాడా?" ఇవే పరిచయ వాక్యాలని ఉన్న నిజాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పిందీ ఈమె. ఇటీవలనే అమెరికా వెళ్ళి వచ్చిన శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు ఆంధ్రపత్రికలో అమెరికా అనుభవాలు రాస్తూ అక్కడ నివసించే ఆంధ్రుల కులపిచ్చిని గురించి కూడా కొంత రాశారు.

"సరిహద్దులను దాటినా
సంకుచితాలను వదలని
సమాజాలని మార్చినా
స్వభావాలని మార్చని
ఆ ప్రపంచ పర్యటనకు
మనోవికాసమివ్వని విజ్ఞాన యాత్రలలో
మనం బావుకున్నదేమిటి?"

అని ఈ కవయిత్రి విదేశ యాత్రలను గురించి గట్టిగా ప్రశ్నిస్తున్నారు. జీవితాన్ని గురించి, మరణాన్ని గురించి ప్రాచ్య, పాశ్చాత్య భావనలను సావిత్రిగారు చక్కగా చెప్పారు.

"ఈ ప్రపంచం దుఃఖమయం
ఈ జన్మచక్రం అవాంఛనీయం
బయటపడటమే కర్తవ్యం
మృత్యువును మెప్పించేందుకిదే మార్గం
ఈ ముక్తి మార్గం తెలుసుకో
ఈ లోకం సంగతి మరచిపో
పై లోకాన్నే మదిలో నిలుపుకో
ఇది ప్రాచ్య బోధన"
"ఈ ప్రపంచం వినోద సాధనం
ఈ జీవితం ఆనంద సాగరం
అనుభవించడమే ఉత్తమం
మరణాన్ని మరిపించేందుకిదే ఉపాయం
ఈ ఆదర్శం అర్థం చేసుకో
ఈ అవకాశం చేజిక్కించుకో
వేరే ఆలోచనలన్నీ వదులుకో
ఇది పాశ్చాత్య వాదన"

ఈ రెండు వాదనల మధ్య అసలు జీవిత విలువలు లుప్తమైపోయాయని శ్రీమతి సావిత్రిగారి వేదన. జాతీయ దురహంకారం ఆరోగ్యకరమైనది కాదని దేశభక్తి ఖండికలో బలంగా చెప్పారు. ఈ దేశభక్తి పరాయణం నుంచి విముక్తి పొంది ప్రపంచ పౌరులుగా వెలుగు చూపే దినం కోసం ఆమె ఆశతో ఎదురు చూస్తున్నది.

శ్రీమతి సావిత్రిగారి దృష్టి విశాలమైనది. కవిత్వం ప్రారంభదశను సూచిస్తున్నా ఆమెకున్న ప్రాపంచిక దృక్పథంతో అమెరికాలో తెలుగు కవిత్వానికి గౌరవం ఏర్పడేటట్లుగా ముందు ముందు సాంద్రమైన కవితానుభూతితో కవితలు రాస్తారని మనం ఆశించవచ్చు. ఈ సంకలనం ఐదవ ఉత్తర అమెరికా తెలుగు మహాసభలకు అంకితం చెయ్యడం సముచితంగా ఉంది.

శ్రీకార శిఖరం

[జె. బాపురెడ్డి; వెల-రు.25-00లు; ప్రతులకు:-రసమయి; లిటరరీ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, 3-6-753/ఏ. హిమాయత్‌నగర్: హైదరాబాద్-500029]

ఈ కవితా సంకలనం లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఐదవ ఉత్తర అమెరికా తెలుగు మహాసభల సందర్భంగా అమెరికాలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితం ఇయ్యబడింది. ప్రతి కవికీ జీవితంపట్లా, కవిత్వంపట్లా ఏవో కొన్ని అభిప్రాయాలుంటై. అట్లాగే బాపురెడ్డిగారికి కూడా కొన్ని అభిప్రాయాలున్నై. "మన భావనలన్నీ ప్రధానంగా ప్రణయోన్ముఖంగానో, ప్రగతిపరంగానో, ప్రణవాత్మకంగానో ప్రకటితమౌతున్నవి. అయితే ఈ త్రివిధాలోచనలూ, త్రిముఖానుభూతులూ పరస్పర సామరస్య సమన్వయం కలిగి ఉన్నప్పుడే సమగ్ర జీవితానందం సాధ్యమౌతుంది. ఆ సరస సమన్వయ సాధనమే సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం అని నా విశ్వాసం" అన్నారు బాపురెడ్డిగారు లాసాంజెల్స్‌లో కృతజ్ఞతాంజలి ఘటిస్తూ, కనిపించేమనిషికీ, కనిపించని దేవుడికీ మధ్య ఉండే సంబంధాల మీదనే మానవుల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలు ఆధారపడి ఉంటై అని

బాపురెడ్డిగారు చెబుతున్నారు. ఎంచేతంటే—వారి నమ్మకం వారిది గనుక. ఈ "శ్రీకార శిఖరం" కావ్యం క్యాసెట్టూ ఐదవ ఉత్తర అమెరికా తెలుగు మహా సభల సందర్భంగా విడుదల చేశారని బాపురెడ్డిగారు తెలియజేస్తున్నారు. ఈ సంకలనం 'ప్రణవాత్మకమైన అద్వైత భక్తిభావ బంధురమైన గీతికా సంపుటిగా' ఆయన పేర్కొన్నారు.

రాయిని దేవుని చేసి
మనిషిని బలిచేయకుండా
మనిషిని దేవుని చేసి
జడతను తొలిచేయరా

అనేది వీరి సిద్ధాంతం.

కనబడనిది చూపించెడి
వినబడనిది వినిపించెడి
నిత్య సత్య సాహిత్య
నిత్యానంద సంగీత
తేజోమయ గేయం
నా జీవితధ్యేయం

అని తన కవిత్వ తత్వాన్ని స్పష్టం చేశారు బాపురెడ్డిగారు.

ఏ పాటలు పాడుదు ఈ
ఏటి గట్టుపైన
ఎడతెగని ప్రజాప్రవాహ క
న్నీటి గట్టుపైన
ఏ ఆటలు ఆడుదు ఈ
ఇరుల గిరులపైన
తరుణారుణ యవనిక
సంధ్యా శిఖరముపైన

అని వర్తమాన కాలధర్మాన్ని ధ్వనింపచేశారు బాపురెడ్డిగారు ఈ కావ్యంలో.

వ్యవధి లేదు

[నారెగ్ బొయాడ్జియాన్; అనువాదం జె. బాపురెడ్డి; వెల:-రు.25-00లు; ప్రతులకు: సుభేలానికేతన్; బి.సి.85; ఇక్రమ్ మంజిల్ కాలనీ: హైదరాబాద్-500004]

అమెరికన్ కవయిత్రి నారెగ్ బొయాడ్జియాన్ రాసిన 'దేర్ ఈజ్ నో టైమ్' అనే కవితా సంకలనానికి జె. బాపురెడ్డిగారు చేసిన తెలుగుసేత ఈ 'వ్యవధి లేదు' అనే కావ్యం. ఈ అనువాదానికి తన అర్హతను బాపురెడ్డిగారు ఈ విధంగా చెప్పారు. "ఆమెతోపాటు నాకూ గత సంవత్సరం మొరాకోలో జరిగిన 7వ ప్రపంచకవుల మహాసభల్లో ప్రపంచ కళాసంస్కృతుల అకాడమీవారు గౌరవ డాక్టరేటు పట్టాను ప్రదానం చేయడమే ప్రధాన అర్హతగా నేను భావిస్తున్నాను" ఈ కావ్యం కూడా 5వ ఉత్తర అమెరికా తెలుగు మహాసభల సందర్భంగా సమర్పించిందే. అనువాద కావ్యంలో ఒక పేజీలో ఆంగ్లమూలం దాని ఎదురు పేజీలో తెలుగు అనువాదం అచ్చు వేశారు. అట్లా వెయ్యటంవల్ల కవిత్వం చదువుకొనే వాడికి మూలంలో వున్న జీవలక్షణం అనువాదంలో ఎంతవరకూ సాఫల్యం పొందిందీ అర్థం అవుతుంది. నారెక్ బోడ్జియాన్ కవిత్వంలో ప్రకృతి రామణీయకత, అంతర్ముఖీనత, సిద్ధాంతాతీతమైన హృదయస్పందన ఉన్నై. అనువాదంలో వాడిన యధాతథంగా తెచ్చే ప్రయత్నం బాపురెడ్డిగారు చేసారు.

'దేర్ ఈజ్ నో టైమ్' అనే ఖండికను వీరు వ్యవధి లేదు అనే పేరుతో అనువదించారు.

ది స్కై అండ్ నేచర్ ఆర్ ఎజెన్
విత్ హెయిర్ వైటెండ్
బై పెయిన్ దట్ ఏజెస్

అనే పాదాలను

ఆకాశమూ ప్రకృతీ
పాలిపోయాయి
వయసు ముక్కుతున్న బాధతో
వాటి తలలు నెరసిపోయాయి

అని అనువదించారు. ఈ కావ్య అనురాగం అంతా ఇట్లా డైరెక్టుగా పాదాలను అనువదించటం జరిగింది. అందువల్ల మూలంలో వున్న ప్రాణభూతమైన కవితాత్మ అనువాదంలో ప్రస్ఫుటం కాలేదు. కవిత్వాన్ని అనువదించటం సర్వే సర్వత్రా కష్టమైన పని. ఐనా బాపురెడ్డిగారు వారి పరిధిలో సాధ్యమయినంత వరకూ భావాన్ని మనకు అందించారు. అందుకు వారు అభినందనీయులు.

టి. యల్. కాంతారావు

తెలుగులో పదకవిత

[రచయిత డాక్టర్. శ్రీ. ఎస్. గంగప్ప. డెమ్మీ 20 + 276 పుటలు. వెల రూ.30లు. ప్రతులకు-శ్రీమతి ఎన్.పార్వతమ్మ శశికృష్ణచరణలు-స.78. శ్రీనివాసనగర్-గుంటూరు-522006]

అనాదినుంచీ తెలుగులో వస్తున్న ప్రక్రియలలో పదప్రక్రియ బహుళ ప్రచారంలో ఉన్నది. ఇది పండితులనే కాక పామరులను కూడా ఆకట్టుకుంటుంది. పాండిత్యం తగినంత లేకపోయినా జానపదకవులు పదకవిత్వంలో పేరు గడించారు. పురాణాల్లో లేకపోయినా పురాణాలకు సంబంధించిన కథలు కల్పించి చిన్న చిన్న పదకృతులు కూర్చి పాడుకోవడం, ప్రజలను సంతోషపెట్టడం పరిపాటిగా ఉండేది. దాసరులు వీటిని పాడి జీవికను సంపాదించుకొనేవారు. చరిత్ర కథలు కూడా పదాలుగా వచ్చేవి. కుసలాయకం, కుచ్చెలకథ, దక్షుడి యజ్ఞం, సుభద్ర సారె మొదలైనవి పురాణాలకు సంబంధించిన జానపదగేయాలు. బొబ్బిలియుద్ధం, చెంజికోట యుద్ధం మున్నగునవి చరిత్రకు సంబంధించినవి.

భక్తాగ్రగణ్యులు, గానకళావేత్తలు, విద్వాంసులు అయిన కొందరు తమ తమ యిష్ట దేవతలను కీర్తించిన సంకీర్తనలు కూడా పదకవితలు క్రిందనే చేర్చబడినవి. అవి పద్యాలు కావు కాబట్టి. అవి గేయకవితలుగా ప్రసిద్ధమయినవి. సంప్రదాయ సంగీతానికి సంబంధించినవి కూడా. నేటి గానకళానిపుణులు వానిని గానం చేసి అందరికీ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నారు. అట్టి గేయకవుల్లో తాళ్ళపాక అన్నమాచార్యులు, క్షేత్రయ్య, కంచెర్ల గోపన్న, త్యాగయ్య ముఖ్యులు. వీరి కవితలో గానంతోపాటు సాహిత్యానికీ విలువ ఉన్నది.

ఈ పద కవిత్వాన్ని గురించి ఎంతో పరిశ్రమ చేసిన గంగప్పగారు, ఈ గ్రంథంలో పదకవిత్వాన్ని గురించిన విశేషాలెన్నో తెలియజేశారు. పదకవిత్వపు 'ఆవిర్భావ వికాసాలు' శీర్షికలో సంస్కృతం, హిందీ, తమిళం, కన్నడం తెలుగు భాషల విషయం సంగ్రహించారు మొదట. తర్వాత తెలుగు పదకవుల చరిత్రను చెప్పారు. ఇందులో అన్నమాచార్య పూర్వయుగం, అన్నమాచార్య యుగం, క్షేత్రయ్య యుగం, త్యాగయ్య యుగం, ఆధునిక యుగం—అని యుగవిభజన చేయబడింది. తర్వాత పదకవితా వైభవంలో అన్నమయ్య, క్షేత్రయ్య, గోపన్న, త్యాగయ్య, సారంగపాణుల రచనా వైభవం, భాషావిశేషాలు. వారి వారి కీర్తనలలో కానవచ్చు శృంగార, భక్తి, నీతి, వైరాగ్యాలు, సంగీతం, అభినయ విశేషాలు సయుక్తికంగా వివరించబడినవి. దీనిని చదివితే ఆ గేయకవులను గురించి సమగ్రంగా తెలుసుకోవచ్చును. ఈ గ్రంథం డాక్టర్ జి.ఎన్.రెడ్డిగారు, డాక్టర్ తూమాటి దొణప్పగారు, డాక్టర్ బి.రామరాజుగారు, సంగీత విద్వాంసులు అన్నవరపు

రామస్వామిగారు మున్నగువారి ప్రశంసలను అందుకొన్నది. తెలుగులోని పద కవిత్వాన్ని గురించి తెలుసుకోవాలంటే దీనిని చదవవలసి ఉన్నది. ఇట్టి పరిశీలన గ్రంథాన్ని రచించిన డాక్టర్ గంగప్పగారు ప్రశంసనీయులు.

శ్రీ కాకాని మల్లీశ్వర మాహాత్మ్యము

[ప్రబంధము, గ్రంథకర్త – తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు. డెమ్మీ సైజు—8+180 పుటలు. వెల 12రూ.లు రామకథామృత గ్రంథమాల (చందోలు) వారి ప్రచురణ. ప్రతులు దొరకుచోటు. శ్రీ కంభంపాటి పురుషోత్తమ శర్మ, పినపాడు, తెనాలి-2.]

కాకాని గ్రామంలోని మల్లీశ్వర దేవాలయం చాలా పురాతనమైనదని ప్రసిద్ధి. శ్రీకృష్ణదేవరాయలవారి మంత్రులలో ఒకరైన చిట్టరుసు జీర్ణావస్థలో వున్న ఈ ఆలయాన్ని పునరుద్ధరణ చేసినట్లు చరిత్రకారులంటున్నారు. శ్రీశైలంలోని మల్లికార్జునదేవుడు భక్తజన రక్షణార్థం లోకసంచారం చేస్తున్నప్పుడు తన ప్రతిరూపాలను గుంటూరు, విజయవాడ, కాకాని మున్నగుచోట్ల ఏర్పరచినట్లు స్థలజ్ఞులంటున్నారు. ఆ క్షేత్రమాహాత్మ్యాన్ని వివరిస్తూ చందవోలు వాస్తవ్యులు, విద్వత్కవులూ అయిన తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు - 1922లోనే కాకాని వాస్తవ్యులూ, వైశ్యోత్తములూ అయిన కాల్లిపర రామకోటయ్య మున్నగువారి ప్రోత్సాహంతో ప్రబంధంగా రచింపబడినది. దాని ముద్రిత ప్రతులయిపోయాయి. తిరిగి తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు చందోలు రామకథామృత గ్రంథమాల వారిచేత దీనిని ప్రచురింపజేశారు.

అయిదాశ్వాసాలు గల యీ పద్యకావ్యంలో, భక్తజనుల కోరికలను సఫలం చేసే మల్లేశ్వరస్వామి మాహాత్మ్యం వివరించబడింది. మహాభక్తులైన రచయిత, అక్కడి దేవాలయంలో నలభై రోజులు నియమంతో మంత్రపునశ్చరణ చేసి, రాత్రి కోవావంటి పొంగలిని మల్లేశ్వర భ్రమరాంబలకు నివేదించి భక్తులందరికీ ప్రవేశపెట్టేవారట! వారి భక్తి భావఫలితమే యీ ప్రబంధం. రచన రసవంతమై ఉన్నది. మచ్చునకు ఒక పద్యం—

"పరమకృపాళుఁ డీశ్వరుఁడు పాలన సేయు దయార్ద్రచిత్తుఁడై
స్మరహరుఁ డాశ్రితాళులకు సంయమముం బొనరించు, మృత్యుగ
హ్వరముఁ దెరల్పఁ జాలుయమ శాసనుఁ డూర్జిత సౌఖ్యదాయి, శం
కరుఁడు శుభప్రదుండలు జగమ్ములకున్ శివుఁడెల్ల భంగులన్,"

[పుట.70. ద్వితీయాశ్వాసము]

'అంగీరస''

ప్రేమ+సెక్స్=నీతి

[మల్లాది సుబ్బమ్మ, ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్ హైదరాబాదు. పదిహేడు రూపాయలు.]

ఈ నవలలోని సెక్స్ అనే పదానికి స్వేచ్ఛాను సంచరణ అనే అర్థం పుట్టేలాటి సంఘటనలు పుంఖాను పుంఖాలుగా వున్నాయి. రచయిత్రి యీ పేరదాదాపు బూతుకథ వ్రాశారు. ఈ కథలోని హత్యలు యథేచ్ఛగా విహరిస్తాయి. ఇందులో పిసరంతకూడా కథలేదు. కథనిండా బూతేకాకుండా అనవసరపు కోర్టు సీనులు కోకొల్లలున్నాయి. అవి సాగదీసి అనవసరంగానూ, అసందర్భంగానూ రాయడంవల్ల చదువరి విసిగి వేసారవలసి వస్తుంది.

కథలోని సెక్స్ అసభ్యంకోసం వ్రాయబడలేదని రచయిత్రి వ్రాశారు. సెక్సు అసభ్యంకోసం వ్రాయబడకపోయినా అసభ్య సెక్సు వ్రాయబడినది మాత్రం నిజం, ఆ సెక్సు కూడా పేలవంగా ప్రేరణ కలిగించలేనిదిగా వున్నది.

దేవుడు లేనిచోట

[కె. రామలక్ష్మి, నవభారత్ బుక్ హౌస్ : విజయవాడ. పదిహేను రూపాయలు.]

కథానాయకుడు శంకర్ వో పత్రికా విలేకరి. జైలు జీవితాన్ని ప్రాక్టికల్‌గా చూచి, రాయాలని మార్గాంతరంవల్ల జైల్లో జేరేసరికాతని తాతగారా విషయం తెలీక అతన్ని విడిపిస్తాడు. శంకర్ మరో వుపాయంలో మళ్ళీ జైలు పాలవుతాడు. అక్కడ తను కనుగొన్న విషయాలు రాసి, రహస్యంగా తాను పనిచేసే పత్రికకు పంపుతాడు. అది ప్రచురితమై పత్రిక బయటికి వచ్చాక జైలు అధికారులతని వీపు సాపు చేస్తారు. శంకర్ చాలా తెలివైనవాడు. అయినా అతను చేసిన తప్పే తిరిగి చేస్తాడు. పరిశోధన పూర్తికాక మునుపే అజ్ఞాతంగా తానున్న చోటునుంచి ఏరోజు సంఘటన ఆరోజు జూనియర్ జర్నలిస్టుకూడా పంపడు. అథవా పంపినా, అది వెంటనే ప్రచురింపరు. కాని యీ కథలో అతను పంపడం-పత్రికలో వేయడం జరుగుతుంది.

కథలో త్రిపురసుందరి అనబడే కల్పన అనే ఒకామెను వేశ్యగా అతను చిలకలూరిపేటలో కొని, తీసుకు వస్తాడు. అది పేపరుకు సంచలన వార్త చేయాలని ఆశపడ్తాడు. కానీ, కేసు కోర్టుకి ఎక్కి విచారణలో ఉండగా ఆమె రిమాండు హవుస్‌లోనుంచి మాయమవుతుంది. ఈమె కథ యింతతోనే ముగుస్తుంది. ఆనకేమవుతుందో తెలీదు. .

ఇహ ఒరిస్సాలోని అడవుల్లోని వోజాతి వారితో శంకర్ అనుభవ ఘట్టాలు వాస్తవానికి దూరంగా వున్నాయి. కాశీకి, పూరీకి శంకర్ ఎందుకు వెళ్ళాల్సివచ్చిందో వెళ్ళి సాధించిందేమిటో చదువరికి బొత్తిగా బోధపడదు. అతనికి కథపొడుగునా మంచివారే తారసపడుతుంటారు. గూడెంపిల్ల అల్లిని హీరోలా రక్షించి, గూడెం తీసుకువెళ్ళి ఆమెను ప్రేమించి తన యింటికి తెచ్చేసుకుంటాడు,

కథ జైలుబ్రతుకులమీద అంతగా లేదు. ఆరంభంలో గంభీరంగా వున్నా, కొస్త దూరం పోయాక పథం మార్చుకునీ ఎటెటో మెలికలు తిరుక్కుంటూ పోతుంది.

మూడు సెంట్రల్ జైళ్ళు, రెండు సబ్ జైళ్ళు, మునసబుకోర్టుల లాకప్ రూములుచూసి, శిక్షనుభవించిన కొందరి మాటలు విని; జైలు సంస్కరణ సంఘం వారి రిపోర్టు చదివి, సాంఘిక బాధ్యత సంఘ సభ్యుల అనుభవాలు తెలుసుకున్న రచయిత్రి యీ కథను జైలు జీవితాలమీద కొంత నిలిపి వుండి వుంటే బాగుండి వుండేది.

కథపేరు అట్టమీద "దేవుడు లేని చోట" అనీ, లోపల పేజీలలో "దేవుడు లేని చోటు'' అనీ వుంది.

పాలాక్షుడు

చిగురులు - పువ్వులు

(భావగీతికలు)

[పి. దుర్గారావు; వెల:రు.4-00లు; ప్రతులకు: పి.దుర్గారావు యం.ఓ.యల్! చెరుకుపల్లి పోస్టు, వయా నక్రేకల్, నక్రేకల్ తాలూకా. నల్లగొండ జిల్లా]

లలితమైన భాషలో, వివిధ భావాలతో, పదిమందీ పాడుకోవడానికి వీలుగా రచింపబడ్డ గీతాలివి. "అఖిలేశ్వరుడైన యీ పరంజ్యోతిని న్నాశ్రయించాలనీ సుందరమైన యీ ప్రకృతిలో లీనమవ్వాలనీ, సాటి జీవుల కష్టాలు, బాధలు తొలగించాలనీ, నూతన ప్రపంచం అవతరించాలనీ-అందటి మనస్సులలో యీ మధురభావాలు స్పందిస్తూ వుంటాయి. ఆ విమల భావములే నా ఈ భావగీతము

లకు మూలము" అని రచయిత తన రచనకు ప్రేరణను చెప్పుకున్నారు. వారి రచనా పద్ధతికి రెండు ఉదాహరణలు.

"సామాన్య మానవుని శ్రమకు ప్రతిబింబమై
మేధావి మున్నుదురు మెఱయు జలకణమునై
నీతి న్యాయముల కిల నిజమగు ప్రతీకనై
శ్రమజీవి మేనిపై విమల హాసమునా!"
స్వేదబిందువునుగా జెలగి మెరయుదునా!"

"తాతయ్య చేకాలు తడబడెడి వేళా!
నే నూతకఱ్ఱగా నిలువ మదికాంక్ష!
పయసు యవసమంత ప్రాలిపోపగనంత
ప్రోపుచేసిన ధనము పోపగా చేవారి
దీనత్వ దశయందు దిన్పూచి నేనగుదు!"

యువతరంగం (కవితా సంకలనం)

[సంపాదకులు: బట్లూరి రామచంద్రయ్య, పరిపాటి వేణుగోపాల గుప్త, వెల: రు.5–00లు; ప్రతులకు: జనరల్ శెక్రటరీ, నేతాజీ యువకసంఘం. తీర్ధం–517481; చిత్తూరు జిల్లా]

1974 మార్చి 26వ తేదీన కొన్ని లక్ష్యాలతో, ఆశయాలతో ఈ నేతాజీ యువక సంఘం ఏర్పడిందని ప్రధాన కార్యదర్శి చెప్పారు. సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు అనేకం చేపట్టి నిర్విఘ్నంగా కొనసాగించి ఆ తరువాత కవితా రంగంలోకి దిగారు. ఇందులో కవితలను గురించి "ప్రస్తుత సమస్యలైన ఆకలి, ఆక్రందనలు, నిరుద్యోగం, అవినీతులపై కోపాగ్నులు వెదజల్లుతూ కొందరు, లోకంలోని అస్తవ్యస్త పరిస్థితులను విమర్శిస్తూ, అరాచకాన్ని అసూయను ఈసడిస్తూ, దిక్కుతోచని పరిస్థితుల్లో భవిష్యత్తును ప్రశ్నిస్తూ మరికొందరూ. మనిషి నిజమైన నడవడిని ప్రబోధిస్తూ, దుర్గంధ భూయిష్టమైన దుర్వ్యవహారాలను దునుమాడుతూ కొందరు తమ కవి హృదయాలను విశదపరిచారు" అని సంపాదకులు పేర్కొన్నారు.

"నాటి కవులు
వాస్తవాలను మరచి
అనుభూతులను ఆలపించారు
నేటి కవులు
అనుభూతులను విడిచి
వాస్తవాలను వినిపిస్తున్నారు"

అని కవిత్వంలో వచ్చిన మార్పును కవిత్వంలోనే రత్నశేకర విశ్వనాథ్‌గారు చెబుతున్నారు.

"పీకలదాకా మేసేసి
పిల్లోకాట్లపై దొర్లేసి
పొట్ట పట్టనంతగా తాగేసి
పేకాటలతో జాగారం చేసిన
కళ్ళలోనూ ఎరుపే!
చలిలో ఆకలిలో
మెలితిరిగే నరాల తాకిడిలో
పీడించే దోమలతో
పీకేసే నల్లులతో, జాగారం చేసిన
కళ్ళలోనూ ఎరుపే"

అని చావా వీరవెంకట సత్యనారాయణగారు చెబుతున్నారు. మొత్తంమీద ఈ సంకలనంలోని కవులందరూ కవితాభ్యాసం చేస్తూ కవిత్వం రాస్తున్నవారే. వీరి అభ్యాసం, రచన ముందు ముందు మంచి ఫలితాలను అందివ్వాలని ఆకాంక్షిస్తాను.

ఈ సంకలనానికి పెద్ద పీఠిక రాసినవారు డా॥ తంగిరాల సుబ్బారావుగారు. "నిజమైన కవిత్వమంటే ఏమిటో తెలుసుకోవాలంటే, 'యుగ కవి' శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారి కవిసేన మేనిఫెస్టో పఠించి తీరాలి. ప్రతి యువకవీ దీనిని భగవద్గీతగా పారాయణం చేసి తీరాలి" అని వారు పీఠికను ముగించారు. పీఠికలు రాసేవారు భట్రాజులుగానో, పర భజనపరులుగానో మారకూడదు. మేనిఫెస్టోలు చదివినంతమాత్రంలో ఎవడూ కవి కాడు. పోగా కవిసేన మేనిఫెస్టోలో శాస్త్ర చర్చకంటె పరదూషణ పతాకస్థాయికి చేరింది. బహుశా ఆ అంశమే ఈ పీఠికా కర్తకు బాగా నచ్చిందేమో! శేషేంద్రశర్మగారి విద్వత్తును గురించి, కవిత్వాన్ని గురించి నాకు ఎలాంటి సందేహం లేదు. కాని మేనిఫెస్టోలో వారి స్వోత్కర్షే శాస్త్రంగా భ్రమించిన ఈ పీఠికాకర్త అజ్ఞానానికి ఆశ్చర్యపోతున్నాను.

అలారమ్ (మినీ కవితలు)

[జోరాశర్మ; వెల:రు.4–00లు; ప్రతులకు: శ్రీమతి జోశ్యుల శేషుబాల; 7–213 మెయిన్‌రోడ్డు, వేంకటేశ్వరటాకీస్ దగ్గర. మచిలీపట్నం–521001]

మినీ కవితల మినీ కాలం ఇది. పత్రికల పుణ్యమా అని మినీ కవుల సంఖ్య, దాని భాష్యకారుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కవిత్వ స్పృహ వుంటే ఏదైనా కవిత్వమే. జోరా శర్మగారు వివిధ అంశాలపై చమత్కారంగా రాసిన కవితలు ఇవి. లోగడ చాలా పత్రికల్లో ఈ కవితలు ప్రచురింపబడినవే. ఈ సంకలనానికి ఆరుద్రగారు వారి పద్ధతిలో ఓ జను పంక్తుల ముందుమాటగా రాశారు. రావి రంగారావుగారు మరోసారి మినీ కవితకు లక్షణం చెప్పటాని ప్రయత్నించారు. వీరి కవిత్వధోరణికి రెండు ఉదాహరణలు.

"ఎందుకలా కాకిలా
అరుస్తావ్?
ఆలస్యమైనా ఫరవాలేదు
కోయిలలా గొంతెత్తి
ఒక్క పాట పాడు చాలు!
పది కాలాలపాటు
ప్రతి ధ్వనిస్తుంది
లోటంతా తోడై నిలుస్తుంది
వసంతం నీకు దాసోహం అంటుంది"

"సాధువులా ప్రతిసారీ
రాజకీయమ్
ఓట్ల బిచ్చాని కొచ్చి
అందగానే
అందలాని కెక్కి కూర్చొని
పదితలల రాక్షసత్వం
ఇరవై చేతు(త)లా
ప్రదర్శించేసరికి
దేశం వంచిత
బ్రతుకు (అ)శోకవనం"

జోరాశర్మగారు మినీకవితను సాధనదశగా పరిగణించి ఒక స్పష్టమైన ఉద్దేశంతో భవిష్యత్తులో మంచి కవిత్వం రాయాలని ఆశిస్తాను. ఎంచేతంటే వారి నాయనగారు జోశ్యుల సూర్యనారాయణమూర్తిగారు మంచి విద్వత్తు కలిగినవారు. అట్టి విద్వత్తు అంచులకైనా వీరు చేరాలని...

పుష్యమి

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.

శ్రీరస్తు – శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాంనమః

వెలువడినది

ఆంధ్రపత్రిక

వెలువడినది

శ్రీ క్షయ నామ సంవత్సర పూర్ణశాస్త్రీయ పంచాంగము



'దైవజ్ఞచిన్తామణి' శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రి,

'భాషాప్రవీణ' శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి సిద్ధాన్తి సోదరులచే గుణించబడినది.

రిజిస్టర్డు బుక్ పోస్టు ద్వారా ప్రతి 1 కి రు. **9.00**

ఆంధ్రపత్రికా కార్యాలయము — ప్రతి 1–కి రూ. **5.00**

గాంధీనగరం, విజయవాడ – 3 — **బషీర్‌బాగ్, హైదరాబాద్-29**